ఆంధ్రజ్యోతి
ప్రచురణ
www.navyaweekly.com

నవ్య
వీక్లి

6-4-2016
₹:20

- ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ బుక్‌డే
- సినీనటి సీత ఇంటర్వ్యూ

ఆ భయం నాకు లేదు

-హన్సిక

చైల్డ్ ఆర్టిస్ట్ నుంచి హీరోయిన్‌గా ఎదిగినవారు చాలామందే ఉన్నా, విజయాన్ని అందుకున్నది మాత్రం తక్కువ మందే! ఆ తక్కువ మందిలో హన్సిక పేరు ప్రముఖంగా చెప్పుకోవాలి. హీరోయిన్‌గా ఎంతో మంచి పేరునీ అంతకు మించి సినీ పరిశ్రమలో మంచి మనసున్న అమ్మాయిగానూ పేరు తెచ్చుకున్న హీరోయిన్ దాదాపు హన్సిక మాత్రమే అని చెప్పుకోవచ్చు. టాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయమైనా కోలీవుడ్‌లోనే ఎక్కువగా సినిమాలు చేస్తున్న హన్సికతో...

ఇటీవలి కాలంలో తెలుగులో స్ట్రయిట్ సినిమాలు లేనట్టున్నాయి?

దీనికి కారణాలు చాలానే ఉన్నాయి. ఒకటి తమిళ సినిమాలతో బిజీగా ఉండడం, రెండోది మనసుకు నచ్చిన పాత్రలు రాకపోవడం వల్ల తెలుగులో సినిమాలు తక్కువగానే చేయవలసి వస్తోంది. మంచి ప్రాజెక్టు వస్తే తప్పకుండా చేస్తాను. అలాంటి సినిమా కోసం నేనూ ఎదురు చూస్తున్నాను.

మనసుకు నచ్చినవి అంటే....

తెలుగులో ఎక్కువగా హీరోయిన్‌ను గ్లామర్‌కే పరిమితం చేస్తారు. నటనకు పెద్దగా అవకాశం ఉండదు. కోలీవుడ్‌లో డిఫరెంట్ సబ్జెక్టులు చేసే అవకాశం ఉంది.

ఈ మధ్య కోలీవుడ్‌లో కూడా సినిమాల జోరు తగ్గించినట్టున్నారు?

గ్లామర్ పాత్రలు ఇప్పటికే చాలా చేశాను. ఒకే రకం పాత్రలు బోర్ కొట్టి నేనే కొన్ని సినిమాలు వదులుకున్నాను.

స్టార్ హీరోలతో చేయనట్టున్నారు?

చేయాలని నాకూ ఉంది. రజనీకాంత్, కమల్‌హాసన్ వంటి నటుల పక్కన అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను. నా కోరిక ఎప్పటికి తీరుతుందో ఏమో!

కొందరు హీరోలతో చేయనంటున్నారట?

శింబు సినిమా మాత్రమే రిజెక్ట్ చేశాను. దానికి నా కారణాలు నాకున్నాయి. అవి అందరితో పంచుకోవలసిన అవసరం లేదు.

దయ్యం సినిమాలు వరుసపెట్టి చేస్తున్నట్టున్నారు? అవంటే భయం కానీ, నమ్మకం కానీ ఉన్నాయా?

దయ్యం కాన్సెప్ట్‌తో చేసినవి రెండు సినిమాలే! అవి ఉన్నాయని నమ్మితే భయం కలుగుతుంది. ఆ నమ్మకం నాకు లేదు. వీటిని ఎందుకు చేస్తున్నానంటే, హీరోయిన్‌గా ఏ పాత్రనైనా చేయాలి. అక్కడ నా నమ్మకాలతో పనిలేదు కాబట్టి చేస్తున్నాను అంతే!

ఇటీవలి కాలంలో కొద్దిగా సన్నబడినట్టున్నారు?

ఓ సినిమా కోసం సన్నబడవలసి వచ్చింది. బొద్దుగా ఉన్నప్పటికంటే ఇప్పుడే బాగున్నావని చాలామంది అంటున్నారు.

మీ పిల్లలు ఎలా ఉన్నారు?వాళ్ళ సంఖ్య పెరిగిందా?

ఇప్పుడు 31మంది ఉన్నారు. అందరూ బాగున్నారు.

మీ పెయింటింగ్స్ వేలం వేసింది వారికోసమేనా?

నిజమే! వారి నిధి కోసం వేలం వేశాను. ప్రస్తుతం మరికొన్ని పెయింటింగ్స్ వేలం వేద్దామని అనుకుంటున్నాను.

పిల్లల సంరక్షణేనా? ఇంకా ఏమైనా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారా?

వృద్ధుల కోసం ఓ ఆశ్రమం నిర్మించే ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. ఇదే కాదు కొంతమంది క్యాన్సర్ రోగుల మందుల ఖర్చు భరిస్తున్నాను. ఇంకా చేయాలని ఉంది కానీ, టైమ్ దొరకడం లేదు.

రూమర్ల గురించి....

వాటి గురించి ఎప్పుడూ పట్టించుకోను. వర్క్ గురించి మాట్లాడితేనే స్పందిస్తాను తప్ప వ్యక్తిగత జీవితం గురించి ఎవరు మాట్లాడినా పట్టించుకోను. ఎక్కువగా రూమర్లు పర్సనల్ లైఫ్ గురించే వస్తుంటాయి. వాటిని చదివో లేదా వినో నవ్వుకుంటాను తప్ప కౌంటర్ ఇవ్వను.

ఖాళీ సమయంలో ఏం చేస్తుంటారు?

ఖాళీ దొరకడం కొద్దిగా కష్టమే. ఏమాత్రం తీరిక దొరికినా పెయింటింగ్స్ వేస్తున్నాను. ఇటీవలే గురునానక్ పెయింటింగ్ వేసి మా మదర్‌కి గిఫ్టుగా ఇచ్చాను.

ప్రేమా, పెళ్ళి....

ఈ ప్రశ్నకి ఇప్పటికే చాలాసార్లు జవాబు చెప్పాను. ఇప్పుడప్పుడే ఆ ఆలోచన లేదు. నాకు పెళ్ళి ఎప్పుడు చేయాలో మా మదర్‌కి బాగా తెలుసు. ఆ విషయాలు ఆవిడే చూసుకుంటారు.

తమిళంలో చేస్తున్న సినిమాలు?

ప్రస్తుతం నాలుగు సినిమాలు చేస్తున్నాను. మరికొన్ని కథలు విన్నాను.

-బి.కె.

సరదాగా

ఎర

రాము సరదాగా చేపలు పట్టడానికి వెళ్ళాడు. తీరా నది ఒడ్డుకెళ్ళాక చూసుకుంటే గాలానికి అవసరమైన ఎరలు తీసుకురావడం మరిచి పోయినట్టు అర్థమైంది. దూరంగా ఓ చిన్న పిట్ట ఎరను తింటుండటం చూశాడు. ఒడుపుగా దాన్ని పట్టేసి ముక్కున ఉన్న ఎర లాక్కున్నాడు. ఆలో చిస్తే దాని నోటి దగ్గర కూడు తాను బలవంతంగా తీసుకున్నట్లుగా అనిపించింది.

తన దగ్గరున్న విస్కీని కాస్తంత దానికి పట్టించాడు. దాంతో గిల్టీ ఫీలింగ్ పోయి తాపీగా చేపలు పట్టేందుకు ఉపక్రమించాడు రాము. కాసేపాగాక ఎవరో వెనుక పొడుస్తున్నట్టు అని పించింది. వెనక్కి తిరిగి చూస్తే, అదే పిట్ట ముక్కున మరో మూడు ఎరలతో!!!

ఒక ప్రశ్న?

రజనీష్, రిత్వికల వివాహం మే మాసంలో అంగరంగ వైభోగంగా జరిగింది. సర్దుబాట్లు, అల కలు, విందు, వినోదాల మధ్య అప్పుడే సంవ త్సరం గడిచింది. మొదటి పెళ్ళిరోజు రానే వచ్చింది. ఆ రోజున తామిద్దరే ప్రత్యేకంగా సెల బ్రేట్ చేసుకోవాలని నిర్ణయించుకున్నారు భార్యా భర్తలు. భార్యకు ఏదైనా బహుమతి ఇవ్వాలను కున్నాడు రజనీష్. ఏం బహుమతి ఇస్తే బాగుం టుందా? అని ఆలోచించాడు. ఆమె పుస్తకాల పురుగు కాబట్టి, వాటినే బహుమతిగా ఇవ్వాలని చివరికి నిశ్చయించుకున్నాడు. ఎప్పటినుండో ఆమె కొనాలనుకుంటున్న పుస్తకాల లిస్టు తయారు చేశాడు. దాని ప్రకారం మే నెల మొదటి తేదీన ఒక పుస్తకం కొన్నాడు. రెండో తేదీన రెండు పుస్త కాలు కొన్నాడు. మూడో తేదీన మూడు పుస్తకాలు కొన్నాడు. ఇలా పుస్తకాలు వరుసగా కొను క్కుంటూ వెళ్ళాడు. వాళ్ళ పెళ్ళిరోజుకి ఆ పుస్తకా లన్నీ మొత్తం 276 అయ్యాయి. వాటన్నింటినీ పెద్ద అట్టపెట్టెలో ప్యాక్ చేయించి, ఆ రోజున రిత్వికకు గిఫ్ట్‌గా ఇచ్చాడు. తనకెంతో ఇష్టమైన ఆ గిఫ్ట్‌ని చూసి తానంటే భర్తకు ఎంత ప్రేమో అని మురిసిపోయింది ఆ ఇల్లాలు. ఇంతకీ అసలు ప్రశ్నేమిటంటే, పుస్తకాలు కొనడం మొదలుపెట్టాక ఎన్నో రోజున, ఏ తేదీన వాళ్ళ పెళ్ళిరోజు వచ్చిందో? ఇంకెందుకు ఆలస్యం? కూడికలు, తీసి వేతలు మొదలెట్టేయండి.

సమాధానం

23వ రోజున అంటే మే, 23వ తేదీన వాళ్ళ పెళ్ళిరోజు వచ్చింది. ఎలాగనుకుంటున్నారా?

1+2+3+4+5+6+7+8+9+10+11+12+13+14+15+16+17+18+19+20+21+22+23= 276

వేరే ఇతర పద్ధతుల్లో కూడా ఈ ప్రశ్నకు సమాధానం రాబట్టవచ్చు.

Jayadev

అడపా దడపా నవ్వుల్లో



8

పుస్తకం ఓ మంచి నేస్తం

అనగనగానేమో ఒకరాజున్నాడు...అంటూ తాతలు చెప్పిన కథలు నేడేమైపోయాయి? ఆ కథలు తెలియకపోవడం వల్ల మనకు జరిగే నష్టం ఏమిటి? ఏప్రిల్ 2న 'ప్రపంచ బాలల పుస్తక దినోత్సవం' సందర్భంగా విహంగ వీక్షణం....

56

ఆనందానికి ఎనిమిది మార్గాలు

రోజువారీ జీవితంలో పూర్తి ఆనందాన్ని, ఆ అనుభూతుల్ని ఆస్వాదించేవారు ఈ రోజుల్లో చాలా తక్కువే. మరి అలాంటి ఆనందాన్ని సొంతం చేసుకునే మార్గాలేంటో చదవండి.

72

ఇంటర్వ్యూ

సినిమాల్లో క్యారెక్టర్ పాత్రలకు ప్రాధాన్యం పోయిందంటున్న బహుభాషా నటి సీత ఇంటర్వ్యూ ఈ వారం మీ కోసం...

సీరియల్స్

మృత్యుంజయుడు	16
డేర్ డెవిల్	30
లవ్ డబ్	44
మనసున్న మనుషులు	58

కథలు

ఒక తండ్రి కథ	10
గాడ్ ఫాదర్	24
ఆనందమే అందం	38
పాత్రోచితం	52

ఫీచర్స్

కంఠుగాడి కాశీయాత్ర-14, సినీ నారాయణీయం-22
ఆరోగ్యమే మహాభాగ్యం-28, సురభి-35
విజయ విలాసం-36, స్లిమ్‌గా ఉండాలనుందా?-43
వంటలు-49, జెన్నీ ఇంటర్వ్యూ-50
మనమీదేనట్రోయ్-55
పుస్తక సమీక్ష-63, క్రైమ్-64
రామాయణం-66, సౌభాగ్యచక్రం-68
నవ్యసినిమా-69, 'ఊపిరి' ఆడేది కాదు-70
ఇవన్నీ నిజాలే!, పదగారడి-74

ముఖచిత్రం: కాజల్ అగర్వాల్
ఫొటో: గోపీకృష్ణ

రచనలు, కథలు పంపవలసిన చిరునామా
నవ్య వీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్, హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33. ***email: navyaweekly@andhrajyothy.com***

ఆ సంగతి చూడు!

నారాయణకి మంచి ఉద్యోగం వచ్చింది. అమెరికా చాన్స్ కొట్టేశాడతను. భార్యాబిడ్డలసహా అమెరికా వెళ్ళిపోయేందుకు ఎయిర్‌పోర్టుకి చేరుకున్నాడు. చెక్-ఇన్ అయింది. డిపార్చర్‌లాంజ్‌లోకి ప్రవేశించాడు. ఫ్లైట్‌కింకా టైమ్ ఉండడంతో కాలక్షేపం కోసం అటూ ఇటూ చూశాడు. ఓ చోట రంగురంగుల బల్బులతో ఓ మెషిన్ కనిపించింది. అక్కడ ఇలా రాసి ఉంది.

ఒక్క రూపాయితో మీ నిజానిజాలు తెలుసుకోండి!

తెలుసుకుందాం పదండి అని భార్య కూడా ప్రోత్సహించడంతో మెషిన్ దగ్గరకు భార్యాబిడ్డలసహా చేరుకున్నాడు నారాయణ. ముందుగా ఓ రూపాయి వేసి, తన పరంగా నిజం ఏమిటో తెలుసుకోవాలనుకున్నాడు. మెషిన్ ఎక్కి, రూపాయి వేశాడు. నిజం తెలియజేసే కార్డొచ్చింది. చదివాడు.

మీ పేరు నారాయణ. మీకు ఉద్యోగం వచ్చింది. మీరు భార్యాబిడ్డలసహా అమెరికా వెళ్తున్నారు.

ఆశ్చర్యపోయాడు నారాయణ. ఈసారి భార్యతో పరిశీలించి చూద్దామనుకున్నాడు. ఆమెను మెషిన్ ఎక్కించి, రూపాయి వేశాడు. నిజం తెలియజేసే కార్డొచ్చింది. చదివాడు.

శ్రీమతి నారాయణగారూ! మీరు మీ భర్త, పిల్లలతో అమెరికాకు వెళ్తున్నారు. మీవారికి అక్కడ మంచి ఉద్యోగం వచ్చింది.

బాగుంది బాగుందనుకున్నాడు నారాయణ. ఈసారి పిల్లలను ప్రయోగించి పరిశీలించాలనుకున్నాడు. మెషిన్‌పైకి పిల్లలను ఎక్కించి రూపాయి వేశాడు. నిజం తెలియజేసే కార్డొచ్చింది. చదివాడు.

నారాయణగారి పిల్లలూ! మీరు మీ అమ్మానాన్నలతో అమెరికా వెళ్తున్నారు. మీ నాన్నగారికి అక్కడ మంచి ఉద్యోగం వచ్చింది.

అబ్బబ్బా! ఏం చెబుతోంది. అన్నీ పర్ఫెక్ట్‌గా చెబుతోంది. అయినా ఎక్కడో ఏదో అనుమానం. దాంతో మరోసారి తానెక్కి నిజానిజాలు తేల్చేద్దాం అనుకున్నాడు నారాయణ. మెషిన్ ఎక్కాడు. రూపాయి వేశాడు. ఎప్పటిలాగే కార్డొచ్చింది. చదివాడు.

పిచ్చినారాయణా! నా సంగతి తేల్చాలని నువ్వు పప్పులో కాలేశావు. నువ్వు ఎక్కాల్సిన ఫ్లైట్ వెళ్ళిపోయింది. ముందు ఆ సంగతి చూడు!

-వైనతేయ

w m w w

నవ్య

సంపుటి: 13 సంచిక: 5

6-4-2016

మేనేజింగ్ డైరెక్టర్
వేమూరి రాధాకృష్ణ

ఎడిటర్
ఎ.ఎన్.జగన్నాథశర్మ

మొదటి పేజి

కంచిగరుడసేవ

సాయంత్రం అయిదయిందంటే వారికి తెల్లవారినట్టు! ఆ అయిదుకోసం ఆ భార్యాభర్తలిద్దరూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి హడావుడి పడతారు. అంతవరకూ చదివిన నాలుగైదు పేపర్లు మడతబెట్టి, బ్యాగులో పెడతారు. రెండు వాటర్‌బాటిళ్ళు పెడతారు. రెండు మూడు బిస్కట్‌ప్యాకెట్లు పెడతారు. గుప్పెడు ద్రాక్ష, రెండు ఆపిల్స్, ఓ చాకూ పెట్టి బయల్దేరతారు. కారంగా చప్పరించేందుకు పావుకిలో కారపుబూందీ దారిలో తీసుకుంటారు. ఫ్లాస్కు నిండా నాలుగు కప్పుల కాఫీ పోయించుకుని, పేపర్‌గ్లాసులు ఆరేడు వేసుకుంటారు. అతను కాసేపు, ఆమె కాసేపు ఆ బరువుబ్యాగుని మోసుకుంటూ పార్కుకి చేరుకుంటారు.

ఇంటికి ఆ పార్కు కిలోమీటర్ దూరంలో ఉంది. రానూ పోనూ రెండు కిలోమీటర్ల నడక చాలనుకుంటారిద్దరూ. అతనికి డెబ్బయి అయిదు, ఆమెకి అరవై ఎనిమిది. అయినా నడక మానరు. ఎండయినా, వానయినా, చలిగా ఉన్నా ఏమైనా సాయంత్రం అయిదు అయిందంటే వాళ్ళిద్దరూ పార్కుకి రావాల్సిందే! పార్కులో ఆ మూల తురాయిచెట్టు కింద, సిమెంట్ బెంచీ మీద కూర్చోవాల్సిందే! వాళ్ళు రావడం ఆలస్యం, అంత వరకూ అక్కడక్కడా కూర్చుని ఉన్న వయసుమళ్ళిన వ్యక్తులు మెల్లగా, మెల్లమెల్లగా వారిని చేరుకుంటారు. అడగరు. మొహమాటపడరు. ఎవరికి కావాల్సింది వారు బ్యాగులోంచి తీసుకుంటారు. పేపర్లు చదువుకునే వాళ్ళు పేపర్లు చదువుకుంటారు. స్నాక్స్ తీసుకునేవారు స్నాక్స్ తీసుకుంటారు. కాఫీ తాగేవాళ్ళు కాఫీ తాగుతారు. ఆ తర్వాత కబుర్లలో పడతారు.

అమెరికాలో ఉన్న అమ్మాయి గురించీ, లండన్‌లో ఉన్న అబ్బాయి గురించీ మాటలు మొదలవుతాయి. మనవడూ, మనవరాళ్ళ గురించి ముచ్చట్లు చెప్పుకుంటారు. మా మనవరాలు మంచి పెయింటరండీ! బాగా బొమ్మలు వేస్తుంది అంటారొకరు. మా మనవడు గిటార్ బాగా వాయిస్తాడండీ! మొన్న స్కైప్‌లో వాయించి చూపించాడు కూడా అంటారొకరు. ఇండియాకి పిల్లలు వచ్చి అయిదేళ్ళు అయిందండీ! ఒకసారి వస్తే బాగుణ్ణంటారొకరు. అమెరికాలో ఉన్నారన్న మాటేగాని, మావాళ్ళది శుద్ధ పల్లెటూరట! అక్కడ ఏవీ దొరకవట! మొన్న మా ఆవిడ పచ్చళ్ళూ, బట్టలూ, స్వీట్లూ, నెయ్యీ... ఇవన్నీ పట్టుకొని అమెరికా వెళ్లిందంటారొకరు. అక్కడ డాలర్లు తప్ప, ఆనందం దొరకదంటారు. అలా రాత్రి ఎనిమిది వరకూ కాలక్షేపం చేసి, ఇక వస్తాం అంటారు. వచ్చిన వాళ్ళు వచ్చినట్టుగానే మెల్లమెల్లగా వెళ్ళిపోతారు. ఖాళీ అయిన బ్యాగునీ, ఫ్లాస్కునీ చూసుకుని, ఆ భార్యాభర్తలిద్దరూ కూడా వెను తిరుగుతారు. మిగిలితే పేపర్లు మిగులుతాయి. లేదంటే లేదు. పట్టించుకోరు. గత అయిదేళ్ళుగా ఇంతే! ఇలాగే బతికేస్తున్నారు ఆ దంపతులు.

ఎవరండీ వాళ్ళు? వాళ్ళకెందుకు ఈ 'కంచిగరుడసేవ' అంటే దానికి ఓ కథ ఉంది. ఆ కథ ఏమిటంటే...

ఆ భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలు చేసి రిటైరయ్యారు. వాళ్ళ పిల్లలు కూడా విదేశాల్లోనే ఉన్నారు. సొంత ఇల్లు ఉంది. పెన్షన్ కూడా ఉంది. ఇద్దరికీ కలిపి, అరవై డెబ్బయివేల పెన్షన్ వస్తుంది. మందుకీ మాకులకీ ఓ పదివేలు పోను, తిండికీ, ఇంటికీ ఓ పదివేలుపోను, నలభై యాభై వేలు మిగిలిపోతాయింకా. మిగిలిన ఆ డబ్బుని దాచి, చచ్చినప్పుడు వచ్చే పిల్లలకు ఇచ్చే బదులు తోటివారికి బిస్కట్ల కిందా, కాఫీల కిందా ఖర్చు చెయ్యడం మంచిది అనుకున్నారు. అలా ఎందుకు అనుకున్నారంటే...అయిదేళ్ళ కిందట అలవాటుగా నడవడానికి పార్కుకి వచ్చినప్పుడు ఓ డెబ్బయి ఏళ్ళ వ్యక్తి, స్పృహ తప్పి పడిపోవడాన్ని చూశారిద్దరూ. పట్టించుకునేవారు లేరు. లేకపోతే ఈ ఇద్దరే ఆ వ్యక్తిని లేపి, రెండు బిస్కట్లు తినిపించి, ఇంత కాఫీ తాగించేసరికి విషయం బైట పడింది. పొద్దుటి నుంచీ తిండి లేదన్నాడు ఆ వ్యక్తి. ఎందుకు లేదంటే...చెప్పడానికి సిగ్గుపడ్డాడు. తనవాళ్ళెవరూ ఇక్కడ లేరంటూ, అంతా విదేశాల్లో ఉన్నారంటూ పిచ్చి నవ్వొకటి నవ్వాడు. ఆ నవ్వు ఏడుపులా వినవచ్చింది వారికి. ఆ ఏడుపు ఇకపై వినకూడదనుకున్నారు. అప్పటి నుంచి వారూ వీరూ అనుకునేట్టుగా 'కంచిగరుడసేవ'కి సిద్ధమయ్యారిద్దరూ.

WOW!

నిస్వార్థ సేవకు మారుపేరు

'సారీ ఇట్స్ టూ లేట్, ఒక్క అరగంట ముందు తీసుకొచ్చుంటే ఏదైనా చేయగలిగేవాళ్ళం.' సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలోనూ చాలామందికి ఎదురయ్యే డైలాగే ఇది. అదీ అర్ధరాత్రి ఏదయినా అనారోగ్య సమస్య తలెత్తితే ఇక అంతే సంగతులు! అంబులెన్సులు సమయానికి రావు. ఆటోలు దొరకవు. ఒకవేళ ఏదైనా టాక్సీ, ఆటో దొరికినా వాళ్ళు అడిగినంతా ఇవ్వాల్సిందే! ఇదే విషయం విజయ్‌ని తీవ్రంగా కలచివేసింది. అర్ధరాత్రి ఆరోగ్యం చెడి హాస్పిటల్‌కి వెళ్ళాలనుకున్న వాళ్ళు ఒక్క ఫోన్ కొడితే చాలు వాళ్ళ ముంగిట్లో తన టాక్సీతో రెడీ అయిపోతాడు. అదీ ఎటువంటి చార్జ్ చేయకుండా!

ముంబైకి చెందిన విజయ్ ఠాకూర్ ఎల్ అండ్ టీ సంస్థలో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేసేవాడు. ఓసారి తన భార్య గర్భవతిగా ఉన్నప్పుడు

విజయ్ ఠాకూర్

అర్ధరాత్రివేళ ఆమెకు నొప్పి మొదలైంది. అరగంట ఎదురుచూసినా ఒక్క ఆటో రాలేదు. చివరికి రెట్టింపు డబ్బులిస్తే వస్తానంటూ ఓ టాక్సీ డ్రైవర్ ముందుకొచ్చాడు. కానీ అప్పటికే ఆలస్యమైంది. అబార్షన్ చేసి పిండాన్ని తొలగించాల్సి వచ్చింది. ఆ సంఘటనతో కలతచెందాడు విజయ్. అలాంటి పరిస్థితి మరెవరికీ రాకుండా తన వంతుగా ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాడు. అంతే. చేస్తున్న ఉద్యోగానికి వెంటనే రాజీనామా చేసి, ఓ టాక్సీ కొన్నాడు. రోగులకు పూర్తిగా ఉచితం అని ప్రచారం చేశాడు. ట్యాక్సీ స్టాండ్స్‌లో, వీధుల్లో తన ఫోన్ నంబర్‌ను పాంప్లెట్లుగా పంచి, అవసరమైన వాళ్ళు ఏ సమయంలో ఫోన్ చేసినా క్షణాల్లో వస్తానని హామీ ఇచ్చాడు. దాదాపు 30 ఏళ్ళ నుంచీ ఇదే పనిలో ఉన్నాడు విజయ్. అలా ఇప్పటి వరకూ 500 ప్రాణాలు నిలబెట్టాడు. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు పోలీసులకు, అంబులెన్స్‌ల కంటే ముందుగా విజయ్‌కే ఫోన్లు వెళ్ళిన సందర్భాలు చాలా ఉన్నాయి. మరోపక్క సిగ్నల్ జంప్ చేశాడనీ, అతివేగంగా వెళ్తున్నాడనీ పోలీసులు వెంబడించి చివరికి కార్లో రోగుల్ని చూసి అతడిని వదిలిపెట్టిన సంఘటనలకూ లెక్కలేదు.

ప్రస్తుతం విజయ్‌కి 62 ఏళ్ళు, బీపీ, షుగరూ ఉన్నాయి. ఇన్నాళ్ళూ చేసింది చాలు, ఇప్పటికైనా ఇంటిదగ్గర ఉండమని కుటుంబ సభ్యులు పోరుతూనే ఉంటారు. కానీ అతడు వింటేగా! తన పని తాను చేసుకుపోతూనే ఉన్నాడు. వృద్ధాప్యాన్ని లెక్కచేయకుండా ప్రజాసేవకే కంకణం కట్టుకున్న అతడి నిస్వార్థ సేవకు హ్యాట్సాఫ్ చెబుదామా!

మెయిల్ బాక్స్

యువతకు పాఠ్యగ్రంథం విజయవిలాసం

విజయవిలాసం వ్యాస పరంపరలో వ్యక్తిత్వ వికాస అంశాలు విరివిగా ఉంటున్నాయి. కొందరి అనుభవాలను ప్రచురించడం అందుకు నిదర్శనం. మాకు ముదావహం. నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా విజయ శిఖరం చేరుకోవాలనే యువతకు కరదీపిక యిది. ఓటమిలో కుంగిపోకుండా, ధైర్యం, స్థైర్యం కూడగట్టుకుని, అకుంఠిత దీక్షతో తెలివితేటలతో సమయోచిత ప్రతిభతో ముందుకెళ్ళాలనే యువతకు విజయ విలాసం ఒక పాఠ్యగ్రంథం అంటే అతిశయోక్తి కాదు. మన సున్న మనుషులు మంచి సీరియల్. ఎలీషా, సుజాతల పాత్రచిత్రణ, రచనా శైలి పాఠకుల్ని ఆకట్టుకునేలా ఉంది.

-కిళాంబి రఘుపతి, సికింద్రాబాద్

చకచకా సాగుతున్న కాశీయాత్ర

కంఠుగాడి కాశీయాత్ర చకచకా సాగుతూ ఆకట్టుకుంటోంది. మొదటిపేజీ కథ పరీక్షల్లో, ఈ ప్రపంచం మనకోసం, మనం అనుభవించడానికి, మనం ప్రేమించడానికి, ప్రేమించబడటానికి పుట్టాం అనడం ఎంతో బాగుంది. ఫన్నీ మ్యారేజెస్, షాకింగ్ సెంటిమెంట్స్ వ్యాసంలో ఏడుస్తూ కూర్చోవడం, గిఫ్ట్‌లు పగలగొట్టడంలాంటి విశేషాలు భలే ఉన్నాయి. ప్రపంచ కవితా దినోత్సవం ఒకటి ఉంటుందని ఎప్పుడూ వినలేదు. ఆ సందర్భంగా ప్రచురించిన కవితలు హృదయాలకు పండుగే.

-శాండో ప్రచండ్, శ్రీనగర్ తూ.గో.జిల్లా

మార్నింగ్ కాఫీ ఝలక్

పిలవని పేరంటానికి విచ్చేసే పార్టీరాయుళ్ళకు చక్కని కనువిప్పు ఈ వారం మార్నింగ్ కాఫీ.. ఓ ఝలక్. ఆవాల శారదగారి సారాంశం కవిత భావగర్భితంగా వుంది. వయొలిన్‌ను 70 విడిభాగాలుగా ఊడదీయవచ్చని తెలిసి ఆశ్చర్యచకితులమయ్యాం. సగినాల శకు కథా కర్త ఎలక్ట్రాన్‌కు అభినందనలు. లత ఇంటర్వ్యూ ఆనందింపజేసింది. వరల్డ్ పొయిట్రీ డే అంటూ ఈ వారం కవితలకు పెద్ద పీట వేయడం ఆనందించదగ్గ విషయం.

-నేమాన సుభాష్‌చంద్రబోస్, విశాఖపట్నం-41

మురిపించిన ముఖచిత్రం

మార్చి 23 తమన్నా ముఖచిత్రం సంచిక మురిపెంగా ఉంది. లత ఇంటర్వ్యూ బాగుంది. హరనాథ్‌గారి ఇంటర్వ్యూలు ఆసక్తికరం. ఐ లవ్యూ ఓ హారికా కథ చాలా బాగుంది. భార్యాభర్తలు రాజీపడి కాపురం చేస్తే వారి జీవితాలు స్వర్గమయమవుతాయి. ముందుచూపు కథ బాగుంది.

-కోలిపాక శ్రీనివాస్, బెల్లంపల్లి

పోటీపడుతున్న సీరియల్స్

సీరియల్స్ ఒకదానితో మరొకటి పోటీపడి చదివిస్తున్నాయి. కథలు, వ్యాసాలు, ఇంటర్వ్యూలు చాలా బాగుంటున్నాయి. గత సంచికలో శివరాత్రి మహాత్మ్యం గురించి చాలా బాగా రాశారు.

-వల్లమూడి పుష్పలత, పెద్ద ఉప్పరపల్లె, చిత్తూరుజిల్లా

ఆహా ఏమి రుచి!

మొదటిపేజీలో భూతాలపాప గురించి చదివి ఆశ్చర్యపోయాం. సీరియల్స్, కథలు, సినీ తారల పరిచయాలు ఎంతో మధురంగా ఉన్నాయి. ఇలాంటి మాధుర్యం ఏ ఇతర వీక్లీలోనూ లభించదు. చదివేశాక అప్పుడే మొత్తం చదివేశామా అనిపిస్తుంది. అందుకే అబ్బా ఏం రుచి! నవ్య వీక్లీ రుచి! అంటాను నేను.

-డా.టి.బాలముకుందసింగ్, టి.కళావతి, అమరచింత

భూతాలపాప గగ్గోలు

మొదటిపేజీలో భూతాలపాప ప్రేమంటే భయం కాదు, చావు కాదు అంటూ గగ్గోలుగా అరిచి చెప్పడం, ఆత్మహత్యల్ని నివారించడం అద్భుతంగా ఉంది. పాములతో మసాజ్ పార్లర్లు, పాముల రెస్టారెంట్లు, వేటాడే పాములు...అబ్బో బోలెడు విషయాలు చెప్పారు. ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడమే బెటర్ అని విజయ విలాసంలో చక్కగా వివరించారు.

-ప్రవీణ్, కాకినాడ

విజయవిలాసంలో విలువైన సూచనలు

విజయవిలాసం శీర్షిక నవ్య వీక్లీకి గొప్ప అలంకారం. సమయస్ఫూర్తితో ఆలోచించినవాడే విజేత అవుతాడని సోదాహరణంగా తెలుసుకున్నాం. మూసలో కొట్టుకుపోకుండా ఆలోచనలకు పదును పెట్టాలని గ్రహించాం. ఉత్సాహంతో ఉంటూ అందరిలో ఉత్సాహం నింపాలని ఉంది. విలువైన సూచనలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు.

-సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్

కవితా దినోత్సవం ముదావహం

ప్రపంచ కవితా దినోత్సవం గురించి విని ఆనందించాం. ఆ సందర్భంగా ఎన్నో కవితలు ప్రచురించి ఆనందపరిచారు. సంపాదకవర్గానికి థాంక్స్. చిత్రవిచిత్రమైన పెళ్ళి సంప్రదాయాలు అలరించాయి. పెళ్ళికూతురు ఏడుస్తూ కూర్చోవడం, పెళ్ళికొడుకును పట్టుకుని బాదటం...అన్నీ వింతగా ఉన్నాయి. వింత వింత ఆర్టికల్స్ ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

-సూరి, తాడేపల్లిగూడెం

సినీ సందడి

సినిమా విశేషాలతో నవ్య వారం వారం ఎంతో అలరిస్తోంది. సినీ తారల సందడి, అలనాటి నటుల ఇంటర్వ్యూలు బాగుంటున్నాయి. కొత్త హీరోయిన్లందరి గురించీ తెలుసుకుంటున్నాం. ఎన్టీఆర్ షూటింగ్‌లో ఉంటే అందరికీ భయమే అంటూ లత చెప్పిన మాట నూటికినూరుపాళ్ళు నిజం.

-శ్రీవల్లి, హైదరాబాద్

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో థైరాయిడ్ సమస్యలకు సమర్థవంతమైన వైద్యం

డా. శ్రీకాంత్ మోర్లావర్
CMD
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్

మానవ శరీరంలోని ముఖ్యమైన గ్రంథులలో ఒకటైన థైరాయిడ్ గ్రంథి- మెడ ప్రాంతంలో కంఠం దగ్గర సీతాకోకచిలుక రెక్కల రూపంలో శ్వాసనాళానికి ఇరుప్రక్కలా ఉంటుంది. ఇది ఉత్పత్తి చేసే థైరాయిడ్ (T3,T4) హార్మోన్లు రక్త ప్రవాహంలో కలిసి శారీరక ఎదుగుదల మరియు వివిధ జీవక్రియలను నిర్వహిస్తాయి. థైరాయిడ్ గ్రంథి మన మెదడులోని పిట్యూటరీ గ్రంథి నియంత్రణలో ఉంటుంది. శరీరంలో తగినన్ని థైరాయిడ్ హార్మోన్లు లేనప్పుడు, పిట్యూటరీ గ్రంథి ఆ అవసరాన్ని గ్రహించి TSH-థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్‌ని విడుదల చేస్తుంది. ఈ TSH సంకేతంతోనే థైరాయిడ్ గ్రంథి T3,T4 అనబడే థైరాయిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేసి రక్త ప్రవాహంలోకి పంపుతుంది. ఇలా నిరంతరం మన శరీరంలో థైరాయిడ్ హార్మోన్లు తగిన స్థాయిలో ఉండే వ్యవస్థ విఫలమై, తద్వారా థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తి ఎక్కువ-తక్కువ కావటం ఖచ్చితమైన సమస్యగా పరిణమిస్తుంది. ఈ రకమైన అసమతుల్యతలు-హైపోథైరాయిడ్ లేదా హైపర్ థైరాయిడ్ మరియు గాయిటర్ అనబడే దీర్ఘకాలిక సమస్యలకు దారి తీస్తాయి.

హైపోథైరాయిడిజం: ఇది సర్వసాధారణమైన థైరాయిడ్ సమస్య. శరీరంలో థైరాయిడ్ హార్మోన్లు తక్కువ మోతాదులో ఉత్పత్తి కావడంతో తలెత్తే ఈ సమస్య సహజంగా పిల్లలు, స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తుంది. ఏ వయసు వారిలోనైనా ఇది కనిపించవచ్చు.

లక్షణాలు: నిస్సత్తువ, బలహీనత, చర్మం పొడిబారడం, తక్కువ చెమట , బరువు పెరగడం, స్త్రీలలో నెలసరి సరిగా రాకపోవడం, జుట్టు రాలటం, మతిమరుపు, మలబద్ధకం, అజీర్ణం, చలికి తట్టుకోలేకపోవడం, పిల్లలలో ఎదుగుదల తగ్గటం, ఆడపిల్లలలో రజస్వల ఆలస్యం కావటం లేదా ముందుగానే రావటం, వృద్ధులలో కుంగుబాటుతో పాటు అధిక మతిమరుపు మొదలైనవి.

హైపర్ థైరాయిడిజం: శరీర అవసరానికి మించి, థైరాయిడ్ హార్మోన్లు ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి అవటాన్ని హైపర్ థైరాయిడిజం అంటారు. ఈ సమస్య ఏ వయసు వారికైనా రావచ్చు. కాకపోతే 20-40 సం॥ల మధ్య వయస్కులలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. కానీ దీన్ని వెంటనే గుర్తించలేకపోయినా/నిర్లక్ష్యం వహించినా...హైపర్ థైరాయిడిజం దుష్ప్రభావాలు మాత్రం తీవ్రంగా ఉంటాయి. మొత్తం థైరాయిడ్ బాధితులలో హైపోథైరాయిడిజం 80% కనిపిస్తే, మిగతా 20% హైపర్ థైరాయిడిజం కనిపిస్తుంది.

లక్షణాలు: ఆహారం సరైన మోతాదులో తీసుకున్నా కూడా శరీర బరువు తగ్గటం, నిద్రలేమి, గుండెదడ, వేడిని తట్టుకోలేకపోవడం, చెమట అధికంగా పట్టడం, మానసికంగా తీవ్రమైన చిరాకు, అస్థిమితం, విరేచనాలు, చేతులు వణకడం, నీరసంగా ఉండటం, స్త్రీలలో నెలసరి త్వరగా రావడం, ఋతుచక్రంలో ఉండే రక్తస్రావం ఎక్కువగా అవడం మొదలైనవి.

గాయిటర్: గొంతు క్రింద ఉండే థైరాయిడ్ గ్రంథి అసహజ వాపుకు గురి కావటాన్నే 'గాయిటర్' అని అంటారు. ముఖ్యంగా అయోడిన్ లోపంతో ఉత్పన్నమయ్యే ఈ గాయిటర్ సమస్య హైపోథైరాయిడ్, హైపర్ థైరాయిడిజం బాధలతో కూడుకుని ఉండవచ్చు. T3,T4 థైరాయిడ్ హార్మోన్లు సాధారణ స్థితిలో ఉన్నప్పటికీ 'గాయిటర్' ఉత్పన్నమయ్యేందుకు అవకాశముంది.

లక్షణాలు: గొంతు క్రింద వాపు బాగా ఎక్కువైనప్పుడు- శ్వాసనాళం, ఆహారనాళం పైన ఒత్తిడి పెరిగి ఆహారం మింగలేకపోవడం, స్వరంలో మార్పులు, శ్వాసలో ఇబ్బందులతో పాటు కొందరిలో హైపోథైరాయిడిజం, హైపర్ థైరాయిడిజం లక్షణాలు ఉండవచ్చు.

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్ వైద్యం: నేటి ఉరుకుల-పరుగుల కాలం ప్రభావం వలన, ప్రతి ఒక్కరి జీవితంలో 'అధిక ఒత్తిడి' ఒక ప్రధాన భాగం కావటంతో ఉత్పన్నమవుతున్న ఈ వ్యాధికి జీవితకాలం మందులు వాడే పని లేదు. రోగి శరీరతత్వం మరియు వ్యాధి లక్షణాలను బట్టి కాన్స్టిట్యూషనల్ పద్ధతిలో థైరాయిడ్ హార్మోన్ సమస్యలను సంపూర్ణంగా నయం చేయవచ్చు.

నా పేరు బాలచందర్, Patient-Id : TMBAA84. నేను గత 4 సం॥లుగా హైపోథైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నాను. మొదటగా థైరాయిడ్ పరీక్ష చేయించినప్పుడు TSH 150 miu/ml ఉండేది. ఈ నాలుగు సంవత్సరాలలో 18 కేజీల బరువు కూడా పెరిగాను. థైరాయిడ్‌కు సంబంధించిన మందులు వాడినా ఎలాంటి మార్పు కనిపించలేదు. ముఖం, కాళ్ళు, చేతులలో స్వల్పంగా వాపు కనిపించడంతో పాటు మోకాళ్ళ నొప్పులు, అలసట వంటి లక్షణాలు ఉండేవి. TV లో ప్రకటన చూసిన వెంటనే హోమియోకేర్ ఇంటర్‌నేషనల్ వారిని సంప్రదించాను. అనంతరం నా వ్యాధి బాధల గురించి అక్కడి డాక్టర్లకు పూర్తిగా వివరించాను. వారి సలహా మేరకు చికిత్స ప్రారంభించాను. మొదట 4 నెలల్లోనే TSH (2.09) సాధారణ స్థాయికి చేరింది. బరువు కూడా 5 కేజీలు తగ్గాను. శరీరంలో వాపు, మోకాళ్ళ నొప్పులు, అలసట వంటి సమస్యలు పూర్తిగా తగ్గిపోయాయి. కాన్స్టిట్యూషనల్ హోమియోపతి మందులతో నా థైరాయిడ్ సమస్యలను పూర్తిగా పరిష్కరించిన హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌కు నా ప్రత్యేక కృతజ్ఞతలు.

ఉచిత కన్సల్టేషన్ 955 000 1188/99 టోల్ ఫ్రీ 1800 102 2202 | www.homeocare.in



పుస్తకం ఓ మంచి నేస్తం

బాలసాహిత్యం అనగానే వెంటనే గుర్తొచ్చేది అమ్మమ్మ తాతయ్య చెప్పే కథలే. అనగనగానేమో...ఒక రాజున్నాడు...అంటూ దీర్ఘంతీసి కథ చెప్పే బామ్మ గుర్తొస్తుంది. బువ్వ తినిపిస్తూ కథ చెప్పే అమ్మ గుర్తొస్తుంది. వీపుమీద ఎక్కించుకుని నాన్న చెప్పే కథ గుర్తొస్తుంది. ఇవన్నీ పాతతరంవారి జ్ఞాపకాలే.

ఇవన్నీ ఇప్పుడు అంతరించిపోయే జ్ఞాపకాల జాబితాలో చేరిపోతున్నాయి. ఈ తరానికి ఇలాంటి అనుభూతులు తెలిసే అవకాశం చాలా తక్కువ. అసలు పిల్లలకు కథలెందుకు చెప్పాలి? అని ఎవరైనా అడిగితే, పిల్లల్లో అంతులేని ఊహాశక్తిని పెంచడానికీ, అమోఘమైన తెలివితేటలను వృద్ధిచేయడానికీ, తద్వారా సరికొత్త ఆవిష్కరణలు సృష్టించడానికీ... అని ఠక్కున చెబుతారు!

పూర్వకాలం ఈ కథలన్నీ పెద్దల నాలుకపై ఉండేవి. మన పురాణాల్లోనే పిల్లల్నీ, పెద్దల్నీ ఆకట్టుకునే చిత్రవిచిత్రమైన కథలెన్నో ఉన్నాయి. మనకు తెలిసీ చిన్నయ్యసూరి వంటి మహామహుల రాకతో పిల్లల కథలు క్రమంగా గ్రంథస్థమయ్యాయి. బాల సాహిత్యం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. మనదైన బాల సాహిత్యం పాతతరాన్ని ఏలితే, దిగుమతి బాల సాహిత్యం, కొత్త తరహా సామాజిక విలువలతో కూడిన బాల సాహిత్యం ఇప్పుడు మార్కెట్‌ను ఏలుతోంది. మరి తెలుగుభాషలో తెలుగు పిల్లల కోసం ఎంత సాహిత్యం ఉంది? మన విలువలు ఎటు కొట్టుకుపోయాయి? **ఏప్రిల్ 2 ప్రపంచ బాలల పుస్తక దినోత్సవం** సందర్భంగా ఆ పూర్వాపరాలు మీ కోసం...

బాల సాహిత్యం ఎన్నెన్నో అనుభవాలను, అనుభూతులను అందిస్తుంది. పిల్లల్ని అలరిస్తుంది. ఆడిస్తుంది, పాడిస్తుంది. పెద్దలను సైతం బాల్య జ్ఞాపకాలలోకి తీసుకెళ్తుంది. ఏమీ ఎరుగని పూవు ల్లారా.. అయిదారేడుల పాపల్లారా.. అని శ్రీశ్రీ అంతటి కవే బాల్యపు మధురిమను శైశవగీతిలో వివరించారు. ఇప్పుడు గొప్ప రచనలు చేస్తున్న వారందరూ బాల సాహిత్యాన్ని రాసినవారే. 'మెరుపు మెరిస్తే..వాన కురిస్తే.. ఆకసమున హరివిల్లు విరిస్తే..అవి తమ కే'నని మురిసే చిన్నారుల సృజన క్రమేపీ తరిగిపోతున్నదని ఇటీవల పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

అన్నింటికన్నా విలువైనది బాల్యం. తిరిగి రానిది బాల్యం. అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలు చెప్పేకథలే అసలైన అందం, ఆనందం. కానీ ఆధునిక జీవితం, న్యూక్లియస్ కుటుంబ వ్యవస్థ ఈ ఆనందాన్ని పొట్టనపెట్టుకుంది. బంగారంలాంటి బాల సాహిత్యం నిరాదరణకు గురవుతోంది. ఇప్పటి పిల్లలకు ఇరుకు గదుల్లో తరగతి చదువులు, టీవీలు, కంప్యూటర్లు, కార్టూన్ షోలు తప్ప మరేం తెలియవు. పుస్తక పఠనంతో మాత్రమే ప్రాపంచిక జ్ఞానం అలవడుతుంది. పోటీ పేరిట పిల్లల్ని పాఠ్య పుస్తకాల పురుగులుగా మార్చేశాం. ప్రభుత్వ నిర్ణయం పుణ్యమా అని మోరల్ క్లాసులు, అవి చెప్పే టీచర్లు కనుమరుగయ్యారు. పిల్లల్ని బాల సాహిత్యానికి దూరం చేస్తున్నామనే వాస్తవాన్ని మరిచిపోయారు.

ఇంగ్లీషులో పిల్లల సాహిత్యం

ఒకప్పుడు పంచతంత్రం, పేదరాశి పెద్దమ్మ కథలు, నీతికథలు, రామాయణ, మహాభారత కథలు పిల్లల్ని అలరించేవి. తర్వాత చందమామ, బొమ్మరిల్లు, బుజ్జాయి, బాలమిత్ర వంటి పత్రికలు వచ్చాక జానపద, పౌరాణిక కథలు, పిట్టకథలు, రాజుల కథలు ఉండేవి. తెలిగింటి బాల సంస్కృతికి చిహ్నం చందమామ అని చెప్పటం అతిశయోక్తి కాదు. ఒకనాడు అతిరథ మహారథులైన సంపాదకులు సామాజిక బాధ్యతతో బాల సాహిత్య ప్రచురణకు నడుంకట్టారు. నాలు గైదు దశాబ్దాల క్రితం వరకు అదొక ఉద్యమంగా కొనసాగింది. ఇంగ్లీషు చదువుల ప్రవేశంతో తెలుగు బాల సాహిత్యానికి భిన్నమైన ఇంగ్లీషు బాలసాహిత్యం ప్రవేశించింది. సూపర్‌మేన్, స్పైడర్‌మేన్; బ్యాట్‌మేన్ వంటి హీరోల కథలు కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాయి. ఇంగ్లీషులో బాలసాహిత్యానికి పునరుజ్జీవనం తెచ్చింది జె.కె.రౌలింగ్. హ్యారీపాటర్ విజయంతో రచయితలెందరో ఆ తరహా పుస్తకాలు రాశారు. ఛోటాభీమ్, బాల్ గణేశ్, వీర్ హనుమాన్



బాలసాహిత్యం మరింత రావాలి!

పిల్లల్లో శారీరక ఎదుగుదలతోపాటు మానసిక ఎదుగుదల సక్రమంగా ఉండాలి. ధైర్యసాహసాలు, విజ్ఞాన విషయాలు, సమాజ విలువలను జీర్ణించుకున్న మానవ వనరులను పెంపొందించుకోవాలంటే వారి మనోవికాసానికి బాలసాహిత్యం మరింతగా రావాల్సి ఉంది. బాలసాహిత్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ కూడా గుర్తింపునివ్వడం వల్ల కొంత కాలంగా బాలసాహిత్య రచయితల సంఖ్య పెరిగింది. సాహిత్యాన్ని కాదని విద్య బోధించలేం. కనుక కవులు, రచయితలు బాలసాహిత్యానికి పునరుజ్జీవనం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వంటి బుల్లితెర సాహస కథలు పిల్లల మనసుల్లో గాఢ ముద్రవేశాయి. ఇతర ఇంగ్లీషు కథలెన్నో అనువాదమై ఆదరణ పొందుతున్నాయి.

ఇంగ్లీషు మీడియం ప్రభావం వల్ల పిల్లలు మాతృభాష, తెలుగు చదవలేని పరిస్థితి వచ్చింది. తెలుగులో సరికొత్త బాలసాహిత్యం వచ్చినా పట్టించుకునేవారు కరవయ్యారు. అయినా కూడా తెలుగులో బాల సాహిత్యం పూర్తిగా నిరాదరణకు గురైందని చెప్పలేం గానీ మాతృభాషలో ఆసక్తికరమైన కథలు చదివే అలవాటు పిల్లలకు చేయలేకపోతున్నాం.

సర్వే నివేదికలు

8 - 16 యేళ్ల వయసు పిల్లల్లో ఎంత మంది పుస్తకాలు చదువుతున్నారనే విషయంపై బ్రిటన్‌కు చెందిన నేషనల్ లిటరసీ ట్రస్ట్ సంస్థ ఇటీవల చేసిన సర్వేలో ఆందోళనకర విషయాలు బయటపడ్డాయి. 2005లో 40శాతం మంది పిల్లలు, 2011లో కేవలం 30శాతం మంది పిల్లలు మాత్రమే పుస్తకాలపై ఆసక్తి ప్రదర్శించారట. ఒక వారంలో టీవీతో 39 శాతం పిల్లలు, ముచ్చట్లతో 34 శాతం మంది పిల్లలు కాలక్షేపం చేస్తుంటే, 12 శాతం మంది పిల్లలు మాత్రమే బాల సాహిత్యం చదువుతున్నట్టు సర్వే పేర్కొంది. జాగ్రత్త పడకపోతే ఈ సంఖ్య మరింత తగ్గుతుందని హెచ్చరించింది.

బాలసాహిత్య జాతీయ కేంద్రం

బాలసాహిత్యానికి పెద్దపీట వేసే ప్రచురణ సంస్థలు ఎన్నో ఉన్నాయి. నిజం చెప్పాలంటే ఈ సంస్థలే బాల సాహిత్యాన్ని బతికిస్తున్నాయి. అందులో నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రత్యేకమైంది. పిల్లల్లో పఠనాసక్తిని ప్రోత్సహించడానికి వివిధ ప్రచురణ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సాహిత్య సంస్థలు సహకారంతో ఏటా నవంబర్ 14 నుంచి 20 వరకు జాతీయ పుస్తక వారోత్సవాల్ని వీరు దేశం అంతటా నిర్వహిస్తున్నారు. దేశ భాషల్లో బాల సాహిత్య ప్రచురణల ప్రగతిని గమనించడానికి, బాలసాహిత్య జాతీయ కేంద్రం పేరిట ప్రత్యేక విభాగం పెట్టి గ్రంథాలయాలు, పుస్తక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. సాహిత్య అకాడమీ, చిల్డ్రన్ బుక్ ట్రస్ట్, బాలసాహిత్య పరిషత్, బాలసాహితి వంటి పలు సంస్థలు కూడా పిల్లల సాహిత్యాన్ని అందిస్తున్నాయి. బాలసాహిత్య రచయితలను సత్కరిస్తున్నాయి! వీటి కృషివల్ల కొంత కాలంగా పిల్లల పుస్తకాల కొనుగోలు 30 శాతం పెరిగిందని ఓ సర్వే తెలిపింది.

చిల్డ్రన్స్ బుక్ డే

పిల్లలతో కథల పుస్తకాలు చదివించాల్సిన ఆవశ్యకతను ప్రపంచం ఏనాడో గుర్తించింది. అందుకే అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం యేటా నిర్వహిస్తారు. దీని వెనుక ఓ రచయిత స్ఫూర్తి ఉంది.

బాగా ప్రాచుర్యం పొందిన చిన్న పిల్లల కథల్లో ఫెయిరీ టేల్స్ ఒకటి. ఈ కథలంటే పిల్లలకి చాలా ఇష్టం. ఈ ఫెయిరీ టేల్స్ రచయిత హన్స్ క్రిస్టియన్ అండర్సన్. డెన్మార్క్ జాతీయుడు. 1805 - 1875 మధ్య కాలంలో ఆయన పిల్లల కోసం గొప్ప సాహిత్యం సృష్టించాడు. ద లిటిల్ మెర్మైడ్, ద స్నో క్వీన్, ద ప్రిన్సెస్ అండ్ ద పీ, థంబులీన్ వంటివి ప్రాచుర్యం పొందిన ఆయన కథలు. ఆయన రాసిన జానపద కథలు 150 భాషల్లోకి అనువదించారు. వాటిల్లో కొన్ని యానిమేషన్ చిత్రాలకు, పిల్లల నాటికలకు ప్రేరణనిచ్చాయి. ఆయన జన్మదినం పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం ఏప్రిల్ 2న ఏటా అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం పాటిస్తారు.

రేడియో, టీవీ

తెలుగునాట రేడియో ఒక అంతర్భాగం. దశాబ్దాలుగా నేటికీ బాల సాహిత్య ప్రసారంలో రేడియో తన వైవిధ్యం నిలబెట్టుకుంటోంది. బొమ్మరిల్లు, బాలానందం, బాలల కార్యక్రమాల ద్వారా ప్రత్యక్షంగా పిల్లల్ని భాగస్వాములను చేస్తూ, వారి మేధోవికాసానికి కృషి చేస్తోంది. దూరదర్శన్ సహా కొన్ని చానల్స్ పిల్లల కోసం ప్రత్యేక ప్రసారాలు చేస్తున్నాయి. పిల్లల కోసం కొన్ని ప్రత్యేక చానల్స్ ఉండటం కూడా ముదావహం. కానీ ఇవన్నీ పుస్తక పఠనానికి భిన్నమైనవే.

పెద్దల బాధ్యత

భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్థులు కావడంవల్ల పిల్లలతో కథల పుస్తకాలు చదివించడంపై వారు శ్రద్ధ చూపించలేకపోతున్నారు. దాంతో పిల్లలు కంప్యూటర్ గేమ్స్, టీవీలకే అతుక్కుపోతున్నారు. మధ్యతరగతి కుటుంబాల్లో ఈ ధోరణి ఎక్కువట. ఉన్నత శ్రేణి కుటుంబాల్లో పిల్లలు కథల పుస్తకాల పట్ల ఆసక్తితో ఉన్నట్టు సర్వేలు చెబుతున్నాయి. పుస్తక పఠనంతో అపరిమిత విజ్ఞానం, కొత్త విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి పెరుగుతుంది. వారి ఊహాశక్తి ద్విగుణీకృతమవుతుంది. భాషపై పట్టు లభిస్తుంది. సరికొత్త ఆలోచనలకది శ్రీకారం చుడుతుంది. పిల్లలు సాహిత్యం చదివేందుకు పెద్దలు పూనుకోవాలి. ఈ - బుక్స్ కంటే కథల పుస్తకాలే పిల్లల్లో ఊహాశక్తిని రెండింతలు చేస్తాయట. చిత్రకారుడి రంగురంగుల బొమ్మలు, కథలో సన్నివేశ దృశ్యాల్ని ప్రతిబింబించే చిత్రాలు పిల్లల మెదడుపై ప్రభావం చూపిస్తాయి. పుస్తక పఠనం వల్ల అనారోగ్య సమస్యలూ తక్కువే.

- సంతోషలక్ష్మి దహగాం

నవ్యవీక్లి కంట్రిబ్యూషన్

పుస్తకాలే పిల్లలకు పసిడి నేస్తాలు. తెలుగునాట ఎన్నో పిల్లల పుస్తకాలు, ప్రచురణలు వెలువడ్డాయి. ఈకాలం పిల్లలకు, అదీ తెలుగు పిల్లలకి, తెలుగులో ఎలాంటి సాహిత్యం లభ్యమవుతోంది? అనే ప్రశ్నకు జవాబు అంతంతమాత్రమే. ఇంగ్లీషు, ఫ్రెంచ్, ఐరోపా వంటి భాషల్లో ఎందరో బాల సాహిత్య రచయితలున్నారు. వివిధ భాషలతో పోలిస్తే ఇటీవల పిల్లల కోసం తెలుగులో వచ్చిన బాలసాహిత్యం తక్కువే. అప్పటి కాలంలో వివిధ పత్రికలు, పాకెట్ సైజ్ పుస్తకాలు దొరికేవి. ఇప్పుడిలాంటి పత్రికలు తెలుగులో తక్కువే. పిల్లల కోసం ప్రత్యేక పుస్తకాలు వెలువరించడం వేరు. కానీ పిల్లలకూ పెద్దలకూ ఉపయోగపడే సాహిత్యం, వినోదం, విజ్ఞానం అందించడంలో నవ్య వారపత్రిక విలక్షణమైన పాత్ర నిర్వహిస్తూ తనవంతు కృషిచేస్తోంది. నెమలీక, పాలపిట్ట,

పంచతంత్రం, పేదరాసి పెద్దమ్మ కథలు, కథాసరిత్సాగరం వంటి ఎన్నో వినోదాత్మక కథలు ప్రచురించింది. ఆ కథలన్నీ ఆబాల గోపాలాన్ని అలరించినవే! రామాయణ, భారత, భాగవతాదులు కూడా పిల్లల కోసమే!

ఒక తండ్రి కథ

శీరం నారాయణస్వామి

డెబ్భై ఏళ్ళ నీలకంఠం కొడుకు గదిలోకి భయం భయంగా తొంగి చూస్తున్నాడు. గదిలో దృశ్యం ఆయన కంటికి ఎంతో భయంకరంగా కనిపిస్తున్నది. రోజూ చూసే దృశ్యమే అది!

చూసిన ప్రతిసారీ భయంకరంగానే కనిపిస్తుంటుంది. అయినా చూడకుండా ఉండలేడు.

బాధతో అస్పష్టంగా గొణుక్కుంటున్నాడు. తన తలరాతను నిందించుకుంటున్నట్టు అర చేతిని నుదుటికేసి కొట్టుకుంటున్నాడు. ఈ లోకంలోని దైన్యమంతా ఆ క్షణాన ఆయన వదనంలోనే తిష్ఠవేసింది.

ఇంతకూ గదిలో ఆయన చూస్తున్న ఆ భయంకరమైన దృశ్యమేమిటంటే పోలీసు శాఖలో ఇన్‌స్పెక్టర్ హోదాలో ఉన్న ఆయన ఒక్కగానొక్క కొడుకు ఉద్యోగానికి వెళుతూ ఖాకీ దుస్తులు ధరిస్తున్నాడు.

పాపం! కొడుకు తొమ్మిదేళ్ళ ప్రాయంలో ఉండగానే ఆయన ధర్మపత్ని కాలధర్మం చెందింది. అప్పటి నుంచీ తనే తల్లీ తండ్రీ అయి కొడుకును పెంచాడు. ఆ విధంగా ఆ తండ్రికి కొడుకుతో ప్రగాఢమైన అనుబంధం ఏర్పడింది. ఆటలలో చిన్న దెబ్బ తగిలించుకున్నా ఆ తండ్రి ఎంతగానో విలవిలలాడిపోయేవాడు. అలా ప్రాణం కన్నా మిన్నగా చూసుకుంటున్న తనయుడు డిగ్రీ చదువు ముగిసిన తరువాత తాను సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపిక అయ్యాననే వార్తను చల్లగా వినిపించడంతోనే ఆ తండ్రి ఒళ్ళు ఒక్కుమ్మడిగా చల్లబడిపోయింది. తీవ్రవాదం, దౌర్జన్యం, హింస, నేరమూ పెచ్చుపెరిగిపోయిన ఈ పిదప కాలంలో ఆ ఉద్యోగంలో అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉంటాయనీ, ఏ క్షణాన ఏ ముప్పు వాటిల్లుతుందోననీ ఆయన భయం. ఎందుకు నాయనా ఆ ఉద్యోగం ఎంచుకున్నావు? అయినా ఇప్పటికిప్పుడు ఉద్యోగంలో చేరితేనే కానీ పూట గడవని స్థితి లేదు కదా! నా మాటవిని మరో మంచి ఉద్యోగం చూసుకో. ఇందులో మాత్రం చేరకు అంటూ, ఎంతగానో నచ్చజెప్పాడు. చుబుకం పట్టుకుని బతిమాలాడు.

అయినా ఆ తనయుడు ససేమిరా అన్నాడు.

ఆయన భయానికి తగ్గట్టే శిక్షణ ముగిసిన వెంటనే అతడిని తీవ్రవాదుల ప్రాబల్యం అధికంగా ఉన్న ప్రాంతానికి పంపించారు. ఇక ఆయన భయాందోళనలు చెప్పతరం కాదు. కొడుకు బలిపశువు కాబోతున్నట్టు, బలిపీఠం ఎక్కుతున్నట్టు తోచింది. కోరి కష్టాల కొలిమిలో దూరుతున్నట్టు అనిపించింది. కరచరణాలాడలేదు. ఏమీ పాలుపోని స్థితి అది.



కొడుకును ఒంటరిగా పంపడానికి మనసు రాలేదు. అందువల్ల తన పదవీ విరమణకు ఇంకా ఎంతో వ్యవధి ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి కొడుకును అనుసరించాడు. అంతటితో ఆ తండ్రి జీవన భారతంలో శాంతిపర్వం ముగిసిపోయింది. అశాంతిపర్వం ఆరంభమైంది. ఆ తండ్రి పిడికెడు గుండె భయం గుప్పిట్లో నలిగి పోతున్నది. ఆందోళనాగ్నిలో కుతకుత ఉడికి పోతున్నది. కొడుకు బైటకు వెళ్ళింది మొదలు తిరిగి ఇంట అడుగు పెట్టేంతవరకూ ఒంట్లో నరాలు ఛిద్రమయిపోతాయేమో అనిపించేటంత ఉద్వేగం, ఉద్రిక్తత ప్రతిదినం, ప్రతి క్షణం.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన కొడుకు తీవ్రవాదుల ప్రాబల్యాన్ని ఎంతో సమర్థంగా అణచివేయడంతో అతడి సేవలకు మెచ్చుకుని ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పించారు.

ఇక ఆయనలోని భయాందోళనలు అదేస్థాయిలో పెరిగిపోయాయని చెప్పనవసరం లేదు.

కొడుకుకు లక్షణమైన సంబంధం చూసి ఎంతో వైభవంగా వివాహం జరిపించాడు. ఒక పౌత్రుడు కలిగాడు. ఆ మనుమడికి ఇప్పుడు మూడేళ్ళు.

ఆరడుగుల ఆజానుబాహుడు అయిన కొడుకు ఖాకీ దుస్తులు ధరించి ఎంతో హుందాగా బుల్లెట్ మోటారు సైకిల్‌పై దూసుకుపోతుంటే బాల్కనీలో నిలబడి చూస్తున్న ఆ తండ్రిలో ఏనాడూ పుత్రోత్సాహం కలగదు సరికదా ఎంతో కాలం నుండి జబ్బుపడిన వాడిలా నీరసించి పోతాడు. కొడుకు వీధి మలుపు తిరిగి అదృశ్యమై పోయినా ఆయన చూపులు అటే నిలిచిపోతాయి. ఆ చూపుల్లో జీవం ఉండదు. అటువంటి స్థితిలో ఆహారం కూడా నోటికెక్కదేమో, ఉదయపు అల్పాహారం బలంగా నోట కుక్కుకుని స్నానాదికాలు ముగించుకుని దేవాలయానికి బయలుదేరతాడు నిత్యం.

అట్లాగని ఆయన గొప్ప దైవ భక్తుడేమీ కాదు. భార్య అకాల మరణంతో ఆయన నాస్తికుడే అయ్యాడు. అయితే ఏ రోజు ప్రాణప్రదమైన తనయుడు ప్రమాదకరమైన ఉద్యోగంలో చేరాడో ఆనాటి నుంచే ఆయన పరమభక్తుడైనాడు. భక్తి జనించేది భయం నుంచే కదా మరి!

సోమవారం శివాలయానికి వెళితే మంగళవారం పవనసుతుని కోవెలకు వెళతాడు. బుధవారం రాఘవేంద్రస్వామి వంతయితే గురువారం సాయినాథుని వంతు. ఇక శుక్రవారం అమ్మవారి కోవెలకు వెళ్ళడమే కాకుండా ఆ జగజ్జనని తన తనయుడిని ఎంతో పదిలంగా చూసుకుంటుందన్న నమ్మికతో నిష్ఠగా లలితా సహస్రనామం పఠిస్తాడు.

ఇక శనివారం వెంకటేశ్వరుని సేవించి అనంతరం అక్కడే ఉన్న శనేశ్వరునికి నువ్వుల నూనెతో అభిషేకం కావించి పదకొండు పర్యాయాలు ప్రదక్షిణలు చేస్తాడు. తనయుని యోగక్షేమాల గురించి ఆలయాలలో అలా పూజలు కావించి ఇంటి ముఖం పడుతుంటే మనసుకు కొంత సాంత్వన చేకూరుతుంది. తన పూజలు వృథా కావన్న భావనతో ఎంతో ప్రశాంతత కలుగుతుంది.

కానీ అదీ తాత్కాలికమే!

ఇంట అడుగుపెట్టడంతోనే చిరకాలంగా గుండెలో గూడుకట్టుకున్న భయం అనబడే ఆ రాబందు యథాప్రకారం తన చుంచువుతో గుండెను పొడవడం ప్రారంభిస్తుంది. హింస ప్రారంభమవుతుంది. అశాంతి అనబడే అగ్ని మరలా రాజుకుంటుంది.

పోలీసు శాఖలో కొన్ని లక్షల మంది పని చేస్తున్నారు. వాళ్ళ కన్నవాళ్ళు తనలాగే భ్రాంతులలో బతుకుతున్నారా? అని ప్రశ్నించుకుంటాడు. అనవసరపు భయాందోళనలు బైటకు నెట్టేసి అందరిలా ఎంతో ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నిస్తాడు.

కానీ పాపిష్ఠి మనసు ఆయన మాట వింటేనా!

“పట్టపగలు బ్యాంకుపై దుండగుల దాడి. అడ్డుకున్న పోలీసులపై కాల్పులు. ఇన్‌స్పెక్టర్‌తో సహా ఇద్దరు పోలీసులు మృతి”

“తీవ్రవాదులు అమర్చిన మందుపాతర పేలి దగ్ధమైపోయిన పోలీసు వాహనం. పదిహేడు

గురు పోలీసు సిబ్బంది దుర్మరణం".

"తీవ్రవాదుల మెరుపు దాడి. తూటాల వర్షంలో నేలకొరిగిన నలభైమంది ఖాకీలు"

దినపత్రికలు తరచుగా ఇటువంటి వార్తలే మోసుకువస్తాయి. అందుకని వాటిని చదవడం ఏనాడో మానుకున్నాడు. ప్రభాతవేళ న్యూస్ పేపర్ కుర్రాడు బాల్కనీలోకి గిరవాటేసిన దినపత్రిక ఆయన కంటికి చుట్టచుట్టుకుని ఉన్న విషసర్పం లానే కనిపిస్తుంటుంది.

వయసు పైబడుతున్న కొద్దీ ఆయనలో భయాందోళనలు ఎంత తీవ్రమవుతున్నాయంటే, కొడుకు ఇంట లేని సమయంలో టెలిఫోన్ గణ గణ మోగితే చాలు ఆ వృద్ధుడి ప్రైప్రాణం పైనే పోతుంది. ఆ తండ్రి మనసు ఎప్పుడూ కొడుకునే శంకిస్తుంటుంది. అటువేపు నుంచి ఏదైనా దుర్వార్త వినవలసి వస్తుందేమోనన్న భయంతో ఎట్టిపరిస్థితుల్లోనూ ఫోన్ రిసీవర్ చేతిలోకి తీసు కోడు. ఎంతపనిలో ఉన్నా కోడలు రావలసిందే. ఆమె ఫోన్‌లో మాట్లాడుతుంటే భయం భయంగా ఆమె ముఖకవళికలు గమనిస్తాడు.

తన భయానికి ఒక్కొక్కప్పుడు ఆయనకు తనమీద తనకే ఎనలేని అసహ్యం కలుగు తుంటుంది కూడా.

ఇక పొద్దుకుంగడంతోనే ఆ తండ్రి మకాం బాల్కనీలోకి మారిపోతుంది. తనయుని కోసం నిరీక్షణ ప్రారంభమవుతుంది. బాల్కనీ పిట్ట గోడకు రెండు చేతులూ ఆనించి నిలబడి తొండ తొర్రలో నుంచి తలబైటకు పెట్టి చూసినట్టు మెడను బారజాపి వీధి మలుపువేపు తొంగి చూస్తుంటాడు కొడుకు రాక కోసం...

కొడుకు కంటపడే ఆ మధుర క్షణం కోసం....

సమయం గడుస్తుంటుంది. నిలబడి నిలబడి కాళ్ళు పీకుతుంటాయి. నేత్రాలు అలసిపోతాయి. మెడనొప్పి పెడుతుంది. అయినా అక్కడి నుండి కదలడానికి మనస్కరించదు. ఒక్కొక్కప్పుడు రాత్రి తొమ్మిదిగంటలు కూడా అవుతుంది. అయినా కొడుకు జాడ ఉండదు. చుట్టూ చీకట్లు మాదిరి ఆయనలో భయాందోళనలు మరింతగా పేరుకు పోతాయి. ఇక నిలువరించుకోలేక కోడలి వద్దకు వెళతాడు. అప్పటికి ఇంటిపని ముగించుకుని ఎంతో తీరుబడిగా బుల్లితెరపై కార్యక్రమాలు చూస్తున్న ఆమెతో, చాలా టైమైంది, వీడింకా రాలే దమ్మా అంటాడు. ఆయన ఏ రోజు తొందరగా వచ్చారో చెప్పండి అంకుల్ అంటూనే ఆమె రెండు మూడు పర్యాయాలు అతడితో సెల్ ఫోన్‌లో మాట్లాడటానికి ప్రయత్నిస్తుంది. కానీ కాల్ దొరకడం లేదని సమాధానం రావడంతో తిరిగి కార్యక్రమాల్లో మునిగిపోతుంది.

'తను ప్రతిక్షణం భయాందోళనలతో సత మతమవుతున్నాడే...అంతులేని మానసిక క్షోభతో నరకాన్నే చవిచూస్తున్నాడే... అటువంటిది ఈమె ఇంత నిశ్చింతగా, ఇంత నిర్భయంగా, ఇంత ప్రశాంతంగా ఎలా ఉండగలుగుతోంది? తను శాపగ్రస్తుడు. జీవితాంతం ఇలా భయాందోళ నలతో మానసిక క్షోభతో అలమటించిపోవాలని భగవంతుడు రాసిపెట్టాడేమో? ఈ క్షోభ నుంచి తనకు విముక్తి ఎన్నడు?'

ఇప్పుడతను మనిషి కాదు. భీకరమైన వెల్లువ వచ్చి తీసిపోయిన నదిలాంటివాడు. ప్రవహించి ప్రవహించి ఇంకిపోయిన నది ఇసుక మేటల్ని మాత్రమే మిగుల్చుకుంటుంది. అతని పరిస్థితి అదే. ఇప్పుడతను దేవాలయానికి వెళ్ళి దేవుళ్ళకు మొక్కుకోవాల్సిన అగత్యం లేదు. టెలిఫోన్ మోగితే భయపడాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఇంతకీ అతడెవరు? ఎందుకతనికీ పరిస్థితి?

భయం కలిగినప్పుడల్లా శంకరాచార్యుని నృసింహ శతకం చదువుకొమ్మని ఎవరో సలహా ఇచ్చారేమో ఆ శతక పఠనం ప్రారంభిస్తాడు. ఎట్టకేలకు ఆయన వీనులకు విందు చేస్తూ అల్లంత దూరం నుంచి బుల్లెట్ మోటారు సైకిల్ చప్పుడు వినవస్తుంది.

ఆ తండ్రి ప్రాణం లేచొస్తుంది.

కొడుకును చూసుకుంటూ పసిపిల్లవాడిలా ఎంతో సంబరపడిపోతాడు.

ఆరడుగుల ఆజానుబాహుడయిన కొడుకు గుమ్మందాటి లోనికి అడుగుపెట్టడంతోనే ఆయన లోని భయమూ, ఆందోళనా, ఆ ఉద్రిక్తతా రవి కిరణాలు సోకిన మంచులా కరిగిపోతాయి.

ఆ తండ్రి పట్టెడు మెతుకులు ఎంతో సంతృ ప్తిగా తినగలిగేది అప్పుడే.

ఇక ఆ రాత్రి పొత్తిళ్ళలో పసికందులా ఎంతో ప్రశాంతంగా నిశ్చింతగా నిద్రపోతాడు.

తెల్లవారుతుంది.

కొడుకు ఖాకీ దుస్తులు ధరిస్తున్న ఆ భయం కరమైన దృశ్యాన్ని చూస్తుండటంతో కథ మళ్ళీ ప్రారంభం అవుతుంది.

అదొక అంతులేని కథ.....

ఒక్కొక్కప్పుడు నడిరాత్రివేళ అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయాన ఫోన్ గణ గణ మోగు తుంది. పట్టణంలో ఎక్కడో నేరమో, ఘోరమో జరిగిందనే వార్త వినిపిస్తుంది. అప్పటికప్పుడు వెళ్ళడానికి ఉద్యుక్తుడైన కొడుకు ఖాకీ దుస్తులు ధరిస్తుంటే ఆయన ప్రైప్రాణం పైనే పోతుంది. ఇంత రాత్రివేళ ఇంత చీకటిలో ఒక్కడివీ ఎలా వెళతావురా నాయనా....పోనీ నన్నూ నీ వెంట తోడుగా రమ్మంటావా! అని అడుగుతాడు. ఎంతో బేలగా.

కానీ కొడుకు పకపకా నవ్వేస్తాడు.

"భలే వాడివే! నేనేమన్నా చిన్న పిల్లాడిననుకుంటున్నావా?"

వెళ్ళినపని ముగించుకుని ఏ తెల్లవారు జామునో అతడు తిరిగి ఇంటికి వచ్చేంత వరకూ నీలకంఠం బాల్కనీలో తచ్చాడుతూ ఉండిపోతాడు కాళ్ళు పీకుతున్నప్పటికీ.

అవకాశం లభించినప్పుడల్లా కొడుకును శత విధాల ప్రాధేయపడుతుంటాడు. "నువ్వు బైటకు వెళ్ళింది మొదలు తిరిగి వచ్చేంత వరకూ నా మనసు మనసులో ఉండదు. ఎందుకురా నాయనా ఈ ఉద్యోగం. నా మాట విని రాజీనామా చేసేయ్. మనకి ఉండటానికి స్వంత ఇల్లు ఉంది. నా ప్రావిడెంట్ ఫండ్ డబ్బులతో నాలుగు ఆటో రిక్షాలు కొంటాను. వాటిని అద్దెకు ఇచ్చుకున్నా వంటే చాలు భుక్తికి ఏ లోటూ ఉండదు. అంచేత నా మాటవిని ఈ ఉద్యోగం విడిచిపెట్టేయ్"

నువ్వు మరీ భయపడితే ఎలా నాన్నా అని నచ్చచెబుతాడు తనయుడు ఎంతో మృదువుగా, అనునయంగా....

ఆ రోజు అపర్ణాహం భోజనానికి ఇంటికి వచ్చిన తనయుడు తిరిగి వెళ్ళిపోతూ రాత్రికి చికెన్ బిరి యానీ తినాలని ఉంది. ఎండతగ్గిన తరువాత బజారుకు వెళ్ళి బాస్మతీ బియ్యమూ, కోడి మాంసమూ తీసుకురమ్మని తండ్రికి పురమా యించాడు. కాస్త ఖరీదు ఎక్కువయినా నాణ్యా మైన బియ్యం తీసుకురా. లేకపోతే బిరియానీకి ఆ సువాసన అబ్బదు. అలాగే చికెన్ కూడా కాస్త పెద్ద ముక్కలు కొట్టించు అంటూ సూచనలు చేశాడు.

నాకు తెలుసులేరా అన్నాడా తండ్రి ఎంతో మురిపెంగా.



శ్రుతికి నిర్మాత దొరికాడు

స్టార్ హీరోయిన్ శ్రుతి డేట్ల కోసం నిర్మాతలు క్యూ కడుతుంటే ఇప్పుడు కొత్తగా నిర్మాత దొరకడం ఏమిటి? అన్న అనుమానం వస్తోంది కదూ! ఇక్కడే చిన్న రహస్యం ఉంది. ఆ నిర్మాతతో శ్రుతి పని చేస్తుందట కానీ హీరోయిన్‌గా కాదు, దర్శకురాలిగా చేస్తుందట! శ్రుతి ఏమిటి? డైరెక్షన్ ఏమిటనుకుంటున్నారా? శ్రుతికి తండ్రిలాగా మంచి డైరెక్టర్ అనిపించుకోవాలని కోరికట! చేతిలో ఉన్న సినిమాలు అయిపోయిన వెంటనే డైరెక్టర్ కుర్చీ ఎక్కేస్తానంటోంది. ఇప్పటికే శ్రుతి డైరెక్ట్ చేసే సినిమాను తాను నిర్మిస్తానని ఓ వ్యక్తి ముందుకు వచ్చారట! అయితే ఆ వ్యక్తి ఎవరన్నది మాత్రం ఇప్పుడే చెప్పనంటోంది శ్రుతి.

తన కొడుకును ప్రాణాలతో చూసుకొనడమూ అతడితో సంభాషించడమూ అదే చిట్టచివరిసారి అని ఆ తండ్రికి తెలియదు.

తన కార్యాలయానికి వెళుతుండగా నాలుగు రోడ్ల కూడలి వద్ద సిగ్నల్ కోసం వేచి ఉన్నప్పుడు శబరిమలై అయ్యప్ప భక్తుల వేషాలలో ఉన్న తీవ్రవాదులు ఊహించని విధంగా అతి సమీపం నుంచి అతడి మీద రివాల్వర్‌లతో కాల్పులు జరిపారు.

నెత్తురు మడుగులో కుప్పకూలిపోయాడతడు. జీవించే అవకాశం ఎంతమాత్రం లేకుండా మరొకమారు రివాల్వర్‌ను అతడి కణతలమీద గురిపెట్టి కొట్టారు (అది తీవ్రవాదులు అనుసరించే సంప్రదాయం).

నిర్ఘాంతపోయిన జనం తేరుకునేలోపు వచ్చిన వారు వచ్చినట్టే మాయమయ్యారు.

ఆ ఆరడుగుల ఆజానుబాహుడు, తండ్రికి ప్రాణం కన్నా మిన్న అయినవాడు తీవ్రవాదమనే పిచ్చికుక్క కోరలకు బలి అయ్యాడు.

ప్రతిరోజూ ఎంతో చీకటిపడిన తరువాత గానీ ఇంటికి చేరుకోని ఆ తనయుడు ఆ రోజు మాత్రం సంధ్యా సమయానికల్లా ఇల్లు చేరుకున్నాడు, శవమైపోయి.

తండ్రి తలకు కొరివిపెట్టవలసినవాడు తండ్రి చేతనే తలకొరివి పెట్టించుకున్నాడు. తండ్రికి ఏ చింతా లేకుండా చూసుకోవలసినవాడు తాను చితిమీదకు చేరుకుంటూ తండ్రి శేష జీవితాన్ని నిరంతరం రగులుతుండే చితిగా మార్చేశాడు.

అపరకర్మలు ముగించిన అనంతరం నీలకంఠం కోడలినీ మనుమడినీ పుట్టింటివారు తీసుకువెళ్ళిపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆమె విద్యార్హతలకు తగిన ఉద్యోగాన్ని పోలీసు శాఖలో ఇవ్వడానికి చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నీలకంఠం ఇప్పుడు ఒంటరి.

భర్తృహీన అయిన ఆయన పినతల్లి కూతురు, వయసులో ఆయన కన్నా పది సంవత్సరాలు చిన్నది తోడుగా వచ్చి ఉంటున్నది. ఆ చెల్లెలే అన్నగారికి వేళకి ఇంత ఉడకేసి పెడుతున్నది.

నదికి ఉధృతంగా వరద వస్తుంది. కదన తరంగంలా ఉప్పొంగి ప్రవహిస్తుంది. కొంత కాలానికి వరద తీసిపోతుంది. నీరు ఇంకిపోతుంది. కానీ నది అంతటా ఇసుక మేట వేస్తుంది. తనయుని గురించిన తాపత్రయంతో ఆ తండ్రి జీవితం వరద ఉధృతి మీద ఉన్న నదిలా ఉండేది. క్షణక్షణానికీ పొంగిపొరలిపోతూ గట్లు తెంచుకుంటూ ఒళ్ళు జలదరింపజేసే భీకరనదిలా ఉండేది. కొడుకు మరణంతో ఆ వరద తీసిపోయింది. ఆ కన్నీరు ఇంకిపోయింది. కానీ పెను విషాదం మాత్రం ఇసుకలా మేట వేసుకుపోయింది.

పుట్టుకతో చూపులేని వారికి నలుపు రంగు కూడా తెలియదు. వారికి పూర్తిగా కళ్ళల్లో ఏ రంగూ లేని శూన్యమే ఆవరించి ఉంటుంది.

తనయుడికి ఎప్పుడు ఏ ముప్పు వాటిల్లుతుందో అనే తాపత్రయం లేదిప్పుడు. అతడిని ఎప్పుడెప్పుడు చూసుకుంటానా అనే ఆరాటమూ లేదు.

తనయునికోసం ఎదురుచూపులు చూసీ చూసీ ఆ తండ్రి జీవితంలో ఎంతగానో అలసిపోయాడు. కొడుకు మరణంతో ఆ నిరీక్షణ ముగిసిపోయింది. అతడు ఖాకీదుస్తులు ధరిస్తుంటే ఎంతో భయం భయంగా ఆ గదిలోకి తొంగి చూసేవాడు ప్రతి ఉదయమూ.

కానీ ఇప్పుడాగది శూన్యమైపోయింది.

అతడు ఇంటలేని సమయంలో టెలిఫోన్ గణగణమోగితే చాలు ఆ తండ్రి పైప్రాణాలు పైనే పోయేవి. కొడుకును గురించి ఏ దుర్వార్త అయినా వినాల్సి వస్తుందేమోనని. పాపిష్టి మనసు ఎప్పుడూ కీడునే శంకిస్తూ ఉండేదిమరి. ఇప్పుడిక రావలసిన దుర్వార్తలేమీ లేవు. అందువలన ఫోను గణగణమంటున్నా ఆయన ఇప్పుడు ఉలిక్కి పడటం లేదు.

ఆయన ఇప్పుడు మనిషి కాదు. భీకరమైన వెల్లువ వచ్చి తీసిపోయిన నది. నీరంతా ఇంకిపోయిన నది. ఇసుక మేటలను మాత్రమే మిగుల్చుకున్న నది.

తనయునికి అపరకర్మలు ముగించుకుని మరుభూమి నుంచి మరలి వచ్చింది మొదలు వీధి ముఖమే చూడటం లేదు. దేవాలయాలకు వెళ్ళవలసిన అవసరం ఏముంది? వేలుపులకు వందనాలు చేయవలసిన అగత్యం ఏముంది?

ఈ రెండు మాసాలలోనూ ఆయన బాగా శుష్కించిపోయాడు. సన్నిహితులు సహితం గుర్తుపట్టలేనంతగా ఎముకలగూడులా మిగిలిపోయాడు. రోజంతా పడక కుర్చీలో పడుకుని శూన్యంలోకి చూస్తూ ఉండిపోతాడు.

ఆరడుగుల ఆజానుబాహుడయిన కొడుకు మనోనేత్రం ఎదుట మెదులుతుంటే, అతడి జ్ఞాపకాలన్నీ ఒక్కటొక్కటిగా గుండెను తొలుస్తూ ఉంటే లోతుకు పోయిన ఆ వృద్ధుని కళ్ళల్లో కాసిని కన్నీటి చుక్కలు చెమరుస్తుంటాయి. అవి చెక్కిళ్ళమీదుగా జారుతుంటాయి, ఆ ఎముకలగూడు ఊపిరితోనే ఉన్నదని చెప్పడానికన్నట్టు.....

సెల్: 94403 06485

కంతుగాడి కాశీయాత్ర

- శివసతీపురం శర్మ 5

తెల్లారుజామున మూడున్నర సమయంలో ఏసీనీ, భూతాలపంతులు దంపతుల నిర్ణయాన్నీ తట్టుకోలేక బయటకు నడిచాడు కంతు. వచ్చి, కోచ్ డోర్ దగ్గరగా నిలబడ్డాడు. ఆలోచిస్తూ అప్రయత్నంగా అటుగా చూశాడు. బురఖాలో ఒక యువతి టాయ్‌లెట్స్ దగ్గరగా కూర్చుని ఉంది. పెద్దపెద్ద కళ్ళు, కొనదేలిన ముక్కు, ముక్కుకీ, పైపెదవికీ మధ్య పుట్టుమచ్చ. ఏడుస్తోందామె. సన్నగా...మెల్లగా...ఏడుస్తోంది. ఆమె చేతుల్లో పసికందు ఉంది. ఆ కందుని పదేపదే చూస్తూ, ముద్దులాడుతోంది.

కళ్ళముందు ఇంకా ఆ దృశ్యం కదులుతూనే ఉంది. కంతు మరచిపోలేదు.

“ఈ పిల్ల తల్లి నాకు తెలుసు. నేను చూశాను.” అన్నాడు కంతు. తానెక్కడ చూసిందీ, ఎప్పుడు చూసిందీ, ఆ తల్లి ఎలా ఉన్నదీ వివరంగా చెప్పాడు అందరికీ.

“అయితే ఆ తల్లి ఈ ట్రైన్లోనే ఎక్కడో అక్కడ ఉండి ఉంటుంది. వెతికి ఇచ్చేద్దాం పిల్లని.” అన్నాడు సుబ్బారావు.

“పిల్లను కాదనుకుని, దాగున్న తల్లిని వెదకడం నీ వల్ల కాదు.” అంది నిర్మల.

“పాజిటివ్‌గా ఆలోచిద్దాం. తల్లిని వెదుకుదాం. దొరికిందనుకో! మంచిదే కదా?” అన్నాడు డాక్టర్ బాబు.

“మంచిదే బాబూ! పిల్లను పట్టుకుని ఆడవాళ్ళు ఇక్కడ ఉంటారు. మగాళ్ళం మనం నలుగురం ఓ పని చేద్దాం. ఇటు ఇద్దరు, అటు ఇద్దరుగా వెళ్ళి కాశీ వచ్చేంత వరకూ ఈ పిల్ల తల్లిని రైల్లో వెదుకుదాం. దొరికిందీ, పిల్ల అదృష్టం. దొరకలేదు, ముందు అనుకున్నట్టుగా పిల్లను కాశీలో పోలీసులకి అప్పజెబుదాం. ఏఁవంటారు?” అన్నాడు భూతాలపంతులు.

“తప్పిపోతే దొరుకుతారు పంతులుగారూ! కావాలని తప్పించుకున్నవారు...దొరకరు.” అంది నిర్మల.

“దొరికితే దొరికింది. లేకపోతే లేదు. మన ప్రయత్నం మనం చేయడంలో తప్పు లేదు కదమ్మా?” అన్నాడు పంతులు.

“అవునవును! తప్పు లేదు.” అంది వాణి.

“వెళ్ళండి వెళ్ళండి! వెళ్ళి వెతకండి.” అంది.

ఇద్దరిద్దరుగా విడిపోయి తల్లి వేటలో పడ్డారు మగాళ్ళు. కంతూ సుబ్బారావూ ఒక వైపూ, భూతాలపంతులూ డాక్టర్‌బాబూ మరొక వైపూ వెదకసాగారు. కోచ్‌లన్నిటా బురఖా వేసుకుని ఉన్న ప్రతి స్త్రీనీ పట్టిపట్టి చూశారు. అలా చూస్తోంటే ఒకటి రెండు చోట్ల కోపాలు వచ్చాయి కొందరికి. సంగతి చెప్పి, సర్ది చెప్పారు వారికి. కంతు చెప్పిన పోలికల్తో... పెద్దపెద్ద కళ్ళు, కొనదేలిన ముక్కు, ముక్కుకీ, పైపెదవికీ మధ్య పుట్టుమచ్చగల స్త్రీ ఎక్కడా ఎవరికీ కనిపించ లేదు. వెను తిరిగారు నలుగురూ. వస్తోంటే కంతుకి మాణిక్యం ఫోన్.

“బాబాయ్! ఇంకో పావుగంటలో మీరు కాశీలో ఉంటారట! ఇప్పుడే బ్రదర్ మోహన్ ఫోన్ చేశాడు.”

“సరే”

“పేరుకి కాశీనే కాని, అక్కడ దొరకంది లేదు. ఎంజాయ్ బాబాయ్! ఎంజాయ్.” అన్నాడు మాణిక్యం.

“సరే”

“మీకేది కావాలంటే అది, బ్రదర్ మోహన్ ఎరేంజ్ చేస్తాడు. మొహమాటపడకండి! అడగండి, అంతే.” అని నవ్వాడు మాణిక్యం.

“సర్లే! ఉంటాను.” అన్నాడు కంతు. ఫోన్ కట్ చేశాడు.

కాశీ వచ్చేసింది. దిగేందుకు హడావుడి పడుతున్నారంతా.

మిత్రబృందంలో ఉన్న మగాళ్ళందరూ రెండు జట్లుగా విడిపోయి కంతు చెప్పిన గుర్తుల ప్రకారం పిల్లతల్లి కోసం రైల్లో ఉన్న కోచ్‌లన్నీ వెదకడం మొదలెట్టారు. ఇంతలో కాశీ రానే వచ్చింది గానీ, పిల్లను వదిలిపెట్టి వెళ్ళిపోయిన ఆ తల్లిజాడ మాత్రం దొరకలేదు. ప్రయాణికులంతా హడావుడిగా కాశీ స్టేషన్లో దిగుతున్నారు. సందిగ్ధంలో పడిన మిత్రబృందం ఆ అనాథ పసి కందును ఏం చేసింది? ఎవరికి అప్పగించింది?

వెళ్ళిన నలుగురూ వెళ్ళినట్టే వచ్చారు. వెంట ఎవరూ లేరు. అంటే తల్లి దొరకనట్టే అనుకున్నది వాణి.

“దిగండి! దిగండి” అంటూ సామాన్లు డోర్ దగ్గరకు చేరవేయసాగాడు సుబ్బారావు.

ప్లాట్‌ఫారం వచ్చింది. రైలాగింది. ప్రయాణికులు దిగసాగారు. కంతుని ఫోన్లో పలకరిస్తూనే కోచ్ దగ్గరగా వచ్చాడు మోహన్. ఆ విధంగా అతన్ని పోల్చుకున్నాడు కంతు. నల్లగా, పొట్టిగా ఉన్నాడు మోహన్. ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, దాని మీద స్వెట్టర్, మెడలో మఫ్లర్‌తో బాగానే ఉన్నాడు.

“కంగారు పడొద్దు! మెల్లగా, మెల్లగా దిగండి.” అన్నాడు మోహన్. ముందు సామాన్లు దించి, తర్వాత ఒకొక్కరే దిగారంతా. దిగుతూనే ఆ నేలని కళ్ళకద్దుకున్నాడు సుబ్బారావు. ఆశ్చర్యంగా చూసిన డాక్టర్‌బాబుతో అన్నాడిలా.

“కాశీరా ఇది. కాశీ అంటే ఏమనుకున్నావు? వెలుగురా బాబూ! పెద్ద జ్ఞానం. శివుడి ఊరు. ప్రమథగణాలూ, పార్వతీ, గణపతీ... అంతా ఇక్కడే ఉన్నారట! శివపురాణంలో రాసి ఉంది.”

“శివపురాణం నువ్వెప్పుడు చదివావు?” అడిగాడు డాక్టర్‌బాబు

“ఎప్పుడో చదివాను.” అన్నాడు సుబ్బారావు. కళ్ళ మీద ఎండ పడకుండా చేతులు అడ్డం పెట్టుకున్నాడు. బాగా ఎండగా ఉందక్కడ. పిల్లకు ఎండ తగలనీయడం లేదు భూతాలపంతులు భార్య. కొంగులో దాచింది.

“మోహన్‌గారూ...” అని కంతు ఏదో చెప్పబోతుంటే అతన్ని వారించాడు మోహన్.

“ముందు అలా నీడకు వెళ్ళి మాట్లాడుకుందాం రండి.” అన్నాడు.

అంతా నీడకి చేరుకున్నారు. భూతాలపంతుల్నీ, పంతులు భార్య చేతిలో ఉన్న పాపనీ పరిశీలనగా చూశాడు మోహన్.

“వీళ్ళూ మనవాళ్ళేనా?” అడిగాడు కంతుని. సమాధానం ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియని సందిగ్ధంలో ఉన్నాడు కంతు. అతని స్థితిని గమనించాడు సుబ్బారావు. కలుగజేసుకున్నాడు.

“కాదండి” అన్నాడు.

“అది కాదు మోహన్‌గారూ, అసలేంటంటే...” అని మోహన్‌ని అక్కణ్ణుంచి దూరంగా తీసుకెళ్ళాడు కంతు. అతనికి భూతాలపంతులువాళ్ళూ కాశీకి ఎందుకు వచ్చిందీ, పాప వాళ్ళకు ఎలా దొరికిందీ అన్నీ వివరంగా చెప్పాడు. చెప్పి, అన్నాడిలా.

“ఇప్పుడు ఆ పాపని పోలీసులకి అప్పజెప్పాలి.”

“చూడాలని వచ్చిన మీకెందుకండీ ఇవన్నీ? చావాలని వచ్చారు కదా, వాళ్ళు చూసుకుంటార్లెండి అవన్నీ. రండి, చెప్తాను.” అన్నాడు మోహన్. కంతుని మిత్రబృందం దగ్గరకు తీసుకువచ్చాడు.

“ఈ పాపని పోలీసులకి అప్పజెప్పాలి, అంతే కదా?” అడిగాడు భూతాలపంతుల్ని.

అవునన్నట్టుగా చూశాడతను.

"ఓ పని చెయ్యండి. అదిగో ఆ లెఫ్ట్‌లో ఉండే కూల్‌డ్రింక్ షాప్, ఆ పక్కనే రైల్వేపోలీసులు ఉంటారు. వెళ్ళి పాపని ఇచ్చేయండి."

"నాకు హిందీ రాదు బాబూ." భార్యను చూశాడు భూతాలపంతులు.

"తనకి కూడా రాదు. అందుకని..." ఆగాడు.

"పోలీసులకి తెలుగు వచ్చు. ఏం పర్వాలేదు. మీరెళ్ళండి." చెప్పాడు మోహన్.

"అదికాదు బాబూ! ఇప్పుడీ పాప ఎలా దొరికిందీ, ఎక్కడ దొరికిందీ అని పోలీసులు గుచ్చి గుచ్చి అడిగితే నేను తడబడతానేమో! మరొకరు ఎవరైనా నాతోపాటు ఉంటే ధైర్యంగా ఉంటుంది..." అని కంఠుని ప్రాధేయపూర్వకంగా చూశాడు పంతులు.

"మీ శ్రీమతిగారున్నారు కదండీ." అని నవ్వాడు మోహన్.

"వెళ్ళిరండి" అన్నాడు అతనితో.

"మీరు పదండి" అన్నాడు కంఠు బృందంతో. చొరవగా సామాన్లు తీసుకున్నాడు. పరుగులాంటి నడకతో బయల్దేరాడు. అతని వెన్నంటి నడిచింది మిత్రబృందం. వాళ్ళలా ముందుకు అడుగు వేశారో లేదో పాప మేల్కొన్నట్టుంది. మళ్ళీ ఆకలికేమో! కెవ్వుమంటూ ఏడుపు అందుకుంది. జాలిగా వెనక్కి తిరిగి చూశాడు కంఠు.

"రండిసార్" కంఠుని ముందుకు లాగాడు మోహన్. వెనక్కి తిరిగి చూస్తూనే వెళ్ళిపోయాడు కంఠు.

స్టేషన్ బయటకి చేరుకున్నారంతా. అయినా పాప ఏడుపు వినవస్తున్నట్టుగానే ఉన్నది అందరికీ.

రెండు టాక్సీలను మాట్లాడాడు మోహన్. 'బాలాజీ లాడ్జింగ్' అని చెప్పి బయల్దేరదీశాడు. రిక్షాలు, ఆటోలు, షేరింగ్ ఆటోలు, టాక్సీలు, కార్లు, లారీలు, ట్రాలీలు రద్దీ రద్దీగా ఉంది వారణాసి. ట్రాఫిక్ దారుణంగా ఉంది. ఎక్కడా సిగ్నల్ వ్యవస్థే లేదు. అక్కడక్కడా పోలీసులు ఉన్నారంతే! రోడ్లన్నీ ఇరుకిరుకుగా ఉన్నాయి. మట్టిమట్టిగా ఉన్నాయి.

"రెండు రూమ్స్ సరిపోతాయి కదండీ, లేడీస్‌కి ఓ రూం. జెంట్స్‌కో రూం. ఏమంటారు?" కంఠుని అడిగాడు మోహన్.

"సరిపోతాయి సరిపోతాయి" అన్నాడు సుబ్బారావు. కంఠేమీ మాట్లాడలేదు. కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు. భూతాలపంతులు దంపతులు పోలీసులతో ఏం మాట్లాడుతున్నారో! పోలీసులు వారిని ఏం ప్రశ్నిస్తున్నారో! పాపం ఎలా ఉన్నారో! పాప ఏడుపు ఆపిందో లేదో! పాలు పట్టారో లేదో!

వాణి నుంచి ఫోన్ వచ్చింది. వేరే టాక్సీలో ఉంది ఆమె. ఆలోచనల నుంచి తేరుకున్నాడు కంఠు.

"చెప్పు వాణి" అన్నాడు.

"కంఠూ! భూతాలపంతులూ, వాళ్ళావిడా ఇక చనిపోరు. పాపని చేతిలో పెట్టి, శివుడు వాళ్ళని బలే అడ్డుకున్నాడు." అంది వాణి.

తెప్పరిల్లాడు కంఠు. పంతులు దంపతుల్ని ఒంటరిగా వదలిపెట్టడం వాళ్ళ మంచికే జరిగిందనుకున్నాడు. గుండె నిండుగా ఊపిరి పీల్చుకున్నాడు. గట్టిగా నిట్టూర్చి, వారి ఆలోచనలను మానుకున్నాడు.

పావుకిలోమీటర్ దూరంలో చౌరస్తా ఉందనగా ఆగిపోయాయి టాక్సీలు.

"బాలాజీ లాడ్జింగ్ దశాశ్వమేథ్‌ఘాట్‌లో ఉంది. అక్కడికి టాక్సీలు, ఆటోలనీ రానివ్వరు. అందుకని మీమీ లగేజీ తీసుకుని సరదాగా ఓ పది అడుగులు వెయ్యండి." అన్నాడు మోహన్. తాను ఓ రెండు బ్యాగులు పట్టుకుని నడవసాగాడు. అతన్ని అనుసరించారంతా. చౌరస్తాకి చేరుకున్నారు. దశాశ్వమేథ్‌ఘాట్ వైపు తిరిగారు. ఆ రోడ్డంతా జనసమ్మర్దంగా ఉంది. వచ్చే మనుషులు, పోయే మనుషులు, అరుపులు, కేకలు... అంతా హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్‌ని గుర్తు చేసింది.

ఎటు చూసినా క్లాత్ షోరూమ్సే! షోరూమ్స్ ముందు చిత్రంగా గుంపులుగా బొమ్మలు. దక్షిణాది షోరూమ్‌ల ముందైతే కొనుగోలుదారులను ఆకర్షించేందుకు రెండు మూడు బొమ్మలు ఉంటాయేమో! కాశీలో అలా కాదు, పదిబొమ్మలకు తక్కువ లేవు. బొమ్మలు ఎక్కువ! బట్టలు తక్కువ అని నవ్వుకున్నాడు కంఠు.

శంఖాలు ఊదుతూ సాధువులు, త్రిశూలాల్ని నేలకు తాటిస్తూ, పెద్దగా అరుస్తూ బైరాగులు, వాళ్ళని వింతగా చూస్తూ విదేశీయులు, ఆ సందడిలోనే పిల్లనగ్రోవులు అమ్మేవాళ్ళు, బొమ్మలు అమ్మేవాళ్ళు అనేకుల్ని తప్పించుకుంటూ, 'ఆలయానికి దారి' అని హిందీలో రాసి ఉన్న సందులోనికి చేరుకున్నాడు మోహన్. మిత్రబృందాన్ని వెంట తిప్పుకున్నాడు. సందు ప్రవేశద్వారం దగ్గర గన్లు, మెషిన్‌గన్లు పట్టుకుని మిలటరీ ఉంది. వాళ్ళు రెండు కళ్ళని వెయ్యి కళ్ళు చేసుకుని గమనిస్తున్నారు.

పక్కపక్కగా ఇద్దరు నడిస్తే మూడోమనిషికి దారి లేదు ఆ సందులో. అందులోనే పాన్‌షాప్‌లు, అందులోనే టిఫిన్ సెంటర్లు, అందులోనే పూజ సామగ్రి దుకాణాలు. ఊపిరి ఆడడం కష్టం. పైగా అడుగులో అడుగు వేసుకుని నడవాలి. తొందరపడితే ఏ ఆవునో, ఎద్దునో, లేదంటే ఏ సైకిల్‌నో, మోటర్‌బైక్‌నో ఢీకొంటారు. ప్రమాదానికి లోనవుతారు.

బాలాజీ లాడ్జింగ్‌కి చేరుకున్నారంతా. లోనికి అడుగుపెట్టి, ఆశ్చర్యపోయారు. ఇల్లులా ఉందది. మూడు అంతస్తులతో ముసలిముసలిగా ఉంది. ముచ్చటగా పువ్వుల తీగేదో పైనుంచి వేలాడుతోంది. రిసెప్షన్లో మాట్లాడాడు మోహన్. ఏసి డబుల్ బెడ్‌రూం, రోజుకి పన్నెండు వందలట! రెండు తీసుకున్నాడు.

"ఒకదాంట్లో బెడ్ ఎక్స్‌ట్రా వేయిద్దాం. ఎక్స్‌ట్రా బెడ్‌కి టూ హండ్రెడ్ తీసుకుంటాడు." చెప్పాడు మోహన్. సరేనంది మిత్రబృందం.

"లాడ్జింగ్ వెనకే ఆలయం. ఎప్పుడు పడితే అప్పుడు ఆలయానికి వెళ్ళి మీరు శివుణ్ణి చూసుకోవచ్చు." అన్నాడు మోహన్.

లాడ్జింగ్ కుర్రాళ్ళొచ్చారు. లగేజీ తీసుకున్నారు. సెకెండ్ ఫ్లోర్లో పక్కపక్కనే ఉన్నాయి 202, 203 రూమ్స్. ఆడాళ్ళిద్దరూ 202లో ప్రవేశిస్తే, మగాళ్ళు నలుగురూ 203లోకి ప్రవేశించారు. రూంలోకి ప్రవేశిస్తూనే బెడ్ మీద వాలిపోయాడు కంఠు.

"మీరిలా రిలాక్సయితే కష్టం. తొందరగా స్నానాలు కానివ్వాలి." అన్నాడు మోహన్.

"స్నానాలైతే ముందు దేవుణ్ణి చూసుకుని, ఆ తర్వాత గంగాహారతి చూసుకోవచ్చు." అన్నాడు.

"హారతి ఎన్ని గంటలకి?" అడిగాడు కంఠు.

"ఆరున్నర...లేదంటే పావు తక్కువ ఏడు గంటలకి" చెప్పాడు మోహన్.

చూడదగ్గ సుందర దృశ్యం గంగాహారతి! కనుల పండుగది! ఆ పండుగను చూసేందుకు ఆత్రం చెందారంతా.

(ఇంకా ఉంది)

"జీవితంలో మరొక రెండు అవాంఛనీయమైన ఘటనలు, స్థితులు, అవస్థలు నీకు ఎదురవుతాయి. ఒకటి జర, రెండవది రుజ. అంటే ముసలితనం; రోగం! మనిషికి ఈ రెండూ భారాలే; దుర్భరాలే! తరతరాల సంతతి గతించిపోతుంటే, చూడలేక నేను ఈ ఏకాంత ప్రదేశానికి చేరుకున్నాను. పారిపోయి వచ్చాను. పలాయనం! తన వాళ్ళు, తన కళ్ళ ముందు పుట్టి పెరిగిన వాళ్ళు, తన మిత్రులు, చివరికి పరిచయస్థులూ చనిపోతూ ఉంటే చూస్తూ జీవిస్తూ ఉండటం అంత తేలిక కాదు. ఆనందదాయకమూ కాదు. మృత్యుంజయుడిగా నువ్వు ఈ లోకంలో సృష్టిని చూడాలి. స్థితిని చూడాలి. మరణాలను చూడాలి. నిర్వికారంగా చూడాలి. చూడగలవా? ఆ శక్తి ఒక్క పరమాత్మకు మాత్రమే ఉంది."

"ఆర్యా.. అయితే.." వీరధర్మ ఏదో అడగబోయాడు.

"ఆలకించు నాయనా!" చిరంతనయోగి అన్నాడు. "చావుకు చాలా పేర్లున్నాయి. మరణించడం, మృత్యువాత పడడం, చనిపోవడం, కన్ను మూయడం, చచ్చిపోవడం - ఇలా ఎన్నో. అయితే వీటన్నిటినీ తనలో విలీనం చేసుకున్న నామధేయం ఒకటుంది. అదే మీటో తెలుసా?"

"చెప్పండి ఆర్యా" వీరధర్మ క్షణకాలం ఆలోచించి అన్నాడు.

"కాలధర్మం!"



నవ్యవీక్లి-లక్ష్మీనారాయణ జైని మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో

ప్రథమ బహుమతి రూ.50,000 పొందిన నవల

"ఔను.."

"కాలధర్మం అంటే కాలం పాటించే ఒక ధర్మం. కాలం 'తప్పని ధర్మం'. ఈ సువిశాల సృష్టి విన్యాసం 'ధర్మం' మీద ఆధారపడి ఉంది. ఎవ్వరు గానీ, ఏ విషయంలో గానీ ధర్మం తప్ప కూడదు. కాలధర్మాన్ని అడ్డుకోడానికి నువ్వు సంకల్పించావు. నేనూ సంకల్పించాను. సాధించాను. కానీ ధర్మా, ఈ సాధనలో, సాధించిన ఫలితంలో నాకు తృప్తి లేదు. ఎంత కాలం ఈ శరీరాన్ని రక్షించుకుంటూ ఉండాలి? మరణం లేని ఈ స్థితి నాకు విసుగు కలిగిస్తోంది. జీవితం మీదా, శరీరం మీదా విరక్తి కలుగుతోంది! మరణరహితమైన ఈ జీవనంలో రుచి లేదని తెలుసుకున్నాను. కాలధర్మం నా శరీరాన్ని కబళించి వేయాలని కలలు కంటున్నాను!"

వీరధర్మ అయోమయంగా చూశాడు. "ఆర్యా, అయితే నా సంకల్పం, నా ప్రయత్నం వృధా అంటారా?"

చిరంతనయోగి చిన్నగా నవ్వాడు. "నేను నియంతను కాను. సంకల్పించే అధికారం, ప్రయత్నించే అధికారం నీవి! అడిగావు కాబట్టి, వివరిస్తాను. మన వేదాలు "శతమానం భవతి!" అని ఆశీర్వదిస్తూ, మానవుడి మనుగడ వ్యవధి వంద సంవత్సరాలే అంటున్నాయి. తదనంతరం శతాధికంగా జీవించే మనిషి దుర్భరమైన ముసలితనంలో దేనికోసం ఎదురు చూస్తాడో తెలుసా? మరణం కోసం! నా స్వానుభవం, నా నిర్విరామ సాధన నాకు కొన్ని నగ్నసత్యాలను తెలియజేశాయి. జీవుడు ఈ మర్త్యలోకంలో మానవుడిగా జన్మించాలి; జీవించాలి; మరణించాలి! ఈ మూడూ కాలం అనే మహత్తరమైన శక్తి విధించిన ధర్మాలు. జీవితం అనుభవించాక మనిషి మరణించాలి. అయితే ఆ మరణం దుర్మరణం కాకూడదు. అకాల మరణం కాకూడదు. పిందె కాయగా ఎదిగి, పండుగా పరిణతి చెంది రాలిపోతుంది. అలాగే మనిషి కూడా పండై రాలిపోవాలి! అకాల మరణాన్ని ఎదిరించాలి. దుర్మరణాన్ని ఎదిరించాలి. సహజమైన మరణాన్ని స్వాగతించాలి. అనాయాస మరణాన్ని ఆశించాలి!" చిరంతనయోగి తదేకంగా చూస్తూ ఆగాడు.

జరిగిన కథ

వైశాలిక రాజ్య యోధుడు వీరధర్మ. రాజ పరివారం కుట్ర వల్ల కన్నతల్లిని పోగొట్టుకుంటాడతడు. తిరిగి వారికి తగినశాస్తి చేస్తాడు. సంపూర్ణాయుస్సు సాధించే లక్ష్యంతో బయలుదేరతాడు. మార్గాంతరంలో ఎన్నో కష్టాలు, అనుభవాలు చవిచూస్తూ చివరకు శ్వేత మరాళ మార్గదర్శనంతో పర్వతశిఖరంపై ఉన్న తాపసి చిరంతనయోగిని ప్రసన్నం చేసుకుంటాడు. ఆ తాపసి చెబుతున్న మరణ రహస్య సందేశాన్ని ఆలకిస్తూ ఉంటాడు వీరధర్మ.

ఆ తర్వాత....

వీరధర్మకు ఏదో సరికొత్త పాఠం ఆలకిస్తున్నట్టుంది. అది ఆ క్షణం దాకా తను వినని వేదాంతం. ఆ వేదాంతం మరణ వేదాంతమా?!

"మరణం అంటే ఏమిటో తార్కికంగా నీకు తెలుసా, ధర్మా?" చిరంతనయోగి ప్రశ్నించాడు.

"ఉపదేశించండి.."

"బ్రహ్మణాత్యక్త దేహస్తు
మృత ఇత్యుచ్యతే బుధైః"

అన్నారు మహాజ్ఞానులు.

"బ్రహ్మ అంటే భగవంతుడు(జీవుడి) దేహాన్ని త్యజించినప్పుడు జీవుడు మృతి చెందాడు అంటారు అని అర్థం. అంటే ఏమిటి భావం? ప్రాణుల దేహాలలో ప్రాణంగా ఉండేది సాక్షాత్తూ భగవంతుడే! అందుకే ప్రాణాన్ని 'ఆత్మహంస' అన్నారు. పంజరంలో పక్షిని బంధించినట్టు, ఈ దేహంలో పరమాత్మను శాశ్వతంగా బంధించడం ధర్మమా?"

ప్రశ్నించి, చిరునవ్వుతో చూస్తున్న చిరంతనయోగి ముఖంలోకి వీరధర్మ వినయంగా చూశాడు. "ఆర్యా, చిరంజీవులుగా ఉన్న వ్యక్తుల గురించి, మన పురాణాలూ, కావ్యాలూ పేర్కొంటున్నాయి. వాళ్ళందరూ తమ దేహ పంజరాల్లో పరమాత్మను బంధించినట్లు కాదా? అది అధర్మమని వాళ్ళకు తెలియదా?"

"మంచి ప్రశ్న అడిగావు నాయనా! వాళ్ళలో ఏ వ్యక్తీ మన కళ్ళకు కనిపించడం లేదు. అంటే వాళ్ళు 'లేరు' అని కాదు సుమా! అదృశ్యరూపాలలో ఉన్నారు. ఇహ లోకంలో అంటే ఈ లోకంతో సంబంధాలను తెంచుకున్నారు. నిరంతర ధ్యానంలో ఆనందాన్ని అన్వేషిస్తూ ఉండిపోతున్నారు. నేను వాళ్ళలా కాదే! శాశ్వతంగా ఇక్కడే ఉండాలి. మరణాన్ని జయించిన మానవుడిగా - అనుకున్నాను. ఉన్నాను. మానవుడుగా ఉన్నంత కాలం, అది మరణం ఉన్న మానవుడిగా అయినా సరే, మరణం లేని మానవుడిగా

అయినా సరే ఉన్నంతకాలం సుఖం, కష్టం, ఆనందం, ఆవేదన అనే ద్వంద్వాలకు లోబడి ఉండాల్సిందే! నీ ఆశయం కూడా 'మృత్యుంజ యుడు'గా ఈ ప్రపంచంలో నీ వాళ్ళ మధ్య ఉండాలనేగా?"

"ఔను... ఆర్యా..." వీరధర్మ తడబడుతూ అన్నాడు.

చిరంతనయోగి చిన్నగా నవ్వాడు. "నా అను భవాన్ని నీకు వినిపించాను. నీ ఆశను విమర్శిం చను. నీ ఆశయాన్ని ఖండించను! మృత్యువును జయించి నువ్వు ఇహ సంబంధమైన సాంసారిక జీవితాన్ని అనుభవించదలచుకుంటే అందుకు నా అభ్యంతరం ఏముంటుంది? ప్రయత్నించు!"

"ఆర్యా, నా ప్రయత్నం ఫలిస్తుందా?" వీర ధర్మ ఆశగా అడిగాడు.

చిరంతనయోగి పెదవులు మందహాసాన్ని సృష్టించాయి. "ఈ చిరంతనుడు జరిగిన దానినీ, గతాన్నీ చూడగలడు. భవిష్యత్తులోకి తొంగి చూడలేడు! భవిష్యదర్శనం భగవంతుడిది! ఎందుకంటే దానిని నిర్దేశించే 'ధర్మనియంత' ఆయనే!"

"ఆర్యా..అయితే..."

చిరంతన యోగి కూచున్న చోటు నుండి లేచాడు. "ధర్మా, ఒక మయూరం నిన్నిక్కడికి తీసుకు వచ్చింది. అది ఎవరి సంకల్ప బలమో నీకు తెలుసు! అదే విధంగా మరేదో, మరెవ్వరో నీకు మరెక్కడికో దారి చూపుతారు."

"ఆర్యా...అంటే.."

"నేను చెప్తున్నది జ్యోతిషం కాదు, నాయనా. ఈ మహత్తర సృష్టిలో జరిగే మహా విన్యాసంలో ఒక కోణం. ఉదాహరణకి నీ ప్రయాణం కొంత దూరం సాగింది. అప్పుడు ఒక మనోహరమైన సువాసన నీ నాసికా పుటాలను స్పృశిస్తుంది. ఆ దివ్య సుగంధం ఎక్కడిది? అనే కుతూహలం నిన్ను అటువైపు నడిపిస్తుంది. అవునా?"

"అవును ఆర్యా.." వీరధర్మ చిరునవ్వు నవ్వాడు.

"ఒక శ్రవణానందకరమైన శబ్దం నీ చెవు లను తాకుతుంది. తన జన్మస్థానం వైపు నిన్ను నడిపిస్తుంది! అలాగే ఒక ఆర్తనాదం! అలాగే ఒక భయానక శబ్దం! వెళ్ళిరా, నాయనా!"

వెనుదిరిగి నెమ్మదిగా వెళ్ళిపోతున్న చిరం తనయోగి వైపు చూస్తూ, పర్వతాగ్రం మీద పాతిన స్తంభంలా ఉండిపోయాడు వీరధర్మ.

యోగీశ్వరుని మాటలు వీరధర్మను దిక్కుతోచని స్థితికి నెట్టివేశాయి. అడవులు దాటి ప్రయాణించి మదగజనగర పొలిమేరల్లో గర్తవాటికకు చేరుకున్నాడు. అక్కడ మోచేతుల వరకు భూమిలో పాతిపెట్టివున్న వృద్ధ దంపతులు రోదిస్తూ కనిపించారు. ఆశ్చర్యంతో వారిని బంధ విముక్తుల్ని చేశాడు వీరధర్మ. వారెవరు? వారిని ఎవరు బంధించారు? వారి గాథవిని వీరధర్మ ఏమన్నాడు?

యోగి మాటలు అతనిలో ఆలోచనా సాగర మథనాన్ని సృష్టించాయి. ఆయన ప్రవచనం తనను నిరుత్సాహ పరుస్తోందా? నిర్ణయాన్ని విస్మరించమంటోందా? దగ్గరగా వస్తున్న సువే గుడి గిట్టల ధ్వని అతని ఆలోచనలను తెంపి వేసింది.

•••

సువేగాశ్వం పర్వతం దిగేసింది. పెంచిన వేగంతో లోయను దాటింది. వీరధర్మ అసంకల్పి తంగా, సూర్యుడి వైపు చూసి, దిశలు నిర్ణయించు కుని, అశ్వాన్ని ఉత్తరాభిముఖంగా పోనిచ్చాడు.

సువేగుడు తన వేగాన్ని తనే నిర్ణయించు కుంటోంది. వీరధర్మ ప్రయాణం గురించి పట్టిం చుకునే స్థితిలో లేడు. అతనిలోంచీ ఆలోచనలు కదిలిన పుట్టలోంచి కందిరీగల్లా లేస్తున్నాయి. ఆ ఆలోచనల నిండా చిరంతనయోగి మాటలే సుళ్ళు తిరుగుతున్నాయి. ఆయన ప్రవచనాన్ని ఆధారం చేసు కుని, తను మృత్యుంజయ ప్రయత్నం నుంచీ విరమించుకోవాలా?

సనాతన మహర్షి మాటలు కానీ, మార్గ మధ్యంలో తారసిల్లిన స్కందానంద యోగి మాటలు కానీ తనలో గందరగోళాన్ని పుట్టించ లేదు. అయితే చిరంతనయోగి మాటలు, ఆయన వ్యక్తిగత అనుభవానికి అద్దం పట్టిన మాటలు తనను దాదాపు దిక్కుతోచని స్థితి లోకి నెట్టివేశాయి! ఆయన మాటలు నర్మ గర్భంగా ఏదైనా సూచన చేస్తున్నాయా?

నెమ్మదిగా వెళ్తున్న అశ్వం ఆగింది; యజ మాని ఆలోచనా ప్రవాహానికి ఆనకట్ట వేసింది. వీరధర్మ తెప్పరిల్లి పరిసరాలను చూశాడు. చీకటి పడుతోంది! ఆలోచనలు తన చూపులను కప్పేసి నట్టున్నాయి! గలగలమంటూ సెలయేరు చేస్తున్న శబ్దం అతని చెవుల్ని తాకింది. ఎక్కడ విడిది చేయాలో సువేగుడికి చక్కగా తెలుసు! వీరధర్మ చిరునవ్వు నవ్వుకుంటూ కిందికి దిగాడు.

•••

వీరధర్మ ప్రయాణం సాగుతోంది. సూర్యకిర ణాలు చెట్ల గుబుర్లలోంచి దూరుతూ తమ ఉని కిని చాటుకుంటున్నాయి. రాత్రి తనను తన ఒడి లోకి తీసుకున్న గాఢ నిద్ర చక్కటి విశ్రాంతిని ప్రసాదించింది. ఆ ప్రభావంతో మనసు, శరీరం

పళ్ళు పీకుతానంటున్న రెజీనా!

రెజీనా అంటే సన్నగా రివ టలా ఉండే అమ్మాయి. ఆమెకి పళ్ళు పీకేంత బలం ఉందా? అనే అనుమానం వస్తోంది కదూ! నిజమే. రెజీనాకు అంత బలం లేకపోవచ్చు కానీ పళ్ళ డాక్టరుగా పేషెంట్ల పళ్ళను తేలిగ్గానే ఊడగొట్టొచ్చు కదా! సరిగ్గా ఇదే పని చేయబోతోంది రెజీనా. త్వరలో నటించబోయే సినిమాలో రెజీనా డెంటల్ డాక్టర్‌గా చేస్తోంది. డెంటల్ డాక్టర్లు పళ్ళు పీకుతారన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. కానీ ఈ సినిమాలో రెజీనా ఆ పని మాత్రం చేయనంటోంది. తానేం చేస్తానన్నది వెండితెర మీదే చూడమంటోంది.

రెండూ ఉల్లాసంగా ఉన్నాయి. చిరంతనయోగికి వీడ్కోలిపి వచ్చిన తరువాత తన మీద దండయాత్ర చేసిన ఆలోచనలను, రాత్రి నిద్రలోకి జారుకునే ముందు తన అంతరంగ పేటికలో దాచి, తాళం వేసేశాడు వీరధర్మ! తన గమ్యాన్ని గమనం నిర్ణయిస్తుంది. సంకల్ప ఫలితాన్ని సమయం నిర్ణయిస్తుంది. ఆ రెండింటినీ విధి నిర్ణయిస్తుంది!

అడవి పల్చబడుతోంది. క్రమంగా దారి విశాలంగా ఎదుగుతోంది. అక్కడక్కడా అగుపిస్తున్న చెట్ల మోడులు సమీపంలో ఎక్కడో 'మనిషి' ఉన్నాడని తెలియజేస్తున్నాయి! తెగిపడిన కొమ్మలూ, తీగలూ తమను నరికిపడేసిన మానవుల అదృశ్య హస్తాలను చూపిస్తున్నాయి. మానవుడు ప్రకృతి మీద ఆధిపత్యం సాధించాడు. సాధించిన ఆధిపత్యాన్ని నిరంకుశంగా సాగిస్తూనే ఉన్నాడు! సువేగాశ్వం అనుసరిస్తున్న దారి అరణ్యాన్ని క్రమంగా వెనక్కి తోసేస్తోంది.

వీరధర్మ దృష్టికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దూరాన ఏపుగా పెరిగిన చెరకు తోటలూ, పంట పొలాలూ కనిపిస్తున్నాయి. ఎవరో జాగ్రత్తగా పేర్చినట్టు నల్లటి రాళ్ళు దూరంలో ఒక చోట గుంపుగా కనిపిస్తున్నాయి. కొన్ని చిన్నవిగా, కొన్ని పెద్దవిగా ఉన్న రాళ్ళు నునుపు దేలి, సూర్యకాంతిలో మెరుస్తున్నాయి.

ఆశ్చర్యంతో వీరధర్మ కళ్ళు విచ్చుకున్నాయి. నల్ల రాళ్ళు ప్రాణం వచ్చినట్టు కదులుతున్నాయి. రాక్షస హస్తాల్లా ఏవో పైకి లేస్తున్నాయి, వాటి మధ్య...అవి...అవి..రాళ్ళు కావు; ఏనుగులు! లేస్తున్నవి రాక్షస హస్తాలు కావు; ఏనుగు తొండాలు! చదునుగా విశాలంగా ఎత్తుగా పెరిగిన పచ్చిక బయళ్ళలో ఏనుగులు గుంపులు గుంపులుగా ఉన్నాయి. పశువుల మందల్లాగా! హస్తి సంపద అత్యధికంగా ఉన్న రాజ్యాన్ని సమీపిస్తున్నాడా తను? నల్లటి రంగులో, చారలున్న చెరకు తోటలో చొరబడుతూ, చెరకుల్ని విరిచి ఆరగిస్తున్న ఏనుగుల గుంపును చిరునవ్వుతో చూస్తూ, అశ్వాన్ని పోనిస్తున్న వీరధర్మ అసంకల్పితంగా, అశ్వాన్ని నిలువరించాడు.

అందుకు కారణం చెట్లకీ, పొదలకీ అటువైపున ఉన్న ప్రదేశం నుండి వినవస్తున్న ఏడుపు! వీరధర్మ చెవులు రిక్కించాడు. ఎవరో స్త్రీ. రోదిస్తోంది. ఎవరో పురుషుడు ఓదారుస్తున్నాడు! "శ్రవణానందకరమైన శబ్దం-ఒక ఆర్తనాదం తన జన్మస్థానం వైపు నిన్ను లాగుతుంది!" చిరంతనయోగి మాటలు వీరధర్మ చెవుల్లో ప్రతిధ్వనించాయి. తన చెవుల్ని తాకుతోంది శ్రవణానందకరమైన శబ్దం కాదు; ఆర్తనాదం కాదు. ఒక ఏడుపు! ఓదార్పుని జతగా చేసుకున్న రోదనం! వీరధర్మ సాలోచనగా గుర్రం దిగాడు. ఏడుపు 'జన్మస్థానం' వైపు నడవసాగాడు. నడక కొన్ని క్షణాల్లో అతన్ని ఒక విశాల ప్రాంగణంలోకి ప్రవేశపెట్టింది. సహజ సిద్ధంగా ఉన్న రాళ్ళూ, రప్పలూ, చెట్లూ, పొదలూ ఆ ఆవరణ చుట్టూ పెట్టని గోడలాగా ఉన్నాయి. ఆవరణంలో కళ్ళకి ఆనుతున్న దృశ్యం వీరధర్మ శరీరాన్ని ఒక్కసారి జలదరింప చేసింది. ఎవరో చల్లినట్టు పుర్రెలూ, ఎముకలూ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి! ఏడుపు అతని దృష్టిని మళ్ళించింది. ఎత్తుగా ఉన్న రాతికి అటువైపున ఎవరో దీనంగా ఏడుస్తున్నారు.

"ఏడ్చి...ఏడ్చి... ఏమీ చేయలేం! చెరువుగా మారిన గుండెను రాయి చేసుకో!" బొంగురు కంఠం ధైర్యం చెప్తోంది.

ఎముకల్నీ, పుర్రెల్నీ దాటుకుంటూ వీరధర్మ అటువైపు అడుగులు వేశాడు. అతని నీడలా అశ్వం...

నివ్వెరపాటు వీరధర్మ పాదాలను నేలకు తాపడం చేసి వేసింది. అతని ముందు ప్రత్యక్షమైన దృశ్యం అతడిని తను చూస్తోంది స్వప్నమా, సత్యమా అన్న మీమాంసలో పడవేసింది. తన రెండు కళ్ళు ఆశ్చర్యంతో చూస్తున్నట్టే, రెండు జతల కళ్ళు తనను ఆశ్చర్యంతో చూస్తున్నాయి.

ఒక వృద్ధురాలు, ఒక వృద్ధుడు తన ముందున్నారు. మోచేతుల దాకా వాళ్ళ శరీరాలు ప్రక్క ప్రక్కనే నేలలో పాతివేయబడి ఉన్నాయి! ఇద్దరి చేతులూ వెనక్కి విరిచి, కట్టబడినట్టున్నాయి.

ఇద్దరి ముఖాల మీదా భయమూ, బాధా, అలసటా మూడు రంగుల్లా ప్రత్యక్షమవుతున్నాయి. శిరోజాలు చెల్లా చెదురుగా ఉన్నాయి. వృద్ధుడి ముఖం చెమటతో తడిసి, నిగనిగలాడుతోంది. వృద్ధురాలి ముఖం మీద వీరధర్మ చూపులు ఆగిపోయాయి. అనునిత్యమూ పసుపు రాసుకున్న ముత్తైదువలా ఉందామె. చెమటా, చెమటను వెక్కిరిస్తున్న కన్నీళ్ళూ ఆమె ముఖం మీద ఆనవాళ్ళు వదిలాయి. బలహీనంగా కనిపిస్తున్న ఆమె ముఖంలో గిన్నెల్లాంటి విశాలమైన కళ్ళు! కొలతకు అందని దుఃఖం ఆ విశాల నేత్రాలలో తడితడిగా తాండవం చేస్తోంది.

"ఎవరు మీరు? మిమ్మల్ని ఇలా పాతిపెట్టిన రాక్షసులు ఎవరు?" వీరధర్మ కంఠం బొంగురుగా ధ్వనించింది. వీరధర్మ ప్రశ్న వృద్ధురాలిలో సుళ్ళు తిరుగుతున్న దుఃఖాన్ని వెలికి లాగింది.

"అమ్మా, ఏడవకండి. పండుటాకుల్లాంటి మీకు ఈ దురవస్థ కల్పించిన కర్కోటకుడు ఎవరు?" వీరధర్మ హెచ్చరిస్తూ అన్నాడు.

".... మదగజరాజ్య మహారాజు జీవంతకుడు, నాయనా.." వృద్ధుడు అన్నాడు.

"మీరు నేరం చేశారా?" వీరధర్మ ప్రశ్నించాడు వృద్ధుడి కళ్ళల్లోకి తదేకంగా చూస్తూ.

"ఇప్పుడే కాదు నాయనా! నా ఏడుపదుల జీవితంలో నేను గానీ, ఆరుపదుల జీవితంలో నా అర్ధాంగి కానీ ఎప్పుడూ ఏ నేరమూ చేయలేదు." వృద్ధుడు వణికే కంఠంతో అన్నాడు.

వీరధర్మ ఇద్దరి కళ్ళల్లోకి నిదానించి చూస్తూ ఉండిపోయాడు. మనిషి పెదవులు అసత్యాలు

నిజంగానే కలుసుకోబోతున్నారా?

అనుష్క శర్మ, విరాట్‌లు విడిపోయారన్న నిజాన్ని బాలీవుడ్ జనం మరిచిపోక ముందే మళ్ళీ కలుసుకోబోతున్నారన్న తాజా వార్తలు సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేస్తున్నాయి. టీమిండియాలో విరాట్ చూపిన ప్రతిభను మెచ్చుకుంటూ అనుష్క ఫోన్ సందేశం పంపిందట! అంతేకాదు, కొద్దిరోజులు షూటింగ్‌కి విరామం ఇచ్చి విరాట్‌తో గడిపేందుకు ప్లాన్ కూడా చేసుకుందట! మొత్తానికి విడిపోయారనుకుంటున్న ప్రేమ జంట తిరిగి కలవబోతున్నందుకు ఇద్దరి సన్నిహితులు హ్యాపీగా ఉన్నారట!

పలకవచ్చు. కళ్ళు అసత్యాలు పలకవు! వృద్ధ దంపతుల కళ్ళు సత్య దర్పణాల్లా అవుపిస్తు న్నాయి.

"మా దురవస్థకు.." వృద్ధుడు ప్రారంభించాడు.

"మాట్లాడకండి. చాలా నీరసంగా, బలహీనంగా ఉన్నారు. నేను మిమ్మల్ని నమ్ముతున్నాను. ఈ 'అర్ధ ఖననం' నుండీ మీకు విముక్తి కలిగిస్తాను" వీరధర్మ వాళ్ళ దగ్గర కూచుంటూ అన్నాడు.

"ప్రమాదం!" వృద్ధుడు బొంగురుగా అన్నాడు. "ప్రమాదం నీకు! రాజుగారి హృదయం విష కుంభం! ప్రమాదాన్ని కొని తెచ్చుకోకు!"

వీరధర్మ అతని ముఖంలోకి తదేకంగా చూశాడు. "ప్రతి విషానికీ విరుగుడుంది; ప్రతి కుంభమూ విచ్ఛిన్నమవుతుంది!"

వీరధర్మ చేతులు బలంగా, వేగంగా వృద్ధ దంపతులను బంధించిన మట్టిని తోడసాగాయి.

●●●

గుంటలోంచీ ముందుగా వృద్ధురాలిని పైకి లాగాడు వీరధర్మ. ఆమె చేతులు వెనక్కి విరిచి

కట్టి ఉన్నాయి. రెండు కాళ్ళూ, పాదాలపైన ఒక్కటిగా బంధించబడి ఉన్నాయి! ఆమెను నేలమీద పడుకోబెట్టి, వృద్ధుడిని పైకి లాగాడు. ఆయన చేతులూ, కాళ్ళూ కూడా బంధించబడి ఉన్నాయి. తనకు తెలుసు. వాళ్ళ కాళ్ళూ, చేతులూ తిమ్మిర్లు ఎక్కి కదలలేని స్థితిలో ఉంటాయి. గొంతులు తడారిపోయి ఉంటాయి. ఆ రెండు కష్టాలూ ఉపశమించాలంటే అత్యవసరంగా నీరు కావాలి! వీరధర్మ క్రిందికి వంగి, వృద్ధ దంపతుల శరీరాలను రెండుచేతులతో అవలీలగా ఎత్తి భుజాల మీద వేసుకున్నాడు, సున్నితంగా, కంచెలాగా ఉన్న చెట్ల వైపు నడవసాగాడు. సువేగుడు యజమాని వెంట చకచకా అడుగులు వేయసాగింది.

●●●

వీరధర్మ ఏకాగ్రతతో చేసిన జల చికిత్సతో వృద్ధ దంపతుల ప్రాణాలు లేచి వచ్చాయి. చెమటా, మట్టీ దూరం కావడంతో వాళ్ళ శరీరాలకు ఉపశమనం లభించింది. చెట్టు బోదెకు జార్లా బడి, విశ్రాంతిగా కూర్చుని తననే చూస్తున్న వృద్ధ దంపతుల ముందు కూర్చున్నాడు వీరధర్మ.

"బాబాయిగారూ...వరస కలుపుతున్నందుకు క్షమించండి. నేను శ్రీమతి హేమాంగినీ ధర్మవీర దంపతుల కుమారుడిని. పేరు వీరధర్మ. మీరు ఎవరో, ఏం జరిగిందో చెప్పండి. అభ్యంతరం లేక పోతే..."

"పుత్రులు లేని మాకు నువ్వు పుత్ర సమానుడవే. పుత్రుడిగా వ్యవహరించి, మాకు పునర్జన్మ ప్రసాదించావు నాయనా" వృద్ధురాలు అంది. ఆమె కళ్ళు చెమర్చాయి.

"ప్రాణదాతవు. నీకు విన్నవించడానికి అభ్యంతరమా? ఎంత మాట నాయనా!" వృద్ధుడు ఆప్యాయంగా అన్నాడు. మాది 'మదగజనగరం'. నా పేరు ఆనందుడు. అర్ధాంగి పేరు పూర్ణ. మా మహారాజు దృష్టిలో మేం ఒక ఘోర నేరం చేశాం."

"చక్కని చుక్కలూ, అందగత్తెలూ అయిన ఇద్దరు కవల పిల్లల్ని కనడమే మేం చేసిన నేరం" పూర్ణ గాద్గదికంగా అంటూ, కన్నీళ్ళు తుడుచుకుంది .

"నిన్న రాజుగారి జన్మదినం. రాత్రి ఏనుగు మీద ఎక్కి ఊరేగింపుగా వచ్చాడు. ముందు వైపు అలంకరించబడిన నలభై ఏనుగులు. వెనుక నలభై ఏనుగులు. అన్నీ మదగజాలే! వాద్య గోష్ఠి! ఆ వేడుకను ప్రజలందరూ తిలకిస్తున్నారు. మా కవల పుత్రికలు కూడా. రాజుగారి డేగ కళ్ళు నా చిట్టి తల్లుల మీద పడినట్టున్నాయి. వేకువ జామున సేనాపతి, భటులను వెంటపెట్టుకుని మా ఇంటికి వచ్చాడు. నిద్రాభంగం కలిగించి, ఇంట్లో జొరబడ్డారు! మా కుమార్తెలను తీసుకు రమ్మని రాజుగారు ఆజ్ఞాపించారన్నారు."

"ఎందుకో చెప్పారా?" వీరధర్మ ప్రశ్నించాడు.

"అమ్మాయిల శయ్యాగారం గుమ్మానికి అడ్డంగా నిలబడి, తిరగబడ్డాక చెప్పారు. రాజుగారి ఇల వేలుపు రక్తజిహ్వాదేవి, రాత్రి రాజుగారి కలలో సాక్షాత్కరించింది. రాబోయే వార్షికోత్సవాలలో అందగత్తెలూ, యుక్తవయస్కురాళ్ళూ, కవలలూ అయిన కన్యలను తనకు బలి ఇవ్వమని ఆజ్ఞాపించిందట. ఆరు నెలల అనంతరం రక్తజిహ్వా దేవత వీరజాతర జరిగేదాకా కవల కన్యకలు రాజుగారి దివాణంలో ఉండాలట. అది కూడా దేవి ఆజ్ఞే! రాజుగారి కలలో దేవత చేసిన శాసనం."

"ఇది ఆచారమా? కన్నెపిల్లల బలి?" వీరధర్మ అడిగాడు.

"హూః! చరిత్రలో లేదు నాయనా. ఇదే మొదటిసారి" ఆనందుడు కసిగా అన్నాడు. నా చిట్టితల్లుల్ని చూశాక ఆ కామాంధుడిలో పుట్టిన దుర్బుద్ధి! నగరంలో ఏ సౌందర్యవతి కనిపించినా, ఏదో సాకుతో దివాణానికి తీసుకెళ్ళిపోతాడు. ఎదురు తిరిగిన వాళ్ళకు 'గర్త వాటికలో శిక్ష!"

"గర్తవాటికా?"

"మమ్మల్ని పాతి పెట్టిన వల్లకాటి పేరు అది. గర్తం అంటే పల్లం. గుంట. అపరాధం చేసిన వాళ్ళకు గర్తవాటికలో శిక్ష విధించబడుతుంది. రాజాజ్ఞను ధిక్కరించిన వాళ్ళూ, ఆయన కోరికను వినయంగా కాదన్న వాళ్ళూ అందరూ మా రాజ్యంలో అపరాధులే! గుంట తవ్వి పాతేస్తారు. తీరికగా వచ్చి మదగజాల చేత తొక్కిస్తారు; చచ్చిపోయేదాకా! ఈ రాజ్యంలో ఉరిశిక్షలూ, శిర చ్ఛేదాలూ లేవు. మదపుటేనుగుల చేత తొక్కించడమే!"

"అన్యాయం!" వీరధర్మ పళ్ళు కొరుకుతూ అన్నాడు.

"నా బంగారు తల్లులు ఈ రాత్రికే అన్యాయమై పోతారు నాయనా!" పూర్ణమ్మ బావురుమంది.

వీరధర్మ ఆమె వైపు సానుభూతితో చూశాడు.

"అవును నాయనా! రక్తజిహ్వాదేవి స్వప్న దర్శనం; కవల కన్యల బలి ఇవన్నీ రాజుగారి దుర్బుద్ధి అల్లిన కల్పనలు. దేవతకు బలిస్తానంటూ ప్రజల్ని నమ్మించి, మభ్యపెట్టి తానే తన కామాగ్నికి బలి తీసుకుంటాడు."

'మమ్మల్ని కాపాడావు. మా ప్రాణాలు దక్కించావు. సంతోషమే. కానీ, నాయనా... ఆ సంతోషాన్ని కబళించే నిత్య దుఃఖం మా ముందు ఉంటుంది." పూర్ణమ్మ కంఠం వణికింది. "నేను రోదించింది నా ప్రాణాల కోసం కాదు; నా బిడ్డల కోసం. మా ప్రాణాలు పోతే కన్న బిడ్డల్ని ఒకడి కామానికి బలి చేశామన్న కడుపు కోత ఉండదు"

వీరధర్మ చిన్నగా నవ్వాడు. "పిన్నీ, ధైర్యంగా ఉండండి. మీ ఆంతర్యం నాకు అర్థమైంది. మీ పెళ్ళీడు కుమార్తెలను ఆ కాముకుడి కబంధ హస్తాల నుండీ కాపాడతాను!"

వృద్ధ దంపతులు ఆశ్చర్యంగా చూశారు. ఆనందుడి పెదవులు అదిరాయి. "నాయనా, నీ మాటలు నీ ధైర్యాన్ని సూచిస్తున్నాయి. కానీ, నీ శక్తి ఏ పాటిదో తెలీదు. జీవంతకుడి శక్తి గురించి నాకు తెలుసు. అతను మహా బలశాలి. గున్న ఏనుగులా ఉంటాడు. అతగాడి శరీరం మహా బలం. మనసు హాలాహలం. రాజ్యం కోసం ఒక అన్ననూ, ఇద్దరు తమ్ముళ్ళనూ స్వహస్తాలతో గొంతులు కోసి చంపేశాడు. మా నగరంలోనే కాదు, రాజ్యంలోని అందగత్తెలెందరినో తన విపరీత కామాగ్నికి ఆహుతి చేశాడు."

(ఇంకావుంది)

హోమియో లైఫ్

డా॥ A.M.రెడ్డి
పాజిటివ్ హోమియోపతి
డాక్టర్ కన్సల్టేషన్ కొరకు :
92462 82802
www.positivehomeopathy.com

సోరియాసిస్ - హోమియో చికిత్స

దీర్ఘకాలం పాటు బాధించే మొండి చర్మవ్యాధులలో సోరియాసిస్ ముఖ్యమైనది. వాడుకలో దీనిని "కింగ్ ఆఫ్ స్కిన్ డిసీజ్" అని కూడా అంటారు. సత్వర పరిష్కారాల కోసం చూడకుండా శాశ్వత సాంత్వన చర్యలు చేపట్టి హోమియోపతిలోని కాన్స్టిట్యూషనల్ పద్దతిలో వైద్యం తీసుకుంటే ఈ వ్యాధి మీద అంతిమ విజయం సాధించవచ్చు.

సోరియాసిస్ అంటే : సోరియాసిస్ వ్యాధిగ్రస్తులలో చర్మంపై దురదతో కూడిన వెండి రంగు పొలుసులు కన్పిస్తాయి. ఈ వ్యాధి ప్రభావం చర్మం మీద మాత్రమే కాకుండా గోళ్లు, తల తదితర శరీర భాగాలు కూడా వ్యాధి ప్రభావానికి లోనవ్వవచ్చు. మొదల్లో సోరియాసిస్ మచ్చలు ఎర్రగా, కమిలిపోయినట్లు కనిపించిన సమయం గడిచేకొద్ది ఈ మచ్చల పైన చేప పొలుసులను పోలిన తెల్లని పొలుసులు మందంగా పేరుకుపోతాయి. ఆ పొలుసులను తొలగిస్తే అడుగున రక్తపు చారికలు కనిపిస్తాయి. దురద ప్రధాన లక్షణం కాదు, కానీ వాతావరణం చల్లగా ఉండి, తేమ తగ్గినప్పుడు దురద ఎక్కువ అవుతుంది.

ఎలా వస్తుంది ? మామూలుగా ఆరోగ్యవంతులలో చర్మం ఉపరితలం క్రింద క్రొత్త కణాలు నిరంతరం తయారవుతుంటాయి. సుమారు నెల రోజులకు ఇవి వెలుపలకు చేరుకుంటాయి. ఇలా పై పొరగా ఏర్పడినవి క్రమంగా నిర్జీవమై పొలుసులుగా ఊడిపోయి క్రింద కణాలు బహిర్గత పరుస్తాయి. సోరియాసిస్ వ్యాధిలో ఈ ప్రక్రియ అవ్వడం తప్పుతుంది. చర్మపు కణాలు వేగంగా తయారయి 3-4 రోజులకే వెలుపట పొరకు చేరుకుంటాయి. అదనపు కణ సముదాయానికి పోషక తత్వాలను అందించే నిమిత్తం రక్త సరఫరా పెరుగుతుంది. దీనితో చర్మంమీద ఎర్రని పొర తయారవ్వడం పొలుసులు ఏర్పడడం జరుగుతుంది.

ఎందుకు వస్తుంది? వ్యాధి నిరోధక శక్తి వికటించి స్వయం ప్రేరితంగా మారడం వలన సోరియాసిస్ వస్తుందని పరిశోధనలు చెపుతున్నాయి. దీనిని అర్థం చేసుకోవడానికి వ్యాధి నిరోధక శక్తి గురించి కొంత తెలుసుకుందాం. వైరస్, బ్యాక్టీరియా వంటివి శరీరం మీద దాడి చేసినప్పుడు వాటినుండి రక్షణ పొందడానికి మన శరీరంలో W.B.C.(తెల్ల రక్త కణాలు) అనే ప్రత్యేకమైన రక్తకణాలు పనిచేస్తుంటాయి. ఇవి అవసరమైన ప్రాంతాలకు వెళ్లి ఇన్ఫెక్షన్‌ను తగ్గించడమే కాకుండా గాయాలు మానేలా చేస్తాయి. దీనిని వ్యాధి నిరోధక శక్తి అంటారు. ఈ నేపథ్యంలో అనుబంధ అంశంగా ఇన్‌ఫ్లామేషన్ (ఎరుపుదనం, వాపు) తయారవుతుంది.

సోరియాసిస్‌లో వ్యాధి నిరోధక శక్తి అవక్రమంగా తయారవుతుంది. ఇదే శారీరక కణజాలాన్ని అన్యపదార్థంగా అన్వయించుకుని దాడిచేసి ఇన్‌ఫ్లామేషన్‌ని కలిగిస్తుంది. సోరియాసిస్ వ్యాధి ప్రక్రియలో W.B.C. లోని β కణాలు యాంటీబాడీస్‌ను తయారు చేస్తాయి. ఇవి ఆరోగ్యంగా ఉండే కణాల మీద దాడి చేస్తాయి. W.B.C. లోని T కణాలు సైటోకిన్స్ అనే పదార్థాన్ని ఎక్కువ మొత్తాలలో విడుదల అయ్యేలా చేస్తాయి. సైకోటిన్స్ అనేవి చర్మకణాలు అదుపు తప్పి పెరగకుండా చేసే యంత్రాంగాన్ని దెబ్బతీస్తుంది. ఫలితంగా చర్మకణాలు అనియంత్రంగా పెరిగి పొలుసులుగా తయారవుతాయి.

సోరియాసిస్ మరియు వంశపారంపర్యత: కొన్ని కుటుంబాలలో సోరియాసిస్ అనివంశికంగా నడుస్తుంది. తల్లిదండ్రులలో ఇద్దరికీ ఉంటే 30 శాతం, ఒకరికే ఉంటే 15 శాతం పిల్లలకు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే కుటుంబంలో ఎవరికీ లేకపోయినప్పటికీ ఈ వ్యాధి హఠాత్తుగా మొదలవుతుంది. దీనికి జన్యుపరమైన అంశాలు కారణం. సోరియాసిస్ అంటువ్యాధి కాదు. ఒకరినుండి మరొకరికి వ్యాపించదు.

సోరియాసిస్‌లో రకాలు ? సోరియాసిస్ వ్యక్తమయ్యే విధానాన్ని బట్టి 5 రకాలుగా వర్గీకరించారు.

• ప్లేగు సోరియాసిస్ • గుట్టేట్ సోరియాసిస్ • పస్టులర్ సోరియాసిస్ • ఇన్‌వర్సివ్ సోరియాసిస్ • ఎక్సెత్రోడెర్మిక్.

సోరియాసిస్‌ను తీవ్రతరం చేసే అంశాలు: చల్లని పొడి వాతావరణం• మానసిక ఒత్తిడి • కొన్నిరకాల మందులు (మలేరియా మందులు, లితేలమా, బీటా బ్లాకర్స్, యాంటి) • ఇన్‌ఫెక్షన్స్ మరియు ఇతర వ్యాధులు • అలవాట్లు • హార్మోన్ తేడాలు • ఆహార పదార్థాలు : ఉదా : గ్లూటెన్ ఎక్కువగా ఉండే ఆహారం.

కాంప్లికేషన్స్ : సోరియాసిస్‌ను ఒక చర్మవ్యాధిగా మాత్రమే గుర్తిస్తే అది తప్పు. దీనివలన సాధారణంగా ప్రాణప్రమాదం జరగదు. కాని వ్యాధి తీవ్రత వలన, దీర్ఘకాలం బాధించడం వలన బాధితులు డిప్రెషన్‌కు లోనవుతారు. ఇది వ్యాధి తీవ్రతను మరింత పెంచుతుంది. సోరియాసిస్‌లో ఇలా వికటించిన వ్యాధి నిరోధక శక్తి వలన సోరియాటిక్ ఆర్థరైటిస్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధికి అనుబంధ అంశంగా కల ఇన్‌ఫ్లమేషన్ వలన సోరియాసిస్‌తో బాధపడే వారికి హార్ట్‌ఎటాక్ మరియు స్ట్రోక్ వంటివి వచ్చే అవకాశం ఉంటుంది. ఇవేకాక ఈ వ్యాధిగ్రస్తులతో డయాబెటిస్ మరియు రక్తపోటుకు గురయ్యే అవకాశం కూడా ఎక్కువే.

కాన్స్టిట్యూషన్ పద్ధతిలో సోరియాసిస్ నివారణ గురించి తెలుసుకుందాం : కాన్స్టిట్యూషనల్ విధానం ద్వారా మందులు ఇవ్వడం అంటే ఒకవ్యక్తి మానసిక శారీరక పరిస్థితులే కాకుండా ఎమోషనల్ పరిధిని కూడా పూర్తిగా అర్థం చేసుకుని మందులు ఇవ్వడం. తర్వాత ఏయే పొటెన్సీలో ఎంత డోస్ ఇవ్వాలి అనేది ముఖ్యం.

కాన్స్టిట్యూషనల్ విధానం ద్వారా సరైన మందులు, పొటెన్సీ, డోస్ ఇచ్చినప్పుడు వ్యాధి పూర్తిగా నివారించబడుతుంది.

"వ్యాధి తీవ్రతను బట్టి చికిత్సా కాలం నిర్ధారించబడుతుంది"

ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక & తమిళనాడు
8-2-293/82/A/69/1, A,B,C,D,F, రోడ్ # 01, న్యాచురల్స్ పైన, సెలబ్రేషన్ రెస్టారెంట్ పక్కన, TV 5 లేన్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ -33
మా డాక్టర్ల సలహాల కొరకు : 9246199922

సినీ నారాయణీయం

(ఎమ్మెస్ నారాయణ జీవితచిత్రం) 11

ఓటింగ్‌లో గెలిచి బదిలీ సంపాదించా

ఏమండీ జేబు కొట్టేసిన దొంగ అతను కాదు ఇతను అన్నా. కానిస్టేబుల్ ఆ రెండు వేలల్లోంచి 50 రూపాయలు నాకిచ్చేసి మీరెళ్ళిపోండన్నాడు. డబ్బు పోగొట్టుకున్నవాడు ఏడుస్తూ నిలబడ్డాడు. దొబ్బేసినవాడేమో అందులోంచి నాకు యాభై ఇచ్చాడు.

నేను బస్సెక్కేశాను. లైఫ్‌లో వాడు నాకు తగిలితే వాడికి నేను ఎన్ని వేలు ఇస్తానో తెలియదు గానీ, దొబ్బేసిన డబ్బుల్లోంచి నాకు డబ్బు ఇప్పిచ్చినవాడు మాత్రం మహానుభావుడు. పరిస్థితి నా చేతిలో లేదు. ఎందుకంటే అప్పటికి నేను అంత గొప్పవాణ్ణి కాదు.

తాడేపల్లిగూడెంలో బస్సు దిగి కైలాసపతి అనే ఫ్రెండు దగ్గరకెళ్ళా. మీటింగ్ ఎక్కడో స్కూల్లో పెట్టారు. అందరూ బ్రాహ్మిణ్స్. ప్రత్యేకంగా తెలుగు, సంస్కృతం, ఓరియంటల్ స్కూల్స్ గ్రేడ్-2 తెలుగు పండిట్స్. ఎవరి బాధలు వాళ్లు చెప్పుకోండి అన్నారు. భీమవరంలో పోస్టింగ్ కావాలని వచ్చిన క్షత్రియులు చాలా ఎక్కువ మంది ఉన్నారు. భీమవరం అంటే క్షత్రియుల కేంద్రం. చాలా గొప్ప వ్యక్తులున్నారు ఆ ఊళ్ళో. సో వాళ్ళకి ఇచ్చి తీరాలి శివరామరాజుగారు. ఆయన క్షత్రియుడే గానీ డెమోక్రాట్, సోషలిస్టు భావాలున్నవాడు. ఆయన డైలమాలో పడిపోయాడు. ఓ పని చెయ్యి. ఎందుకు నీకు బదిలీ కావాలనుకున్నావో అక్కడ చెప్పుకో. ఓట్లేస్తారు. అలా ఎక్కువ ఓట్లు నీకు పడితే నీకు భీమవరం ఇస్తా అన్నారు.

55 చేతులు మద్దతిచ్చాయి

భీమవరం ట్రాన్స్‌ఫర్ ఇస్తారా? లేదా? అనేది నాకు పెద్ద సమస్య. మీటింగ్‌లో ఒక్కొక్కళ్ళూ ఒక్కొక్క కారణం చెప్పారు. పలానా ఆయన నాకు ఇల్లుందని చెప్పాడు. పలానందుకు ఇక్కడ కావాలని ఒకరూ, తోట ఉందని చూసుకోవాలని మరొకాయన చెప్పారు. నేను చెప్పా నాది లవ్ మ్యారేజ్. నా మిసెస్ బ్రాహ్మిణ్. సమాజం నన్ను బహిష్కరించింది. సరస్వతి నన్ను ఆహ్వానించింది. అంచేత నా మిసెస్ కూడా చదువుకుంటే ఇలా లవ్ మ్యారేజ్‌లు చేసుకున్నవారు, బ్రాహ్మణులు, గొప్పవాళ్ళు అందరూ బాగుండే ఒక సమాజం ఏర్పడుతుంది. అందుకని నాకు భీమవరం ట్రాన్స్‌ఫర్ చేస్తే నా మిసెస్‌ని నేను అక్కడ చదివించుకుంటాను. నా మిసెస్‌కూ దిక్కులేదు, నాకూ దిక్కులేదు. దానికి నేనే దిక్కు అని చెప్పేటప్పటికీ 55 చేతులు పైకి లేచాయి.

కన్నీటి వీడ్కోలు

తరువాత ఇంకో గొప్ప ఇన్సిడెంట్ ఉంది నా లైఫ్‌లో. నవంబర్‌లో నాకు భీమవరం ట్రాన్స్‌ఫర్ వచ్చింది. అది నేను నమ్మలేని సంఘటన. ఆ రోజున నాకు రిలీవింగ్ ఆర్డర్ ఇచ్చి నన్ను పంపించేస్తున్నారు. సాయంత్రం స్కూలు అయిపోయిన తరువాత నాలుగున్నరకి ముందు 6, 7 తరగతుల్లో పిల్లలు ఎవరూ లేరు స్కూల్లో. అందరూ వెళ్ళిపోయారు. మధ్యాహ్నం సెక్షన్ పిల్లలు లేరు. నాలుగున్నరకి మీటింగ్. ఆ విషయం టీచర్లకూ తెలుసు. హెడ్మాస్టర్‌కూ తెలుసు. ఆంజనేయులు మాస్టారు, సత్యనారాయణగారు, ఏఎస్ సత్యనారాయణగారిని అడిగా. వాళ్ళూ మాకు ఏమీ తెలియదన్నారు. ఒక బ్యాండ్ మేళం టోటల్ 6,7 తరగతి పిల్లలు రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయల దండలు, రాజుల పిల్లలు ఎక్కువమంది ఉన్నారు. స్కూలుకి 5 రూపాయలు పట్టుకొచ్చి నాకు బహుమతిగా ఇచ్చిన షావుకారుగారు, మిగిలిన వాళ్ళు అంతా ఉన్నారు. ఇంకా బహుమతులు అన్నీ ఇచ్చి ఏడుస్తున్నారు. నాకూ ఏడుపు వచ్చింది. బట్ స్వార్థం. నేను అక్కడ ఉండలేని పరిస్థితి. అప్పుడు మనల్ని వ్యతిరేకించిన వారందరూ కూడా ఇతను చాలా గొప్ప వ్యక్తి అని నన్ను పొగడటానికి వచ్చారు. నాక్కూడా ఏడుపొస్తుందోయ్ అని మా హెడ్ మాస్టర్ కూడా గోడ చాటుకెళ్ళి సిగరెట్ కాల్చుకున్నాడు. ఆయనకు అది ఉపశమనం.

అక్కడి నుంచి నేను భీమవరం ట్రాన్స్‌ఫర్ మీద వెళ్ళిపోయాను. సత్యనారాయణగారు హిందీ మాస్టారు. ఆయనకి తెలుగు లెక్చరర్ అవ్వాలని కోరిక. అది నా దగ్గర చెప్పాడు. నేను తెలుగు ఎం.ఏ కట్టాలనుకున్నానండీ మరి బయటికెళ్ళి చదివే అవకాశం లేదు. ఏం చెయ్యమంటారు అన్నాడు. మీ అభిప్రాయం ఏంటన్నా. మీరు నాకు చెప్తారా అన్నాడు. నేను చెప్తాను. నేను గ్రేడ్-2 తెలుగు పండిట్. ఆయన గ్రేడ్-1 హిందీ పండిట్. అతను తెలుగు ఎం.ఏ అయితే అతనికి లెక్చరర్ వచ్చే చానల్ ఒకటుంది. నేను భాషా ప్రవీణ కదా. తెలుగు ఎం.ఏకి భాషా ప్రవీణ పనికొస్తుందని ఆయన అభిప్రాయం. అందుకని నన్ను అడిగాడు. మీరు ఫీజు కట్టేయండన్నా. మ్యాథమెటిక్స్ లిటరేచర్‌లో ఉండదు గాని గ్రామర్‌లో ఉంటుంది. గ్రామర్‌కి సెంట్ పర్సంట్ మార్కులు వెయ్యాలి. మ్యాథమెటిక్స్ 2+2=4, 2x2=4. ఆ ఈక్వే



షన్ అక్కడ తప్పా ఎక్కడా కలవదు. గ్రామరు కూడా అలాగే ఉంటుంది.

బాల వ్యాకరణం నాకు బైహార్ట్. దాంట్లో పెద్ద సూత్రం ఒకటే ఉంది. అపాయ, భయ, జుగుప్సా పరాజయ, ప్రమాదగ్రహణ, స్థాన, విరామ, అంతర్థివారణం బులిద్దారణగున్ అచ్చట వరనవ ల్లంబుగన్ వలన అని వస్తుంది. ఎందుకంటే వాడి వలన నాకు భయం కలిగింది. అపాయం. అందువలన చస్తానని వచ్చింది. అపాయపు భయం వలన నాకు భయం వచ్చింది. జుగుప్సా దానిని చూట్టం వలన నాకు ఇలాగైంది అంటారు. ఇంత పెద్ద సూత్రం నాకు బైహార్ట్. 59 పేజీలండీ. పరవస్తు చిన్నయ్యసూరిగారి బాల వ్యాకరణం. అది నాకు బైహార్ట్. నా సీనియర్స్‌కి చెప్పాను. భాషాప్రవీణలో అప్పుడు నా ఏజ్ 20. అప్పటికీ నేను ఎం.ఏ కట్టలేదు. ఆయన ఎం.ఏకి ఆంధ్రా యూనివర్సిటీకి ప్రైవేటు కరస్పాండెన్స్ కోర్సులో చదవటానికి అప్లికేషన్ పెట్టేశాడు. ఆయనకి నేను టీచర్. బాలవ్యాకరణం బోధించా. ఈ పాండిత్యం నాలో ఉందని గమనించి ఆయనే నా తండ్రిగా వ్యవహరించి పెళ్ళి చేశారు.

హిందీ మాస్టారుకి తెలుగు చెప్తే, ఆయన ఎం.ఏ రాసి పాసై పోయాడు. అప్పటికి నేను ఎం.ఏ పూర్తి చేయలేదు. అతను తెలుగులో లెక్చరర్. ఆయనకి ఇద్దరు కొడుకులున్నారు. ఒకతను ఓఎన్‌జీసీలో ఉన్నాడు. నెలకు 4 లక్షల జీతం. ఇంకొకతను అమెరికాలో ఉన్నాడు. ఈయన తణుకులో ఇల్లు కట్టుకొని ఉన్నాడు. ఆయన నాకు కాళ్ళు కడిగి కన్యాదానమిచ్చారు. పెద్దోళ్ళయ్యారు. నేను ఒకసారి కలిశా. ఇంకొకరు ఆంజనేయులు గారు. ఆయన ఎక్కడున్నారో ఇప్పుడూ తెలీదు నాకు.

దివిసీమ ఉప్పెన

1977 నవంబర్ 19వ తేదీ శనివారం అర్థరాత్రి కృష్ణాజిల్లా దివిసీమ ప్రాంతంలో ఉప్పెన వచ్చింది. ఆ రాత్రి తాడిచెట్టు అంత ఎత్తు సముద్ర తరంగం అనేక గ్రామాలను ముంచేసింది. ఆ రోజు మేం మిత్రులతో కలిసి సెకండ్ షో సినిమాకు వెళ్ళాం. వర్షం, ఈదురు గాలులు వస్తున్నాయి. రాత్రి 12 గంటల ప్రాంతంలో సినిమా హాలు షెడ్డుపై రేకులు ఎగిరిపోయాయి. కరెంటు పోయింది. మేం పరుగులు పెట్టి ఎవరింటికి వాళ్ళం వెళ్ళిపోయాం. తరువాత రోజు తెలిసింది. ఎంత బీభత్సం జరిగిందో. వేలమంది చనిపోయారు, లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ఓ నాలుగు రోజులలో సహాయ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. నేను భీమవరంలో తెలుగు పండిట్‌గా చేస్తున్నాను. నేను, అప్పుడు డ్రిల్ మాస్టర్‌గా పనిచేసే కలిదిండి రామచంద్రరాజు గారు కలిసి బాధితుల సహాయం కోసం వస్తువులు, బట్టల సేకరణకు మైక్ పెట్టి లారీలో ప్రచారం ప్రారంభించాం. అప్పుడు నేను ఓ పాట రాశాను.

"కూడు పోయెను, గూడు పోయెను

నోటిముందర కూడుపోయెను
తల్లి పోయెను, తండ్రి పోయెను
మొండి ప్రాణం మిగిలిపోయెను
నీళ్ళు త్రాగిన స్త్రీ శవం, నిండు గర్భిణీతో స్త్రీ శవం
ఒక్కలాగే మిగిలిపోయి, లెక్కలేని శవాలతో కలిసిపోయెను
ఆదుకో నను సోదరా! ఆదుకో నను సోదరీ!
మమ్ము నువ్వే మరిచిపోతే మనుగడ ఎవరికోసం.."

ఈ పాటను పాడుతూ ఓ నాలుగు రోజులు అనేక సరుకులు పోగుచేసి దివిసీమకు వెళ్ళాం. అక్కడ దృశ్యాలు మమ్మల్ని కలిచివేశాయి. ఓ తాడి చెట్టుపైన ఓ దున్నపోతు శవం కనిపించింది. అంతా బురదతో నిండిపోయి ఓ చిన్న దేవాలయం, కొన్ని శవాలు కనిపించాయి. కొన్నిచోట్ల శవాలు తొలగించాక వాటి జుట్టు విగ్గుల్లాగా కొన్ని చెట్లకు అంటుకుని ఉండడం నేను చూశాను. వీటన్నిటినీ

> **భీమవరం అంటే క్షత్రియులకు ప్రధాన కేంద్రం. అక్కడికి బదిలీ సంపాదించటం అంటే పెద్ద సమస్యే. బదిలీ కోరే బాధితులు అందరితో తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎవరి సమస్యలు వాళ్ళు చెప్పుకుంటున్నారు. బదిలీ కావాలంటే అక్కడికి వచ్చిన వాళ్ళందరి మద్దతూ సంపాదించాలి. మరి ఎమ్మెస్ ఏం చేశారు? వాళ్ళని ఎలా ఒప్పించారు?**

కలిపి "జీవచ్ఛవాలు" అనే నాటిక రాశాను. ఈ నాటికను డీఎన్ఆర్ కళాశాల వారు వేసి ఆంధ్రా యూనివర్సిటీలో బహుమతి కూడా సాధించారు. ఆనాటి విషాద స్మృతులు ఇప్పటికీ నా మనసును కలచివేస్తూనే ఉంటాయి."

తెలుగు లెక్చరర్ ఉద్యోగానికి కసరత్తు

భీమవరం బదిలీ అయిన తరువాత జరిగిన సంఘటనలను ఎమ్మెస్‌గారు చెప్పుకొచ్చారు.

"5, 6 తరగతుల విద్యార్థులకు గ్రేడ్-2 పండిట్‌లు పాఠాలు చెప్పాలి. గ్రేడ్-1 పండిట్‌లు 8, 9, 10 క్లాసుల విద్యార్థులకు పాఠాలు చెప్పాలి. ఈ క్లాసులు చెప్పాలంటే టీచర్స్ ట్రైనింగ్ ఉంటుంది. ట్రైనింగ్ పొందాలంటే ఒక సంవత్సరం సెలవు పెట్టి వెళ్ళాలి. నాకు తీరిక లేదు. నా మిసెస్‌ని సంస్కృతం కాలేజీలో జాయిన్ చేశా. ఎలాగా అని ఆలోచించా. ముఖ్యంగా నేను లెక్చరర్ అవ్వడానికి కారణం రామకృష్ణరాజుగారని మా హెడ్ మాస్టర్. అప్పటికి భీమవరం వచ్చేశాను. నేను పాఠం చెబుతుంటే రామకృష్ణంరాజుగారు వచ్చి, ఏమండీ మీరు పాఠం చెబుతున్నది 6, 7 తరగతుల పిల్లలకి. కానీ నేను పక్కన కూర్చొని వింటుంటే, మీరు ఎం.ఏ వాళ్ళకి చెబుతున్నట్లుంది. కాబట్టి ట్రైనింగ్ తీసుకుంటే పెద్ద క్లాసుల పిల్లలకి పాఠాలు చెప్పొచ్చు వెళ్ళి ట్రైనింగ్ తీసుకుని రండన్నారు. గ్రేడ్-1 అయినా గ్రేడ్-2 అయినా తెలుగు పండిట్ తెలుగు పండిట్టే.

హైస్కూలు హైస్కూలే. నేను అయితే లెక్చరర్ అవుతాను, కానీ నేను ట్రైనింగ్ అవను అన్నాను. అప్పుడాయన లెక్చరర్ అవ్వాలంటే ఎం.ఏ చెయ్యాలండీ. మీరేదో ఈ భాషాప్రవీణతో లెక్చరర్ కాలేరు అన్నారు.

హాల్ టికెట్ లేదు

ఆయన చెప్పినప్పటి నుంచి ఆలోచించా, ఎం.ఏ ఎలా కట్టాలి? సిలబస్ చూస్తే భాషా ప్రవీణ చేసినోళ్ళు డైరెక్టుగా ఎం.ఏ కట్టడానికి పీఓఎల్ అని మధ్యలో ఒక ఎగ్జామ్ ఉంది. ఇప్పుడు ఎంసెట్ లాంటిదన్నమాట. పీఓఎల్ అంటే ప్రొఫిషియన్సీ ఇన్ ఓరియంటల్ లెర్నింగ్. అది ఒక సంవత్సరం కోర్సు. నాకు ఆ బుక్ దొరకలేదు. ఎవడో మాన్యుస్క్రిప్టు ఇచ్చాడు. అది దగ్గర పెట్టుకుని చదువుకుంటూ ఫీజు కట్టేశా. ఎగ్జామ్ దగ్గర కొచ్చేసింది. హాల్‌టికెట్ రాలేదు.

(ఇంకావుంది)

-కూనపరాజు కుమార్
సెల్: 99899 99599

గాడ్‌ఫాదర్

వాణిశ్రీ

నా కళ్ళల్లో డ్రాప్స్ వేసింది నర్స్.

"సార్! కళ్ళు మూసుకుని ఉండండి. నేను చెప్పేవరకు తెరవొద్దు" అంది.

నేను తలూపి కళ్ళు మూసుకున్నాను. కాలం నత్తనడక నడుస్తోంది. ఎంతసేపు? విసుగు పుడుతోంది. గుడ్డివాడిలా ఉంది నా పరిస్థితి. కొన్ని నిమిషాలు కళ్ళ ముందు ఏమీ కనిపించక పోతేనే నాకు చిరాకుగా ఉందే? మరి గుడ్డివాళ్ళ సంగతేమిటి? జీవితమంతా అంధకారంలో గడపాల్సిందే గదా? పాపం ఎట్లా బతుకుతున్నారో? నాకు గుడ్డి వాళ్ళ మీద జాలి కలిగింది. అందుకే అంటారు 'కళ్ళు లేకపోతే కలియుగం లేదు' అని.

మనుషులు నడుస్తున్న అడుగుల చప్పుడు, ఎవరో మాట్లాడుకుంటున్న మాటలు వినిపిస్తున్నాయి. చాలాసేపు కళ్ళు మూసుకుని ఉన్నందు వల్ల మత్తు ఆవరిస్తోంది. నిద్ర ముంచుకొస్తోంది.

నాకు తొందరగా పిలుపొస్తే బాగుండును.

నా భుజం మీద మెత్తటి చెయ్యి పడింది. పూల చెండు పడినట్లు అనుభూతి కలిగింది.

"సార్! ఇక కళ్ళు తెరవండి" చెప్పింది నర్స్.

"నేను కళ్ళు తెరిచాను. ఎదురుగా నిలబడి ఉంది నర్స్.

"రండి. మీ టర్న్ వచ్చింది" అంది.

నేను డాక్టర్ ఉన్న గదిలోకి ప్రవేశించాను. ఆయనకు విష్ చేశాను. నన్ను కూర్చోమని సైగ చేశాడు. నా కళ్ళకు లెన్సులు తగిలిస్తూ ఎదురుగా ఉన్న అక్షరాలు చదవమన్నాడు. పరీక్ష పూర్తయింది.

"ప్రాబ్లం ఏం లేదండీ. సైట్ కొంచెం పెరిగింది. అద్దాలు మారిస్తే సరిపోతుంది" అన్నాడు.

ప్రిస్క్రిప్షన్ ప్యాడ్ మీద రాసిచ్చాడు. ఆ కాగితం తీసుకుని బైట పడ్డాను.

'హమ్మయ్య!' అనుకున్నాను.

రిలీఫ్ కలిగింది. నాకీ మధ్య కళ్ళజోడున్నా అంతా మసకమసకగా కనిపిస్తోంది. ఇరవై ఏళ్ళ నుంచి కళ్ళజోడు వాడుతున్నాను. ఎప్పుడూ తేడా కనిపించలేదు. అవే అద్దాలు. ఒకటి రెండుసార్లు ఫ్రేమ్ విరిగిపోతే మార్చాను. అంతే. మా అమ్మకు కళ్ళ జబ్బు వచ్చింది. నీటికాసులు. అప్పట్లో మద్రాసు తీసుకెళ్లి శంకర నేత్రాలయంలో ఆపరేషన్ చేయించాడు మా నాన్న. రెండుసార్లు జరిగింది ఆపరేషన్. ఒకసారి ఎడమ కంటికి. మరోసారి కుడి కంటికి. నాకు కూడా అమ్మ నుంచి వారసత్వంలా కళ్ళకి ఈ గ్లకోమా జబ్బు వస్తుందేమో అని భయం భయంగా ఉంది. డాక్టర్ ప్రాబ్లం ఏం లేదని చెప్పాడు. ఇప్పుడు సంతోషంగా ఉంది.

ఐ హాస్పిటల్ ఎదురుగానే సోని ఆప్టికల్ ప్యాలెస్ ఉంది. అక్కడే కళ్ళజోడుకి ఆర్డర్ ఇస్తే సరిపోతుందనుకుని మెట్లు దిగుతున్నాను. లాబీలో ఆ అమ్మాయిని చూసి ఆశ్చర్యపోయాను. అరుణలాగా ఉంది. ఔను. అచ్చుగుద్దినట్లు, జిరాక్స్ కాపీ

తీసినట్టు, అట్లాగే కనిపించింది. నా కళ్ళు మసక మసకగా కనిపిస్తున్నాయి. డ్రాప్స్ ప్రభావం ఏమో? అందుకే ఆ అమ్మాయి అరుణలా ఉందని భ్రమ పడుతున్నానేమో?

ఆ కుర్చీల వరుసలో ఎవరూ లేరు. ఆ అమ్మాయి ఒక్కతే కూర్చుని ఉంది. లాబీ దాదాపు ఖాళీగా ఉంది. పేషెంట్లు తగ్గిపోయారు. నేను దగ్గరగా వెళ్ళాను. ఆ అమ్మాయి ఎందుకో ఏడుస్తోంది. సోడాబుడ్డి కళ్ళద్దాలు అంటారే, అటువంటివి పెట్టుకుని ఉంది. పాపం చిన్నవయసులోనే పెద్ద సైటు!

కళ్ళజోడు తీసి కన్నీళ్ళు తుడుచుకుంటూ, మళ్ళీ తగిలించుకుంటోంది. నాకు ఆ పిల్లను చూస్తే అరుణ జ్ఞాపకం వస్తోంది. ఇంకెక్కడి అరుణ? చనిపోయిందిగా? కొంపదీసి ఈ పిల్ల అరుణ కూతురా ఏం?

అలా అనుకోగానే నాలో ఉద్వేగం కలిగింది. ఏదో పులకింత. మధురమైన అనుభూతి. అరుణ బతికొచ్చి నా ఎదురుగా కూర్చున్నట్లు అనిపిస్తోంది.

కలా? నిజమా?

నేను ఆ అమ్మాయి దగ్గరగా వెళ్ళి నిలబడే సరికి కలవరపడింది. తల పైకెత్తి నన్ను చూస్తోంది.

"అమ్మాయ్! ఎందుకు ఏడుస్తున్నావు?" అని పలకరించాను.

ఆమెకు దుఃఖం ఎక్కువైంది. నేను ఆప్యాయంగా పలకరించేసరికి తట్టుకోలేకపోయింది. ప్రేమరాహిత్యంతో బాధపడేవాళ్ళకి ఎవరైనా కాస్త ప్రేమ చూపించినా ఎండ తగిలిన మంచుగడ్డలా కరిగిపోతారు.

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆమె లేత గులాబీరంగు పెదవులు అదురుతున్నాయి. ఆమె బుగ్గలు కన్నీటితో తడుస్తున్నాయి.

"అరెరె...! ఎందుకమ్మా ఏడుస్తున్నావు?" అంటూ ఆమె పక్కనే కూర్చుని కన్నీరు తుడిచాను నా కర్చీఫ్‌తో.

ఆమె నా భుజం మీద తల వాల్చింది. దుఃఖం వల్ల ఆమెకు నోట మాటలు రావడం లేదు. ఆవేదన వల్ల కాబోలు ఆమె శరీరం సన్నగా వణుకుతోంది. నేను ఆమె వీపు తట్టి అనునయించాను.

"నువ్వొక్కదానివే వచ్చావా? నీ వాళ్ళెవరూ లేరా?"

"నేనే వచ్చాను" నెమ్మదిగా అన్నది.

"సరే! ఇక్కడ కూర్చుని ఏడుస్తున్నావెందుకు?"

"డాక్టర్ ఆపరేషన్ చేయాలన్నాడు. అంత డబ్బు ఎక్కడ తేవాలి? నాకు కళ్ళు సరిగా కనిపించడం లేదని జాబ్‌లోంచి తీసేశారు".

"ఆపరేషన్ చేయాలన్నారా! ఏదీ డాక్టర్ రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ చూపించు".

ఆమె హేండ్ బ్యాగ్‌లో నుంచి కాగితం తీసిచ్చింది.

అది చూసి బిత్తరపోయాను. పాపం చిన్న వయసులోనే మాయదారి కంటి జబ్బు వచ్చిందే?

"కొంతకాలం మందులు వాడాలన్నాడు. మందులు తీసుకున్నావా?"

ఆమె తల అడ్డంగా ఊపింది.

పాపం మందులు కొనడానికి కూడా డబ్బుల్లేవేమో? నేను లేచి నిల్చున్నాను.

"వెళ్ళిపోతున్నారా?"

"ఇప్పుడే వస్తాను".

ఫార్మసీకి వెళ్ళి మందులు కొనుక్కొచ్చాను.

హాస్పిటల్‌లో కూర్చుని రోదిస్తున్న ఆ యువతిని చూసి చకితుడయ్యాడతను. ఆమెను సమీపించి కష్టం కనుక్కున్నాడు. ఆపద్బాంధవుడిలా మారి అండగా నిలిచాడు. ఆమెకు ఓ భరోసా కల్పించాడు. ఇంతకూ అమెపట్ల అతడెందుకంత సాభిప్రాయ ధోరణి ప్రదర్శించాడు? ఆమె ఎవరు? ఆమెతో అతడికి ఏం అనుబంధం ఉందని అంతటి అవ్యాజమైన ప్రేమను చూపించాడు?

"అమ్మాయి! నీ పేరేమిటి? చెప్పనేలేదు"

"మీరు అడగలేదుగా?"

"చమత్కారివే! బాగుంది. ఇప్పుడు అడుగుతున్నాను. చెప్పు. నీ పేరేమిటి?"

"ప్రేమలత".

"గుడ్. బాగుంది. ఇదుగో ప్రేమలతా! డాక్టర్ రాసిచ్చిన మందులు తెచ్చాను. ఈ డ్రాప్స్ రోజుకి రెండుసార్లు కంట్లో వేసుకోవాలి. మూడు చుక్కలు చాలు. ఈ టాబ్లెట్లు రోజూ రెండు వేసుకోవాలి. పరగడుపున వేసుకోగూడదు. ఏదైనా తిన్న తర్వాత అరగంట ఆగి వేసుకోవాలి. నీళ్ళు బాగా తాగాలి. ఓ.కే".

"సార్!! మీ పేరేమిటి?"

"నువ్వు అడగలేదుగా?"

"ఇప్పుడు అడుగుతున్నాను చెప్పండి?"

"శ్రీరామ్".

"శ్రీరామ్ గారూ! మీరు మందులు కొనిచ్చారు. సరే! తర్వాత నాకు ఆపరేషన్ ఎవరు చేయిస్తారు?"

అలా అడుగుతున్నప్పుడు ప్రేమలత కంఠం వణికింది.

"నేనే".

ప్రేమలత ముఖం ఆశ్చర్యంతో నిండిపోయింది. ఆమెలో అప్పటివరకు ఉన్న నైరాశ్యం మాయమైంది. ఆమె కళ్ళల్లోకి వెలుగొచ్చింది.

"మీరా?"

ఆమె నమ్మలేనట్లు చూస్తూ అన్నది.

"నమ్మలేక పోతున్నావా?"

"కాదండీ! నా కోసం మీరెందుకు అంత డబ్బు ఖర్చు చేస్తారు? నేను మీకు ఏమీ కానుగా?"

"ఏమీకానని ఎందుకు అనుకుంటున్నావు? మానవత్వం అనే బంధం ఉన్నది. నిన్ను చూడగానే ఎవరో ఆత్మీయురాలిని చూసిన అనుభవం కలిగింది. మన మధ్య కనిపించని బంధం

వారి కల నెరవేరుస్తా!

పంజాబీ పిల్ల తాప్సీ పన్ను ఇప్పటి వరకూ తెలుగు, తమిళం, హిందీ, మలయాళం భాషల్లో నటించింది కానీ మాతృ భాష పంజాబీలో నటించలేదు. మాతృభాషలో తను నటించలేదని, ఆమె పేరెంట్స్‌కి దిగులుగా ఉందట! ఎప్పటికైనా తమ కూతురు మాతృభాషా చిత్రంలో నటిస్తే చూడాలని కలలు కంటున్నారట! త్వరలోనే వారి కల నెరవేరుస్తానంటూ చెప్పుకొచ్చింది ఢిల్లీ పాప తాప్సీ. ప్రస్తుతం ఒప్పుకున్న సినిమాల్తో బిజీగా ఉండటంతో మాతృభాషలో చేయ లేకపోతోందట! త్వరలోనే కాస్త తీరిక దొరకబోతోందట! ఆ గ్యాప్‌లో కచ్చితంగా పంజాబీ సినిమా చేస్తానంటోంది తాప్సీ.

ఉంది".

ప్రేమలత అర్థం కానట్టు చూసింది.

"సార్! మీరు ఏదో పెద్దమాటలు చెప్తున్నారు" అన్నది.

"మాకు ఒక చారిటీ సంస్థ ఉంది. బీదవారికి వైద్య సహాయం చేయడం అందులో ఒక భాగం. విదేశాలలో ఉన్న మన తెలుగు వారు ఫండ్స్ పంపిస్తుంటారు. ఇక్కడ ఉన్న బిజినెస్ చేసే వాళ్ళం కొంతమంది ఆ సంస్థను నడుపుతుంటాం. ఎన్.ఆర్.ఐ. చారిటీ సంస్థ పేరు వినే ఉంటావు. బీదవారుండే స్లమ్ ఏరియాలలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య సహాయం అందిస్తాం. కంటి డాక్టర్లతో ఉచిత వైద్య పరీక్షలు చేయించి కళ్ళ జోళ్ళు ఇస్తాం. కీళ్ళ నొప్పులతో బాధపడే వారికి ఆర్థోపెడిక్ డాక్టర్లతో ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాం. కరెంటుతో మసాజ్ చేయడం, కొన్ని ఎక్సర్‌సైజులు నేర్పించడం చేస్తాం".

"సార్! మీరు ఎంతో మంచి పని చేస్తున్నారు. ఈసారి ఐ క్యాంప్ పెట్టినప్పుడు నా కళ్ళకు ఆపరేషన్ చేయిస్తారా?"

"అప్పటివరకు ఆగనవసరం లేదు. ఈ లోపలే చేయిస్తాను"

"థాంక్యూ సార్!"

"ప్రేమలతా! నన్ను సార్ అనకుండా అంకుల్ అని పిలిస్తే సంతోషిస్తాను".

"అందర్నీ సార్ అని పిలవాలని మా ప్రొప్రయిటర్ స్ట్రిక్ట్‌గా చెప్పాడు. అలా అలవాటైంది".

"ఏం జాబ్ చేసేదానివి?"

"సూపర్ మార్కెట్‌లో బిల్లింగ్ చేసేదాన్ని. నాకు కళ్ళ జబ్బు రావడంతో తీసేశారు".

"ఎంతవరకు చదువుకున్నావు?"

"ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ మానేశాను. మా అమ్మమ్మ చదివించలేకపోయింది. ఇక తప్పక నేను సూపర్ మార్కెట్‌లో చేరాను. మూడేళ్ళ నుంచి చేస్తున్నాను. ఇప్పుడు జాబ్ లేక పోవడంతో ఇబ్బందిగా ఉంది".

"అమ్మమ్మ చదివించడం ఏమిటి?" అమ్మా నాన్నా లేరా?"

ప్రేమలత తల వంచుకుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కళ్ళజోడు తీసి తుడుచుకుంది.

"అమ్మ చనిపోయింది. నాన్న సంగతి తెలీదు".

"తెలీదంటే, నువ్వెప్పుడూ చూళ్ళేదా?"

"లేదు"

"మీ అమ్మమ్మ ఎప్పుడూ చెప్పలేదా?"

"అమ్మమ్మ మా నాన్నను తిడుతుండేది. మోసగాడు. మీ అమ్మను అన్యాయం చేసి పోయాడు. గొంతు కోశాడు దుర్మార్గుడు అనేది.

ప్రపంచంలో ఉన్న వార్తా పత్రికల్లో దాదాపు సగానికి సగం అమెరికా సంయుక్త రాష్ట్రాలు, కెనడా దేశాల్లోనే ప్రచురితమవుతున్నాయి.

అమ్మ ఒప్పుకునేది కాదు. 'మీ వల్లనే ఆయన దూరమయ్యాడు. నీ కొడుకు ఆయన్ని చంపుతానని బెదిరించాడు' అనేది.

"ఏం జరిగిందో నాకైతే తెలీదు".

"వాళ్ళూ వీళ్ళు చెప్పుకోవడమే తప్ప ఏం తెలీదు. మా అమ్మని నాన్న గుళ్ళో పెళ్ళి చేసుకున్నాడనీ, మా మావయ్య వెళ్ళి నాన్నను కొట్టి చంపేస్తానని అమ్మని బలవంతంగా ఇంటికి తీసుకొచ్చాడనీ అంటారు".

"ఇందులో మీ నాన్న తప్పు ఏం లేదుగా?"

"ఎందుకు లేదు అంకుల్! ఆ తర్వాతయినా అమ్మను పట్టించుకోవాలిగా?"

"పట్టించుకోలేదని నీకేం తెలుసు?"

"పట్టించుకుంటే నాకు కనపడే వాడేగా?"

"మీ నాన్న పట్టించుకోలేదనటం తప్పు. కట్టుకున్న భార్యను ఎవరూ వదులుకోరు. మీ నాన్న ఆ తర్వాత ఉద్యోగం చేయడానికి దూరంగా, అంటే ఏ విదేశమో వెళ్ళాడేమో? ఆ తర్వాత ఆమె ఆచూకీ తెలుసుకోలేకపోయాడేమో? తర్వాత చనిపోయిందని తెలుసుకున్నాడేమో?"

"ఏమోలే అంకుల్! నాన్న గురించి నాకేం దిగుల్లేదు".

"అయితే మీ నాన్న ఎట్లా ఉంటాడో నీకు తెలీదన్నమాట".

"తెలుసు"

"మరి చూళ్ళేదన్నావ్!"

"అమ్మ, నాన్న ఫొటో ఇచ్చింది నాకు".

"అయితే మీ నాన్నను ఇప్పుడు చూస్తే గుర్తుపడతావన్న మాట".

"ఇరవై ఏళ్ళ క్రితం ఫొటో అది. ఇప్పుడు ఆయన చాలా మారిపోయి ఉంటాడుగా! ఎట్లా గుర్తుపట్టడం?"

"నిజమే! చాలా మారిపోయి ఉంటాడు. మనిషి బాగా లావై పోయి ఉంటాడు. జుట్టు ఊడిపోయి బట్టతల వచ్చుంటుంది. కళ్ళజోడు పెట్టుకుని ఉంటాడు. గుర్తించలేవు".

"బాగా చెప్పారు అంకుల్!"

"ప్రేమలతా! మీ అమ్మ పేరేంటి?"

"అరుణతార".

"నేను ఉలిక్కిపడ్డాను. నేను అనుమానించింది నిజమే. ఈ ప్రేమలత అరుణ కూతురే. అందుకే ఆమె నోట్లో నుంచి ఊడి పడినట్టుగా ఉంది.

"మీ నాన్న పేరేంటి?"

"తెలీదు"

"అదేంటి? స్కూల్లో చేర్పించేటప్పుడైనా నాన్న పేరు రాయించలేదా?"

"మా అమ్మమ్మ నన్ను స్కూల్లో చేర్పించింది. అమ్మ, నాన్న లేని దిక్కులేని పిల్లనీ, తన పేరు గార్డియన్‌గా రాయించింది".

"మీ నాన్నంటే మీ అమ్మమ్మకు అంత కోపం అన్నమాట".

"ఔను అంకుల్!"

"ఓ.కే. ఇక బయల్దేరుదాం. నాకు మీ ఇల్లు చూపించు. తర్వాత నిన్ను 'ఐ' హాస్పిటల్‌కి తీసుకెళ్ళి ఆపరేషన్ చేయిస్తాను. నీ కళ్ళు బాగయిన తర్వాత కాలేజీలో చేర్పిస్తాను. నీకు ఇష్టమైనంత వరకు చదువుకోవచ్చు. సరేనా?"

"థాంక్యూ అంకుల్".

ప్రేమలతను కారులో ఎక్కించుకుని ఆమె ఉంటున్న జనతా కాలనీకి తీసుకెళ్ళాను. గవర్నమెంట్ కట్టించిన సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ అది. తాళం తియ్యడానికే ఇబ్బంది పడుతోంది ప్రేమలత. పాపం కళ్ళు సరిగ్గా కనిపించడం లేదనుకుంటాను. నేను ఆమె చేతిలోని 'కీ' తీసుకుని తాళం తెరిచాను.

"మీ అమ్మమ్మ లేదేం?"

"పనికి వెళ్ళుంటుంది".

"ఏం పని?"

"ఇక్కడికి దగ్గర్లోనే చెప్పులు తయారు చేసే ఫ్యాక్టరీ ఉంది. అందులో పనికి పోతుంది".

"ఓ మైగాడ్".

"ఎందుకు దేవుణ్ణి తల్చుకుంటున్నారు?"

"పాపం మీ అమ్మమ్మ ముసలి వయసులో

కూడా కష్టపడి పనికి పోవాల్సి వచ్చిందే అని".

"ఏం చేస్తాం?"

"మీ మావయ్య మిమ్మల్ని పట్టించుకోడా?"

"తాగుబోతోడు అంకుల్! డబ్బివ్వమని అమ్మమ్మనే పీక్కుతింటాడు".

"ఓ మైగాడ్".

"మా మావయ్య మా మీద పెత్తనం చేయడానికే చూస్తాడు. మాకేం హెల్ప్ చెయ్యడు".

నేను హాల్లో ఉన్న ప్లాస్టిక్ కుర్చీలో కూర్చున్నాను.

"అంకుల్! కాఫీ తాగుతారా?"

"ఇవ్వమ్మా! నీ చేత్తో చేసిన కాఫీ తాగాలనిపిస్తోంది".

ప్రేమలత కాఫీ చేసి గ్లాసులో పోసిచ్చింది. తనూ ఒక గ్లాసులో తెచ్చుకుని తాగింది.

"మీ నాన్న ఫొటో ఉందన్నావు చూపిస్తావా?"

ప్రేమలత బెడ్‌రూమ్‌లోకెళ్ళి ట్రంక్ పెట్టెలో అడుగున దాచిన ఫొటో తెచ్చి నా చేతికి ఇచ్చింది. అది బ్లాక్ అండ్ వైట్ ఫొటో. తర్వాత ఆమెతో మాట్లాడుతూ కొంచెం సేపు కూర్చున్నాను.

"ఇక నేను వెళ్ళొస్తాను ప్రేమలతా! యాజ్ ఎర్లీ యాజ్ పాజిబుల్ వస్తాను. నీకు ఆపరేషన్ చేయిస్తాను. మందులు వాడుతూ ఉండు .. బై.."

నా కారు వరకు వచ్చి 'బై' చెప్పింది ప్రేమలత.

నేను కారులో కూర్చున్నాను. నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ రోజు చాలా ముఖ్యమైనది నా జీవితంలో. నేనిక కలుసుకోలేను అని నిర్ణయించుకున్న అరుణను ఎటూ కలుసుకోలేదు. కాని అరుణ కన్న కూతుర్ని కలుసుకున్నాను. ఎంతో తృప్తిగా ఉంది నాకు.

మా ఇల్లు వచ్చింది. సెక్యూరిటీ గార్డు గేటు తెరిచాడు. ప్రేమలతకు ఆ ఫొటో తిరిగి ఇవ్వలేదు నేను. భద్రంగా జేబులో పెట్టుకుని తెచ్చాను. ప్రేమలత గమనించలేదు.

కారు పోర్టికోలో ఆపాను. జేబులో నుంచి ఫొటో తీసి చించి ముక్కలు చేసి గాలిలోకి విసిరేశాను.

ముందు ముందు ప్రేమలతకు కళ్ళు బాగయిన తర్వాత ఆ ఫొటో నాదేనని గుర్తిస్తే?

'తన తల్లిని మోసం చేసిన వాడు' అనుకునే ప్రమాదం ఉంది. ఎందుకొచ్చిన గొడవ?

ఇక ప్రేమలత అమ్మమ్మ ఎటూ గుర్తుపట్టదు. ఇరవైఏళ్ళ క్రితం రెండు, మూడుసార్లు చూసింది. అంతే! ఆ ముసిల్ది మారిపోయిన నన్నేం గుర్తుపడుతుంది?

ఇప్పుడు నేను ప్రేమలతకు కేవలం గాడ్‌ఫాదర్ని మాత్రమే. చాలా సంతోషంగా ఇంట్లోకి అడుగుపెట్టాను.

"ఏమండీ! ఇంతసేపున్నారేం? హాస్పిటల్లో రష్‌గా ఉందా?" అని అడిగింది నా భార్య.

"కాదు. నా జీవితంలో చాలా కాలం తర్వాత ఒక ముఖ్యమైన వ్యక్తిని కలుసుకున్నాను. అందుకని ఆలస్యమైంది" అన్నాను.

ఆ రాత్రి నాకు సరిగా నిద్రపట్టలేదు. ఏదో గిల్టీ ఫీలింగ్. ఎప్పటికో నిద్ర పట్టింది. కలలో అరుణ ఆగ్రహంతో కనిపించింది.

"పిరికి వెధవా?" అన్నది.

"పిరికి వెధవనా? ఎందుకు?" అన్నాను.

"కన్నకూతురు కనిపిస్తే, నా కూతురు అని లోకానికి తెలియజేయలేవా? ధైర్యం లేదా నీకు? పిరికివాడివి కాక మరేంటి.." అన్నది అరుణ.

"ఇప్పుడు లోకానికి ఎలా వెల్లడించగలను? నేను ఫారిన్ వెళ్ళి తిరిగొచ్చాక నీ కోసం ఎంత వెతికాను? మీ వాళ్ళు ఎన్ని ఇళ్ళు మారారో? విధి లేక మళ్ళీ పెళ్ళి చేసుకున్నాను. నాకు భార్యా, పిల్లలూ ఉన్నారు. ఇప్పుడు ఈ సంగతి చెప్తే గొడవ అవుతుంది".

"ఏం గొడవ అవుతుంది? ప్రేమలత నువ్వు కట్టుకున్న భార్యకు పుట్టిందేగా? ఉంపుడుగత్తెకు కాదుగా పుట్టింది? ఏ పరిస్థితుల్లో దూరమైందో నీ భార్యాపిల్లలకు చెప్పి ఒప్పించలేవా?"

"అదంత సులభం కాదు. సవతి కూతుర్ని ఆదరించే విశాల హృదయం ఆమెకు లేదు".

"ఛీ... ఇంత చేతగాని వాడివా? నీ హృదయం కఠినం. రాతి గుండె. ఆమెది విశాల హృదయం కాదని నీకేం తెలుసు?"

"నాది రాతి గుండె అయితే ప్రేమలతను ఆదరించాలని ఎందుకు అనుకుంటాను? కన్నకూతురు కాబట్టి ఎన్ని లక్షలు ఖర్చయినా కళ్ళకు ఆపరేషన్ చేయించి చూపు తెప్పించాలనుకున్నాను. తర్వాత బాగా చదివిస్తాను. ఘనంగా పెళ్ళి చేస్తాను. గాడ్ ఫాదర్‌గా ఉంటాను".

"ఒక అనాథ పిల్ల కోసం అంత డబ్బు ఎందుకు ఖర్చు పెడుతున్నాడని నీ భార్యకు అనుమానం రాదా?"

"నేను చెప్తేగా?"

"అందుకే నిన్ను పిరికివాడివి అన్నది. ఏం అంతధైర్యం లేదా నీకు? చాటుమాటుగా కన్నబిడ్డకు సహాయం చెయ్యడం ఎందుకు? ఏం ఖర్మ నీకు?... లే... లేచి నీ కన్నబిడ్డని ధైర్యంగా లోకానికి పరిచయం చెయ్యి. అప్పుడే నా ఆత్మ సంతోషిస్తుంది" అరుణ హితోపదేశం చేసింది.

ఉలిక్కిపడ్డాను. మెలకువ వచ్చింది. అరుణ కలలోకొచ్చి నిలదీసిందంతా గుర్తొచ్చింది. ఇక తర్వాత నిద్ర పట్టలేదు.

తెల్లారి ప్రేమలతను తీసుకొచ్చి నా భార్యకు జరిగిందంతా చెప్పాను. ఏమైతే అదే అవుతుందని తెగించాను. నిజమే! నేను ఎవర్నీ మోసం చెయ్యలేదు. ఎందుకు భయపడాలి?

నేను ఊహించినట్టు ఏం జరగలేదు.

"మన ఇంటి మహాలక్ష్మి అండీ!" అంటూ ప్రేమలతను దగ్గరకు తీసుకుంది నా భార్య.

"ఆడపిల్ల కావాలని ఎంతగానో పరితపించాను. ఇద్దరూ మగపిల్లలే పుట్టారు. ఇన్నాళ్లకి నా కోరిక తీరింది. రక్త సంబంధం ఎక్కడికి పోతుంది? అందుకే లక్ష్మీదేవిలా మన ఇంట్లో అడుగు పెట్టింది" అని మురిసిపోతూ ప్రేమలతను ముద్దుపెట్టుకుంది నా భార్య.

సెల్: 93900 85292

స్టార్ హీరో అయితే ఏంటి?

పొట్టిపిల్ల నిత్యామీనన్ పొగరుమోతుతనం మరోసారి బయటపడింది అంటున్నారు టాలీవుడ్ జనాలు. మహేష్‌బాబు, మురుగదాస్ కాంబినేషన్‌లో రూపొందబోయే సినిమాలో ఓ రోల్ కోసం నిత్యామీనన్‌ను అడిగారట! అయితే కథంతా విన్న తరువాత ఆ పాత్ర చేయనని అందట! కారణం అది చిన్న పాత్ర అట! అంత చిన్న పాత్ర చేయను పొమ్మందట! అది మహేష్‌బాబు సినిమా అయినా కూడా ఏమాత్రం తగ్గలేదట! ఈ విషయం తెలుసుకున్న మహేష్‌బాబు అభిమానులే కాదు, టాలీవుడ్ జనం కూడా నిత్యా మీద మండిపడుతున్నారు.

ఆటో ఇమ్యూన్ డిజార్డర్

శరీరంవ్యాధులబారినపడకుండా కాపాడటానికీ, పోరాడటానికీ ఒక రక్షణ వ్యవస్థ ఉంటుంది. ఆ రక్షణ వ్యవస్థ పొరబడి తన సొంత శరీరంపైనే దాడిచేసే థైరాయిడ్ సమస్యలు, రుమటాయిడ్ ఆర్థరైటీస్, తెల్లమచ్చలు, సోరియాసిస్ వంటి వ్యాధులువస్తాయి. అందుకే వీటిని ఆటోఇమ్యూన్ వ్యాధులంటారు. **కారణాలు:** బ్యాక్టీరియా, వైరస్, కెమికల్స్, వాతావరణ కాలుష్యం. వంశపారంపర్యంగా కూడా ఇది వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. **లక్షణాలు:** కండరాలనొప్పి, నీరసం, జ్వరం, అలసట. కీళ్ళనొప్పులు, చర్మం, రక్త కణాలు, రక్తనాళాలు వంటి భాగాలు ఎక్కువ ప్రభావానికీ లోనవుతాయి. **వ్యాధి నిర్ధారణ:** ఆటోయాంటీ బాడీస్ టెస్టులు, సిబిపి, సీరియాక్టివ్ ప్రోటీన్, ఈ.ఎస్.ఆర్. సిబిపి, ఎరిత్రోసైట్ సెడిమెన్‌టేషన్‌రేట్.

కొన్నిరకాల ఆటోఇమ్యూన్ వ్యాధులు: రుమటాయిడ్ ఆర్థరైటీస్: ఇదొక ఇన్‌ఫ్లెమెటరీఆర్థరైటీస్, జీవక్రియలలో ఏర్పడే అసమతూల్యతవలన తలెత్తే ఈ ఆటోఇమ్యూన్ డిసీజ్, శరీరంలో ఇరు ప్రక్కలలో ఉండే కీళ్ళకు సమాంతరంగా వ్యాప్తి చెందుతుంది.

థైరాయిడ్ సమస్యలు: యాంటీబాడీస్ శరీరంలో తయారగుట వల్ల థైరాయిడ్ గ్రంథికి వ్యాపిస్తాయి. ఇది కొన్ని నెలలనుంచి కొన్ని సంవత్సరాలు పడుతుంది. రేడియేషన్ చికిత్స ఇచ్చినప్పుడు థైరాయిడ్ గ్రంథి దెబ్బతిని హైపోథైరాయిడిజం రావచ్చు. హైపర్ థైరయిడ్ వచ్చినప్పుడు గ్రేవ్స్ డిసిజ్ అంటారు. **లక్షణాలు:** మలబద్ధకం, డిప్రెషన్, నీరసం, అలసట, వెంట్రుకలు రాలిపోవడం, గోళ్ళు విరగడం, కాళ్ళు, చేతులు వాయడం, గొంతుబొంగురుపోవడం. **వ్యాధి నిర్ధారణ:** టీ,టీ4, టీఎస్‌హెచ్ పరీక్షలు, లిపిడ్‌ప్రొఫైల్, సిబిపి, ఎల్.ఎచ్.టీ, ప్రోలాక్టిన్ మొదలైన పరీక్షలు చేయించుకోవాలి.

సోరియాసిస్: సోరియాసిస్ అనేది దీర్ఘకాలపు చర్మ వ్యాధి. ఇది పొలుసుల మాదిరిగా వచ్చే చర్మవ్యాధి. దురద, ఎర్రమచ్చలు శరీరమంతా వ్యాపిస్తాయి. ఈ వ్యాధి స్త్రీ పురుషులకు సమానంగా వస్తుంది. సోరియాసిస్ వ్యాధి ఎక్కువగా మోచేతులు,మోకాళ్ళు, తల, వీపు, అరిచేతులు, అరికాళ్ళు, ఉదరంపై, మెడ, నుదురు, చెవులు మొదలైన ప్రాంతాల్లో వ్యాపిస్తుంది. **లక్షణాలు:** చర్మం ఎర్రబడటం, జుట్టు రాలిపోవడం, కీళ్ళనొప్పులు, చర్మం పొడిబారినప్పుడు, చర్మంపై పగుళ్ళు, ఏర్పడంతో పాటు రక్తస్రావం అవుతుంది. **నిర్ధారణపరీక్షలు:** స్కిన్‌బయోప్సీ, ఈఎస్ఆర్, సిబిపి, ఎక్స్‌రే. **డయాబెటీస్:** టైప్-1 డయాబెటీస్ అనేది ఆటో ఇమ్యూన్ డిజార్డర్‌లో మరో డయాబెటీస్ అనగా షుగర్‌వ్యాధి. ఇది ఏ వయసులోనైనా రావచ్చు. ప్రస్తుతం భారతదేశంలో ప్రతి వంద మందిలో 14 మంది డయాబెటీస్ బారిన పడుతువ్నారు. ఇది ఇన్సులిన్ ఉత్పత్తి లోపం వల్ల జరుగుతుంది. వంశపారంపర్యంగా కూడా ఇది రావచ్చు. ఇప్పుడు 20-30 ఏళ్ళ వారిలో సైతం కనిపిస్తోంది. డయాబెటీస్ రెండు రకాలుగా ఉంటుంది. టైప్ 1, టైప్ 2.

టైప్ 1. 20 సంవత్సరాల లోపు వారిలో వచ్చే వ్యాధి. ఇది ఆటోఇమ్యూన్ డిసిజ్‌గా చెబుతారు. ఇది చిన్నపిల్లలో కనిపించే సమస్య కనుక అది వారి మానసిక, శారీరక పెరుగుదల మీద చాలా ప్రభావాన్ని చూపుతుంది.

టైప్-2. డయాబెటీస్ 20 సంవత్సరాలు పైబడిన వారిలో కనిపిస్తుంది. ఏటా 5.1 మిలియన్ల మంది డయాబెటీస్ వల్ల మరణిస్తున్నారు. 2030 వరకు ప్రపంచంలోని ప్రతి ఇద్దరిలో ఒకరు డయాబెటీస్ బారిన పడే అవకాశం ఉందని అంచనా. టైప్-1, టైప్-2, టైప్-3 డయాబెటీస్ కుడా ఉంది ఇది జెస్టేషనల్ డయాబెటీస్ ముఖ్యంగా గర్భిణుల్లో కనిపిస్తుంది.

డా. మురళి అంకిరెడ్డి
M. D (Homeo)
స్టార్ హోమియోపతి

లక్షణాలు. ఆకలి, నీరసం, దాహం ఎక్కువగా ఉండటం. అతిమూత్రం, కళ్ళుమసకగా కనిపించడం, బరువు తగ్గడం. తలనొప్పి, గుండెదడ, చెమటలు పట్టడం, గాయాలు నయం కాకపోవడం, కాళ్లు, చేతులు తిమిర్లు రావడం. **నిర్ధారణ పరీక్షలు.** ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, పోస్‌డియల్ బ్లడ్ షుగరం, గ్లూకోజ్ టాలరెంట్ టెస్ట్, యూరిన్ షుగర్ లెవల్, రావడమే షుగర్ లెవల్, బ్లడ్ యూరియా లెవల్స్, సిరమ్ పరీక్షలు.

హోమియోచికిత్స. హోమియో వైద్యవిధానంలో వ్యాధి లక్షణాలు, మానసిక, శారీరక స్థితిగతులు, ఆహార వివరాలను పరిగణలోకి తీసుకొని చికిత్స అందించడ్ జరుగుతుంది. ఆటోఇమ్యూన్ డిజార్డర్స్ అన్నింటికీ హోమియోలో మంచి మందులు ఉన్నాయి. వీటితో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. ఇది అనుభవజ్ఞులైన హోమియో వైద్యుని పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే ఆటోఇమ్యూన్‌డిసిజ్‌ను సమూలంగా నయంచేయవచ్చు. మన రక్షణ వ్యవస్థను పటిష్టం చేయడం వ్యాధి మూలాలకు చికిత్స చేస్తూ వ్యాధి తిరగబడకుండా చికిత్స చేయడం హోమియోపతి యొక్కప్రాధాన్యం.

www.starhomeo.com

సికింద్రాబాద్ । కొత్తపేట । కూకట్‌పల్లి । గచ్చిబౌలి । వరంగల్
విజయవాడ । తిరుపతి । విశాఖపట్నం । రాజమండ్రి । కర్నాటక

✆ 90300 64224

ఫ్యాటీలివర్

కాలేయంలో కొవ్వుశాతం ఉండవలసిన స్థాయి కంటె ఎక్కువ ఉండటాన్ని ఫ్యాటీ లివర్ అంటారు. కాలేయం... అహారాన్ని ప్రొటీన్‌గా, కొవ్వుగా, పిండి పదార్థాలుగామారుస్తుంది. సహజంగానే కాలేయంలో కొంతకొవ్వు ఉంటుంది. శరీరంలోని ఇతర భాగాల నుండి కూడా కొవ్వు సరఫరా చేయబడుతుంది. ఫ్యాటీలివర్ వ్యాధిలో... కాలేయకణాలలోని కొవ్వుతో ట్రైగ్లిజరాయిడ్స్ కూడా వచ్చి చేరుతాయి. ఈ విధంగా కొవ్వు కాలేయ కణాలలో నిక్షిప్తమవుతుంది. ఈ సంక్లిష్ట కొవ్వును కాలేయ కణాలు సరళమైన పదార్థాలుగా మార్చలేకపోవటం వలన ఫ్యాటీలివర్ వ్యాధి ఏర్పడుతుంది. ప్యాటీలివర్ వ్యాధి ప్రమాదకరమైనది కాదు. కాని కాలేయం బరువు కన్నా 10 శాతం కొవ్వు శాతం అధికంగా ఉండటం వలన కాలేయంలోవాపుమొదలవుతుంది. కాలేయం పని తీరు మందగిస్తుంది. ఇది రెండు రకాలుగా చెప్పవచ్చు. 1.ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్. ఈ వ్యాధి ఆల్కహాల్‌ఎక్కువగా తీసుకునేవారిలోకనబడుతుంది. 2.నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్.

కొంతమంది ఆల్కహాల్ తీసుకోకపోయినా బరువు అధికంగా ఉండటం వలన కనిపిస్తుంది, చక్కెర వ్యాధితో బాధపడేవారిలో కూడా ఫ్యాటీ లివర్ వస్తుంది. సన్నగా ఉండేవారిలోనూ ఈ వ్యాధి వస్తుంది. వంశపారంపర్యంగానూ, వివిధ రకాల వ్యాధులకుమందులు వాడటంతోవాటిదుష్ప్రభావాల వల్ల కూడా ఫ్యాటీలివర్ రావచ్చును. లక్షణాలు. వ్యాధితీవ్రత ఎక్కువగా లేకపోతేలక్షణాలను తేలికగా గుర్తించలేం. లక్షణాలు తీవ్రమైతే కాలేయంవాపు లేదా హైపటైటిస్, సిర్రోసిస్‌అనే కండిషన్ వస్తాయి. కొన్నిసార్లు కామేర్లు, ఉదరంలో కుడివైపునొప్పి, వాపు, జ్వరం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. గర్భవతుల్లో ఈవ్యాధి తీవ్రత వలన వాంతి వచ్చినట్లు అనిపంచటం, ఆకలి లేకపోవటం, నొప్పి మొదలైన లక్షణాలు ఉంటాయి.

ఈ వ్యాధి రావటానికి కారణాలు: 1. ఆల్కహాల్ తీసుకోవటం 2. బరువు పెరగటం 3. ఆకలి తక్కువగా ఉండటం 4. చక్కెరవ్యాధి 5. స్థిరాయిడ్స్ వాడకం 6. కొలెస్ట్రాల్ అధికస్థాయిలో ఉండటం 7. మందుల ప్రభావం. ఈ వ్యాధిని రక్తపరీక్ష ద్వారా గుర్తించవచ్చు. ఈ పరీక్షద్వారా లివర్ ఎంజైములలో మార్పు కనిపిస్తుంది. లివరుబయాప్సీ వలన దాని తీవ్రత ఎంతవరకు ఉందో గుర్తించవచ్చు. ఆయుర్వేదశాస్త్రం ప్రకారం కాలేయం పిత్త ప్రకృతి కలిగి ఉంటుంది. ఇది జీర్ణక్రియను సమతుల్యం చేసి విషాలను బయటకు పంపుతుంది. కాలేయంలో ఆల్కహాల్ శాతం, కొవ్వు శాతం అధికమవ్వటం వలన అధికంగాశ్రమిస్తుంది. ఈకారణంగా లివరులో వాపు వెుదలవుతుంది. ఆయుర్వేద వైద్యం ప్రకారం ఆహారవిహారాలను క్రమబద్ధీకరించడం వలన, ఔషదసేవన వలన ఈ వ్యాధిని పూర్తిగా అదుపులోఉంచవచ్చు. అధిక బరువు కలవారు పంచకర్మల ద్వారా బరువును అదుపులో ఉంచుకోవడం ద్వారా ఫ్యాటీలివర్ వ్యాధిని నివారించవచ్చును. నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో మాత్రమే వ్యాధిని నిర్ధారించుకుని చికిత్స తీసుకోవటం వలన ఫ్యాటీలివర్‌ను పూర్తిగా నివారించవచ్చును. నివారణ. ఆల్కహాల్ తీసుకోరాదు. మసాలా పదార్థాలు తినకూడదు. చల్లని వస్తువులు,వేపుళ్ళు తినరాదు. పులుపుపదార్థాలు తగ్గించి కూర గాయలు తీసుకోవాలి. బరువు(తగ్గించుకోవాలి) నియంత్రణలో ఉండేలా చూసుకోవాలి.

డా.మనోహర్. M. D (Ayurveda)
స్టార్ ఆయుర్వేద

ADVT

✆90300 85456

సికింద్రాబాద్ । కొత్తపేట । కూకట్‌పల్లి । గచ్చిబౌలి । వరంగల్
విజయవాడ । తిరుపతి । విశాఖపట్నం । రాజమండ్రి । కర్నాటక

www.starayurveda.com

ఆరోగ్యమే మహాభాగ్యం

లివర్ వ్యాధికి కాఫీ చిట్కా!

రోజుకు రెండుకప్పుల కాఫీ తాగితే లివర్ సిర్రోసిస్ వ్యాధి నుంచి 44 శాతం వరకూ తప్పించుకోవచ్చని సౌత్ హ్యాంప్టన్ యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది ఈ వ్యాధి బారిన పడి మరణిస్తున్న సంగతి తెలిసిందే! సుమారు నాలుగు లక్షల మంది మీద వీరు పరిశోధనలు నిర్వహించారు. కప్పుల సంఖ్య పెరిగే కొద్దీ వ్యాధి వచ్చే అవకాశాలు తగ్గుతాయన్న విషయాన్ని వీరు గుర్తించారు. అయితే కాఫీలో ఉండే వంద రకాల రసాయనాలలో ఏ రసాయనం లివర్‌ను వ్యాధుల బారి నుంచి కాపాడుతుందన్న విషయాన్ని మాత్రం వీరు స్పష్టం చేయలేకపోతున్నారు. అయితే రోజుకి అయిదు కప్పులు మించి కాఫీ తాగితే పొత్తికడుపులో కొవ్వు పేరుకుపోయే ప్రమాదం ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయం మీద ఇంకా విస్తృతంగా పరిశోధనలు నిర్వహించాల్సి ఉందని వారు చెబుతున్నారు.

ఎడమ వైపు పడుకుంటేనే మంచిది

చాలా మంది రాత్రి పడుకోబోయే సమయంలో ఎక్కువగా కుడివైపే తిరిగి పడుకుంటారు. కానీ ఎడమ వైపు తిరిగి పడుకుంటేనే రాత్రి సమయంలో గాఢనిద్ర పడుతుందనీ, అంతేకాక మరుసటి రోజు చురుకుగా ఉంటారనీ బ్రిటన్ పరిశోధకులు అంటున్నారు. ఎడమ వైపు తిరిగి పడుకోవడం ఆరోగ్యానికి మంచిదని కూడా వారు సూచిస్తున్నారు. సుమారు మూడు వేల మందిపై వీరు పరిశోధనలు నిర్వహించారు. రాత్రి సమయంలో కుడి వైపుకు తిరిగి పడుకునే వారి కన్నా ఎడమ వైపు తిరిగి పడుకున్న వారే మరుసటి రోజు ఎక్కువ ఉత్సాహంగా, చురుకుగా వ్యవహరించడాన్ని వీరు గుర్తించారు. ఎడమ వైపు తిరిగి పడుకున్న వారిలో ఆహారం త్వరగా జీర్ణం కావడాన్ని వీరు గమనించారు. ఇలాంటివారు పని ఒత్తిడిని కూడా ఫీలవరని చెబుతున్నారు. కుడివైపుకు తిరిగి పడుకునే అలవాటు ఉన్నవారు ఎడమ వైపు తిరిగి పడుకోవడాన్ని అలవాటు చేసుకోవాలని వారు సూచిస్తున్నారు.

మెట్లు ఎక్కితే మెదడుకు ఆరోగ్యం

లిఫ్టు ఉపయోగించడం కన్నా మెట్లు ఎక్కి దిగితే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు పదే పదే చెబుతుంటారు. ఈప్రక్రియ శరీరానికే కాదు మెదడుకు కూడా ఆరోగ్యాన్ని, చురుకుదనాన్ని ఇస్తుందని కెనడా యూనివర్సిటీ పరిశోధకులు అంటున్నారు. పదిహేడు సంవత్సరాల నుంచి డెబ్భైతొమ్మిది సంవత్సరాల మధ్య వయస్సు గల 300 మంది వ్యక్తుల మీద వీరు పరిశోధనలు నిర్వహించారు. వయస్సు రీత్యా జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచించలేకపోవడం వంటి సమస్యలను మెట్లు ఎక్కడం ద్వారా అధిగమించవచ్చని వీరు అంటున్నారు. వయస్సు రీత్యా మెదడులో సంభవించే పలు పరిణామాలకు కూడా ఈ వ్యాయామం చెక్ పెడుతుందని అంటున్నారు. అయితే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు మాత్రం వైద్యుల సలహా మేరకే మెట్లు ఎక్కడం, దిగడం చేయాలని సూచిస్తున్నారు.

నొప్పులకు కారణమయ్యే ఆరోగ్య స్థితి

తరచు శరీరంలో ఏదో ఒక భాగంలో నొప్పి ఎదుర్కొనేవారు వారి ఆర్థిక పరిస్థితిని ఒకసారి తరచి చూసుకోవాలి అంటున్నారు అమెరికా యూనివర్సిటీ పరిశోధకులు. ఆర్థికస్థితిగతుల్లో ఒడిదుడుకులు తీవ్రమైన ఒత్తిడికీ, ఆందోళనకూ, గురిచేస్తాయన్న సంగతి తెలిసిందే! తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన ప్రభావం శరీరంలోని భాగాల మీద పడుతుందనీ, ఈ సమయంలో ఆయా భాగాలు నొప్పికి గురవుతాయనీ చెబుతున్నారు. ఇదే విషయం మీద వీరు కొన్ని నెలల పాటు పరిశోధనలు నిర్వహించారు. ఆర్థిక పరిస్థితి సక్రమంగా ఉన్నవారు కూడా నొప్పుల బాధను ఎదుర్కొంటారనీ, ఆ బాధ ఏదైనా అనారోగ్యానికి సంబంధించి ఉండవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. శరీరంలో ఎలాంటి అనారోగ్యం లేకపోయినా, నొప్పులు బాధిస్తున్నాయంటే, వారి ఆర్థిక పరిస్థితి అందుకు కారణం కావచ్చని అంటున్నారు. అయితే అందరికీ ఈ సిద్ధాంతాన్ని వర్తింపజేయలేమని కూడా వారు స్పష్టం చేస్తున్నారు. ఆర్థిక స్థితిగతులు ఒడిదుడుకులకు లోనైన సమయంలో మానసికంగా, శారీరకంగా కొన్ని మార్పులు కచ్చితంగా వస్తాయని వారు చెబుతున్నారు.

-అవినాష్

డేర్ డెవిల్

-మధుబాబు

23



'పట్టుకోండి... పారిపోతోంది. పట్టుకోండి' అని గొంతు చించుకుని అరుస్తూ తాను కూడా కిందికి వచ్చేశాడు జాబిల్లిని ఆపలేకపోయిన అనుచరుడు.

అదే సమయంలో తను లోపలికి వచ్చాడు రహంతుల్లా. 'ఏంటిరా? ఏమయింది? ఎవరు పారిపోతున్నారు?' అని అడుగుతూ ఎదురుపోయాడు అతనికి.

అతను లోపలికి రావటం ఒక్క క్షణం. ఒక్కటంటే ఒక్క క్షణం ఆలస్యమై ఉంటే బట్టబయలు అయిపోయి ఉండేది జాబిల్లి గుట్టు. పైనుంచి వస్తున్న పెద్ద మనిషికి చాలా స్పష్టంగా కనిపించి ఉండేది ఆమె.

అతని చూపు ఆమె మీదికి ప్రసరించక ముందే రహంతుల్లా ఎంటర్ అయ్యేసరికి, ఫోకస్ అంతా అతని మీదా, అతనితోపాటుగా వచ్చిన ఇతర అనుచరుల మీదా కాన్‌సన్‌ట్రేట్ అయింది. అన్నిటికీ తెగించేసింది జాబిల్లి. ఆరు అడుగుల దూరంలోనే ఉండిపోయారు వారందరూ. వారిలో ఏ ఒక్కరు వెనక్కి చూసినా తన బండారం బయటపడి పోతుంది. అలా కాదని చెప్పి, తాను బయటికి పరిగెత్తితే, వెంటనే వారి దృష్టిని ఆకర్షించి తీరుతుంది.

ముందు నుయ్యి వెనుక గొయ్యి మాదిరి తయారయిన తన పరిస్థితిని తలుచుకుని కుంగిపోలేదు ఆమె. రెండో ఆలోచన లేకుండా తెగించి ఆ కట్టడం బయటికి పరిగెత్తింది.

'ఏమిటిరా? ఏమయింది?' అని అడుగుతున్న రహంతుల్లా భుజం మీది నుంచి ద్వారం వైపు తన చేతిని జాచి మరీ అరిచాడు అతని అనుచరుడు.

'అదిగో... అదిగదిగో.. పట్టుకోండి. పట్టుకోండి'.

అదిరిపడి వెనక్కి తిరిగి జాబిల్లిని చూశాడు రహంతుల్లా. విపరీతమైన కోపంతో చిందులు తొక్కినంత పనిచేశాడు.

'ఆగు, ఆగిపో, ఆగు' అని కేకలు పెడుతూ కట్టడం వెలుపలికి దూకాడు.

కట్టడంలో నుంచి బయటికి వచ్చిన వెంటనే, మంటల్ని చూసి గంతులు వేస్తూ గొంతులు చించుకుంటున్న జనం మధ్యలోకి దూరిపోయింది జాబిల్లి.

ఏదో ఒక విధంగా మహాసుల్తాన్ విడిది చేసి ఉన్న బిల్డింగ్ ముందుకు పోవటమే ఆమె ఆశయం. అక్కడికి పోగలిగితే, రహంతుల్లా తనను రీకాప్చర్ చేయడం అసంభవమని ఆమె నమ్మకం.

ఆవురావురు మంటూ కట్టడాలను ఆరగిస్తున్న మంటల వెలుగు తప్ప మరే విధమైన వెలుతురు లేదు అక్కడ. దగ్గరగా నిలబడి కనులు చిట్లించుకు చూస్తే తప్ప ఎదురు నిలబడి ఉన్నది ఎవరో ఎవరికీ తెలియటం లేదు.

'ఆ మసక వెలుగు తనని రక్షిస్తుందనే ఆశించింది ఆమె. ఊపిరి బిగపట్టి సూటిగా ముందుకు పోతూ ఉండగా, ఉన్నట్లుండి ఆమె దారికి అడ్డ వచ్చారు ఇద్దరు వ్యక్తులు. అడ్డ రావటంతో ఆగలేదు వాళ్ళు. గబుక్కున చేతులుజాచి ఆమెను ఒడిసి పట్టుకున్నాడు ఒకతను. తన తల మీది తలపాగా తీసి, ఆమె నోటికి గట్టిగా అదిమాడు రెండవ వ్యక్తి.

'పట్టుకోండిరా పట్టుకోండి పారిపోనీయకండి' అని కేకలు పెడుతూ, రహంతుల్లా ఆ ప్రదేశంలోకి రాకముందే, మట్టి బొమ్మను ఎత్తినట్లు చేతుల్లోకి ఎత్తుకుని, పది గజాల దూరంలో ఉన్న ఇంకో చిన్న సందులోకి ఆమెను తీసుకువెళ్ళిపోయారు వాళ్ళు.

> **జరిగిన కథ**
>
> జుబ్బా కొండల్లో నిక్షిప్తమైన నిధికోసం జుబ్బారాజ్య మహాసుల్తాన్ అన్వేషిస్తూ ఉంటాడు. ఫిలోలజిస్టు సబ్జెక్టు చదివే జాబిల్లికి పురాతన లిపిలో ఉన్న పత్రాలిచ్చి అధ్యయనం చేయమంటాడు మహాసుల్తాన్. అతడి సోదరుడు రహంతుల్లా ఆ నిధిని కాజేసేందుకు జాబిల్లిని కిడ్నాప్ చేసి బంధిస్తాడు. సిటీ సెక్యూరిటీ పరిశోధనా విభాగం గూఢచారి శ్యామ్‌సుందర్, నఫీజు ఇద్దరూ జాబిల్లిని వెతుక్కుంటూ ఆమెను బంధించిన ప్రదేశం సమీపానికి చేరుకుంటారు. గుడారానికి నిప్పుపెట్టి బయటకు తప్పించుకు వస్తుంది జాబిల్లి. ఆ తర్వాత....

•••

'ఎవరు మీరు? ఎందుకు పట్టుకున్నారు నన్ను?' భయం భయంగా చూస్తూ నఫీజుని అడిగాడు గుడారం దగ్గర పట్టుబడిన ఘనీ సుల్తాన్ మనిషి.

'నీ ముద్దుముఖం మాకు చాలా బాగా నచ్చింది బే. దగ్గర్నించి చూడటం కోసం పట్టుకున్నాను' సమాధానం ఇచ్చాడు నఫీజు.

'నేను ఎవరినో తెలుసా? నన్ను పట్టుకున్నారని మా ఘనీసుల్తాన్‌కి తెలిస్తే ఏమౌతుందో మీకు అవగాహన ఉందా?' కోపంగా చూస్తూ అడిగాడు ఆ మనిషి.

మెరుస్తున్న కనులతో శ్యామ్‌సుందర్ వైపు చూశాడు నఫీజు. 'వాడు మనకి శ్రమ తగ్గించేశాడు సాబ్. నెత్తి పగలగొడితే తప్ప తన బాస్ ఎవరో చెప్పడని అనుకున్నాను. ఒంటిమీద చెయ్యి పడకముందే తనంతట తనే బయటపెట్టేశాడు. మహా తెలివైన వాడు' అన్నాడు.

'ఎర్రకొండల దగ్గర్నించి వాడి బాస్‌కి మెస్సేజి వచ్చిందో లేదో అది కూడా తెలుసుకో, ఇంకో పని అయిపోతుంది' అన్నాడు శ్యామ్‌సుందర్.

'మెస్సేజా? ఎర్రకొండల దగ్గర్నించా? అదేమిటి?' ఆ ప్రశ్న తనకు మహా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నట్లు కనులు పెద్దవి చేసి చూస్తూ అడిగాడు ఆ మనిషి.

కంటికి కనిపించనంత వేగంతో కదిలింది నఫీజు పిడికిలి. అతని పెదవులు కత్తిపెట్టి చీలినట్లు చీరుకు పోయాయి. ఎర్రటి రక్తం చిన్నగా చుబుకం మీదికి జారి అక్కడినుంచి దుస్తుల మీద పడటం ప్రారంభించింది బొట్లుబొట్లుగా.

'ఇది వట్టి శాంపిల్ మాత్రమే భయ్యా. అసలైన దెబ్బలు ఇంకా మొదలు కాలేదు' చిరచిరలాడుతున్న పిడికిలిని తన షర్టుకేసి అద్దుకుంటూ చెప్పాడు నఫీజు.

'చెప్తాను. నన్ను వదిలేస్తానని ప్రామిస్ చేస్తే' గబగబా అన్నాడు ఆ మనిషి.

'వదిలేస్తాను భయ్యా. నిన్ను వెంట బెట్టుకు తిరగాలన్న కోరిక మాకు లేదు. చెప్పేయ్ మరి' ప్రాంప్ట్ చేశాడు నఫీజు.

'వచ్చింది మెస్సేజి. అందుకే నేను గుడారం దగ్గిర కాపలా నిలబడ్డాను' తడుముకోకుండా

చెప్పేశాడు ఆ మనిషి.

'ఓ.కే. చాలా బాగుంది. మరి ఇంతకుముందు ఈ సిటీలోకి తీసుకురాబడిన'.. అని మొదలు పెట్టాడు నఫీజు.

'అది అది రహంతుల్లా సాబ్ చేసిన పని. నేను చేసింది కాదు. నాకు, ఆ పనికి ఎటువంటి సంబంధం లేదు. వాళ్ళ వాళ్ళు చెప్పుకుంటుంటే వినటం తప్ప ఆ అమ్మాయిని నేను చూడను కూడా చూడలేదు' చాలా స్పీడ్‌గా చెప్పాడు ఆ మనిషి.

తన చెవుల్ని తనే నమ్మలేనట్లు మహా ఆశ్చర్యంగా శ్యామ్‌సుందర్ వైపు చూశాడు నఫీజు.

'మనం అడిగింది ఏమిటో వాడికి అర్థమై ఉంటుందా?' అన్నాడు. క్షణక్షణానికి అధికం అయిపోతోంది శ్యామ్‌సుందర్‌కి. సిగరెట్ వెలిగించుకోవాలన్న కోరిక. అది బలవంతంగా అదుముకుంటూ చిన్నగా నవ్వాడు.

'ఈ రోజు మనం లేచిన వేళా విశేషం చాలా బాగుంది నఫీజూ. అతిగా కష్టపడకుండా అతి తేలికగా అన్నీ తెలిసిపోతున్నాయి మనకి అవసరమైన విశేషాలన్నీ' అంటూ ఆ మనిషి భుజం మీద చెయ్యివేశాడు.

'రహంతుల్లా తీసుకు వచ్చిన అమ్మాయిని ఎక్కడ దాచిపెట్టారు. సిటీలోనే ఉంచాడా? లేక ఇంకో ప్రదేశానికి తీసుకుపోయాడా?' చాలా అనుమానంగా అడిగాడు.

'ఎక్కడికీ తీసుకుపోలేదట. ఇక్కడే ఉంచాట్ట' అంటూ ఒక వీధి పేరు, ఆ వీధిలో ఉన్న చెక్కల కట్టడం పేరు చెప్పాడు.

'మనం ఆలస్యం చేయటం అనవసరం శ్యామ్‌సాబ్. పనిలో పనిగా పోయి ఆ కట్టడం మీద పడదాం. తెల్లవారే లోపు పని పూర్తి చేసుకుందాం' ఉత్సాహంగా అన్నాడు నఫీజు.

'అరే నఫీజు గాడా... దేశం కాని దేశంలో ఉన్నాం మనం. ఇది ఆ రహంతుల్లా ఏరియా. స్థానబలం ఉంటుంది వాడికి. అనుకున్నంత తేలిక కాదు ఎదిరించటం. ఏదో ఒక విధంగా పని పూర్తి చేసినా, వదిలి పెట్టడు వాడు. పాము పగబట్టినట్టు వెంటపడి తరుముకుంటూ వస్తాడు. తప్పించుకోవటం ఎలాగో ఆలోచించు' తాపీగా అన్నాడు శ్యామ్‌సుందర్.

మార్చి మార్చి వారిద్దరి ముఖాల వంకా చూడటం మొదలు పెట్టాడు ఘనీసుల్తాన్ మనిషి. అతనితో మాట్లాడినప్పుడు అతనికి అర్థమైన భాషలోనే ప్రశ్నలు వేశారు వాళ్ళు. ఇప్పుడు తమ భాషలో మాట్లాడుకుంటున్నారు.

'వీడితో అవసరం తీరిపోయింది సాబ్. ఏం చేద్దాం?' వదిలిపెడితే ఉరుకులు పరుగుల మీద ఘనీసుల్తాన్ దగ్గరికిపోయి మన గురించి చెప్పేస్తాడు. గొంతు పిసికి ఇసుకలో కప్పెట్టేయటం బెటర్ అని నాకు అనిపిస్తోంది' ఉన్నట్లుండి చెప్పాడు నఫీజు.

'అది చాలా కష్టమైన పనిరా నఫీజుగాడా. ముక్కులు ముఖాలు ఏకం అయిపోయేటట్లు దెబ్బలు కొట్టమంటే కొట్టగలం. చూస్తూ చూస్తూ గొంతు పిసికి ప్రాణాలు తీయటం మనకి చేతనయ్యే పని కాదు. తల అడ్డం తిప్పుతూ అన్నాడు శ్యామ్‌సుందర్.

రెండే రెండు క్షణాలు ఆలోచించాడు నఫీజు. మూడో క్షణంలో ఉన్నట్లుండి పిడికిలి ఎత్తి ఆ మనిషి మెడమీద చాలా బలంగా కొట్టాడు.

గావురుమని అరవటం కోసం నోరు తెరిచాడు ఆ మనిషి. శబ్దం పెదవులు దాటి బయ

టికి రాకముందే తప్పిపోయింది తెలివి. కూర్చున్న వాడు కూర్చున్న ప్రదేశంలోనే వెనక్కి వాలి పోయాడు.

'అదృష్టం బాగుంటే వాడికి ఇంకో రెండు మూడు గంటల వరకూ తెలివి రాకపోవచ్చు. ఈ లోపల మనం సిటీలోకి పోయి అక్కడి సిచ్యుయేషన్ ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చు' పిడికిలిని మళ్ళీ షర్టుకేసి రుద్దుకుంటూ చెప్పాడు నఫీజు.

పెద్ద ఇసుకగుట్ట చాటున జరిగింది ఈ ఇంటరాగేషన్ అంతా. పాంటు జేబుల్లో చేతులు పెట్టుకుని లేచి నిలుచున్నాడు శ్యామ్‌సుందర్. సిటీ ఉన్న దిశలోకి చూస్తూ కనులు చిట్లించాడు.

అంత చీకటిలోను, ఆ విషయాన్ని చటుక్కున గమనించాడు నఫీజు. 'ఏమయింది సాబ్? ఏమిటి మీ అనుమానం?' అని అడిగాడు.

'సిటీలో ఏదో గందరగోళం స్టార్ట్ అయినట్లు కనిపిస్తోంది. ఏవో బిల్డింగులు మంటల బారిన పడినట్లున్నాయి. ఆ వెలుగు మంటలుంటేనే కనిపిస్తుంది' చేతిని జేబులో నుంచి తీసి అటుకేసి చూస్తూ అన్నాడు.

'మంటలే అయితే మరీ మంచిది సాబ్. మహా గందరగోళంగా ఉంటుంది. మన గురించి పట్టించుకునే తీరిక ఎవరికీ ఉండదు. పదండి త్వరగా' అంటూ అతని సమాధానం కోసం ఎదురు చూడకుండానే పరుగు మొదలు పెట్టాడు నఫీజు.

'వెల్లకిలా పడిపోయిన ఘనీసుల్తాన్ మనిషి వైపు ఒకసారి చూసి, తను కూడా అతన్ని అనుసరించాడు శ్యామ్‌సుందర్.

•••

'పట్టుకోండిరా... పట్టుకోండి. పారిపోనీయకండి' అని గావుకేకలు పెడుతూ జాబిల్లిని అనుసరించి, వీధిలోకి వచ్చిన రహంతుల్లా వేగానికి సరిగ్గా నిమిషంన్నర తరువాత పడింది సడన్ బ్రేకు.

వీధిలో ఉన్న గందరగోళాన్ని దాటుకుంటూ తన సోదరుడు విడిదిచేసి ఉన్న భవనం దగ్గరికి పోతున్నాడు అతను.

పరుగుదీస్తున్న జాబిల్లిని చూడనే చూశాడతను. పట్టుకోండి పట్టుకోండి అంటూ తన అనుచరులతో కలిసి ఆమె వెంటపడ్డాడు. ఇంతలో నాలుగు బలమైన చేతులు ఆమెను అడ్డుకున్నాయి. ఆ చేతులు ఆమెను గట్టిగా బంధించి చిన్న సందులోకి ఎత్తుకెళ్ళిపోయాయి. ఆ చేతులు ఎవరివి? ఆమెను ఎక్కడికి తీసుకెళ్ళారు?

'నా సోదరుడు అందులోనే ఉన్నట్లు ఆ పిల్లకి ఘనీసుల్తాన్ మాటల ద్వారా తెలిసింది. తప్పకుండా ఆ పిల్ల అక్కడికే పోతుంది. మనల్ని తప్పించుకుని, ఒక్కసారి ఆ బిల్డింగ్‌లోకి ఎంటర్ అయిందంటే, తిరిగి ఆ పిల్లని పట్టుకోవటం అసాధ్యం. ఇప్పటివరకూ పడిన కష్టమంతా చిటికెలో నాశనం అయిపోతుంది. పరిగెత్తండి. పరిగెత్తండి' అని తన అనుచరుల్ని హెచ్చరించాడు.

ఆ బిల్డింగ్‌కి సరిగ్గా వంద అడుగుల దూరంలోకి పోతూ ఉండగానే పది మంది బాడీగార్డులు తన చుట్టూ వలయాకారంలో నడుస్తూ ఉండగా బయటికి వచ్చాడు మహాసుల్తాన్.

వీధికి రెండో వైపున చెలరేగిపోతున్న మంటలు ఆయన విడిదిచేసిన బిల్డింగ్ మీదికి కూడా రావచ్చని అనిపించింది కాబోలు. దగ్గర ఉండి ఆయన్ని బయటికి పంపిస్తున్నారు ఆ బిల్డింగ్ నిర్వాహకులు.

తెల్లవారే వరకూ మీరు ఎడారిలోకి పోయి వెయిట్ చేయండి హుజూర్. తెల్లవారేలోపు ఈ సమస్య ఒక కొలిక్కి వచ్చేస్తుంది' అంటూ ఆయనకు కలుగుతున్న అసౌకర్యానికి క్షమాపణలు చెప్పుకుంటున్నారు.

మూడు ఖరీదైన ఫారిన్ మోటార్ కార్లు ఆ బిల్డింగ్ ముందుకు వచ్చాయి. మహాసుల్తాన్‌ను ఎక్కించుకుని వేగంగా ఎడారివైపు దూసుకు పోయింది మొదటి కారు. ఆయన బాడీగార్డుల్ని ఎక్కించుకుని క్లోజ్‌గా ఫాలో అయినాయి మిగిలిన రెండూ.

'భగవంతుడు మహా కరుణామయుడు. మంటల్ని చూసి ముసలి సుల్తాన్ భయపడి పోయినట్లున్నాడు. మిమ్మల్నిగాని, మమ్మల్ని గాని గమనించలేదు' రహంతుల్లా వెనుకే ఆగిపోయి చిన్నగా కామెంట్ చేశాడు ఒక అనుచరుడు.

అంతకుముందు ఒక్క క్షణం ముందు వరకూ ఎంతో టెన్షన్‌తో వికృతంగా మారిపోయి ఉన్న రహంతుల్లా ముఖం, ఉన్నట్లుండి సుప్రసన్నంగా మారిపోయింది.

'మన సైనికులు మనతో కలిసి ఉంటే అందరికీ అనుమానం వస్తుందని వాళ్ళని సిటీ వెలుపలే ఆగిపొమ్మని చెప్పాను. ఇప్పుడు భయపడవలసిన అవసరంలేదు. వాళ్ళని ఇక్కడికి వచ్చేయమని చెప్పండి' తీరికగా నిలబడుతూ ఆర్డర్ ఇచ్చాడు.

'సైనికులు ఇప్పుడు దేనికి హుజూర్?' అయోమయంగా అడిగాడు ఒక అనుచరుడు.

'మంటలకి దూరంగా పారిపోయిన ముసలి నక్క ఇక మంటలు పూర్తిగా కంట్రోల్ అయ్యేంత వరకు సిటీలోకి రాడు. వాడు వచ్చేలోపు మనం సిటీనంతా గాలించి పారిపోయిన పిల్లను పట్టేసుకుంటాం' సగర్వంగా ఎనౌన్స్ చేశాడు రహంతుల్లా.

'ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. ఎంతైనా రహంతుల్లా సాబ్ మహాచతురులు. ఎంతటి క్లిష్ట పరిస్థితిలోనైనా సరే దీర్ఘంగా ఆలోచించటం సాబ్‌కి ఒక్కడికే తెలుసు..' మెచ్చుకున్నాడు ఆ అనుచరుడు.

'మన సైనికులతో పాటు ఘనీసుల్తాన్‌ని వాడి చంచాల్ని కూడా ఉపయోగించుకోవాలి. వాడిని కూడా పిలిపించండి' మరో ఆజ్ఞను వినిపించాడు రహంతుల్లా.

ఎడారిలో మకాం వేసి ఉన్న తమ సైనికుల దగ్గరికి పోయాడు మొదటి అనుచరుడు. సిటీకి ఆవలి పక్కన ఉండే ఘనీసుల్తాన్ దగ్గరికి పరిగెత్తాడు మరో అనుచరుడు.

•••

'ఎవడ్రా అక్కడ? ఎవడ్రా?' పెద్ద కంఠంతో తన అనుచరుడు ఒకతన్ని పిలిచాడు ఘనీసుల్తాన్.

పిలుపు తన నోటి నుంచి వెలువడిన మరుక్షణం మహావేగంతో వచ్చి ఎదుట నిలబడవలసిన ఆ అనుచరుడు అతి నెమ్మదిగా వచ్చి అల్లంత దూరంలో నిలబడటం ఆశ్చర్యం కలిగించింది అతనికి.

తను మారదట!

నయనతారకి పొగరు, ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడదన్న బిరుదులు ఉన్నాయి. అవన్నీ ఒట్టి పుకార్లే అంటోంది నయనతార. వాస్తవానికి తను షూటింగ్‌లో అందరితో చాలా సరదాగా ఉంటుందట! తనకు ఎవరైనా గౌరవం ఇవ్వకపోయినా, మర్యాదగా ప్రవర్తించకపోయినా వారితో దురుసుగా ప్రవర్తిస్తానే తప్ప అందరితో కాదంటూ వివరణ ఇచ్చుకుంది. సెట్‌లో తనెలా ఉంటాననే విషయం తనతో పనిచేసే వారందరికీ తెలుసునని కూడా చెబుతోంది. గతంలో తనకు చాలా మంది స్నేహితులు ఉండేవారనీ, కానీ ఇప్పుడు ఆ స్నేహాలన్నీ కట్ చేసేశాననీ అంటోంది. గత అనుభవాలే తనను ఇలా మార్చాయని కూడా చెప్పుకొచ్చింది.

'ఏమిటి విశేషం? గుడారం దగ్గర ద్రాక్షరసం కాకుండా ఇంకేమైనా ఎక్కువగా పుచ్చుకున్నావా?' కోరగా చూస్తూ అడిగాడు.

అర్జంటుగా తల అడ్డం తిప్పాడు అతను.

'అందరినీ పిలువ్. రహంతుల్లా సాబ్ ఆజ్ఞ అయింది. సిటీ అంతా గాలించి తెల్లవారేలోపు ఆయన పని పూర్తి చేయాలట' అన్నాడు ఘనీ సుల్తాన్.

ఆనందంగా తల ఊపి వెంటనే వెనక్కిపోవాల్సిన ఆ అనుచరుడు శిలా విగ్రహం మాదిరి అక్కడే నిలబడి పోవటం అతనికి ఆశ్చర్యాన్ని అధికం చేసేసింది.

'ఏమిటి? ఏమైంది నీకు?' పళ్ళు బిగపట్టి అడిగాడు.

'ఒక్కసారి వెనక్కి వచ్చి చూడాలి' అతనికి మాత్రమే వినబడేటట్లు అతి చిన్నగా చెప్పాడు ఆ అనుచరుడు.

అసహనంగా నిలబడి ఉన్నాడు రహంతుల్లా దగ్గర్నించి వచ్చిన మనిషి. 'రహంతుల్లాసాబ్ ఆజ్ఞల్ని వెంటనే అమలు పరుస్తామని చెప్పండి. మీరు వెళ్ళండి. నా వాళ్ళందర్నీ కూడగట్టుకుని మీ వెనుకే వచ్చేస్తాను' అంటూ అతనికి చెప్పి పంపించాడు ఘనీసుల్తాన్. రహంతుల్లా మనిషి తన వెహికల్ ఎక్కి దూరంగా వెళ్ళిన తర్వాత, ముందు తన అనుచరుడు దారి చూపిస్తుండగా, తమ స్థావరం వెనుక భాగంలోకి పోయాడు.

చిన్నసైజు రేకుల కట్టడం ఒకటి ఉన్నది అక్కడ. ఆ కట్టడంలో కూర్చుని ఉన్న జాబిల్లి వెంటనే కనిపించింది అతనికి.

'రహంతుల్లా దగ్గర్నించి తప్పించుకుని, మహాసుల్తాన్ దగ్గరికి కాబోలు పరిగెత్తుతోంది. మంచి అవకాశమనిపించింది. వెంటనే పట్టేసుకున్నాం' అరిచి కేకలు పెట్టకుండా జాబిల్లి నోటిని తన తలపాగాతో అదిమిపట్టుకున్న అనుచరుడు ఆనందంగా చెప్పాడు ఘనీసుల్తాన్‌కి.

ఆ సన్నివేశాన్ని ఎలా అన్వయించుకోవాలో, అర్థం చేసుకోవాలో తెలియనట్లు స్థాణువై పోయాడు ఘనీసుల్తాన్.

'ఈ పిల్ల కోసం వెర్రిగా సిటీలో తిరుగుతున్నాడు రహంతుల్లా. పిచ్చిపట్టినట్టు ప్రతివారిని, ప్రతి ఇంటిని గాలించబోతున్నాడు. ఈ పిల్లని మన దగ్గర ఉంచుకున్నట్లు తెలిస్తే తన సైనికుల్ని మన మీదికి ఉసికొల్పుతాడు. రహంతుల్లా అంటే సైతాన్‌కి ప్రతి రూపం రాక్షసుడు', ఎంతో ప్రయత్నం మీద తన కంఠాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుంటూ అన్నాడు.

'ఈ పిల్లకి తెలిసిన ఆ నిధి రహస్యం మనకి తెలిస్తే, అతని దగ్గర ఉన్న బలగం కంటే రెట్టింపు బలగాన్ని మనం సంపాదించుకోవచ్చు. అతన్ని, అతనితోపాటు ఆ మహాసుల్తాన్‌ని ఓడించి జుబ్బా రాజ్యాన్ని నువ్వే పరిపాలించవచ్చు. ఇప్పటివరకూ ఒక్క పేరులోనే నువ్వు సుల్తాన్‌వి'. ఆ నిధి దొరికితే నిజంగానే సుల్తాన్‌ని అయిపోతావ్" హుషారుగా చెప్పాడు ఆ అనుచరుడు.

అతని మాటల్లో యదార్థం ఘనీసుల్తాన్ మెదడుకు బాగా అర్థం అయింది. అప్పటికప్పుడు ఆలోచించి, తల ఊపేశాడు అతను.

'ఈ పిల్ల మన దగ్గరున్నట్టు చిన్న అనుమానం కలిగినా రహంతుల్లా నన్ను, మిమ్మల్ని కూడా బ్రతకనివ్వడు. మీలో నలుగురు కలిసి ఈ పిల్లని వెంటనే కొండల దగ్గరికి తీసుకెళ్ళిపోండి. నేను రహంతుల్లా సాబ్‌తో సిటీ అంతా గాలించి, తీరికగా వస్తాను. రెండో కంటి వాడికి తెలియకుండా ఆ నిధిని మనం చేజిక్కించుకుందాం' అన్నాడు.

అప్పటికప్పుడు మూడు ఒంటెల్ని ప్రయాణానికి సిద్ధం చేశారు అతని అనుచరులు. కాళ్ళు చేతులు బంధించి, శబ్దం చేయకుండా నోటికి ఒక వస్త్రాన్ని అడ్డుగా కట్టిన జాబిల్లిని ఒక ఒంటె మీదికి ఎక్కించి, ఒక అనుచరుడు ఆమె వెనుక కూర్చున్నాడు. మిగిలిన ఒంటెల మీద సర్దుకున్నారు మరో ముగ్గురు.

'వెళ్ళిపోండి. ఎవరికంటా పడకుండా మాయమైపోండి. కొండల్లో మీరు ఎక్కడ మకాం పెట్టిందీ మీలో ఒకరు వచ్చి నాకు చెప్పండి' ఆర్డర్ ఇచ్చాడు ఘనీసుల్తాన్.

ఒంటెలు ఆ ఏరియాలో ఉన్న మూడు బిల్డింగ్‌లను దాటి ఎడారిలోకి పోయిన తర్వాత, మిగిలిన తన అనుచరులందరినీ వెంట బెట్టుకుని, రహంతుల్లా దగ్గరికి బయలుదేరాడు ఘనీ సుల్తాన్.

●●●

తూర్పుదిక్కు తెల్లబడటానికి సరిగ్గా ఒక గంట ముందు స్వాధీనంలోకి వచ్చాయి జాబిల్లి క్రియేట్ చేసిన మంటలు.

ఎడారి మీది నుంచి విసురుగా వీచిన గాలుల మూలంగా వాటిని వెంటనే నియంత్రించటం అసాధ్యమైపోయింది ఘాడీ పట్టణంలో ఉన్న ఫైర్ డిపార్ట్‌మెంట్ వారికి.

అష్టకష్టాలు పడి ఆఖర్లో సక్సెస్ అయ్యారు వాళ్ళు. పన్నెండు పెద్ద పెద్ద భవనాలు, పాతికకు పైగా చిన్నచిన్న కట్టడాలు సర్వనాశనం అయిపోయాయి.

అప్పటి వరకు జాబిల్లిని బంధించి ఉంచిన చెక్కలకట్టడం కూడా నాశనం అయిపోయిన వాటిలో ఉండటం వల్ల, తన అనుచరులతో కలిసి వీధుల్లోనే ఉండిపోయాడు రహంతుల్లా.

తన సోదరుడికి అనుమానం రాకుండా ఎడారిలోనే నిలబెట్టి ఉంచిన తన సైనికుల్ని సిటీలోకి రప్పించాడు అతను.

బరిశెలు, బాణాలు మొదలుకుని, అత్యంత ఆధునికమైన రైఫిల్స్ ఉపయోగించటంలో ట్రెయినింగ్ పొందిన వాళ్ళు ఆ సైనికులు. మొత్తం నూట నలభై మంది ఉన్నారు.

ఘనీసుల్తాన్ వెంట బెట్టుకు వచ్చిన రఫ్ క్యారెక్టర్స్‌తో కలిసి సిటీలోని ప్రతి ప్రదేశాన్ని వడబోసి వదిలాడు రహంతుల్లా. సూర్యుడు తూర్పు దిక్కున ప్రత్యక్షం అవుతున్న సమయంలో పూర్తి అయింది ఆ గాలింపు.

'లాభం లేదు రహంతుల్లా సాబ్. ఆ పిల్ల మంటల్లో పడి మాడిపోయైనా మాడిపోయి ఉండాలి. లేదా ఎవరి సహాయంతోనో ఎడారిలోకి పారిపోయి ఉండాలి. ఈ రెండింటిలో ఏది జరి

అతగాడితో అనుష్క చేస్తుందా?

అనుష్క ఏదైనా ఒక సినిమా చేసే విషయంలో ఎక్కువగా కథ గురించి తప్ప దర్శకనిర్మాతలు, హీరో గురించి పట్టించుకోదంటారు. అలాంటిది ఇప్పుడు ఓ వ్యక్తితో అనుష్క సినిమా చేస్తుందా లేదా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు కోలీవుడ్ జనాలు. ఆ వ్యక్తి మరెవరో కాదు లారెన్స్. 'రెబల్' షూటింగ్ సమయంలో అనుష్క, లారెన్స్ మధ్య గొడవ జరిగి అనుష్క ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకుంది. ఇప్పుడు కన్నడంలో మంచి విజయం సాధించిన 'శివగంగ' సినిమాని తిరిగి వీరిద్దరితో కలిసి పి. వాసు 'చంద్రముఖి 2'గా తీయాలని భావిస్తున్నారట! అయితే గతంలో లారెన్స్‌తో ఉన్న గొడవల కారణంగా అనుష్క ఈ సినిమా చేస్తుందా? లేదా? అన్న అనుమానం తలెత్తుతోంది. ఈ విషయంలో అనుష్కను ఇంత వరకూ ఎవరూ సంప్రదించలేదట!

గినా ఆమెను మనం తిరిగి పట్టుకోవడం అసాధ్యం. అసంభవం' స్పష్టమైన మాటలతో చెప్పాడు ఘనీ సుల్తాన్.

'ఈ మాటలు నిజమే హుజూర్. ఎడారిలోకి పారిపోయి ఉంటే వెతికి పట్టుకోవడం మనకి సాధ్యం కాదు. ఎందుకంటే మీ సోదరుడు ఇప్పుడు ఎడారిలోనే ఉన్నాడు' అన్నాడు రహంతుల్లా అను చరుడు.

జాబిల్లిని పట్టుకురావటానికి తాను పడిన పాట్లన్నీ గుర్తుకువచ్చి, ఎండ తగిలిన బండ రాయి మాదిరి నల్లగా కమిలిపోయింది రహం తుల్లా వదనం.

'జుబ్బా సింహాసనం నాకు చెంది తీరాలి. దక్కించుకోవటానికి నేను ఎంతకైనా తెగిస్తాను' పళ్ళు బిగపడుతూ అన్నాడు.

'నిజమే హుజూర్. మీ పట్టుదల ఎటు వంటిదో మాకు తెలుసు. కాని ఇప్పుడు చేయగలి గింది ఏముంది? తిరుగుబాటు చేయాలంటే ఇప్పుడున్న ఈ బలగం సరిపోదు. ఇంకా కావాలి.



అందుకు ధనం అవసరం. అది లభించే అవ కాశం చేజారిపోయింది' చిన్న కంఠంతో అనున యించటానికి ప్రయత్నించాడు ఆ అనుచరుడు.

ఆ మాటలతో తను కూడా ఏకీభవిస్తున్నట్లు తల ఊపుతూ, ఉన్నట్లుండి చిటికెవేసి, తొడను బలంగా చరిచాడు రహంతుల్లా. అప్పటివరకూ విపరీతమైన నిరాశతో వడిలిపోయి ఉన్న అతని వదనం ఒక్కసారిగా వెయ్యి కాండిల్ బల్బు మాదిరి ప్రకాశించడం మొదలు పెట్టింది.

అతని దగ్గరనించి పారిపోతున్న పిల్లను తన అనుచరులు పట్టుకున్న విషయం అతనికి తెలిసి పోయిందేమోనన్న అనుమానం వెంటనే కలి గింది ఘనీసుల్తాన్‌కి.

'మీకు ఏదో ఆలోచన వచ్చినట్టుంది. అది ఏమిటో మాకు కూడా చెబితే సంతోషిస్తాం' తన భయాన్ని కప్పి పెట్టుకోవటానికి ప్రయత్నం చేస్తూ అన్నాడు.

'మంటలకు బెదిరి ఎడారిలోకి పారిపోయాడు మా సోదరుడు. వెంట కేవలం పదిమంది బాడీ గార్డులు మాత్రమే ఉన్నారు' అన్నాడు రహం తుల్లా.

'అది పెద్ద సమస్య కాదు సాబ్. ఆయన చిటికె వేస్తే ఈ సిటీలో నుంచి వెయ్యిమంది వెళ్ళి ఆయన ఎదుట నిలబడతారు అన్నాడు ఘనీ సుల్తాన్. చిటికె వేస్తే వెళ్ళి ఎదుట నిల్చుంటారా? మరి చిటికె వేయకపోతే? ఆయన ఎప్పైపోయాడో ఎవరికీ తెలియదు కదా అంటూ దూరదూరంగా నిలబడి ఉన్న సైనికులకు సైగ చేశాడు రహం తుల్లా.

'కదలండి అందరూ. మహాసుల్తాన్ తిరిగి సిటీలోకి రాకముందే అడ్డుకోవాలి. కదలండి' అంటూ ఆజ్ఞ ఇచ్చాడు.

హాయిగా నిలబడి తాపీగా నెమరు వేసు కుంటున్న తమ ఒంటెల్ని అధిరోహించారు సైని కులు.

'దారి చూపించు ఘనీసుల్తాన్. నా సోద రుడు ఎటునుంచి ఎటు వెళ్ళాడో నా సైనికులకు వివరించి చెప్పు' అంటూ ఘనీసుల్తాన్‌ని ఆదే శించాడు రహంతుల్లా.

అయిష్టంగానే కదిలాడు ఘనీసుల్తాన్. పావు గంట తరువాత మహాసుల్తాన్ తన బాడీ గార్డు లతో కలిసి ఎటుగా వెళ్ళాడో సైనికుల్ని కమాండ్ చేస్తున్న నాయకుడికి వివరంగా చెప్పాడు ఘనీ సుల్తాన్.

●●●

'అగ్నిప్రమాదాలు జరగటం ఆస్తులు నష్టం కావటం, అదృష్టం బాగోలేకపోతే కొన్ని కొన్ని ప్రాణాలు కూడా పోవటం చాలా సహజం. మంటలు కంట్రోల్‌లోకి వచ్చిన తర్వాత తగా దాలు తన్నులాటలు మొదలు కావటం మాత్రం నిజంగా విచిత్రమే...' సిటీ మధ్య భాగంలో ఉన్న ఒయాసిస్సు అంచుదగ్గిర ఒక ఖర్జూర చెట్టు కింద కూర్చుని, చిన్నగా కామెంట్ చేశాడు నఫీజు.

మంటలు ఎవరికీ స్వాధీనపడకుండా పెట్రేగి పోతున్న సమయంలోనే సిటీలోకి వచ్చారు వారి ద్దరూ. వీధుల వెంట బ్లడ్‌హౌండ్స్ మాదిరి తిరు గుతున్న జనాల్ని చూసి ఆశ్చర్యపడ్డారు.

నఫీజుని ఒక వీధిలో వదిలి తాను ఒక్కడే మంటల బారిన పడిన భవంతుల దగ్గరికి వెళ్ళి వచ్చాడు శ్యామ్‌సుందర్.

'జుబ్బా చక్రవర్తి మహాసుల్తాన్‌కి సోదరుడు రహంతుల్లా తన సైనికుల్ని వెంట బెట్టుకుని ఎవరో అమ్మాయికోసం వీధి వీధినా గాలిస్తున్నాడు' తాను తెలుసుకున్న మాటను అతని చెవిన వేశాడు.

'ఈ సిటీలో ఎవరైనా ఒక అమ్మాయికోసం వెతుకులాట మొదలు పెట్టారంటే, అది డెఫి నెట్‌గా మన జాబిలమ్మకోసమే అయివుంటుంది. రమేష్ సాబ్‌లో ప్రవహించే రక్తమే ఆమెలో కూడా ఉంటుంది. అవకాశం దొరికితే తిరగబడే తత్వం. మొండితనం మహా అధికం' అన్నాడు నఫీజు.

రమేష్ పద్ధతుల్ని అతను వర్ణించిన విధానం శ్యామ్‌సుందర్‌కి నవ్వు తెప్పించింది.

మొండి ఘటాల్లో మొదటి రకం అతను. తాను ఏదైనా చెయ్యదలుచుకుంటే, ఎటువంటి ఇబ్బంది ఎదురైనా వెనుకంజ వేయటం ఎలాగో తెలియని మనిషి.

ఆ లక్షణాలే జాబిల్లికి కూడా వచ్చి ఉంటాయి. రహంతుల్లా గాలిస్తున్నది ఆమె కోసమే అయి ఉంటే...ముక్కుముఖం తెలియని వాళ్ళు చెప్పిన మాటల్ని బట్టి ఒక నిర్ణయానికి రావటం శ్యామ్ సుందర్‌కి ఎప్పుడూ అలవాటు లేదు.

'ఇప్పుడు సిటీలో జరుగుతున్న గాలింపు గొడ వకు కారణం మన జాబిల్లి అయితే, కచ్చితంగా మనం తెలుసుకోవల్సిన విషయం అవుతుంది అది'.

'పూర్తి వివరాలు తెలియకుండా మనం కూడా ఎంక్వయిరీలు ప్రారంభిస్తే మళ్ళీ చిక్కుల్లో పడతాం' అని కూడా చెప్పాడు నఫీజుకి.

'అదో పెద్ద సమస్య అయినట్లు మాట్లాడకండి సాబ్. నేను వెళ్ళి తెలుసుకు వస్తాను' అంటూ శ్యామ్‌సుందర్‌ని ఆ సందులో నిలబెట్టి, ఈసారి తాను వీధుల్లోకి పోయాడు నఫీజు.

తగలబడుతున్న బిల్డింగ్స్ దగ్గరికిపోలేదు. తగల బడుతుందేమోనని అందరూ భయపడు తున్న భవంతి ముందు నిలుచున్నాడు.

'దెబె మొఖంతో దిగాలుగా చూస్తావేమిటి? నీళ్ళ బక్కెట్‌తో సిద్ధంగా నిలబడు. అవసరం అయితే వెంటనే బిల్డింగ్ మీద నీళ్ళు వెదజల్లాలి' పది నిమిషాల పాటు చూసి, చూసి, అతన్ని హెచ్చరించాడు ఆ భవనానికి సంబంధించిన సెక్యూరిటీ గార్డు ఒకతను.

అతను తన ముందుకు జాచిన బక్కెట్ తీసు కుని, భవనం పక్కనే ఉన్న చిన్న ఆర్టిఫీషియల్ కొలనులో నీళ్ళు ముంచుకు వచ్చాడు నఫీజు. 'మనం మంటల్ని ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నాం. మరి వాళ్ళెవరు? ఎందుకలా అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు?' అని అడిగాడు కొంతమందిని చూపిస్తూ.

(ఇంకావుంది)

సురభి

సాగర కన్య

'సాహసవీరుడు సాగరకన్య' సినిమాలో సాగరకన్య పొరపాటున మనుషుల మధ్యకు వచ్చి కొన్నాళ్ళు మనిషిలా జీవిస్తుంది. కాని ఈ స్కాట్‌లాండ్ అమ్మడు మాత్రం నిజంగా సాగర కన్య కాకపోయినా, సాగరకన్యను తలపిస్తోంది. అంతేకాదు, దాంట్లోనే తన జీవనోపాధిని వెతుక్కుంది.

స్కాట్లాండ్, క్లైడ్‌బ్యాంక్‌కు చెందిన మెలనీలాంగ్‌కు తన చిన్ననాటి కలలన్నీ సాగరకన్య చుట్టూనే తిరిగేవట! పెద్దయ్యాక నువ్వేమవుతావని అడిగితే సాగరకన్య అని బదులిచ్చేదట! ఆ కోరిక తీర్చుకునేందుకు రకరకాలుగా ప్రయత్నించిందామె. ఐదు సంవత్సరాల క్రితం స్కూబా డైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేయడానికి థాయ్‌లాండ్ వెళ్ళినప్పుడు ఆమెకు థాయ్ చిల్డ్రన్ చారిటీతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయమే ఆమె సాగరకన్యలా మారడానికి తోడ్పడింది. పిల్లల కోసం చారిటీ వారు ఓ పెద్దవిందు ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమయ్యారు. సాగరకన్యలా నటించి విందులో పిల్లల్ని ఉత్సాహపరిచేవారు కావాలని వారు ఇచ్చిన యాడ్ చూసి వెంటనే మెలనీ తన చిన్ననాటి కల నెరవేర్చుకోడానికి బయలుదేరింది. ఆ ప్రోగ్రామ్‌కి సెలక్టయి ఇక దాన్నే తన వృత్తిగా మార్చుకుంది. సాగరకన్యలా కనిపించడానికి ధరించే దుస్తులను స్వయంగా ఆమే తయారుచేసుకుంది. అందుకు ఆమెకు దాదాపు సంవత్సర కాలం పట్టిందట. తన ఉచ్ఛ్వాసనిశ్వాసలకు అనుగుణంగా తను డ్రెస్సును డిజైన్ చేసుకుంది. ఇప్పుడు పార్టీలు, విందులు, పెళ్ళిళ్ళు పబ్బాలలో మెలనీయే ఒక స్పెషల్ ఎట్రాక్షన్‌గా మారింది.

చూడతరమా!

రంగురంగుల దుస్తులు, రకరకాల హెయిర్‌స్టైల్స్‌తో ముస్తాబైన ఆ శునకాలను చూసేందుకు రెండు కళ్ళూ చాలవేమో! ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో క్రఫ్ట్ డాగ్ షోలో కళ్ళకు కట్టిన దృశ్యమిది. ఇందులో 49 దేశాల ఉత్సాహవంతులు తమ పెంపుడు శునకాలను అందంగా ముస్తాబు చేసి మరీ ప్రదర్శించారు. దాదాపు 22 వేల శునకాలు ఈ షోలో సందడి చేశాయి. అంతేకాదండోయ్, క్యాట్‌వాక్ తరహాలో ఇవన్నీ డాగ్‌వాక్ కూడా చేశాయట. జంతు ప్రేమికులు సెల్ఫీలు తీసుకుంటూ ఎంతో ఉత్సాహంగా ఈ ప్రదర్శనను వీక్షించారు. 1891లో మొదటిసారి ఈ క్రఫ్ట్ డాగ్ షో ఏర్పాటు చేశారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద డాగ్ షో. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన శునకానికి 'బెస్ట్ ఇన్ షో' టైటిల్‌ను కూడా అందిస్తారు. ట్రిమ్‌గా తయారైన శునకాలను చూస్తే భలే ముచ్చటేస్తుంది కదూ!

దిష్టి బొమ్మల గ్రామం!

ఆ గ్రామంలోకి అడుగుపెట్టగానే దిష్టిబొమ్మలు స్వాగతం పలుకుతాయి. ఊళ్ళో ఎక్కడ చూసినా దిష్టిబొమ్మలే దర్శనమిస్తాయి. ఇదేదో దయ్యాల గ్రామం అనుకునేరు? కానేకాదు. గ్రామ ప్రచార నిమిత్తం ఏర్పాటు చేసిన బొమ్మలివి. ఈ దిష్టిబొమ్మల కథాకమామీషు తెలుసుకోవాలంటే జపాన్ వెళ్ళాల్సిందే!

జపాన్‌లోని సేకీ జిల్లాలోని ఓకూహరీమా గ్రామంలో టోపీలు పెట్టుకుని నవ్వుతున్న దిష్టిబొమ్మలు ఉంటాయి. ఈ గ్రామానికే 'ప్రజల భయం' అనే పేరు కూడా ఉంది. వీటిని మసాటో ఒకావే అనే వృద్ధుడు తయారుచేసి గ్రామంలో అనేక ప్రదేశాల్లో ఉంచాడు. పొలంలో పనిచేస్తున్నట్లు, బస్సు కోసం వేచి చూసే ప్రయాణికులుగా, బండి లాగుతున్నట్లుగా...ఇలా రకరకాల జీవన భంగిమల్లో మనుషుల్లా కనిపించే దిష్టిబొమ్మలను ఏర్పాటు చేశాడు. ఇదంతా ఎందుకు అంటే ఆ ఊరినుంచి జీవనోపాధి కోసం పట్టణాలకు వలసలు పెరిగిపోయాయట! ఇకమీదట గ్రామం నుంచి ఎవరూ బయటకు వలస వెళ్ళనవసరం లేకుండా ఈ దిష్టి బొమ్మల్ని ఏర్పాటు చేసి, దాన్నొక పర్యాటక ప్రదేశంగా మార్చాడు మసాటో ఒకావే. దీనివల్ల ఆ గ్రామానికి పర్యాటకుల తాకిడి మొదలైందట! క్రమంగా పర్యాటకుల సంఖ్య పెరగడమే కాదు, దాంతో జీవనోపాధి పెరిగింది, గ్రామానికి ఎనలేని పేరుప్రఖ్యాతులు కూడా వచ్చాయని ఆ గ్రామస్థులంతా తెగ మురిసిపోతున్నారు.

అశ్వ చికిత్స

నవ్వు నాలుగు విధాల చేటు అంటారు పెద్దలు. నవ్వు ఆరోగ్యానికి మేలు అంటారు వైద్యులు. ఇదే కాన్సెప్ట్ మీద అమెరికాలోని ఓ హాస్పిటల్‌వారు రోగుల ఆనందం కోసం ఓ చిన్న గుర్రాన్ని తీసుకొచ్చి విన్యాసాలు చేయిస్తున్నారు.

అమెరికా, న్యూయార్క్ నగరంలోని క్రావిస్ అనే పిల్లల ఆసుపత్రికి ఓ బుల్లి అశ్వాన్ని తీసుకొచ్చారు. దాన్ని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లల దగ్గరకు తీసుకు వెళ్ళారు. ఆ బుల్లి అశ్వం రకరకాల విన్యాసాలు చేయడం మొదలెట్టింది. అవి చూసి పిల్లల ఉత్సాహం చెప్పనలవి కాదు. ఇలా పిల్లలు ఉత్సాహంగా, ఆనందంగా ఉంటే, వారి వ్యాధులు త్వరగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వైద్యుల అభిప్రాయం. దాంతో వారీ పద్ధతికి శ్రీకారం చుట్టారు. పిల్లల కోసం మొదలెట్టిన ఈ అశ్వ చికిత్స ఇంకా బాగా పనిచేయాలని కోరుకుందాం.

-నర్మద వాసిరెడ్డి

జయమ్ము నిశ్చయమ్మురా భయమ్ము లేదురా..

“అపజయాలన్నింటినీ అవకాశాలుగా భావించి ముందుకు సాగాలంటే ఒక్కటేమార్గం. అదే ఆత్మ విశ్వాసం.”

-అంబేద్కర్

ఆత్మవిశ్వాసం, ప్రయత్నం, పట్టుదల ఉంటే ఇసుక నుంచి కూడా నూనె తీయొచ్చు. అలాంటి పట్టుదలతోనే ఎందుకూ పనికిరాని బీడు భూముల్ని కాసులు కుమ్మరించే భూములుగా మార్చాడు ఓ కుర్రాడు. 'యూత్ ఐకాన్ ఆఫ్ బీహార్'గా ప్రభుత్వం నుండి గుర్తింపు పొందాడు. బీహార్‌లో వెనుకబడ్డ గయ జిల్లాకు చెందిన అంకిత్ కుమార్ ఈ అద్భుతం సాధించాడు. గయ జిల్లాలో కొత్వాడా అనే పల్లెటూరు అంకిత్‌ది. కొడుకు ఇంజనీర్‌గా కుటుంబాన్ని పేదరికం నుండి బయట పడేస్తాడని తండ్రి ఆశ. ఏదో ఒకటిచేసి తన ఊరి వాళ్ళందరినీ పేదరికం నుండి బయట పడేయాలన్నది అంకిత్ ఆలోచన. ఇంజనీరింగ్ చదివాక కార్పొరేట్ ఉద్యోగాల గురించి కలలు కనటం మాని, ప్రభుత్వ పథకాల అధ్యయనం ప్రారంభించాడు. బయోడీజిల్ మొక్కల సాగు ప్రోత్సాహానికి 270 కోట్లు కేటాయించారనే వార్త చదివి బీడు భూముల్లో బయోడీజిల్ పెంపకం గురించి వివరాలు సేకరించాడు. బీడు భూముల్లో ఈ మొక్కల పెంపకం చేపడితే ఎలా ఉంటుంది? అని ఆలోచించాడు. కాని చేతిలో డబ్బులేదు. దారి చూపించే వాళ్ళూ లేరు. వ్యాపార మెళకువల కోసం ఎం.బి.ఎలో చేరాడు. కాలేజీలో చేరి తన ఆలోచనలకు శ్రీకారం చుట్టాడు. 'గ్రీన్ లీఫ్ ఎనర్జీ' పేరుతో కంపెనీ ప్రారంభించి తన ఊరికి దగ్గర్లో భూమిని లీజుకి తీసుకున్నాడు. ఆర్నెల్లలో లక్షా పాతిక వేల మొక్కల్ని పెంచాడు. కాలేజీ యాజమాన్యం అతనికి ముఖ్యమంత్రి నితీష్‌తో అపాయింట్‌మెంట్ ఇప్పించడం, ఆయన ప్రోత్సహించడం జరిగింది. వ్యవసాయ పనులు లేనప్పుడు ప్రజలు వలస వెళ్ళకుండా నిరంతరం పని ఉండే బయోడీజిల్ ఉత్పత్తులకు వినియోగించే మొక్కల పెంపకం మొదలెట్టించాడు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద ప్రభుత్వం చేయూతనిచ్చింది. ఏడాది తిరిగేసరికి 100 పంచాయతీలకు ఈ పథకం విస్తరించింది. మూడేళ్ళలో సంస్థ టర్నోవర్ 30 కోట్లకు చేరింది. అంకిత్ మొదలుపెట్టిన జీవ ఇంధన ప్రాజెక్టు 50 పాళ్ళ రైతులకు ఉపాధి అందిస్తోంది. అతని ఆత్మవిశ్వాసానికి, ప్రయత్నానికి మెచ్చి 'యూత్ ఐకాన్ ఆఫ్ బీహార్'గా ప్రభుత్వం ప్రకటించింది.

'ఆత్మవిశ్వాసం ఉంటే అద్భుతాలు సృష్టించవచ్చు' అందుకు అంకిత్ మంచి ఉదాహరణ.

ప్రత్యేకంగా

ఆత్మవిశ్వాసం ఉన్న వ్యక్తులు ఎంతమందిలో ఉన్నా ప్రత్యేకంగా కన్పిస్తారు. చూడటానికి చాలా ఈజీ గోయింగ్ వ్యక్తుల్లా కన్పిస్తారు. కానీ వాళ్ళు ఏ పని చేపట్టినా, అది ఎవరూ చేపట్టనిదై ప్రత్యేకంగా ఉంటుంది. ఆత్మవిశ్వాసంతో కూడినదై ఉంటుంది. అలాంటి వారు చేసే పని ప్రణాళికతో, చిత్తశుద్ధితో నిజాయితీగా చేస్తారు. కాబట్టే కచ్చితంగా విజయం సాధిస్తాం అని చెప్పి మరీ విజేతలవుతారు. శ్రమకి వెనుకంజ వెయ్యటం, డిగ్నిటీ ఆఫ్ లేబర్ వంటి వాటికి దూరంగా ఉంటారు.

“అందరూ అరటిపండ్లు అమ్మేచోట, నేను నారింజపండ్లు అమ్మటానికి ఇష్టపడతా. అందుకే నేను నా చిత్రాలకి విభిన్నమైన కథలు ఎంచుకుంటా” అంటారు ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళి. అదే ఆయన ఆత్మవిశ్వాసం.

రిస్కు తీసుకునే సామర్థ్యం

ఏ పని మొదలుపెట్టినా అందులో ఎంతో కొంత శ్రమ, రిస్కు, పోరాటం ఉంటాయి. అలా ఎదురొచ్చే అడ్డంకులను పని ద్వారానే పక్కకి తప్పించాలనే కోరిక, శక్తి, ధైర్యం ఉండాలి. విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యంతో ఎవరైతే కష్టనష్టాల్ని అధిగమించగలరో వారినే విజయం వరిస్తుంది.

సహజంగా ఉండండి

కొంతమంది ఏ పని మొదలుపెట్టినా అందులో మమేకమైపోతారు. గెలుపు ఓటములు, లాభనష్టాల గురించి ఆలోచించకుండా కర్తవ్య నిర్వహణలో మునిగిపోతారు. అది ఆత్మవిశ్వాసంతో కూడిన నమ్మకం. నమ్మిన పనిని మనస్ఫూర్తిగా చేసుకుంటూ వెళతారు. ఇలాంటి వ్యక్తులు ఇతరుల మీద ఆధారపడరు. అలా సహజంగా ఉన్నప్పుడే అందరూ మనల్ని అంగీకరిస్తారు. మన శ్రమని గుర్తిస్తారు. ఇలాంటి వారు ఎవరికోసమో తాము నమ్మిన దానిని సగంలో వదిలిపెట్టరు. కాంప్రమైజ్ కారు.

సరిగ్గా అలాంటి కుర్రాడే ఎర్నెస్టో. వయసు పదేళ్ళలోపే. చిన్న గ్లాసులో మాతె (టీ లాంటి ద్రవం) పోసుకుని, ఒక గది నుండి మరోగదిని దాటటానికి ప్రయత్నిస్తున్నాడు. రెండు గదుల మధ్య చిన్న కాలువ ఉంది. ఎర్నెస్టో కాలువ దాటబోయి బోర్లాపడ్డాడు. గ్లాసులోని ద్రవం నేలపాలయింది. ఎర్నెస్టో మళ్ళీ లేచి గ్లాసులో మాతె

విజయ విలాసం

స్టెప్స్ టు సక్సెస్

14

-ఎం. వెంకటేశ్వరరావు, సెల్: 90307 07037

నింపుకుని మళ్ళీ కాలువ దాటబోయి, కింద పడటం, ఇలా పది పన్నెండుసార్లు చేస్తూనే ఉన్నాడు. చివరికి మాతె నింపి ఉన్న గ్లాసుతో కాలువ దాటటం నేర్చుకున్నాడు. అదీ ఆత్మ విశ్వాసం, పట్టుదల. ఎర్నెస్టో మరెవరో కాదు మనకు తెల్సిన పోరాట యోధుడు చెగువెరా.

సుఖాలు త్యజించాలి

కష్టపడకుండా ఇంట్లో కూచుని కలలుగంటూ ఉంటే వచ్చి ఒళ్ళో వాలేదికాదు 'విజయం'. కష్టపడ టానికి ఇష్టపడని వాళ్ళు ఎప్పుడూ ఎవరో ఒకరిని నిందిస్తూ ఉంటారు. విధి, దేవుడు వంటి వాటి మీద బాధ్యత నెట్టేస్తారు. తమ సుఖాలకి భంగం కలగకుండా, బాధ్యత నిర్వర్తించకుండా, హక్కును మాత్రం వాడుకుంటుంటారు. ఆత్మవిశ్వాసం లోపిం చిన వాళ్ళే ఇలా సుఖాలకు అలవాటుపడి, విజ యానికి దూరమవుతుంటారు.

నిర్ణయాధికారం మీదే!

గొప్పవ్యక్తులు తమ భావాల్ని ఇతరులతో పదే పదే చర్చించరు. మెదడుతో ఆలోచిస్తారు. మన అభిప్రాయాలు, ఆలోచనలపై నిర్ణయాధికారం మనదే అయ్యుండాలి. సామాన్యులు మాత్రమే చిన్నచిన్న విషయాల్ని కూడా పదిమందితో చర్చించాకే నిర్ణయాలు తీసుకుంటారు. మన నిర్ణయం ఇతరుల వద్దకు చేరితే, నిర్ణయాన్ని నిర్వీర్యం చేసి వాళ్ళు మిమ్మల్ని శాసించడం మొదలెడతారు. నిర్ణయాన్ని మీ చేతుల్లో, చేతల్లో ఉంచుకోవడం ఆత్మవిశ్వాసం అవుతుంది.

విమర్శ పట్టించుకోవద్దు

కొంతమంది స్నేహితులు, బంధువులు, సన్ని హితులు ఎదుటివారు చేసే పనిలో లోపాలు వెతకటం, విమర్శించటమే ధ్యేయంగా పెట్టు కుంటారు. ఇలాంటి వారికి ప్రతి రోజూ చెడ్డ రోజే. అన్నీ సవ్యంగా ఉన్నా, తప్పులు ఎంచుతారు. అది వాళ్ళ ఆత్మన్యూనత, అసూయ, అజ్ఞానం వల్ల చేసే విమర్శలు. ఆత్మవిశ్వాసం గల వ్యక్తులు ఇలాంటి విమర్శలు పట్టించుకోకూడదు. పట్టించు కుంటే విజయం అక్కడే నిలబడిపోతుంది. సద్వి మర్శ అయితే స్వీకరించాలి. ఆత్మవిశ్వాసం మీద దెబ్బకొట్టే విమర్శ అయితే పట్టించుకోకూడదు.

స్థితప్రజ్ఞత

ఆత్మవిశ్వాసం గల వ్యక్తులు ఎలాంటి సంద ర్భాలు ఎదురైనా చలించరు. సంతోషాన్ని, దుఃఖాన్ని, లాభనష్టాల్ని, జయాపజయాల్ని, దుర లవాట్లకి, పొగడ్తలకి అతీతంగా, పొంగకుండా, కుంగకుండా స్వీయ నియంత్రణతో స్థితప్రజ్ఞులుగా ఉంటారు. దేన్నైనా ధైర్యంగా ఎదుర్కోగల మొక్క వోని ఆత్మవిశ్వాసం కలిగి ఉంటారు. ఎదురొచ్చిన నష్టాల్ని, చేయిజారిపోయిన విజయాన్ని గురించి ఆలోచించరు. వాస్తవాన్ని యథాతథంగా అంగీ కరించి, మరుక్షణమే విజయం కోసం ప్రయత్నాలు మొదలెడతారు.

ఇతరులతో పోల్చుకోకండి

ఆత్మవిశ్వాసం మెండుగా ఉన్న వ్యక్తులు తమని తాము తక్కువ చేసుకోరు. ఇతరులతో తమను పోల్చుకోరు. ఎందుకంటే ప్రపంచంలో ప్రతి వ్యక్తికీ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, అలాగే తనకు మరొకరితో పోలికలేని ప్రత్యేకత ఉందని గుర్తించ టమే. అదే ఆత్మవిశ్వాసం. ఇతరులతో పోల్చుకోని వ్యక్తుల్లో విశ్లేషణా సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. నిర్ణయాత్మకమైన ఆలోచనలు, క్రియాశీలమైన నిర్ణ యాలతో ఆత్మవిశ్వాసంతో అనూహ్య విజయాల బాటలో సాగిపోతుంటారు.

సగంలో వదిలెయ్యటం పిరికితనం

చేపట్టిన పనిని సగంలో వదిలెయ్యటం, ఆత్మ విశ్వాసానికి ఆపోజిట్, అదే పిరికితనం. ఒడిదు డుకులకి, విమర్శలకి, అపజయాలకి కుంగిపోతూ, తమని తాము తక్కువ అంచనా వేసుకుంటూ, చేస్తున్న పని సగంలోనే వదిలేస్తారు. లేదా అరకొర విజయాలకి పొంగిపోతారు. స్థిరంగా ఏ పనీ పూర్తి చెయ్యలేరు. నిజమైన విజయాన్ని ఎన్నటికీ పొంద లేరు.

మోటివేట్ మంత్రం

నడి సంద్రంలో మునిగిపోతున్నా తీరం చేర గలనన్న ఆత్మవిశ్వాసం ఉన్న వాళ్ళు కచ్చితంగా తీరం చేరే తీరతారు. ఆత్మవిశ్వాసానికున్న శక్తి అంత బలమైనది. అది ఉన్నవాళ్ళు తమని తామే మోటివేట్ చేసుకుంటారు. పరిసరాలకి, పరిస్థితు లకి, తలొగ్గకుండా మోటివేట్ మంత్రం జపిస్తూ, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వెయ్యటమే గాని వెనుకంజ వెయ్యరు.

ఆత్మవిశ్వాసం విజయానికి సోపానం. విజ యానికి విలాసం. వినయం లేని 'ఆత్మవిశ్వాసం' దర్పం అనిపించుకుంటుంది. ఆత్మవిశ్వాసం విన యానికి మకుటంలో మణిలాంటిది. మనస్ఫూర్తిగా చూపే వినయం 'ఆత్మవిశ్వాసాన్ని' ప్రతిఫలింప జేస్తే, నక్క వినయం వెగటు పుట్టిస్తుంది.

సో, ఘంటసాల వారు పాడినట్టు "జయమ్ము నిశ్చయమ్మురా! భయమ్ము లేదురా! జంకు బొంకు లేక ముందు సాగిపొమ్మురా!..." అలా ముందుకి దూసుకెళ్ళాలంటే 'ఆత్మవిశ్వాసం' మెండుగా ఉండాలి.

"ఇతరులు నిన్ను గౌరవించాలనుకుంటే ముందు నిన్ను నువ్వు గౌరవించుకో. ఆత్మవిశ్వాసం ఉన్నవాళ్ళే తమని తాము గౌరవించుకుంటూ, ఇతరుల్ని గౌరవిస్తారు".

-దాస్తోవ్‌స్కీ

(ఇంకావుంది)

అద్భుతం సాధించాలంటే...

- ఆత్మవిశ్వాసమున్న వ్యక్తిపై జయాపజయాల ప్రభావం అంతగా ఉండదు. నడిచే కొద్దీ మార్గం సులువవుతుందనుకుంటాడు.
- హృదయానికి సంబంధించి వివేకం ఉంటుంది. మేధస్సుకు సంబంధించి ఆత్మ విశ్వాసం ఉంటుంది.
- మనిషిలో ఆత్మవిశ్వాసం అణగారితే దానిని మించిన పేదరికం ప్రపంచంలో మరొకటి లేదు.
- నీ నుదుటిన స్వేదం చిందిననాడే నీపై నీకు విశ్వాసం కలుగుతుంది.
- ఆత్మవిశ్వాసం లేని వాడు పిరికివాడు. అతడు పారిపోవడానికే ప్రయత్నిస్తుంటాడు.
- ఆత్మవిశ్వాసం ఉన్న వాళ్ళకే ఏకాగ్రత ఉంటుంది. అది లక్ష్యాలు సాధించడానికి ఎంతో అవసరం.
- మనం చేసే పని మీద ఎప్పుడైతే మనకు ఆత్మ విశ్వాసం తగ్గుతుందో, అప్పుడే మన ఓటమికి పునాది వేసినట్లే.
- ధీరుడు ఒకేసారి మరణిస్తాడు. పిరికివాడు అనుక్షణం మరణిస్తాడు. ధీరుడి వలె చచ్చి బ్రతకడానికి ఆత్మవిశ్వాసం ఉండాలి.
- ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకోవాలి. అద్భు తాలను సాధించడానికి అదే మూలం.

హేట్సాఫ్

ఆత్మవిశ్వాసానికి మరోపేరు అంబేద్కర్ మహాశయుడు. ఆయన అసలు పేరు భీమ్‌రావ్ రాంజీ అంబావడేకర్. ఆయన తల్లిదండ్రులకు 14వ సంతానం. ఆయన 'మహర్' కులానికి చెందిన వాడని అవమానించే వాళ్ళు. ఆ రోజుల్లోనే సహ నంతో చదువే తన ఆయుధంగా ఎంచుకుని, అందరికంటే ముందుండటమే ధ్యేయంగా నిర్ణ యించుకున్నారు. ఆత్మవిశ్వాసం ఉంటే ఎన్ని అవాంతరాలనైనా అవలీలగా దాటొచ్చని నమ్మాడు. 1908లో మెట్రిక్ పాసయ్యాడు. వాళ్ళ కులంలో మెట్రిక్ పాసయిన తొలి వ్యక్తి ఆయనే. బరోడా మహారాజు అంబేద్కర్ తెలివితేటలకు మెచ్చి స్కాలర్‌షిప్ ఇచ్చేవాడు. 1912లో బి.ఎ. పాస య్యాడు. బరోడా మహారాజు ఉద్యోగం ఇచ్చాడు. అతని కులం విని ఎవ్వరూ ఇల్లు అద్దెకు ఇవ్వలేదు. అయినా నిరుత్సాహ పడలేదు. కుల పిచ్చి నిర్మూ లనకు తన చదువుతోనే సమాధానం చెప్పాలను కున్నాడు. 1913లో అమెరికాలో కొలంబియా యూనివర్సిటీలో చేరాడు. ఎం.ఎ. పూర్తిచేసి, పిమ్మట పి.హెచ్.డి చేసి, లండన్లో బారిస్టర్ కూడా పూర్తి చేశాడు. ఆ తర్వాత బొంబాయి వచ్చి న్యాయ వాద వృత్తిని ప్రారంభిం చాడు. కులాల పేరుతో వెనుకబడిన వారందరికి తగిన స్థానం కల్పిం చాలని నడుం బిగించాడు. అంబేద్కర్‌లో నిండి ఉన్న ఆత్మవిశ్వాసం ఆయన్ని ఆకాశ మంత ఎత్తుకి చేర్చింది. దళితులకు రిజర్వేషన్ల విషయంలో అవిశ్రాం తంగా పోరాడి జయించారు. అలుపెరుగకుండా అనేక పదవులు నిర్వహించాడు. కుల నిర్మూల నపై పుస్తకం రాశాడు. విజయాలు సాధించాడు. నెహ్రూ తన మంత్రివర్గంలో అంబేద్కర్‌కి స్థానం కల్పించి, మన దేశానికి అవసరమైన రాజ్యాం గానికి రూపకర్తని చేశాడు. అందుకే అంబేద్కర్ నేటికీ భారతీయుల మనసులో భారతరత్నగా, ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపంగా నిలిచారు.

హేట్సాఫ్

మా పై ఆఫీసరు ఎవరో వస్తారంటే విశాఖ రైల్వేస్టేషన్‌కు వెళ్ళక తప్పలేదు. ఆ వచ్చే రైలు బాగా ఆలస్య మవుతుందన్న ప్రకటన వెలువడ్డంతో అక్కడే ఉన్న షాపులో ఒక వార పత్రిక కొనుక్కుని తిరగేస్తుంటే, తళుక్కున మెరిసిందామె! ఔను! కచ్చితంగా ఆమే! ఆమెను సులువుగానే పోల్చగలిగాను!

మరెవరో కాదు ఆమె, ప్రాభవి! డిగ్రీలో నాకన్నా రెండేళ్ళు జూనియర్! బహు అందగత్తె! ఏ కోణంలోంచి చూసినా ఆమెలో అందం ఉట్టి పడి ఊరించేది. కాలేజీలో అందరి చూపులూ ఆమె చుట్టూ పరిభ్రమించేవి. సోగకళ్ళు ఆమె అందానికి ప్రాతినిధ్యం వహించేవి. ఏ బట్టలు వేసుకున్నా సరే ఆమె వైపు అందరి చూపులూ చురుగ్గా సాగేవి.

ఓసారి లైబ్రరీలో పుస్తకాల అలమర దగ్గర చూసుకోకుండా నన్ను గుద్దేసింది. నా చేతిలో ఉన్న పుస్తకాలన్నీ జారి పడ్డాయి. గభాలున ఒకే సమయంలో ఇద్దరం కిందకు వంగాం. మళ్ళా మా బుర్రలు రెండూ ఢీకొట్టాయి. 'సారీ' అంటూ ఒకేసారి చెప్పగానే ఆకస్మికంగా జరిగిందానికి ఇద్దరికీ నవ్వొచ్చేసింది. పుస్తకాలు తీసుకుంటుంటే "అయామ్ ప్రాభవి!" చేయందిస్తూ పరిచయం చేసుకుంది. 'అయామ్ హాసన్!' తిరిగి కరచాలనం చేశా!

ఆనందమే అందం

-కె.కె.రఘునందన

అది మొదలు మేమిద్దరం కలుసుకోవడం పరిపాటైంది. నా ఆలోచనల్లో, ఊహల్లో ప్రాభవి నిరంతరం వెన్నాడుతూనే ఉంది. ఎప్పుడు కలిసినా నాలో ఏదో ఒక ప్రత్యేకతను తెలుపుతూ పొగడ్తల్లో ముంచెత్తేది. ఒకసారి నా ఉంగరాల జుత్తు బాగుంటుందంది. అదే నా ముఖానికి అందమట! మరోసారి కోటేరులాంటి నా నాసికను మెచ్చుకుంది. ముఖ్యంగా నా ఆరడుగుల ఎత్తు! విగ్రహ పుష్టిని ఎత్తిపారేసింది. మాటకారితనానికి ఎక్కువ మార్కులు వేసేది. అయితే ఈ పొగడ్తలన్నీ నా హృదయాన్ని మైమరపించి ఆమె అంటే ఆత్రేయపురం పూతరేకులంత తీయని ప్రేమను, కాకినాడ కాజా అంత మధురమైన ఇష్టాన్ని కలుగజేసాయనడం ముమ్మాటికీ నిజం!

తర్వాత్తర్వాత కాలేజీకి అప్పుడప్పుడు డుమ్మా కొట్టే అలవాటున్న నేను ప్రాభవి పరిచయమైనాక ఎగ్గొట్టే పనికి పూర్తిగా స్వస్తి పలికాను. తరగతిలో ఉన్నా సరే ఎప్పుడు బెల్ కొడతారా ఎప్పుడు ప్రాభవి నా కళ్లబడుతుందా అని నా మనసు ఉవ్విళ్ళూరేది. ఆమె వైపు నుండి కూడా అదే ఆరాటాన్ని పసిగట్టాన్నేను. అది మా స్నేహానికి మరింత బలమైన పునాది వేసింది.

ఆ చనువుతోటే ఓ రోజు ఆమెతో 'మనిద్దరం సరదాగా ఎక్కడికైనా వెళ్దామా?' అని ప్రతిపాదించాను.

'అమ్మో! ఇంట్లో తెలిస్తే తాట ఒలుస్తారు. నేరాలేను' భయంతో తిరస్కరించింది.

'కాలేజీకని బయలుదేరి అలా రామతీర్థం వెళ్దామా? చాలా బాగుంటుంది" అని అడగటంతో కాసేపు తటపటాయించింది.

"అంటే క్లాసులెగ్గొట్టి వెళ్దామంటావ్? ఇదిగో సరిగ్గా రెండు గంటల్లో మళ్ళీ వెనక్కి రావాలి?' అని షరతు విధించింది.

నా గ్లామర్ బైక్ ఎక్కింది. సర్రుమంటూ దూసుకెళ్ళా! వెనక కూర్చుందన్న మాటేగాని నన్ను అంటిపెట్టుకునే ఉన్నది. ఆమె ఎదభాగం సున్నితంగా పూబంతిలా తాకుతుంటే ఎక్కడెక్కడికో తేలిపోయా! స్పీడ్ బ్రేకర్స్ దగ్గర మరింతగా హత్తుకుపోయేది. ఇదివరలో ఎన్నోసార్లు రామతీర్థం వెళ్ళడంతో అక్కడి కొండమీదున్న రాముడి గుడి నాకు బాగా ఎరికే! ఊరి చివర చాకలివాగు దగ్గర బైక్ పెట్టి, జాగ్రత్తగా చూడమంటూ ఒకరికి అప్పగించాం. ఒకప్పుడు ఎక్కడం చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడు మెట్ల దారి ఉంది. పట్టుకోడానికి ఆసరా ఉంది. అయితే ప్రాభవి నన్ను మాత్రం వదలకుండా భుజం చుట్టూ చేతులేసి మరీ నడక సాగిస్తోంది. ఆ అనుభవం నాకెంతో తాదాత్మ్యాన్ని ప్రసాదించింది.

కొంతదూరం నడిచాక మధ్యమధ్యలో ఆగే వాళ్ళం. అలాంటి సమయంలోనే హఠాత్తుగా ఆకాశమంతా మబ్బులు కమ్మటం మొదలైంది. ఇక కొద్దిసేపట్లో వర్షం ప్రారంభమయ్యే సూచన మెండుగా కనిపిస్తోంది. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు కూడా మమ్మల్ని హెచ్చరిస్తున్నట్లే అనిపించింది. 'హసన్!' అంటూ నన్నొక్కసారిగా భయంతో అల్లుకుపోయింది. మీదకు వెళ్ళేందుకు వాతావరణం అనుకూలంగా లేదు. ఇక తిరిగి కిందకు దిగడమే మంచిదని మెల్లగా ఒకరిచేతులు ఒకరం పట్టుకుని దిగసాగాం. ఇక కిందకు దిగే వేళ చిన్నగా ఎక్కడో నాచు పట్టినందున ఆమె కాలు జారి జరజరమంటూ నన్ను కూడా కిందకు ఈడ్చుకెళ్ళింది. అయితే కింద మేటవేసిన ఇసుక దిబ్బలా పడి ఉండటంతో మేమిద్దరం రక్షించబడ్డాం. కాని ప్రాభవి మాత్రం కెవ్వుమన్న కేకలతో ఈ లోకంలోకి ఇంకా రాకుండా నన్ను ఇంకా గట్టిగా వాటేసుకుని ఉండిపోయింది. దాంతో కోతి లాంటి నా మనసులో చిలిపి కోరికలు ఉవ్వెత్తున లేచి నన్ను ఆమెను కరుచుకునేలాగ చేశాయి. వాన వల్ల ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేరు.

ఆ ధైర్యమే నన్ను ఆమె శరీరం మీద పెత్తనం చేసేలా ప్రోత్సహించింది. చిన్నగా చలికూడా ప్రాభవిలో చోటు చేసుకుందనడానికి గడగడా వణకటంతోనే తెలుస్తోంది. అంతే! వేడి పుట్టించే దిశలో నా చర్యలు సాగాయి. ఇంకా ముందుకు సాగడానికి ప్రయత్నించే తరుణంలో ప్రాభవి మేల్కొన్నట్టుగా ఒక్కసారిగా నన్ను తోసి విడివడి 'వద్దు ఇద్దరికీ ప్రమాదం! ఇక వెళ్దాం పదండి' అని చెప్పి లేచింది.

లేచే ముందు మాత్రం ఆగలేక దగ్గరగా లాక్కుని ముద్దెట్టుకున్నా. చిరుదరహాసం చిందించింది.

'తడి బట్టలతో ఇంటికెళ్తే వాళ్ళు అడిగిన ప్రశ్నలకు ఏం చెప్పాలో తెలీటం లేదు తెల్సా? మరెప్పుడూ ఇలా వద్దు. ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకుందాం ఎంచక్కా!' అని కోపంగా చూసింది.

అతడి భుజాలచుట్టూ చేతులేసి గట్టిగా ముద్దు పెట్టుకుందామె. అతడిలో ప్రతిచర్య మొదలైంది. వారి వలువలకు విలువలేకుండా కుప్పలా పడ్డాయి. పరస్పర ఎదురుదాడులతో హూనమైన వారి శరీరాలు సొమ్మసిల్లి పోయాయి.

ఓసారి తలవని తలంపుగానే ఎదురుగా ఉన్న ఆమె, పార్కులో ఎవరూ లేకపోవడం చూసి నన్ను చటుక్కున దగ్గరకు లాక్కుని ముద్దెట్టుకుని అంతలోనే విడిపోయి లేచింది వెళ్ళిపోదామంటూ. ఒక అనూహ్యమైన అందమైన ముద్ర అది.

అలా మా స్నేహం ముందుకెళ్ళినప్పటికీ పెద్దల కారణంగా పెళ్ళి దాకా చేరలేదు. తర్వాత ప్రాభవికి పెళ్ళయి దూరంగా వెళ్ళిపోవడంతో మా స్నేహానికి ఫుల్‌స్టాప్ పడింది. నేను కూడా

అరకోటికే ఇలియానా

కెరీర్ పరంగా నడుము సుందరి ఇలియానా పరిస్థితి ఏమంత బాగాలేదు. కోటి ఆశలతో బాలీవుడ్‌కి వెళ్ళిన ఇల్లీ బేబీని అక్కడి జనాలు అస్సలు పట్టించుకోలేదు. ఏవో ఒకటో రెండో సినిమాలు చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న ఇలియానా కన్ను తిరిగి టాలీవుడ్ మీద పడింది. గతంలో టాలీవుడ్‌లో కోటికి పైగా పుచ్చుకున్న ఇలియానాకు ఇప్పుడు అంత ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదట! దాంతో తన రెమ్యునరేషన్ సగానికి కుదించేసి తెలుగులో ఓ ఆఫర్ చేజిక్కించుకుందని అంటున్నారు. అయితే ఆ సినిమాకు సంబంధించి పూర్తి వివరాలు మాత్రం బయటకి రాలేదు.

వైవాహిక జీవితంలోకి దుమికాక మామూలైపోయాను.

కాని మళ్ళీ ఇంతకాలానికి ప్రాభవి నాకు తారల్లే తళుక్కుమని తారసపడింది. ఒంటరిగా నిలబడింది. మరెవరికోసమో ఎదురుచూపులు? ఎలాగైనా కలవాలి. అసలు నన్ను పోలుస్తుందో లేదోనన్న మీమాంస! అయినా మనసాగలేదు. గబగబా ముందడుగేశాను.

'హల్లో! ప్రాభవీ....' అని పలకరిస్తూ ఎదురుగా నిల్చున్నాను.

ఒక్క క్షణం తటపటాయిస్తూ "ఓహ్! నువ్వు... హాసన్‌వా?... అదేంటలాగైపోయావ్? నువ్వో కాదోననుకున్నా! అప్పుడే ఇరవై యేళ్ళయింది చూసి..." అని నోరునొక్కుకుంటూ తెగ ఆశ్చర్యపోయింది.

"నువ్వు మాత్రం వన్నె తరగని కన్నెపిల్లలాగే ఉన్నావ్!" అన్న నా మాటలకి ముత్యాలు రాలినట్లుగా నవ్వింది ప్రాభవి.

మళ్ళా నేనే 'ఇంతకీ ఇక్కడ?' అని ప్రశ్నించాను.

"నేను భువనేశ్వర్ వెళ్ళాలి. రైలుకోసం ఎదురుచూస్తున్నాను. మా మేనత్తను దిగబెట్టి రావాలి. ఇంతకీ నువ్వెక్కడ?" అన్నది ఆత్రంగా ఎటో చూస్తూ.

"నేనిక్కడే స్థిరపడ్డా! ఇద్దరు పిల్లలు. బాబు, పాప. మరి మీ శ్రీవారు, పిల్లలు?" వివరాలడిగాను.

'ఆయన గురించి తల్చుకుంటేనే పాపం! ఒక్క పాప! టి.సి.ఎస్‌లో పనిచేస్తోంది. ప్రస్తుతం ఒంటరి జీవితం!' అని చెబుతుంటే ఎవరో దూరం నుంచి చేయూపడంతో ఆదుర్దాగా వెళ్ళేందుకు సిద్ధపడింది.

'అన్నట్లు నిన్ను కలవచ్చా? ఇంతకీ నీ సెల్ నెంబర్' గబగబ అడిగాను. ఆమె అంతే వేగంగా నెంబర్ చెప్పి కదిలింది.

సెల్‌లో ఫీడ్ చేసుకునేసరికి ప్రాణం తెరిపిన పడింది. ఎందుకైనా మంచిదని ఒకసారి రింగ్ చేశా! హలో! ఎవరంటూ' అడిగింది. నేనని చెప్పా! 'నెంబర్ సేవ్ చేసుకుంటా'నన్నది.

ప్రాభవికి చెంపల దగ్గర కొద్దిగా నెరిసిందేమో తప్ప లావణ్యం ఎంతమాత్రం తగ్గలేదు. శారీరక పరిపుష్టి సైతం నైగనిగ్యం విరబూసేలాగుంది. వస్తానన్న మాపై ఆఫీసర్ ఫోన్ చేసి రావడంతో తిరుగుముఖం పట్టాను.

●●●

నేనింటికెళ్ళగానే చేసిన మొదటి పని అద్దం ముందు నిలబడ్డం! ఒక్కసారిగా నా ముఖం చూసుకున్నా! ఛీ! ఎంతలా మారిపోయాను? ఆనాడు ప్రాభవి పొగిడిన ఉంగరాల జుత్తేదీ? కాస్త ఎండు గడ్డిపరకలా మిగిలిన వెంట్రుకలు తప్ప! చక్కని ముక్కేది? ముందర ఉండలా తేలి దర్శనమిస్తోంది. కళ్ళకింద నల్లని చారలు వెక్కిరిస్తున్నాయి. నిజానికి చెప్పాలంటే ఆధార్ కార్డ్ కోసం తీసిన ఫోటో మాదిరిగా ఉంది నా ముఖం! ఇంతకంటే వేరే ఉదాహరణ చెప్పక్కర్లేదు నేనెంతగా పాడైనానో?

"ఏమండోయ్! ఏమిటింత హఠాత్తుగా అద్దం ముందు కూలబడ్డారు" అన్నది శ్రీమతి మల్లిక.

"అబ్బే! ఏం లేదు. నా ముఖం చూసుకుంటే నాకే అసహ్య మేస్తోంది. పాడైపోయానని విచారంగా ఉంది" అన్నాను చింతిస్తున్నట్లుగా.

"ఏ వయసుకాకళన్నారు పెద్దలు. వయసు పెరుగుతున్న కొద్దీ వన్నె తరగదా మహాశయా! అయినా మీరు నా దృష్టిలో ఎప్పుడూ అందగాడే! మరి వేరే ఎవరి పొగడ్తలో మీకెందుకు? మీరు పన్నీటిలో స్నానంచేసి కొత్త బట్టలు వేసుకునేటప్పుడూ, శ్రమపడి చెమటలు కక్కే సమయంలోనూ నా కళ్ళకు మీరు అందంగానే కనిపిస్తారు. మనసెప్పుడూ హుషారుగా ఉంటే ముసలితనం మీ చెంతకు రాదు! మీరు నాకు మాత్రం ముసలి కానేకాదు!' అని నన్ను ఒక్కసారి ముద్దాడింది. శ్రీమతి మల్లిక. అలాగన్నా సరే ఎందుకో నాకు తృప్తిలేదు.

'అదేంటలాగైపోయావ్? నువ్వో కాదో అనుకున్నా!' అన్న ప్రాభవి మాటలే నా చెవుల్లో రింగుమంటున్నాయి. ఒకనాడు నన్ను, నా అందాన్ని పొగడ్తల్లో ముంచెత్తిన ప్రాభవి కళ్ళల్లో నా రూపం పాడైనట్లు కనిపించిందా? లేదు ఎలాగైనా మరోసారి ఆమె ఎదుట పడినప్పుడు కాస్తయినా శ్రద్ధవహించి రూపం దిద్దుకుని వెళ్ళాలి. ఆమెను కలిస్తే పాతరోజులు గుర్తురాక మానవు. ఆమె మాటలను బట్టి ఒంటరిగా ఉన్నట్లే గోచరిస్తోంది. ఒకప్పుడు పెళ్ళి కాని తాము ముందుకు వెళ్ళడానికే జంకారు. కాని ఇప్పుడా భయం ఏ మాత్రం అక్కర్లేదు. తనకూ భర్తపట్ల ఏదో వైముఖ్యం ప్రస్ఫుటిస్తోంది. కోరికలతో తహతహలాడ్డం సహజం! తనకు నచ్చినవాడు దొరికేదాక స్త్రీ వేరే మగాడితో జత కట్టదని ఎక్కడో చదివాను. వెర్రి కోరికలు తీర్చుకోడం కోసం ఆమె రెచ్చిపోయి ఎవరుపడితే వారితో కులకడానికి ఇష్టపడదట! బహుశా అలాంటి నైజం ప్రాభవిది కావచ్చునేమో! ఆనాటి నుంచి ఈనాటిదాకా నేనే గనుక ఆమె గుండెల్లో ముద్రవేసుకుంటే నాకు తప్పకుండా తన పక్కలో చోటివ్వక మానదు. ఆ ఊహ ఒక్కటే నన్ను బ్రతికిస్తోంది.

ఇంట్లో ఇల్లాలెప్పుడూ ఏదో ఒకటి అనటం మామూలే! లేదు! ప్రాభవి కోసమైనా ఆమెను కలిసేలోగా కొద్దిగానైనా ముఖం మెరిసేలా చేయాలి. తలకు రంగేసి తెల్లవెంట్రుకలు కనపడకుండా చూడాలి! అలాగనుకోగానే బైకేసుకుని సెలూన్ కెళ్ళా! ఎంచక్కా ఫేషియల్ చేయించుకున్నా! నల్లని వెంట్రుకలు దర్శనమిచ్చేలా చేశాడు. అద్దంలో చూసుకుంటే రూపం మారినట్లే అనిపించింది, నా మట్టుకు.

'అదేంటి ఈ వేషం? ఎవరికోసమట? నాకోసమైతే అక్కర్లేదు! మీరెలాగున్నా స్వీకరిస్తా! మరి ఈ వెర్రి ప్రయత్నం ఎందుకట?' అంటూ వీధిలోంచి రాగానే చిలిపిగా నవ్వుతూ ప్రశ్నించింది మల్లిక.

'ఈ మధ్యన మా కొలీగ్స్ కాస్త మోడ్రన్‌గా

జాగ్రత్త ఉల్లాల్!

క్రికెట్ అభిమానులకు క్రిస్ గేల్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మైదానంలో ఆట ఆడే సమయంలో ఎలా చెలరేగిపోతాడో, మైదానం బయట అమ్మాయిల విషయంలోనూ అలాగే చెల రేగిపోతాడు అంటారు అందరూ. అలాంటి 'ఆట'గాడితో జూనియర్ ఐష్‌గా పిలిపించుకునే స్నేహా ఉల్లాల్ చెట్టపట్టా లేసుకుని తిరిగేస్తోందట! ఇదేదో పుకారు అని సరిపెట్టుకోవడానికి వీలు లేకుండా అతగాడితో కలిసి దిగిన సెల్ఫీలు కూడా ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఏ భాషలోనూ సినిమాల్లేక ఖాళీగా ఉన్న స్నేహ మీద క్రిస్ కన్ను పడింది అంటున్నారు సినీ జనాలు. గేల్‌తో వ్యవహారం శ్రుతి మించితే అది ఉల్లాల్‌కే ప్రమాదం అని హెచ్చ రిస్తున్నారు కూడా!

ఉండచ్చుగా అన్నారు. అందుకే ఇలా తయారయ్యా!' అని ఏదో చెప్పి తప్పించుకున్నా!

'నిజం చెప్పనా? మీరు ఎప్పటిలాగుంటేనే నాకు నచ్చుతారు. కృతకంగా అనిపిస్తోంది' అనే సింది.

నాకా మాటలకి మాత్రం కాస్త కోపం వచ్చిన మాట పొల్లు కాదు. నేనేదో తంటాలు పడి మెరుగులు దిద్దించుకుని మెరుపులొచ్చాయని మురుస్తున్న వేళ...! ఈమె ఉన్నదున్నట్లుగా కక్కటం జీర్ణించుకోలేక పోయాను! అయినాసరే ప్రాభవి ప్రాపుకోసమే ఈ తాపత్రయమంతా! ఎలాగైనా ఆమె పొందు నా పాలిట విందుకావాలి! అదే నిశ్చయంతో ఉన్న నేను ముందుగా ఫోన్ చేయాలనుకున్నా!

కాల్‌చేసినా ఒక పట్టాన ఎత్తలేదు. ఒక పూటంతా అదే పనిలో ఉండి విసిగిపోయాను. అయితే హఠాత్తుగా ఆమె ఫోన్!

'హసన్! సారీ! కాల్ చేశావుకానీ ఎత్తలేదు. ఎక్కడున్నావ్?' అని అడుగుతుంటే ఆనందం పొంగి పొర్లింది.

'ఇంటి దగ్గరున్నా! ఎక్కడుంటున్నావ్? రావచ్చా!' అనగానే 'తప్పకుండా రా!' అని తన చిరునామా చెప్పింది. ఆ మాట చెవుల్లో అమృతం పలికింది.

అంతే టిప్‌టాప్‌గా తయారయ్యా! పదేపదే అద్దంలోకి చూసుకున్నా!' దొరగారి షికారెక్కడికో? ఎప్పుడూ ఇలా తయారవని మీరు ఇలాగ ఇంత మేకప్ ఏమిటో?' అని కాస్త ఆశ్చర్యం ప్రకటించి ఆనక నవ్వేసింది మల్లిక.

ఆ నవ్వు వెనుక అనుమానం లేకపోవడం నన్ను రక్షించింది. ఎవరో కొత్తాఫీసర్ వస్తున్నాడని అందుకే ఇలా తయారైనానని చెపితే నమ్మేసింది.

ఇక శివాజీపాలెంలో ఆమె ఉన్న ఫ్లాట్‌కి వెళ్ళా! కాలింగ్ బజర్ మోగించా! ప్రాభవి పారదర్శకమైన నైటీలో దర్శన మిచ్చింది. వెళ్ళీవెళ్ళగానే తలుపులు బార్లా తెరిచి ఉంచకుండా వెంటనే వేసేసి గడియ బిగించేసింది.

'అదేంటి? ఎవరూ ఏమనుకోరా? కొత్తవ్యక్తిని కదా! అనుమానం రాదూ!' నా భయం నాది.

నాలో పట్టిపీడిస్తున్న అనుమానం, భయాలను పటాపంచలు చేస్తూ సోఫాలో నా పక్కనే కూర్చుంది.

'ఎవరో ఏదో అనుకుంటారని ఇంత కాలం తర్వాత కలిసిన ఒకనాటి ప్రియ మిత్రుడివైన నిన్ను వదులుకుంటానా? ఉన్నదున్నట్లు చెప్పనా? ఆరోజు స్టేషన్లో కలిశాక మళ్ళా నా జీవితంలో వసంతం తిరిగొచ్చిందని ఎంతగానో ఉప్పొంగి పోయాను. ప్రస్తుతం ఎటువంటి సరస సల్లాపాలు లేక నిస్సారమైన నాకు నీ రాక ఉవ్వెత్తున పొంగే సముద్రమై పోయింది తెలుసా? అన్ని బాధ్యతలూ తీరిపోయి స్వేచ్ఛగా ఉన్నా! నీ రాకపోకలకు ఎటువంటి ఆక్షేపణ లేదు' అని మరింత దగ్గరగా జరిగింది. నా భుజాల చుట్టూ తనే చేతులేసి గట్టిగా లాక్కొని ముద్దివ్వడం అనంతమైన ఆశ్చర్యానికి గురిచేసింది.

అవాక్కవడమొక్కటే నే చేసిన పని! అంతటితో ఆగలేదామె! నన్ను బిగియారా కౌగిలించుకుంది. అంతే! నేను ప్రతిచర్య ప్రారంభించాను. రెండు చేతులు కలిస్తే చప్పట్లు మ్రోగిన చందమైంది మా పరిస్థితి. ఒకర్ని మించిపోదామని ఒకరం చేసే ప్రయత్నాలు మరింతగా ముమ్మరమైనాయి. సర్ప పూత్కారాలకు ప్రతిబింబాల్లా మా వేడి ఊపిరులు. వలువలకు విలువలు లేకుండా కుప్పలా పడ్డాయి. ఆ శృంగార గ్రామంలో మా ఇద్దరి ఎదురు దాడులకు ఒళ్ళు హూనమై పోయింది. సొమ్మసిల్లి పోయి కరుచుకుపోయామిద్దరం.

'అదేంటి, తలుపు తెరిచినా ఇంకా కాలింగ్ బెల్ కొడుతున్నావేమిటి హసన్?' అన్న మాటలకు ఈలోకంలో పడ్డాను.

"అబ్బే! అదేమీ కాదు!' అనేశాను గానీ ఇంత దాకా ఏవేవో ఊహల్లో తేలిపోవడంతో అలా పరాకుగా అయ్యాను.

ప్రాభవి చీరకట్టులో సౌందర్యరాశిలా తళుకులీనుతోంది. అక్కడ ఆమె కెదురుగా సోఫాలో కూర్చుండిపోయాను. ఆమె ఎంతకూ తలుపేయక పోతే నేనే అన్నా' తలుపేయొచ్చుగా! ఫ్రీగా ఉంటుంది".

"వద్దు! ఇక్కడివాళ్ళకి నువ్వు కొత్త! మనిద్దరికీ ఏదో లింకుందంటారు" అని వేయడానికిష్టపడ లేదు. తర్వాత కాఫీ కలిపి తెస్తానని లోనికెళ్ళింది. ప్రాభవి అందానికి దాసురాలైన కోతి మనసు అప్పటికే గంతులేస్తోంది. లోపలికెళ్ళి కాస్త చొరవ చేసి ముద్దుపెట్టేస్తే... అలాగనుకోగానే మళ్ళీ భీతి వెంటాడింది. అసలామె మనసులో ఏముందో తెలుసుకోకుండా చేసే ప్రయత్నం వ్యర్థమవుతుంది.

ఒక్క ఐదు నిమిషాల పిదప కాఫీతో ప్రత్యక్షమైంది. 'ఒకసారి కాఫీ షాపుకెళ్ళి ఖరీదైన కాఫీ తాగాం గుర్తుందా?' అని ఆమె గతం కదిపింది.

"ఔను! నువ్వు కాఫీ తాగుతుంటే నేనో జోక్ వేస్తే నీ నవ్వుకి అది ఒలికిపోయింది. బట్టలు పాడైపోయాయని నువ్వెంత కంగారుపడ్డావో నాకిప్పటికీ గుర్తే! మరో సంగతి.. మనం రామతీర్థం వెళ్ళాం కాలేజీకి దుమ్మాకొట్టి.. అప్పుడు మనిద్దరం కిందకు దొర్లిపోయి... కౌగిల్లోకి..' అదే అదనుగా అందుకున్నాను.

"ఔన్లే! అదంతా పాత కథ! అప్పటి నీ కర్లింగ్ హెయిరు ఇప్పుడుందా? లేదే? నాలుగు పరకల్లా మిగిలాయి తప్ప! గతం తవ్వుకోవడమే మిగు

ల్తుంది" అనేసరికి ఒక్కసారిగా విభ్రాంతిలో పడ్డాను.

అప్పటినుంచి ఏవేవో విషయాలు మాట్లాడింది. నేను గతంలో చిలిపి పనులను గుర్తు చేస్తూ ఆమెను నా రాకలో ఆంతర్యం వైపుకి మళ్ళించే ప్రయత్నం పెద్దగా ఫలించలేదు. పైగా పెద్దగా నవ్వేస్తూ "బాగుంది వరస! అప్పటి నీ అందం ఏది హసన్?! నువ్విప్పుడు నాకెలాగ ఇష్టమవుతావో చెప్పు! అది టీనేజ్! ఏదో ఆపోజిట్ సెక్స్ పట్ల ఆకర్షణ... నీ ఉంగరాల జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి ఎంతో ఆనందించేదాన్ని. నీ మజిల్స్ చూసి ముచ్చటపడేదాన్ని. మరిప్పుడో? కనీసం పిడికెడు వెంట్రుకలేవు నీ నెత్తిపైన! కండలు కరిగిపోయి వేలాడుతున్నావ్! ముక్కేమో బండగా తయారైంది. మరి నీలో ఏ అంశం చూసి మోజుపడాలి. చాలారోజుల తర్వాత కనిపించావని సరదాగా మాట్లాడాలని పిలిచా. నేను పిలిచానని జుత్తుకి రంగేసుకున్నావ్. జీన్ ప్యాంటేసుకున్నావ్. టీ షర్ట్ తొడిగావ్! అన్నీ ఓకే! కాని పిట్టల దొరలాగున్నావ్! నా మనసు నీ



ఇప్పటి రూపం ఇష్టపడనంటూ మొరాయిస్తోంది. టేకిట్ ఈజీ! బైదిబై! మా ఫ్లాటెలాగుందో చూద్దువుగాని రా.." అని పిలిచింది. అన్యమనస్కంగానే లేచా!

అయినా నా కోతి మనసూరుకోలేదు. ఆమె మాస్టర్ బెడ్రూం చూపించడానికి లోపలికి తీసుకెళ్ళింది. విశాలమైన బెడ్! ఆమె వెనుకగా వెళ్ళిన నేను ఆమెను వెనుకనుంచి గబాలున బంధించేశాను. కాని అనుకోకుండా నా వ్యూహం తలకిందులైంది. విదిలించుకుంటూ ఒక్కసారిగా నావైపు తిరిగి "నీకేమైనా పిచ్చిపట్టిందా? ఒంటరిగా ఉన్నాననగానే కోరికలతో వేగిపోతున్నాననే భ్రమలో కొట్టుకుపోతూ వచ్చిన నిన్నేమనాలో నా కర్థం కావటం లేదు. నీమీద నాకిప్పుడెటువంటి కాంక్ష లేదంటే వినవేం! దయచేసి వెళ్ళు. మనిద్దరం జీవితంలో ఒకటి కాలేకపోయిన మాట నిజం! నా జీవితం ఎలాగూ సాఫీగా లేదన్నది నిజం! మరి నీకేమైంది? మీ ఇద్దరూ సయోధ్యగానే ఉంటారని నాకు తెలిసింది. అలాంటిది ఆమెకు అన్యాయం చేయాలని ఎందుకనుకుంటున్నావ్? అప్పుడు నీ అందం చూసి నీవైపు ఆకర్షించబడ్డాను. అదిప్పుడు నీ దగ్గర శూన్యం" అనేసి గుమ్మం వైపు దారి చూపించింది. అంతే విషణ్ణ వదనంతో ఇంటిదారి పట్టాను.

పుట్టెడు అవమానం, బాధ కలగలసి ఇంట్లో అడుగు పెట్టిన నన్ను చూస్తూనే "ఏమండీ! ఏమైందీ? మీ కొత్తాఫీసరు చేత మొదటిరోజే తలవాచేలా చీవాట్లు గాని తిన్నారా?" అని అమాయకంగా అడుగుతున్న శ్రీమతి మల్లికని చూస్తుంటే జాలేసింది.

"అబ్బ! ఎందుకలాగ బాధపడతారు? ఏదైనా జరిగితే దాన్ని వెంటనే మరిచిపోతేనే మనసు ఆనందంగా అందంగా ఉంటుంది. మీలో ఏ లోపం ఉందని ఎవరైనా అనుమానించడానికి? నా భర్తగా మిమ్మల్ని నిందిస్తే వాళ్ళే పోతారు" అంటూ నాపై ప్రేమను కురిపిస్తూ అల్లుకుంది.

అప్పుడు నా కళ్ళల్లో సన్నటి నీటిపొర! ఈ పిచ్చిపిల్లకు నేను రచించిన వ్యూహం గురించి తెలీక నన్నింకా నిజాయితీగా నమ్ముతోంది. ప్రస్తుతం అనుభవిస్తున్న అవమాన భారం ఎందుకో తెలీదు పాపం!

'ఏమండీ! అన్నట్లు మన పాల లక్ష్మి జున్నుపాలు తెచ్చిచ్చింది. విరుస్తున్నాను. మీరు హాయిగా స్నానం చేసి రండి. తిందురుగాని. తొలిసారి తీసిన పాలతో చేసిన జున్ను మహాబలమని మా తాతగారు చెప్పేవారు' అని నన్ను ఉత్సాహపరచ డానికి ఆమె చేసిన ప్రయత్నాన్ని హర్షిస్తూనే మోసం చేయబోయిన నన్ను తెగ తిట్టుకున్నాను.

వేడెక్కిన బుర్రమీంచి చన్నీటి స్నానం చేసి ఇలా వచ్చానో లేదో అలా నా ముందు పొగలు కక్కుతున్న గడ్డలాంటి జున్ను పెట్టింది. తర్వాత శ్రీమతి స్నానానికి వెళ్ళింది.

అప్పుడే నేను వేడిగా ఉన్న జున్నుని తినకుండా ఎదురుగా ఉన్న నిలువుటద్దంలో నన్ను నేను మళ్ళా తిలకించుకున్నాను. నిజమే! ప్రాభవి కళ్ళకి ఈ పాడుముఖం ఎలా నచ్చుతుంది? నాతో సుఖాలు పంచుకుందుకు ఎలా సిద్ధపడుతుంది? పైగా ఎప్పుడో జరిగిన దాన్ని ఆసరాగా తీసుకుని పక్కలో చోటుకోసం ప్రయత్నించడం ఎంత వరకు సమంజసం? ఒక విధంగా ఆమెను స్నేహితురాలిగా చూడకుండా పరిస్థితులను బట్టి చులకనగా చూసి వక్రంగా ప్రవర్తించాను. మరోపక్క శ్రీమతినీ మోసం చేయబోయాను.

నా మీద నాకే అసహ్యం వేసింది. నేను చల్లారిన జున్నును తినడానికి సిద్ధపడుతుంటే అప్పుడే వచ్చిన శ్రీమతి ఎంచక్కా బొండుమల్లిలా విప్పారితంగా కళ ఉట్టిపడేలాగుంది.

"నేను నీకు తగను మల్లికా! నా ముఖం, మనసు రెండూ అందవికారమైనవే! ' పక్కమీద చేరగానే నేనన్న మొదటి మాట.

"మీరెప్పుడూ అలాగే అంటారులెండి. కాని నాకు మీరెప్పుడూ అందమైన వారే! నాకే కాదు ఏ స్త్రీకైనా తన స్వచ్ఛమైన మనసుతో భర్తను చూస్తే అతను ఎల్లప్పుడూ అందంగానే కనిపిస్తాడు. అలా కాకుండా ఎప్పుడూ మనసులో ఏదో అనుమానాన్ని పెనుభూతంలా పెట్టుకోవడం, అందం తగ్గిపోతోంది, వయసు పెరిగిపోతోంది అనే ఒక మానసిక రుగ్మతను బలీయం చేసుకుంటూ పోతే ఇక జీవితంలో ఆనందమే శూన్యమవుతుంది. అందుకే ఒకరి కొకరు ఆనందంగా తోడుగా ఉంటే అదే అసలైన అందం. అందువల్ల మీరు నా కళ్ళకెప్పుడూ అందగాడే! మరెప్పుడూ ఆ మాట మీ నోటంట రానీయకండి' అంటూ సున్నితంగా నా నోరు మూసింది.

లోలోపల నా తప్పు నన్ను దహిస్తున్నాసరే శ్రీమతి మాటలు నన్ను ఒకదారిలో పెట్టే దిశగా సాగినట్లుగా అనిపించింది.

"ఏమండీ! మాట్లాడరేంటి? అసలీరోజు ఏమైందో మీకు. ప్లీజ్ అలా ఉండొద్దు. జున్నెందుకిచ్చానో ఊహించారా?" అన్నది మల్లిక దగ్గరగా జరిగి. ఊహు! అన్నాను.

"మీది ట్యూబ్‌లైట్ బుర్ర. ఈరోజు ప్రత్యేకత ఏమిటో తెల్సా? అసలు జున్ను గుణాలు తెల్సా? సున్నుండలు... అవీ ఏ సమయంలో పెడతారో తెల్సా?' ప్రశ్నల వర్షం కురిపించింది.

వాటికి నా దగ్గర సమాధానం శూన్యం! నా మౌనం చూసి నా బుగ్గమీద చిటికేస్తూ 'మన పెళ్ళయిన తర్వాత వరసగా రెండు ఆషాఢాలొచ్చాయి. తర్వాత ఆ ముహూర్తం కుదిరిందన్నారు. అందుకే నాకీరోజు బాగా గుర్తుండిపోయింది. ఇప్పటికైనా అర్థమైందా? మహాశయా?" అన్నది చిలిపిగా అర్ధాంగి మల్లిక. అంతే! నా మానసిక వ్యాకులత పూర్తిగా అణగారిపోయింది. ఇద్దరం ఆనందలోకాల్లో విహరించ డానికి సమాయత్తమయ్యాం.

అందమే ఆనందం అన్నది అందరూ పలికే మాట! కాని ఎవరికైనా ఆనందమే అందం! ఇది నేను గ్రహించిన సత్యం!!

సెల్: 97054 11897

స్లిమ్‌గా ఉండాలనుందా?

శరీరంలో హార్మోన్ల అసమతౌల్యం వల్ల బరువు పెరుగుతాం. ఈ విషయం దాదాపు అందరికీ తెలిసిందే. కానీ ఏ హార్మోన్లు దీనికి కారణమని ప్రశ్నిస్తే సమాధానం మాత్రం చాలా తక్కువ మందికే తెలుస్తుంది. కేవలం నాలుగు రకాల హార్మోన్లు మన శరీర బరువు పెరుగుదలకు దారితీస్తాయి. అంతేకాదు, పొట్ట భాగంలో కొవ్వు పేరుకుపోవడానికి ఆ హార్మోన్లే కారణం!

ఇంతకీ ఏంటా హార్మోన్లు అనుకుంటున్నారా? అవే లెప్టిన్, ఈస్ట్రోజన్, కార్టిసాల్, ఇన్సులిన్. ఈ నాలుగు హార్మోన్ల అసమతుల్యత కారణంగా శరీరాకృతి దెబ్బతినే అవకాశం ఉంటుంది. కాబట్టి మంచి శరీరాకృతిని సొంతం చేసుకుని నాజూగ్గా ఉండాలంటే ఆ హార్మోన్ల సమతౌల్యం సాధించడం చాలా ముఖ్యం. మరి అదెలాగో తెలుసుకుందామా!

ఈస్ట్రోజన్

ఈస్ట్రోజన్ అనేది ఒక స్త్రీ హార్మోన్. ఈ హార్మోన్ మోతాదు అదుపు తప్పడం వల్ల బరువు పెరిగే అవకాశాలు ఉన్నాయి. అంతే కాదు, ఈస్ట్రోజన్ పెరుగుదల వల్ల శరీరం క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే అవకాశం కూడా ఉంది. కాబట్టి ఈ హార్మోన్‌ను అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఇందు కోసం కెఫిన్ సంబంధిత ఆహార పదార్థాలు ప్రాసెస్డ్ ఫుడ్ జంక్‌ఫుడ్ వంటి కొవ్వులు అధికంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. అదేవిధంగా తినే ఆహారంలో సోయా ఉత్పత్తుల్ని కూడా ఎంత తగ్గించుకుంటే అంత మంచిది. ఎందుకంటే సోయా శరీరంలో ఈస్ట్రోజన్ స్థాయిని పెంచుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణమై జీర్ణవ్యవస్థను మెరుగుపరిచే ఫైబర్ అధికంగా లభించే బెర్రీస్ ఆకు కూరలు, బీన్స్, నిమ్మజాతి పండ్లు వంటివి ఆహారంలో చేర్చుకోవడం చాలా ముఖ్యం. ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వచేసిన ఆహార పదార్థాలు, డబ్బాల్లో నీరు తీసుకోకపోవడం మంచిది. ఇవన్నీ క్రమం తప్పకుండా పాటించడంవల్ల ఈ హార్మోన్ మోతాదును అదుపులో ఉంచుకునే అవకాశం ఉంటుంది.

కార్టిసాల్

ఇది ఒత్తిడిని కలిగించే హార్మోన్. ఇది శరీరంలో ఎక్కువ మోతాదులో ఉంటే కడుపు నిండా తినలేం, కంటి నిండా నిద్రపోలేం. అంతేకాదు ఈ హార్మోన్ వల్ల శరీరంలో అనవసర కొవ్వు స్థాయి రెట్టింపు అవుతుంది. ఈ హార్మోన్ అదుపులో ఉండాలంటే ఒత్తిడిని నియంత్రించుకోవడమే మేలైన మార్గం. అందుకే ఒత్తిడిని సాధ్యమైనంత త్వరగా తగ్గించుకోవాలి. యోగా, మెడిటేషన్, వ్యాయామం వంటివి ఇందుకు చక్కగా సహకరిస్తాయి. అలాగే రోజుకు కనీసం ఏడెనిమిది గంటలు నిద్రపోవాలి. మానసిక ప్రశాంతత కోసం వినసొంపైన సంగీతం, నచ్చిన సినిమాలు చూడడం, ఇష్టమైన వాళ్లతో సమయం గడపడం మంచిది. ఒత్తిడి నుంచి బయటపడేసే ఆహారానికే మొగ్గుచూపాలి. విటమిన్ సి అధికంగా ఉండే నిమ్మజాతి పండ్లు, మెగ్నీషియం ఎక్కువగా లభించే పెరుగు, డార్క్ చాక్లెట్, చేపలు, ఆకుకూరలు, పండ్లు, అవకాడో మొదలైన వాటిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి. తద్వారా ఒత్తిడి తగ్గి ఈ హార్మోన్ అదుపులో ఉంటుంది. అలాగే బరువు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

లెప్టిన్

లెప్టిన్ హార్మోన్‌లో సమతౌల్యం లోపిస్తే తీసుకున్న ఆహార పదార్థాలు కొవ్వు రూపంలో పొట్ట భాగంలో పేరుకుపోతాయి. కాబట్టి జింక్ అధికంగా లభించే మాంసం, చేపలు, పాలకూర నట్స్, పుట్టగొడుగులు వంటివి ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే తీసుకునే ఆహారం వేగంగా కాకుండా నెమ్మదిగా నమిలి మింగాలి. కంటి నిండా నిద్రపోవడం కూడా చాలా ముఖ్యం. ఈ చిట్కాలు పాటిస్తే శరీరంలో లెప్టిన్ హార్మోన్ స్థాయిలు సమతులమై పొట్ట భాగంలో అధిక కొవ్వు పేరుకుపోకుండా జాగ్రత్తపడవచ్చు.

యోగాతో తగ్గండి

రోజూ యోగా చేయడం వల్ల డైటింగ్‌తో పనిలేకుండా అధిక బరువు తగ్గించుకోవచ్చునని ఓ అధ్యయనంలో వెల్లడైంది. యోగావల్ల ఎలాంటి ఒత్తిళ్లు ఉండవు. మానసిక ప్రశాంతత లభిస్తుంది. తినే అలవాటు కూడా యోగా వల్ల దూరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి రోజుకు కనీసం అరగంటైనా యోగా చేయడం మంచిది.

ఇన్సులిన్

కొంతమంది ఆకలేస్తే తప్ప తినరు. ఇలా ఆకలి వేసేదాకా వేచి చూసి తింటే కూడా బరువు పెరిగే అవకాశాలున్నాయి. అదేంటి ఆకలి వేస్తేనే కదా ఏదైనా తినేది? రెండింటికీ సంబంధం ఏముంది? అని ఆలోచిస్తున్నారా! సంబంధం ఉంది. ఎలాగంటే ఆకలేసినప్పుడు శరీరంలో ఇన్సులిన్ స్థాయి పెరుగుతుంది. దానివల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. తద్వారా బరువు పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి బాగా ఆకలివేసే వరకు వేచి చూడకుండా సమయానికి ఎప్పటికప్పుడు ఆహారం తీసుకోవడం మంచిది. ఫలితంగా ఇన్సులిన్ స్థాయిని అదుపులో ఉంచుకోవచ్చు. ఈ హార్మోన్ అదుపులో ఉండాలంటే పాలిష్డ్ బియ్యం, మైదా లాంటి పదార్థాలు తినకూడదు. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే క్యాండీస్, పాస్తా, స్వీట్లు శీతల పానీయాలకు దూరంగా ఉండటం ఉత్తమం.

\- నివేదిత

"నిజమే ఉదయ్, నా హృదయంలో నువ్వున్నావు. నువ్వే ఉన్నావు. కేవలం నువ్వు మాత్రమే ఉన్నావు. కానీ నీ హృదయంలో నేనున్నానా??"

"ఉన్నావు?' అని టక్కున బదులు చెప్పలేక పోయాడతను. లిప్తకాలం పాటు ఒక అయోమయం. ఏమని చెప్పాలో తేల్చుకోలేని సందిగ్ధత. ఆ క్షణకాలపు సందిగ్ధతే చాలు ఆమెకు!!

"సంధ్య నీ జీవితం లోంచి వెళ్ళిపోయింది గానీ, నీ జ్ఞాపకాల్లో ఇంకా అలాగే ఉంది ఉదయ్..." అంది దీప్తి.

"కానీ నేను నిన్ను మనస్పూర్తిగానే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నా దీప్తీ! నిజం"

నిజమే కావచ్చు. ఆ అనుకోవడం కృతజ్ఞత తోనో లేక నేను ఒంటరిగా మిగిలిపోతున్నాననే జాలితోనో కాక, నీ మనసంతా నేనే నిండి, ఆ ప్రియభావనతో అలా అనిపిస్తే ఎంత బావుం డేది ఉదయ్".

"సంధ్య జ్ఞాపకాలు నన్ను వీడని మాట వాస్తవమే కానీ..."

"తనను నువ్వు మర్చిపోలేవు ఉదయ్".

"... ... ..."

నేనలా అన్నప్పుడు నువ్విలా మౌనం వహించ కుండా, 'తను నా జ్ఞాపకాల్లో లేదు దీప్తి' అని స్థిరంగా చెప్పగలిగే దాకా మనం ఒక్కటవ్వలేం. అది నా కిష్టం లేదు. నాకది ఓ వెలితిగానే ఉంటుంది. అసంతృప్తితోనే ఉంటాను. ఆ వెలి తినీ, ఆ అసంతృప్తినీ భరించడం కంటే ఇలా ఒంటరిగా ఉండి పోవడంలోనే ఓ ఆనందం ఉంది".

"దీప్తి!?"

"అవును ఉదయ్. అయ్ మీనిట్".

•••

అదీ అప్పుడు జరిగిన సంభాషణ:



లవ్ డబ్

(నా గుండె చప్పుడు)

21

-గుమ్మడి రవీంద్రనాథ్ సెల్: 98660 41012



"దీప్తీ!...." ఆ జ్ఞాపకాల నుండి బయటపడి చెప్పాడు ఉదయ్.. సంధ్యని మర్చిపోలేని స్థితిలో నేను ఉన్నంతవరకు నీకు వెలితి అనీ, అసంతృప్తి అనీ ఆనాడన్నావ్. ఆ అసంతృప్తిని భరించడం కంటే ఒంటరిగా, ఉండిపోవడంలోనే ఆనందం ఉందనీ అన్నావ్. కానీ ఇప్పుడు చెబుతున్నాను. 'ఫస్ట్‌లవ్' అనే ఒక సెంటిమెంటల్ భావం బలీయమైనదే అయినా, 'ట్రూ లవ్' ఇంకా బలీయమైనది. ఎంతో అమూల్యమైంది. ఏదీ ఆశించకుండా సమర్పణే ధ్యేయంగా సాగే నీ 'నిజమైన ప్రేమ'ను కోల్పోవటం మూర్ఖత్వమే కాదు అమానుషం కూడా! అందుకే వివాహ బంధంతో మనం ఒక్కటవుదాం".

ఆమెకు ఉదయ్ మాటల్ని నమ్మాలని బలంగా అనిపిస్తోంది. అనిపించడం కాదు - అవి నిజమనిపిస్తోంది. హృదయంలోంచి ఒక ఆనందపు జలపాతం ఉరుకుతోన్న భావన. ఆమె నేత్రాలూ, అధరాలూ విచ్చుకుంటున్నాయి సంతోషంతో. యుగయుగాల ఎదురుచూపుకు ఒక అర్థవంతమైన ముగింపు లభిస్తోన్న ఫీలింగ్.

'అయితే నీ మనసులో సంధ్య జ్ఞాపకాలు ఆవిరైపోయినట్లేనా...' అని అడగలేదు దీప్తి. ఆ అవసరం లేదు. అతని మాటల్లోని స్వచ్ఛత, స్థిరత్వం చెప్పకనే చెబుతున్నాయి. తను మళ్ళీ అలా ప్రశ్నించి అతని జవాబుకై చూడాల్సిన పని లేదు.

నిజానికి సంధ్యను అతడు పూర్తిగా మర్చిపోవడం అసాధ్యమని ఆమెకూ తెల్సు!!!

'మాట్లాడు దీప్తి!' నేను నీ సమ్మతికోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడతను.

ఆమె హృదయం ఎగసి ఎగసి పడ్తోంది.

"సిగ్గుపడుతున్నావా? లేక సంశయమా?" అతను రెట్టించి అడిగేసరికి, పెదవి విప్పిందామె.

ఇన్నాళ్ళ నా ఎదురు చూపు ఇందుకే అని నీకు తెలీదా ఉదయ్? నువ్వు నా సమక్షంలో ఉండి ఉంటే నా కళ్ళల్లో కురిసే అమృత భాష్పాలు కన్పించేవి. అవును. నిజంగానే కొంచెం సిగ్గు పడుతున్నాను. బుగ్గల్లో ఒక ఆవిరి. చిన్న ఎరుపు కూడా..."

"నేను రేపే నిన్ను కలుస్తాను దీప్తి. నీ కళ్ళల్లోని ఆనందాన్ని చూడ్డానికి కాదు"

"మరి?"

"సిగ్గుతో ఎరుపెక్కే నీ చెక్కిలిని చూడాలని. ఆడపిల్ల శరీరంలో జరిగే ఆ అందమైన 'కెమికల్ మార్పు'ల్ని చూడ్డానికి మించిన మధురమైన అనుభూతేదీ లేదేమో".

"నీలో ఓ గొప్ప ప్రేమికుడున్నాడు ఉదయ్! సున్నితత్వం, భావుకత, సృజనాత్మకత ఈ మూడు గుణాలు ఉన్న మంచిమనిషికి ప్రేయసిగా ఒక్క రోజు బ్రతకగలిగినా, జన్మ ధన్యమే. థాంక్యూ".

"థాంక్స్ నేను చెప్పాలి దీప్తీ.... ఫర్ ఎవ్రీథింగ్ యు గేవ్ మీ".

"గుడ్‌నైట్ ఉదయ్".

"రేపు కలుస్తాను. చాలా విషయాలు మాట్లాడాలి నీతో. రాత్రంతా నీ ఆలోచనలతో నిద్రపోలేనేమో నేను".

"లేదు. హాయిగా, నిశ్చింతగా నిద్రపో. కలలు కను. రేపు మనం కలిసినప్పుడు పెళ్ళి సంగతులే కాక, ఆ కలల సంగతీ చర్చించుకుందాం బై".

"బై"

ఆమె ఫోన్ పెట్టేసింది. ఆ క్షణం తన చుట్టూ ఉన్న ప్రపంచం అంతా పూలమయమై పోయి ఏదో తీయని సుగంధ పరిమళాలు వెదజల్లి నట్లనిపించింది. లోకమంతా వెన్నెల వెలుగుతో నిండి పోయింది. కళ్ళముందు కొత్త కాంతులు...! కోటానుకోట్ల ఇంద్ర ధనుస్సులు! గాలి నిండి మధుర మంజుల నాదం.

ఒక ట్రాన్స్‌లో ఉన్న దానిలా ఫోన్ దగ్గర నుండి కదలి అద్దం ముందుకు నడిచింది. దీక్షగా తనలోకి తాను చూసుకుంది. ఇందాకటి ఎరుపు చెంపల్లో ఇంకా అలాగే ఉన్నట్లనిపించింది. నైటీ లోంచి కూడా లీలగా కనిపిస్తూనే ఉన్నాయి శరీరపు అందమైన వంపులు. ఇంటర్‌లో సన్నగా, ఒకింత బలహీనంగా ఉండేది. కానీ ఇప్పుడు క్రమ పద్ధతిలో చేసే యోగాతో శరీరం చాలా కర్వీగా మారిపోయింది. డాక్టర్‌గా ఆరోగ్యనియమాలు పాటించడంతో శరీరమంతా ఒక లాంటి నిగనిగ. అప్పట్లోలా, తలకెప్పుడూ నూనె రాసుకోవడం లేదు. ఆమె కన్నుల్లోనూ, ముఖంలోనూ ఎంతో పవిత్రత కనిపిస్తుంటుంది. శరీర సౌష్ఠవం మాత్రం ఉద్వేగపరిచేలా ఉంటుంది. పవిత్రతా, సెన్సువాలిటీల సమ్మేళనం. అదొక అద్భుతమైన జోడీ. చాలా అరుదైన కాంబినేషన్.

దీప్తికి ఒక వ్యోమగామిలా గాలిలో ఎగరాలనిపిస్తోంది. ఏదో ఆనందం శరీరం అణువణువులో తెరలు తెరలుగా కదలాడుతోంది. ఉన్నపళంగా షవర్ కింద తడవాలనిపించింది. అద్దం ముందు నుంచి కదలి బాత్రూమ్ దగ్గరి లైట్ స్విచ్ నొక్కింది.

బాత్రూమ్‌లోకి వెళ్ళింది.

ఆ మరుక్షణం కెవ్వుమన్న కేక ఆమె గొంతులోంచి బిగ్గరగా బయటికొచ్చింది. ఆ ఇంటి వెనుక వైపున్న నీటి గొట్టం మీద పాకి, కిటికీ రెక్కను తొలగించి ఇంటి లోపలికి ప్రవేశించి,

జరిగిన కథ

తన తండ్రిని సజీవదహనం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకోవడానికి రవి హంతకుడుగా మారి మూడు హత్యలు చేస్తాడు. కాలేజీ రోజుల్లో తన ప్రియురాలు సంధ్య కూతురు కీర్తనే రవి నెక్స్ట్ టార్గెట్ అని తెలుసుకున్న కల్యాణ్ రవికి నచ్చజెపుతాడు. అంతర్మథనంతో రవి ఆత్మహత్య చేసుకుంటాడు. లలిత్, యోగ కీర్తనలకు పెళ్ళి చేయాలని పెద్దలు నిర్ణయిస్తారు. మరోవైపు పరిమళదీప్తి హాస్పిటల్‌లో సైకో రేపిస్ట్ కృష్ణ స్వీపర్ ముసుగులో దాక్కుని అవకాశంకోసం పొంచి ఉంటాడు. ఆ తర్వాత...

బాత్రూమ్‌లో నక్కి ఉన్న కృష్ణ ఒక్కసారిగా ఆమె మీదికి లంఘించాడు!!

●●●

గుండె ఆగినట్లై తీవ్రమైన గగుర్పాటుతో మెదడు మొద్దుబారిపోయింది డాక్టర్ దీప్తికి. అంతటి భీతావహస్థితిని, ఎంత గుండె ధైర్యం కల వాళ్ళైనా తట్టుకోవడం చాలా కష్టం. ముందు ఏదో జంతువనుకుంది. కానీ అది మనిషని తెలియగానే వణికిపోయింది. ఎవరో కూడా గుర్తించలేదామె. కృష్ణ వెనుక నుంచి చుట్టేసుకున్నాడు. ఆ మనిషి ఓ మగాడన్న స్పృహ కలగగానే, భయంతో పాటు జుగుప్స.

"ఏయ్!! ఎవర్నువ్వు? వదులు" ఎలాగో గొంతు పెగుల్చుకుంది.

"నా పేరు కృష్ణండీ. నేను మీ ఆసుపత్రిలో ఊడ్చేవాడ్ని. స్వీపర్ని" ఆమె ఎవర్నువ్వు అన్న దానికి వెకిలిగా నవ్వుతూ, వినయం నటిస్తూ, పైశాచిక ఆనందంతో చెప్పాడు వాడు.

వినగానే, దిగ్భ్రాంతితో వాడి ముఖం చూడాలని ప్రయత్నించింది. బలమైన వాడి చేతులు గట్టిగా ఉక్కు సంకెళ్ళలా పట్టేసి ఉండడంతో కుదర్లేదు.

"నన్ను వదిలిపెట్టు. నీకేం కావాలి? నేను ఈ హాస్పిటల్‌కి అధిపతిని. మీ అందరికీ జీవనోపాధి..." వాడు గట్టిగా ఆమె మెడ వెనుక ముద్దు పెట్టుకున్నాడు.

"ఛీ... వదల్రా" ఆమెకు అర్థమైపోతోంది వాడి ఉద్దేశం ఏంటో.

"నాకెప్పట్నుంచో ఒక తీరని కోరిక. ఇలా మీలాగ, ఒక 'గొప్ప అమ్మాయితో' గడపాలని".

కృష్ణలోని 'వైపరీత్యం' బయటికొస్తోంది.

"నీకేం కావాలన్నా ఇస్తాను వదిలిపెట్టు ప్లీజ్" ఏడుస్తోంది దీప్తి.

"ఇరవై మూడు మేడం" అన్నాడు వాడు, ఒక చేత్తో నడుముని అదిమి పట్టుకునే, రెండో చేయిని ఆమె గుండెలపై వేస్తూ.

"ఛీ..." ఆమె ఆ చేతిని పంటితో కొరికింది. నొప్పి తెలీలేదు వాడికి. అలా పట్టుకునే ఉన్నాడు.

"ఇరవై మూడు" మళ్ళీ అన్నాడు.

"... ... ..."

"ఇప్పటిదాకా ఇరవై రెండు మంది అమ్మాయిల్ని నలిపేసాను. మీరు ఇరవై మూడు మేడం" వాడి కళ్ళూ, ముఖం వికృతంగా, భయానకంగా మారిపోతున్నాయి. బలమైన విద్యుద్ఘాతం తగిలినట్లు కంపించిపోయింది డాక్టర్ దీప్తి. వెన్నులోంచి భయం చల్లని నీరులా పాకింది. స్వేదం బొట్లుబొట్లుగా తలలోంచి కారిపోతోంది. తల వెనక్కి తిప్పి వాడి ముఖాన్ని చూసింది బాత్రూమ్‌లోని బల్బ్ వెల్తురులో. అవును. వాణ్ణి తను హాస్పిటల్లో చాలాసార్లు చూసింది. కారిడార్లలో, బేస్‌మెంట్ దగ్గరా.. వాడు తన దగ్గరొక కాంట్రాక్ట్ స్వీపర్! ఆ క్షణం వాణ్ణి చూస్తే ఒక స్వీపర్‌లా లేడు, సైకోపాత్‌లా ఉన్నాడు.

"సాయంత్రం మన జూనియర్ నర్సు స్రవంతి నా చేతుల్లోంచి తప్పించుకు పారిపోయింది. దాన్ని వదల్ను. ఇప్పుడు నిన్నూ వదల్ను..." ఆమెను అలాగే, బాత్రూమ్ నేల మీద పడేయాలని చూశాడు. కానీ ఆ క్షణంలోనే ఒక తెగింపుతో, ఒంట్లో శక్తినంతా కూడదీసుకుని వాడి చేతుల్ని బలంగా లాగేసింది దీప్తి. క్షణం ఆలస్యం చేయకుండా, తలుపు తెరిచి బయటకు పరిగెత్తింది. ఆరేడు అడుగులు వేసిందో లేదో వాడు మళ్ళీ ఆమెను దొరక పుచ్చుకున్నాడు. కెవ్వున అరిచింది.

"సె... సెక్యూరిటీ?" గొంతు పెగల్చుకుని గట్టిగా అరిచింది సాయం కోసం. తన ఇంటిముందు ఒక గార్డ్ కాపలా ఉంటాడు. కానీ తన పిలుపు అతనికి వినపడదని తెలుసు. అయినా ఆఖరి ప్రయత్నంగా అలా అరిచింది. ఇక ఇప్పుడు కృష్ణ మరింత వైల్డ్‌గా మారిపోయాడు "గొడవ చెయ్యొద్దు. గొడవ చేస్తే నేనేం చేస్తానో నాకే తెలీదు" హెచ్చరిస్తూ చెప్పాడు. చెబ్తూనే ఒక బటన్‌నైఫ్ బయటకు తీశాడు, ప్యాంట్ జేబులోంచి.

సరిగ్గా అప్పుడు... ఇంట్లోని ల్యాండ్‌ఫోన్ మోగింది! వాడు ఉలిక్కిపడి అటువేపు చూశాడు.

ట్రింగ్... ట్రింగ్.

ట్రింగ్... ట్రింగ్.

ఉచ్ఛ్వాసనిశ్వాసలు వేగంగా జరుగుతున్నాయామెలో. గుండెలు ఎగిసెగిసి పడుతున్నాయి. ఆమెకు తెలీదు - ఆ ఫోన్ ఉదయ్ నుంచి అని! అవతలి వైపున్న ఉదయ్ ఫోన్ పట్టుకుని, రింగవుతున్న శబ్దాన్ని వింటున్నాడు. "కమాన్, కమాన్! ఫోన్ ఎత్తు దీప్తీ. నీతో ఇంకా మాట్లాడాలి" అనుకుంటున్నాడు.

ట్రింగ్.... ట్రింగ్....

పరిమళదీప్తి జీవితంలో ఓ గొప్ప మధురానుభూతి, ఓ మహావిషాదం రెండూ కలగలిసిన రాత్రి అది! కల్యాణ్ పెళ్ళి ప్రతిపాదన చేయడం ఆమెకు అంతులేని అనుభూతినిచ్చిన ఘటన. కానీ మరుక్షణమే ఆ రేయి ఆమెకు కాళరాత్రిగా మారుతుందని ఊహించలేకపోయింది. అద్దంలో తననుతాను చూసుకుని మురిసిపోయిన దీప్తి, జల్లునీటిలో తడవాలని షవర్ దగ్గరకు వెళ్ళి కెవ్వున కేక పెట్టింది. అప్పుడక్కడ ఏం జరిగింది?

సినిమాలు చేయనంటున్న అవికా

అవికాగోర్ అంటే తెలియకపోవచ్చుకానీ, చిన్నారి పెళ్ళికూతురంటే మాత్రం చాలా మంది టక్కున గుర్తుపట్టేస్తారు. ఆ పాపులారిటీ తోనే సినిమాల్లో అవకాశాలు కూడా అందిపుచ్చుకుంది. అయితే ఇప్పుడు సినిమాలకి గుడ్‌బై చెప్పేయాలని భావిస్తోందట! అలాగే సీరియల్స్‌కి కూడా! ఇంత పెద్ద నిర్ణయం తీసుకోవడానికి కారణం చదువట! తనది ఇంకా చదువుకునే వయస్సే కాబట్టి ముందు బుద్ధిగా చదువుకుని ఆ తరువాత నటన మీద దృష్టి పెడుతుందట! ఓ విధంగా అవికా నిర్ణయం మంచిదే అయినా సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆమెను గుర్తుపడతారా? అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ఆ నిశ్శబ్దంలో, ఫోన్ మోగుతున్న చప్పుడు చాలా బిగ్గరగా వినిపిస్తోంది.

"వదులు... ఫోన్ చూడనీ" ఎందుకో అది ఉదయ్ నుండే అన్న ఊహ ఎదలో మెదిలింది. ఉదయ్ గుర్తు రాగానే ఆమెకు ఎలాగైనా ఈ ప్రమాదం నుండి బయటపడాలని అనిపించింది. ఒక్కసారిగా, వాడి కబంధహస్తాల్ని విదిలించి కొట్టి, ఫోన్ వైపు పరిగెట్టింది. వాడిలో క్రౌర్యం తారస్థాయికి చేరిపోయింది. కళ్ళు ఎర్రగా, నెత్తురు గడ్డకట్టినట్టుగా మారాయి.

"ఆగవే..' ముందు, మీరూ, మేడం అన్నవాడు ఆ తర్వాత 'నువ్వు' అన్నాడు. ఇప్పుడు 'ఆగవే' అంటున్నాడు. అరుస్తూనే ఒక్క అంగలో ఆమెను చేరుకుని సింహం చిన్న లేడిపిల్లను కోరల్లో చిక్కించుకుని వెళ్తున్నట్టు ఆమెను అమాంతం తన భుజాల మీద వేసుకుని మంచం ఉన్న గది వైపు నడిచాడు.

ఆమెలో ఆశ చచ్చిపోతోంది.

"హెల్ప్! హెల్ప్! సెక్యూరిటీ" నిస్సహాయంగా, దీనంగా అరుస్తోంది.

"నన్నేం చేయకు. ప్లీజ్. నీకు దండం పెడతాను. నాకేదైనా అయితే ఈ ఆసుపత్రిలో అనాథలూ, నిరుపేదలూ వికలాంగులూ... అందరికీ ఇబ్బంది కలుగుతుంది. వాళ్ళ కోసమైనా నా పైన దయచూపు. నన్ను వదిలెయ్.. ప్లీజ్.. ప్లీజ్" ఆమె వేడుకుంటోంది, అతని భుజాలపై తలకిందులుగా వేలాడుతూనే.

అంతే!

ఆమె ఎంతకీ ఫోన్ ఎత్తకపోవడంతో, ఫోన్ క్రెడిల్ చేసేశాడు ఉదయ్. ఇక్కడ ఫోన్ మోగడం ఆగిపోయింది.

నిశ్శబ్దం.

ఆమె అంత దీనాతిదీనంగా వేడుకుంటున్నా వాడిలో జాలి కలగలేదు. సరికదా, వాడిలోపలి మృగం జూలు విదుల్చుకుంది. శాడిస్టిక్‌గా నవ్వుతూ "వదిలెయ్ మన్నావ్‌గా... వ...ది...లే.. స్తు...న్నా!" అంటూ ఆమె కాళ్ళను ఒక్కసారిగా పైకి లేపి, భుజం మీదున్న ఆమెను గాలిలోకి వదిలేశాడు!!

అంతే.. దబ్‌మన్న శబ్దం. ఆమె తల నేరుగా వెళ్ళి, మొజాయిక్ ఫ్లోర్‌ని ఢీకొట్టింది. ఎక్కడో, ఏ ఎముకో విరిగినట్టు చిన్న చప్పుడు! తలకు తగిలిన ఆ దెబ్బకి, "అమ్మా" అని బాధతో మూలిగింది దీప్తి. ఇప్పుడామె నేలపైన వెల్లకిలా పడి ఉంది. ఆశగా ఆమె శరీరాన్ని చూశాడు వాడు. చేతిలో కత్తిని విసిరేసాడు. ఆమె నైటీ కాళ్ళ దగ్గర స్థానభ్రంశం చెందింది.

"వద్దు... విడిచిపెట్టు... ప్లీజ్.." కన్నీళ్ళు ధారగా కారిపోతున్నాయి ఆమెలో. చేతులు ఎత్తి దండం పెట్టాలని ప్రయత్నిస్తోంది. కానీ ఎందుకో చేతుల్ని పైకి లేపలేక పోతోంది. నిస్సత్తువ. మీద మీదకి వస్తోన్న ఆ మానవ మృగానికి చిక్కకుండా లేచి పారిపోవాలనీ, దూరంగా జరగాలనీ ప్రయత్నిస్తోంది. కానీ అది సాధ్యం కావడం లేదు. నిస్త్రాణ!

ఎందుకైనా మంచిదని, కుక్కల్ని కట్టివేసే ఇనుప గొలుసుని ఆమె మెడకు చుట్టి దాని రెండో కొనని డైనింగ్ టేబుల్ కాలుకి కట్టేశాడు వాడు, పారిపోకుండా, పెనుగు లాడకుండా ఉండాలని!

వికృతంగా నవ్వుతూ ఆమె మీద వాలాడు వాడు. ఆమె నోరు మాత్రం "వద్దు... వద్దు" అంటోంది. కానీ పెనుగులాడ లేకపోతోంది. కాళ్ళల్లోంచి, చేతుల్లోంచి శక్తినంతా ఎవరో పీల్చేసినట్టు నిస్సత్తువగా, బేలగా, అసహాయంగా వాడి చిత్రవధను అనుభవిస్తోంది.

"నేను రేపే నిన్ను కలుస్తాను దీప్తీ. నీ కళ్ళలోని ఆనందాన్ని చూడ్డానికొక్కడు.."

"సిగ్గుతో ఎరుపెక్కే నీ చెక్కిలిని చూడాలని.."

థాంక్స్ నేను చెప్పాలి దీప్తీ... ఫర్ ఎవ్రీథింగ్ యు గేవ్ టు మీ"

"రాత్రంతా నీ ఆలోచనలతో నిద్ర పోలేనేమో నేను".

కన్నీళ్ళు నిర్విరామంగా ఆమె చెంపల్ని తడిపేస్తున్నాయి. వాడి అసహ్యకరమైన ఊపిరి ఆమె మెడను కాల్చేస్తోంది.

"ఫస్ట్ లవ్ అనే సెంటిమెంటల్ భావన బలీయమైనదే. అయినా 'ట్రూ లవ్' ఇంకా బలీయమైంది. ఎంతో అమూల్యమైంది. ఏదీ ఆశించకుండా, సమర్పణే ధ్యేయంగా సాగే నీ 'నిజమైన ప్రేమ'ను కోల్పోవటం మూర్ఖత్వమే కాదు. అమానుషం కూడా. అందుకే వివాహబంధంతో మనం ఒక్కటవుదాం."

ఆమెకు స్పృహ తప్పుతోంది.

'ఇంతకాలం నీ కోసం వేచి ఉన్నాను ఉదయ్. కానీ ఇప్పుడు సర్వం కోల్పోయాను. నన్ను క్షమించు.. ఉదయ్...'

తను కేవలం శారీరకంగా మలినపడిందని మాత్రమే ఆమెకు తెలుసు. కానీ దానికి ఎన్నో రెట్లు భయంకరమైన నష్టం జరిగిపోయిందని తెలీదు!!

●●●

కాస్తాగి, మళ్ళీ దీప్తి నంబర్ డయల్ చేశాడు ఉదయ్. ఎన్నిసార్లు మోగినా ఆమె ఫోన్ ఎత్తడం లేదు.

ఏం చేస్తున్నావ్ దీప్తీ? ఇంట్లోనే ఉన్నావా? లేక ఏ ఎమర్జెన్సీ అనో మళ్ళీ హాస్పిటల్‌కి వెళ్ళావా? అలా అనుకుంటూండగానే హఠాత్తుగా ఆ ఆలోచన వచ్చింది! 'రేపు కలుస్తానన్నాను. కానీ రేపటి దాకా ఆగలేక వచ్చేశాను' అని ఇప్పుడే వెళ్ళి దీప్తితో చెప్తే ఎంతో సంతోషిస్తుంది తను? ఆ సంతోషం చూడాలి. ఆ చెంపల్లో ఆవిరి చూడాలి. అనూహ్యంగా తను ఆమె వద్ద ప్రత్యక్షమైనపుడు ఆ కళ్ళల్లో కదిలే సంభ్రమాన్ని చూడాలి. అంతే. అతను దుస్తులు మార్చుకుని బయటకు వచ్చేశాడు. ఎంతో ఆహ్లాదకరమైన మనస్థితిలో వస్తోన్న అతనికి అత్యంత దారుణమైన దృశ్యం ఎదురు కాబోతోందని ఊహించ లేదతను.

●●●

నైటీ అంతా తడిసిపోతోంది రక్తంతో. నేల మీద పారిన రక్తం మెల్లగా గడ్డ కడ్తోంది. "దీప్తీ! దీప్తీ!" అని పిలుస్తూ లోపలికి అడుగుపెట్టిన ఉదయ్‌కి నేలమీద చెదిరిన దుస్తులతో స్పృహ లేకుండా పడి ఉన్న ఆమెను చూడ్డంతోనే, ఊపిరి ఆగింది!

"దీప్తీ!"

గుండెలవిసేలా ఉన్న ఆ పిలుపు ఆ ఇంటి నాలుగు గోడల మధ్య ప్రతిధ్వనించింది!

●●●

నలుగురు స్పైన్ స్పెషలిస్టులూ (వెన్నెముక నిపుణులు) ఇద్దరు న్యూరోసర్జన్లూ, మరో ఇద్దరు ఆర్థోనిపుణులూ... అంతా కలిసి వివిధ రకాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఎం.ఆర్.ఐ.,

డాక్టర్ ధేనువకొండ శ్రీరామమూర్తి

బహుమతి పొందిన నవల

కామరూప

త్వరలో....

సీటీ స్కాన్లూ.... అన్నీ అయ్యాయి. అంతా కలిసి దీప్తి 'గాయాన్ని' నిర్ధారించారు.

ఆమె గాలిలోంచి తలకిందులుగా నేలమీద పడ్డప్పుడు తల తాలూకు స్కల్‌కి గాయమైంది. కానీ మెడ ఓ... ప...క్క...కు... వం...గి...పో..యింది!! మెడలోని వెన్నుపూసలు ఒకదానిలోకి మరొకటి ఇరుక్కుని, పూర్తిగా 'జామ్' అయిపోయాయి.! దాంతో శరీరంలోని ఇతర అవయవాలకి వెళ్ళే నరాలన్నీ 'నొక్కబడి' పోతున్నాయి! సర్జరీకి వీలు లేని విధంగా ఆ వెన్నుపూసలు ఒకదాన్లోకి ఒకటి ఇరుక్కుపోయాయి. ఒకే ఒక అదృష్టం ఏంటంటే మెదడుకి ఏ నష్టమూ జరగలేదు. కాకపోతే మెడ కింద ఉన్న ఆమె శరీరావయవాలన్నీ పూర్తిగా చచ్చుబడిపోయాయి. చేతులూ, కాళ్ళూ... ఇంకా ఏ అవయవమూ పని చేయవు. అసలు మెడ కింద తనకొక శరీరం ఉంది అనే స్పృహ కూడా ఆమెకు తెలీదు. కేవలం తల, ముఖం, మెదడు, అంతే ఇప్పుడు డాక్టర్ పరిమళదీప్తి అంటే!!!

మెడికల్‌గా తన పరిస్థితి ఏమిటో ఆమెకు అర్థం కావడానికీ, అర్థమైంది మనసులో ఇంకడానికీ చాలా సమయమే పట్టింది. దుఃఖం పొంగుకు రాలేదు. ఆ స్థితి, సాధారణమైన దుఃఖాన్ని మించినది. ఆ బాధను కొలిచే కన్నీళ్ళు లేవు. కరువు తీరా ఏడ్వాలని ఉన్నా కన్నీళ్ళు రాలని చిత్రమైన వ్యధాభరిత స్థితి. గుండె నిండా గడ్డ కట్టుకుపోయిన బాధ.

ఆ పరిస్థితిని ఎంతో మానసిక పరిపక్వతతో ఎదుర్కొన్నాడు ఉదయ్.

ఆమె చేతిని ఒక్కక్షణం కూడా వదలకుండా అలా పట్టుకునే ఉంటున్నాడతను. అసలు విషాదం ఏంటంటే అతని 'స్పర్శ' ఆమెకు తెలీదు!! ఆమెకు తెలిసేదంతా ఒక్కటే, 'అతను తనతో ఉన్నాడు. తన చెంత ఉన్నాడు' అని మాత్రమే!!

స్రవంతి చెప్పిన వివరాలతో పోలీసులు కృష్ణ అనే ఆ మానవ మృగాన్ని పట్టుకున్నా, వాడు బెయిల్‌పైన బయటి కొచ్చేశాడు. కానీ బెయిల్‌పై బయటికొచ్చిన రోజే, రోడ్డు ప్రమాదంలో, పద హారు టన్నుల ఇనుపరాడ్ల లోడ్ ఉన్న లారీ కిందపడి నుజ్జునుజ్జై పోయాడు!!!

కొన్ని నెలలు తర్వాత-

ఉదయ్, దీప్తి కళ్ళల్లోకి చూస్తూ "ఎప్పుడు సెట్స్‌కి వెళ్దాం దీప్తీ?" అన్నాడు. ఆమె విరక్తిగా నవ్వింది.

కానీ అతడు పట్టుపట్టి, ఆమెను వివాహానికి ఒప్పించాడు. ఓ శుభముహూర్తాన ఆమె మెడలో తాళి కట్టాడు. అన్నీ తనే అయ్యాడు. ఆమెకు సంబంధించిన అన్ని పనులూ తనే స్వయంగా చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు.

ఆమె కారుణ్య మరణం కోసం కోర్టుల్ని వేడుకుంది. కానీ ఉదయ్ దాన్ని వ్యతిరేకించాడు. కోర్టులూ అతని పక్షానే నిలిచాయి.

ప్రేమంటే ఇవ్వడం మాత్రమే. ప్రతిఫలంగా ఏదో ఒకటి ఆశించడం కాదు. కోరుకోవడం కాదు' అన్న మాటలకు అతడు తిరుగులేని నిరూపణగా నిలిచాడు!!

•••

ప్రస్తుతం

"..... అలా మెడకు కింది భాగమంతా పేరలైజైపోయి ఒక 'వెజిటబుల్‌గా' మారిపోయిన డాక్టర్ పరిమళగారికి ఒక 'సేవకుడి'గా, ఒక 'మగనర్సు'గా మిగిలిపోయాడు కల్యాణ్ గారు".

లలిత్ చెప్పడం ముగించేసరికి, కీర్తన కన్నుల్లోంచి కన్నీళ్ళు జలజలా రాలిపోతున్నాయి.

లలిత్‌కి గానీ, కీర్తనకు గానీ తెలీదు - ట్రేలో టీ కప్పులతో అక్కడికి వచ్చిన సంధ్య కూడా లలిత్ చెప్పినదంతా వింటూనే ఉందనీ, ఆవిడ హృదయం బరువెక్కిపోయి ఆర్ద్రతతో పొంగిపొరలి పోతోందనీనూ!!

అప్పుడు లలిత్ చెప్పాడు. "ఎవరి వలన నీకు ప్రాణాపాయం ఉన్నదో, ఆ రవి అనే హంతకుడ్ని పోలీసులు కాదు పట్టుకున్నది. నీ ప్రాణాలు కాపాడ్డం కోసం కల్యాణ్ గారు రవిని కలిశారు. కలిసి, అతని ఆలోచనా దృక్పథాన్ని మార్చారు. కేవలం కల్యాణ్‌గారంటే అతనికున్న పూజ్య భావం కారణంగా అతను మారాడు. 'మారి' పరోక్షంగా నీ పట్ల తన 'క్షమ'ను చాటాడు" అంటూ అసలు రవి ఏ పరిస్థితుల్లో ఎలా మరణించాడో చెప్పాడు.

కీర్తన కళ్ళలోంచి ధారాపాతంగా కన్నీళ్ళు కారిపోతున్నాయి.

"అమ్మాయిల్ని ఎక్స్‌ప్లాయిట్ చేసే ఆ రాక్షసుడి ఆలోచన కూడా భరించలేను. అయ్ హేట్ హిమ్"

"అతని గురించిన ఊహే డిజ్‌గస్టింగ్‌గా ఉంది".

"అలాంటి నీచుడి ముఖం చూడాలన్నా పాపమే".

తను కల్యాణ్ గారి నెంతగా అపార్థం చేసుకుంది?!

అంత మహోన్నత వ్యక్తిత్వం గల ఆయన్ను రాక్షసుడనీ, నీచుడనీ ఎలా అనగలిగింది?!

కీర్తన ఆ దిగ్భ్రమావస్థలో ఉండగానే గుమ్మం దగ్గర ఎవరో వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దం వినపడింది. అది సంధ్యా మాధవి! లలిత్ చెప్తున్న ప్రతి విషయం ఆవిడా వింటూనే ఉంది. ఆ వాస్తవాలు ఆమెలోని స్త్రీ హృదయాన్ని కుదిపి వేశాయి.

ఉదయ్ గురించి తనెంత వికృతంగా ఆలోచించింది. శ్రీకాంత్ అతన్నీ హత్య చేయిస్తానన్నప్పుడు కూడా ఏమీ మాట్లాడకుండా, 'మౌనం'గా ఉండిపోయిందంటే దాని అర్థం ఏమిటి?

తనలో ఇంత అమానుషత్వమూ, ఇంత క్రూరత్వమూ దాగి ఉన్నాయా? తనలోని స్త్రీ సహజమైన కరుణా, ప్రేమా, సున్నితత్వమూ ఏమైపోయాయి?!

ఆ రోజు ఉదయ్ అంధుడైపోయాడని తెలీగానే, లోపలి ప్రేమను మరో వ్యక్తి మీదకి అంత అనాయాసంగా ఎలా మళ్ళించగలిగింది. అసలు ఆ రోజే 'స్త్రీ'గా తను మరణించిందా?

•••

ఉదయ్ నిర్మలప్రేమ అనే మేరుపర్వతం ముందు తన ప్రేమ ఓ గులకరాయి. ఊహు.. అది కూడా కాదు. ఓ ఇసుక రేణువు!!

అతను ఇంకా తన హృదయంలో నన్ను నిలుపుకునే ఉండి ఉంటాడు. పరిమళను పెళ్ళి చేసుకున్నది కేవలం ఆమెకు తోడుగా నీడగా ఉంటూ, సేవలు చేయడానికే, అదంతా మానవీయత!!

తన పట్ల కలిగిన ఆ తొలి ప్రేమ పరిమళం వలనేనా, కీర్తనను కాపాడేందుకు అంతగా తపించిపోయింది? ఆ తపన వెనుక గల కారణం తనకు బాధ కలగకూడదనే కన్‌సర్న్?!

ఉదయ్ ప్రేమ ఓ వెలుగుల జలపాతం. ఏ మేఘాలూ ముసరని నిర్మలాకాశం. సంధ్యకి గుండె గొంతులోకి వచ్చేస్తోంది. చెప్పనలవి కాని బాధ. మనసుని మెలితిప్పేస్తున్న అపరాధ భావన.

కన్నీళ్ళతో ఉదయ్ పాదాల్ని కడిగేదాకా తన వేదన తీరదనిపిస్తోంది.

వెక్కిళ్ళు విని బయటకు వచ్చి చూసిన లలిత్ కీర్తనలు అశ్రునయనాలతో ఎవ్వరూ ఆపలేనంతగా రోదిస్తున్న సంధ్యను చూసి నిశ్చేష్టులైపోయారు!!

(ముగింపు వచ్చే వారం)

వంటలు

మ్యాంగో కలాకండ్

కావలసిన పదార్థాలు: మామిడి గుజ్జు - ఒక కప్పు, పన్నీర్ తురిమినది - అర కప్పు, కండెన్స్‌డ్ మిల్క్ - అర కప్పు, నెయ్యి - 1 టీ స్పూన్, యాలకుల పొడి - పావు టీ స్పూన్, జీడిపప్పు, బాదం, పిస్తా (చిన్న ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి) - 1 టేబుల్ స్పూన్

తయారీ విధానం: నాన్‌స్టిక్ పాన్‌లో కొద్దిగా నెయ్యి వేసి మామిడి గుజ్జు వేసి రెండు నిమిషాలు ఉడికించాలి. తరువాత తురిమిన పన్నీరు వేసి మిశ్రమాన్ని కలుపుతూ ఉడికించుకోవాలి. కండెన్స్‌డ్ మిల్క్ కూడా వేసుకోవాలి. ఈ మిశ్రమం అంతా చిక్కబడి దగ్గరగా అయ్యేంత వరకూ కలుపుతూనే ఉండాలి. యాలకుల పొడి వేసి, మిశ్రమం దగ్గరపడ్డాక స్టవ్ మీద నుంచి పాన్ దించాలి. నెయ్యి రాసి పెట్టుకున్న ప్లేట్‌లో మిశ్రమాన్ని సమంగా పోసి, దానిపైన జీడిపప్పు, బాదం, పిస్తాలతో డెకరేట్ చేసుకోవాలి. చల్లారిన తరువాత ముక్కలుగా కట్ చేసుకుంటే నోరూరించే మ్యాంగో కలాకండ్ రెడీ.

డ్రైఫ్రూట్, మ్యాంగో లస్సీ

కావలసిన పదార్థాలు: పెరుగు - ఒక కప్పు, మామిడికాయ - 1, బాదం - 4-5 (పొడి చేసుకోవాలి), పిస్తాలు - 3-4 (పొడి చేసుకోవాలి), పంచదార - 3 టేబుల్ స్పూన్లు, రోజ్ వాటర్ - కొద్దిగా, ఐస్ క్యూబ్స్

తయారీ విధానం: ముందుగా పెరుగును ఒక గిన్నెలో వడగట్టుకోవాలి. తర్వాత మిక్సీజార్‌లో వడగట్టుకున్న చిక్కటి పెరుగు, మామిడి ముక్కలు, కొద్దిగా నీళ్ళు, పంచదార కూడా వేసి గ్రైండ్ చేయాలి. ఇలా గ్రైండ్ చేసుకున్న మిశ్రమంలో రెండు మూడు చుక్కల రోజ్ వాటర్ వేసి మరోసారి గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు గ్రైండ్ చేసుకున్న దాన్ని వేరే గిన్నెలోకి వడపోసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఫైబర్ మరియు మామిడి ముక్కలు తొలగించవచ్చు. తర్వాత ఒక గ్లాసు తీసుకుని అందులో ఐస్‌క్యూబ్స్ వేసి, వడగట్టిన మ్యాంగో లస్సీ వేసి, డ్రైఫ్రూట్స్ పొడి, పలుకులతో గార్నిష్ చేయాలి. మీకు ఇష్టం అయితే గ్రైండ్ చేసేటప్పుడే కొన్ని డ్రైఫ్రూట్స్‌ను వేసుకోవచ్చు.

మ్యాంగో పులిసేరీ

కావలసిన పదార్థాలు: మామిడిపండు - 1, కొబ్బరి తురుము - 3 టేబుల్ స్పూన్లు, ఎండు మిర్చి - 2, మెంతులు - అర టీ స్పూను, చిక్కటి మజ్జిగ - ఒకటిన్నర కప్పు, నూనె - 2 టీ స్పూన్లు, ఆవాలు - అర టీ స్పూను, కరివేపాకు - రెండు రెమ్మలు, ఉప్పు - తగినంత

తయారీ: ముందుగా మామిడి పండు తొక్క తీసి పెద్ద పెద్ద ముక్కలుగా కట్ చేయాలి. ఒక పాత్రలో కొద్దిగా నీళ్ళు, మామిడిముక్కలు, కరివేపాకు వేసి ఉడికించాలి. చిన్న బాణలిలో టీ స్పూను నూనె వేసి కాగాక మెంతులు, ఎండు మిర్చి వేసి వేయించి చల్లారాక, మిక్సీలో వేసి, కొద్దిగా నీళ్ళు జత చేసి మెత్తగా చేసి, ఉడుకుతున్న మామిడిపండు గుజ్జులో వేయాలి. ఉడుకుతుండగానే మజ్జిగ జత చేసి, కలిపి దించేయాలి. మరొక చిన్న బాణలిలో నూనె వేసి కాగాక ఆవాలు వేసి చిటపటలాడాక, కరివేపాకు వేసి వేయించి, మామిడి పండు గుజ్జులో వేయాలి. ఇది అన్నంలోకి బాగుంటుంది.

మామిడి సలాడ్

కావలసిన పదార్థాలు: నువ్వులు - 1 టేబుల్ స్పూన్, పల్లీలు - 1 టేబుల్ స్పూన్, బెల్లం - 1 టేబుల్ స్పూన్, పచ్చి మామిడికాయ తురుము - ఒక కప్పు, రెడ్ మరియు ఎల్లో క్యాప్సికమ్ తరుగు - ఒక కప్పు, కొత్తిమీర తరుగు - 4 టేబుల్ స్పూన్లు, ఉప్పు - తగినంత, మిరియాల పొడి - తగినంత

తయారీ విధానం: బాణలిని స్టవ్ మీద ఉంచి వేడయ్యాక నువ్వులు, పల్లీలు విడివిడిగా వేయించి తీయాలి. పల్లీలు, నువ్వులు, బెల్లం వేసి, పొడిపొడిగా అయ్యేలా దంచి, పక్కన ఉంచాలి. ఒక పాత్రలో పచ్చి మామిడికాయ తురుము, ఎల్లో మరియు రెడ్ క్యాప్సికమ్ తరుగు, ఉప్పు, మిరియాల పొడి వేసి కలిపి ప్లేట్‌లోకి తీసుకోవాలి (ముందుగా వీటిని ఫ్రిజ్‌లో ఉంచి చల్లబడనివ్వాలి). ఈ మిశ్రమంపైన పల్లీలు, నువ్వులు, బెల్లం మిశ్రమం, కొత్తిమీర, చల్లి సర్వింగ్ బౌల్స్‌లో అందిస్తే ఆ టేస్టే వేరు.

మామిడి-పుదీనా పచ్చడి

కావలసిన పదార్థాలు: పచ్చి మామిడికాయ - 1, పుదీనా - 1 కట్ట, వెల్లుల్లి రెబ్బలు - 4, బ్లాక్ సాల్ట్ - అర టీ స్పూన్, పచ్చిమిర్చి - 3, జీలకర్ర పొడి- 2 టీ స్పూన్లు, ఉప్పు - రుచికి సరిపడా

తయారీ: ముందుగా పచ్చి మామిడికాయను శుభ్రంగా కడిగి తేమ తుడిచేసి పీలర్‌తో పొట్టు తీసి, ముక్కలుగా కట్ చేసి పక్కన పెట్టుకోవాలి. తర్వాత పుదీనా ఆకులను తీసి శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. పచ్చి మామిడికాయ ముక్కలు, పుదీనా ఆకులు, వెల్లుల్లి రెబ్బలు, పచ్చిమిర్చి అన్నింటినీ మిక్సీలో వేసి రుబ్బుకోవాలి. కొద్దిగా నీళ్ళు కలుపుకొని పేస్ట్ చేసుకోవాలి. తర్వాత ఈ చట్నీని గిన్నెలోకి తీసుకుని, దానికి కొద్దిగా ఉప్పు, జీలకర్ర వేసి కలుపుకోవాలి. అవసరం అయితే పోపు పెట్టుకోవచ్చు.

ఇంటర్వ్యూ

నటనానుభవం లేకపోతే సీను పండదు

-జెన్నీ

నటుడు, కథకుడు పోలాప్రగడ జనార్దనరావు. జెన్నీగా ప్రసిద్ధులు. తొలి తెలుగు మూకాభినటుడు. మూడు దశాబ్దాలుగా పలు భాషల్లో 400 చిత్రాల్లో నటించారు. ఒక సీను పండాలంటే అనుభవం ఉన్న నటులు కావాలంటున్న జెన్నీ ఇంటర్వ్యూ....

తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మా ఊరు. మాది వ్యవసాయ కుటుంబం. నాన్న పోలాప్రగడ సుబ్బారావు. గ్రామ కరణం. అమ్మ లక్ష్మీదేవమ్మ. 1944 మే 15న నేను పుట్టాను. నాకు నలుగురు అక్కయ్యలు, ఇద్దరు అన్నయ్యలు, ముగ్గురు చెల్లాయిలు. ఊళ్ళో ఎస్సెల్సీ చదివి రాజమండ్రిలో బీకాం చేశాను. 1966లో హైదరాబాద్ చేరి చిన్న ప్రభుత్వ ఉద్యోగం సంపాదించా. ప్రైవేటుగా ఎంకాం చేసి 1968 నాటికి ఇసిఐఎల్‌లో అకౌంట్స్ మేనేజర్‌గా స్థిరపడ్డాను.

నాటకరంగం

సాహితీవేత్తల పురిటిగడ్డ మా ఊరు. ఉషశ్రీ, పోరంకి దక్షిణామూర్తి, పోతుకూరి సాంబశివరావు, పోలాప్రగడ సత్యనారాయణమూర్తి, కనకప్రవాస్, పోలాప్రగడ రాజ్యలక్ష్మి వంటివారు మా ఊళ్ళో స్థాపించిన నవ్యసాహితీ సమితి 70 ఏళ్లుగా నేటికీ సేవలు అందిస్తోంది. అన్నయ్యలు గోపాలకృష్ణ, సీతారామయ్య నాకు గురువులై నన్ను నటుడిగా తీర్చిదిద్దారు. ఊళ్ళో వారు నాటక సమాజం స్థాపించి నాటకాలు వేసేవారు. వారి ప్రోత్సాహంతో నాలుగో తరగతిలోనే పల్లెపడుచు నాటకంలో నటించాను. ఆడది, రిక్షావోడు, కప్పలు వంటి నాటకాలతో బాల నటుడిగా ఎన్నో బహుమతులు పొందాను.

సినిమా కల

మా గోపి, వదినగారి గాజులు లాంటి పిల్లల ప్రాధాన్యంగల సినిమాలు చూసి స్ఫూర్తి పొందేవాణ్ణి. నా బహుమతులన్నీ మద్రాసులో చూపించి సినిమాల్లో బాలనటుడిగా స్థిరపడాలని ఆ వయసులోనే కలలు కనేవాణ్ణి. గొప్పనటుడు కావాలంటే నటన బాగా నేర్చుకోవాలి. దానికి సంబంధించిన పుస్తకాలు చదివి అర్థం చేసుకోవాలి. అందుకని ఇప్పుడు బాగా చదువుకోవాలని అమ్మచెప్పిన మాటలే నాకు శిరోధార్యమయ్యాయి. బంధువుల ముందు పద్యాలు పాడించి, ఏక పాత్రాభినయాలు చేయిస్తూ నాలో స్టేజ్ ఫియర్ పోగొట్టి నటుడుగా తీర్చిదిద్దింది అమ్మ. ఆ స్ఫూర్తితో చిన్నమొత్తాల పొదుపుపై నాటి విద్యాశాఖవారి రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీల్లో స్వర్ణపతకం గెలుచుకున్నాను. కాలేజీ నాటకపోటీల్లో అనేకసార్లు ఉత్తమ హాస్యనటుడుగా బహుమతులందుకున్నాను.

ఆలిండియా అండర్-19 బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపికై రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించా. అర్జున అవార్డు గ్రహీత పిచ్చయ్యగారితో కలిసి బ్యాడ్మింటన్ ఆడేవాణ్ణి.

రంగస్థల శిక్షణ

హైదరాబాద్‌లో పద్మశ్రీ ఎ.ఆర్.కృష్ణ నాట్యవిద్యాలయంలో మూడేళ్ళు థియేటర్ ఆర్ట్స్ కోర్సు చేశాను. చాట్ల శ్రీరాములు, జె.ఎల్.నరసింహారావు, డి.ఎల్.ఎన్. దీక్షితులు, తల్లావఝ్ఝుల సుందరం వంటి రంగస్థల దర్శకుల వద్ద శిష్యరికం చేశాను.

ఇసిఐఎల్ ఎంప్లాయీస్ కల్చరల్ అసోసియేషన్ ద్వారా ఎన్నో సార్లు ఉత్తమ నటుడు, హాస్యనటుడు బహుమతులు పొందాను. ప్రస్తుతం రాళ్ళపల్లి స్థాపించిన మురళీ కళానిలయంలో నాటకాలు వేస్తున్నాం. స్టేజీమీద నటనకు, తెరమీద నటనకు నాకు తేడా వివరించి చెప్పిన గురువు జంధ్యాల.

తొలి తెలుగు మూకాభినటుణ్ణి

మూకాభినయం (మైమ్)లో తొలి తెలుగు నటుణ్ణి నేనే. 1970లో మూకాభినయం చేసే పారిస్ నటుడు ఆల్ఫ్రెడ్ వారెన్ హైదరాబాద్‌లో ప్రదర్శనలు ఇచ్చారు. ఆయనకు శిష్యరికంచేసి అనేక దేశాల్లో 1000కి పైగా మూకాభినయ ప్రదర్శనలు ఇచ్చాను. గంటసేపు ఈ ప్రదర్శన చేసేవాణ్ణి. ఆంధ్రా, ఉస్మానియా, బెనారస్ సహా అనేక విశ్వవిద్యాలయాలు నన్ను ప్రోత్సహించాయి. ఉస్మానియా యూనివర్సిటీలో, మధు ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో, అక్కినేని సినీ, రేడియో గురుకుల సంస్థలో మూకాభినయ అధ్యాపకునిగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాను. రాష్ట్ర ప్రభుత్వ మైమ్ వర్క్‌షాప్ ఫ్యాకల్టీగా చేశాను. నాటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ సమక్షంలో మూకాభినయ ప్రదర్శన చేసిన తెలుగు నటుణ్ణి నేనే. నేరెళ్ళ వేణుమాధవ్, ఫన్ డాక్టర్ చంద్రశేఖర్

లతో కలిసి ఎన్నో మైమ్ ప్రదర్శనలు చేశాను.

400 చిత్రాలు

నటుడుగా, నాటక రచయితగా దూరదర్శన్, ఆకాశవాణిలలో ఎన్నో ప్రదర్శనలు చేశాను. హైదరాబాద్‌లో నాటకం ప్రదర్శిస్తుండగా రచయిత జంధ్యాలగారు నన్ను చూసి 1986లో 'అహ నా పెళ్ళంట' చిత్రంలో చిన్న వేషం ఇచ్చారు. అప్పుడే నాకు రామానాయుడుగారితో పరిచయం ఏర్పడింది. సినీరంగం హైదరాబాద్‌లో స్థిరపడే సమయంలో లోకల్ టాలెంట్‌ని ప్రోత్సహించేవారు. ఉద్యోగానికి సెలవు పెట్టి, జంధ్యాల, బాపు, దాసరి, రాఘవేంద్రరావు, త్రివిక్రమ్ శ్రీనివాస్, శ్రీనువైట్ల, ఇవివి సత్యనారాయణ, వి.వి.వినాయక్ వంటి ఎందరో దర్శకుల చిత్రాల్లో నటించాను. తెలుగు, హిందీ, బెంగాలీ, భోజ్‌పురి, తమిళం, కన్నడ బాషల్లో మొత్తం 400 చిత్రాల్లో నటించా. వీటిల్లో హిందీ, తమిళంలో చెరో 15 చిత్రాల్లో చేశాను. రెండు బెంగాలీ చిత్రాలు చేశాను.

చెల్లాయికి పెళ్ళి.. మళ్ళీ మళ్ళీ..

నాకు గుర్తింపునిచ్చిన చిత్రం 'యమలీల'. చెల్లాయికి పెళ్ళి అవ్వాలి మళ్ళీ..మళ్ళీ..అని తనికెళ్ళ భరణి రాసి తెచ్చిన కవిత ప్రచురించే సందర్భంలో పత్రికా ఎడిటర్‌గా కామెడీ సన్నివేశం ప్రేక్షకులకు గుర్తుండిపోయింది. ఆ సన్నివేశమే నాకు ఎన్నో సినిమాల్లో అవకాశాలిచ్చింది.

పరుచూరి రఘుబాబు స్మారక నాటకోత్సవాల్లో ఉత్తమ నటన ప్రదర్శించిన వారికి పరుచూరి బ్రదర్స్ సినిమా అవకాశాలిచ్చేవారు. దొంగలబండి నాటకంలో వారు నన్ను ఉత్తమ నటుడుగా ఎంపికచేశారు. దాంతో ప్రాణదాతలో నాకు అవకాశం ఇచ్చారు. బ్రహ్మానందానికి మామగారివేషం నాకు మంచి గుర్తింపు తెచ్చింది. ఆయనతో ఐదారు చిత్రాలు చేశాను. కోట శ్రీనివాసరావు నా నాటక రంగ మిత్రుడు. స్నేహశీలురు. ఉద్యోగం వల్ల హైదరాబాద్ వదిలి వెళ్ళలేకపోయాను. కానీ జంధ్యాల, బాపు, విశ్వనాథ్‌గార్లు హైదరాబాద్‌లో తీసిన అన్ని చిత్రాల్లో నటించాను. నాకు సాత్వికాభినయం నేర్పిన దర్శకులు బాపు, విశ్వనాథ్‌లే.

2000 సంవత్సరంలో ఉద్యోగ బాధ్యతలు విరమించి పూర్తి స్థాయిలో నటనపై దృష్టి సారించాను.

ఇంప్రొవైజేషన్‌పై పాఠం

దాసరిగారి అభిమానం చూరగొనాలని షూటింగ్‌లో డైలాగ్ ఇంప్రొవైజ్ చేసేవాణ్ణి. ఆయనో మంచి మాట చెప్పారు. ఇంప్రొవైజేషన్ అంటే, రచయిత డైలాగ్ పొడుగు పెంచడం కాదు. మంచి పదాలేవైనా బుర్రకు తడితే భావానుగుణంగా ఇంప్రొవైజ్ చెయ్యాలి తప్ప సెంటెన్స్‌ను కాంప్లికేట్ చెయ్యకూడదంటూ మంచి పాఠం నేర్పారాయన.


నాటి ముఖ్యమంత్రి కె.రోశయ్య నుండి పురస్కారం స్వీకరిస్తూ...

కుటుంబ సభ్యులతో...

తెలుగు బాగా వచ్చిన నటుణ్ణి నా పక్కన వేయండి అని దర్శకుడు సురేష్‌కృష్ణను కమల్ హాసన్ 'ఇంద్రుడు-చంద్రుడు' సినిమా షూటింగ్ సమయంలో కోరారు. అప్పుడు నాకు అవకాశం ఇచ్చారు. డైలాగ్స్‌లో కమల్‌హాసన్ సందేహాలన్నీ నేనే తీర్చేవాణ్ణి. నాకు అదొక మధురానుభవం. రజనీకాంత్ 'బాషా' చిత్రంలో కూడా అదేవిధంగా నాకు అవకాశం లభించింది.

రామానాయుడుగారు 'యమలీల' చిత్రాన్ని హిందీలో వెంకటేష్‌తో 'తక్దీర్‌వాలా'గా తీసినప్పుడు ఎస్సై పాత్రలో అనుపమ్‌ఖేర్ పక్కన కానిస్టేబుల్‌గా నాకు అవకాశం ఇచ్చారు.

అక్కినేనితో

ఏఎన్నార్‌తో కలిసి ప్రాణదాత చిత్రంలో నటించాను. ఒక నటుడికి ఆంగికాభినయం స్టేజీమీద ఎంతవరకు అవసరమో, తెరమీదకు వచ్చేసరికి ఎక్స్‌ప్రెషన్స్ ఎంత క్లారిటీగా, డీటైల్‌గా ఉండాలో తోటి నటీనటులమైన మాకు విరామ సమయాల్లో చెబుతూ ఉండేవారు అక్కినేని. అప్పుడు ఆయనలో నేనొక అధ్యాపకుణ్ణి చూశాను.

అవార్డులు

అనేక పరిషత్తులకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాను. పరిషత్తుల్లో ఉత్తమ నటుడు, ఉత్తమ హాస్య నటుడు అవార్డులెన్నో పొందాను. గుమ్మడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నా.

1986లో జైసీస్ అవుట్‌స్టాండింగ్ యంగ్ పర్సన్ అవార్డు, టీవీ రంగంలో 2007 బెస్ట్ కమెడియన్‌గా వంశీ ఆర్ట్ థియేటర్ అవార్డు పొందాను.

కథా రచన

బాల్యం నుండీ పుస్తకాలు బాగా చదివేవాణ్ణి. గడిచిన ఐదేళ్ళల్లో 40 కథలు రాశాను. తొలి కథ ఆంధ్రజ్యోతి ప్రచురించింది. నవ్య వీక్లీలో ఐదారు కథలు ప్రచురితమయ్యాయి. ఇప్పటి వరకు 21 కథలకు వివిధ పత్రికల్లో బహుమతులు అందుకున్నాను.

టీవీ రంగం

పదిహేనేళ్ళుగా అన్ని టీవీ చానల్స్‌లో కలిపి ముప్పై సీరియల్స్‌లో నటించాను. ప్రస్తుతం మూడు సీరియల్స్ చేస్తున్నాను.

1990లో దూరదర్శన్ ఉత్తమ నటుడు, ఉత్తమ సహాయ నటుడు అవార్డులు అందుకున్నా.

ప్రస్తుతం సిసిఆర్‌టిఐ (కేంద్ర సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థ) ద్వారా 25 వేల మంది 9, 10 విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం, మూకాభినయం నేర్పిస్తున్నాం. ప్రస్తుతం ఐదారు చిత్రాల్లో నటిస్తున్నాను.

అన్ని రసాలు పరిపూర్ణంగా ఉండాలి

ఆ రోజుల్లో ఫలానా పాత్రకు ఎవరైతే సరైన నటుడని భావిస్తారో, వారిచేతనే పాత్ర వేయించేవారు. వారి కోసం ఎదురుచూసేవారు. కానీ ఇప్పుడు అందుబాటులో ఉన్నవారితో అన్నిపాత్రలూ చేయిస్తున్నారు. దీనివల్ల పాత్రకు పరిపూర్ణత చేకూరదనే కంటే, ఎక్కువ మందికి అవకాశాలు లభిస్తాయనవచ్చు. కానీ ఆ పాత్ర పదికాలాలపాటు ప్రేక్షకుల మనసులలో గుర్తుండిపోవడం లేదు. కొత్త నటులకు అవకాశాలు ఇవ్వాల్సిందే. కానీ పాత నటుల్ని మరిచిపోకూడదు. ఒక సీను పండాలంటే, అనుభవం ఉన్న నటుడు కావాలి. అనుభవజ్ఞుడు ఒక పెద్ద నటుడి పక్కన చిన్న పాత్ర వేసినా అనుభవంవల్ల ఆ సీను రక్తికడుతుంది. అలా చేయకపోవడం వల్ల ప్రేక్షకుల్లో రసోత్పత్తి కలగడం లేదు. మళ్ళీ మళ్ళీ ఆ సీన్లు చూడాలనే ఉత్సాహం కలగడం లేదు. ఇలాంటివి అప్పుడప్పుడు సినిమాకు నష్టం కలిగించవచ్చు.

అన్ని రకాలు, రుచికరమైన ఆదరవులుంటేనే అది షడ్రసోపేతం, పరిపూర్ణ ఆహారం. సినిమా కూడా అంతే. అన్ని రసాలు పరిపూర్ణంగా ఉండాలి. రచయిత, దర్శకుడు, నటుడు ఈ ముగ్గురే దాన్ని సమతుల్యం చేయగలరు. సమర్థులైన ఈ ముగ్గురినీ సమకూర్చుకోవడంలోనే నిర్మాత అభిరుచి ఏమిటో ప్రేక్షకులకు తెలుస్తుంది.

కుటుంబం

నా వివాహం 1970లో జరిగింది. నా భార్య మాణిక్యాంబ. తెలుగు ఉపాధ్యాయురాలు. మాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి జానకి, అల్లుడు గాయత్రీ శంకర్. మనవలు, మనవరాళ్ళు పెద్ద చదువుల్లో ఉన్నారు. అబ్బాయి గోపాలకృష్ణ. ఐటీ సంస్థలో డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్. కోడలు ఉమ ఎమ్మెస్సీ బయోటెక్నాలజీలో లెక్చరర్.

-రామ్మోహన్



పాత్రుడికి పేపర్లో ఆ వార్త చదవగానే ఏదో కలవరం మొదలైంది. ఆ కాగితాన్ని లిట్మస్ టెస్ట్‌కి పంపితే రంగులు మారడం మొదలై, తన అసలు రంగు బయటపెడుతుందన్న భ్రమ. భ్రమ కాదు భయం. భయం కానే కాదు వాస్తవం.

పాత్రుడికి బాగా తెలుసు. తను చాలా ఏళ్ళు మొహానికి రంగు పూసుకుని ప్రేక్షకులకి రంగు రంగు కలలు కల్పించాననీ, తను నటించిన చింతామణి పాత్రను చూసి నాటకం మధ్యలో నవ దంపతులు ఆవేశంతో, ఆనందంతో, కోరికతో, ఇంటికెళ్ళి సుఖపడ్డారని, డబ్బున్న విలాస పురుషులు తనని స్త్రీ అని భ్రమపడి ఒకరాత్రి వాళ్ళతో గడపడానికి ఎంత పుచ్చుకుంటుందో తెలుసుకోమని మధ్యవర్తుల్ని పంపడం, ఒక వేశ్య తన యావదాస్తిని బీదలకి దానం చేసి యోగిని అయ్యిందని, విలేకర్లు పేపర్లో రంగస్థలం మీద తన కులుకులకి నవరసాల జలతారు అద్ది, పాఠకుల్ని ప్రేక్షకులుగా మార్చి తనకి వీరాభిమానులుగా చేశారని.

కాని... కాని... యవ్వనంలో తన అందాన్ని, తన నటనని మెచ్చుకున్న తెలుగు అక్షరాలు ఇప్పుడు... ఇప్పుడు... ఈ వార్తతో తూణీరాలై శరీరంలో ఎక్కడ తగలాలో అక్కడ తగిలి నిద్రాణమైన మానవత్వాన్ని మేల్కొల్పుతున్నాయి.

ముందుగా నేనున్నానంటూ పిలవకుండానే వచ్చి రాజేశ్వరి, పాత్రుడ్ని భూపాల రాగంలో మేల్కొలిపింది.

చింతామణి నాటకం మొదలవబోతోంది. మేకప్ రూమ్‌లో హడావిడి. కొంతమంది నటీనటులు వాళ్ళ మేకప్ వాళ్ళే చేసుకుంటున్నారు. మేకప్‌మేన్ బాబూరావు మాత్రం పాత్రుణ్ణి చింతామణిగా రూపుదిద్దుతూ, అష్టావధానం చేస్తున్నాడు. తన అసిస్టెంట్లకి ప్రేమగా సూచనలు ఇస్తూ, మేకప్ నేర్పుతూ మిగతా క్యారెక్టర్లకి మేకప్ చేయిస్తున్నాడు.

చింతామణి నాటకం పూర్తయ్యాక మేకప్ రూమ్‌లోకొచ్చిన పాత్రుడు అద్దంలో తళుక్కుమన్న ఆమెను చూసి చటుక్కున వెనక్కి చూశాడు. మేకప్ తుడుచుకోబోయి టక్కున ఆగాడు, రంగు తుడుచుకుంటే తన అసలు రంగు బయట పడుతుందని.

మధ్య వయస్కురాలు. అందంగా, ఆరోగ్యంగా ఉంది. కానీ చీర మాత్రం బెడ్డింగ్‌కి చుట్టినట్టు బిగించి కట్టింది. నవ్వబోయి ఆమె మాటలకి ఆగాడు.

"నా పేరు రాజేశ్వరి. నేను మహిళా మండలి సెక్రటరీని. ఓ అనాథాశ్రమం కూడా నడుపుతున్నా. మా వారికి దుబాయ్‌లో వ్యాపారం. పిల్లలు అమెరికాలో ఉంటున్నారు. నేను ఒంటరిగా సంఘ సేవ చేస్తూ ఇక్కడే ఉన్నా. మీరు చీరకట్టిన పద్ధతి చూసి ముచ్చటపడి వచ్చా. నన్ను మీ శిష్యురాలిగా స్వీకరించి, నాకు చీర కట్టడం నేర్పండి" కాళ్ళకి అడ్డం పడ్డ చీర కుచ్చిళ్ళు లాంటివి పైకెత్తి పట్టుకుని పాత్రుడి కాళ్ళకి నమస్కరించింది.

ఆమె తల మీద చెయ్యిపెట్టి ఆశీర్వదించబోయి, అభినయం తెలిసున్న నటుడు కాబట్టి, అనుభవం ఉన్న రెండు చేతులతో ముచ్చటైన పంపర పనసకాయల్లాంటి ఆమె గుండ్రని భుజాల్ని మృదువుగా నొక్కుతూ పైకి లేవదీశాడు. అతని స్పర్శకు ఆమె ఒళ్ళు ఝల్లుమంది.

"మీకు అభ్యంతరం లేకపోతే రేపు మా ఇంటికి లంచ్‌కి రావాలి".

"అయ్యో, ఈ రోజునే వెళ్ళిపోతున్నా".

"నా గురించి ఒక్కరోజు ఉండలేరా? ప్లీజ్" అందంగా నవ్వుతూ అడిగింది. అంతే పాత్రుడు రాజేశ్వరి ఇంటికి ఒక్కసారి లంచ్‌కెళ్ళి, ఎన్నోసార్లు

డిన్నర్లకెళ్ళాడు. చీర కట్టుకోవడంతో పాటు ఎన్నో చిలిపి పనులు నేర్పాడు. ఎలా అలంకరించు కోవాలో, పెటీకోట్ దగ్గర్నుంచి పైటకి పిన్ను పెట్టు కోవడం వరకు స్వయంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నేర్పాడు. పనిలో పని ఇంకా ఎన్నో, ఎన్నెన్నో నేర్పి సుఖపెట్టాడు, సుఖపడ్డాడు.

మిత్రుల ద్వారా రాజేశ్వరి ప్రవర్తన తెలిసిన ఆమె భర్త దుబాయ్ నుంచి వచ్చి, స్వయంగా ఆమె ప్రవర్తన ఆమెకు తెలియకుండానే తెలుసు కున్నాడు. సంస్కారం ఉన్న వాడు కాబట్టి గొడవ పడకుండా ఆమెను వదిలేసి దుబాయ్ వెళ్ళి పోయాడు.

రాజేశ్వరి ఎన్నిసార్లు ఫోను చేసినా సమాధానం రాలేదు. వ్యాపారం వదలి దుబాయ్ నుండి అమెరికాలో ఉన్న పిల్లల దగ్గరికి వెళ్ళి పోయాడని తెలిసింది. తండ్రి ద్వారా తల్లి ప్రవర్తన తెలుసుకున్న పిల్లలు ఆమెను ఆదరించ లేదు, సరికదా అసహ్యించుకున్నారు.

అమెరికా నుంచి తిరిగొచ్చిన రాజేశ్వరి, పాత్రుడి దగ్గరికి వెడితే అతను మొహం చాటేశాడు. అంతేకాదు ప్రస్తుతం, చాలా బిజీగా రాగిణి, రంగనాయకి , పెద్ద బేబీ, ఇంకా చాలా మందికి ఒకళ్ళకి తెలియకుండా ఇంకొకళ్ళకి చీర కట్టడం నేర్పడంలో జీవితం అంకితం చేశాడని తెలిసి, తన మీద తనకే అసహ్యమేసి వైరాగ్యంతో, అనాథలకి సేవ చెయ్యడానికి జీవితం అంకితం చేసింది.

ఒకప్పుడు అనాథాశ్రమం నడిపిన రాజేశ్వరి, ఇప్పుడు పాపం అనాథగా మిగిలిపోయింది పాత్రుడి పుణ్యాన.

ఒక్కసారి గతాన్ని వెనక్కినెట్టి వాస్తవాన్ని ముందుకు తోసింది పాత్రుడి మనసు.

మళ్ళీ చదివాడు పేపర్లో వార్త.

మళ్ళీ మళ్ళీ చూశాడు పేపర్లో ఆ ఫొటో.

'చింతామణి' వేషంలో తనకంటే ఎంతో అందంగా ఉంది ఆమె. అప్రయత్నంగా చూపుడు వేలుతో వదిలిన సూదంటి తన ముసలి ముక్కుని కొలుచుకుని, అదే వేలుతో ఫొటోలో ఉన్న చింతామణి ముక్కుని కొలిచాడు. సేమ్ టు సేమ్. చూపుడు వేలుని అడ్డం తిప్పి ముడతలు పడ్డ తన పెదాల్ని కొలుచుకుని చింతామణి నోరు కొలిచాడు.

నో డౌట్, తన నోట్లోంచి ఊడి పడ్డట్టే ఉంది ఆమె.

ఫొటో కింద వార్త మళ్ళీ చదివాడు.

'చింతామణి మళ్ళీ పుట్టింది. అద్భుతమైన అందం, అంతకు మించిన అభినయం. ఒకప్పటి చింతామణి పాత్రధారి పాత్రుడ్ని మించిపోయింది అంటున్నారు నాటకాభిమాన పెద్దలు, పాత తరం ప్రేక్షకులు. పాత్రుడికి నటనా వారసురాలు సుభాషిణి. తన తల్లి రంగనాయకి తన గురువని సవినయంగా చెప్పుకుంది సుభాషిణి. త్వరలో ఆమెకు పద్మశ్రీ రావాలి'.

వార్త చదువుతున్న పాత్రుడి మనసులో రంగనాయకి మెదలి కన్నీళ్ళతో అక్షరాలు అలుక్కు పోయాయి.

సుభాషిణి నటన చూడాలని, తన ప్రతి బింబాన్ని చూసుకోవాలని ఉవ్విళ్ళూరింది పాత్రుడి మనసు. నాటక ప్రదర్శన వివరాలు కనుక్కొని, మేకప్‌మేన్ బాబూరావు సాయంతో, లేని ఓపిక తెచ్చుకుని నాటకం చూడ్డానికి వెళ్ళాడు పాత్రుడు.

నాటకం ప్రారంభమయింది. సుభాషిణి, చింతామణి పాత్రలో లీనమై నటిస్తోంది. అందానికి మించిన అభినయం, వాచకాన్ని మరిపించే గాత్రం. పాత్రోచితమైన కులుకులతో ప్రేక్షకుల మనసుల్ని కొల్లగొట్టడంతో పాటు, క్లైమాక్స్‌లో అందరి మనసుల్లో ఆధ్యాత్మిక భావాల్ని నింపి, శృంగార భావాల్ని తుడిపేసింది. నాటకం ముగిసింది.

అపర చింతామణిగా వేదికపై నీరాజనాలందుకున్నాడతడు. అతడి అందం ఎందరినో పరవశుల్ని చేసేది. తుదకు మగాడని తెలిసి డీలాపడేవారు. జీవితంలో ఒక్క శిష్యుణ్ణి కూడా సంపాదించుకోలేదు. అసలతడి జీవితమే ఓ పెద్ద నాటకంలా సాగింది. వెనుదిరిగి చూస్తే మిగిలింది శూన్యం. మరి అతడికి జీవిత పరమార్థాన్ని తెలియజెప్పిందెవరు?

నాటకం చూసిన పాత్రుడి ఒళ్ళు పులకరించి పోయింది. తన్మయత్వంలో ఆపాదమస్తకం నూతనోత్సాహంతో నిండి పోయింది. తనను తాను అద్దంలో చూసుకున్నట్టయింది. కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

అద్దం అబద్ధమాడదు.

పాపభీతి, ఆధ్యాత్మిక భావాలు, కృష్ణభక్తి, అద్భుతంగా ప్రదర్శించింది సుభాషిణి. విత్తం కంటే విటుల గుణ సంపత్తికి ప్రాధాన్యం ఇచ్చిన సన్నివేశాలు తన నటనలో కొట్టొచ్చినట్టు చూపింది.

మరి పాత్రుడు రూపానికి, సంగీత సాహిత్యాలకే ప్రాధాన్యం ఇచ్చాడు. వేశ్యకు ఉండకూడనిది జాలి, దయా దాక్షిణ్యాలే అంటూ ప్రేక్షకుల్ని రెచ్చగొట్టాడు.

వేశ్యలంటే ఎండమావులని, వేశ్యగా జన్మించే దానికన్నా మరుభూమిలో మట్టిదిబ్బగా జన్మించడం మంచిదని సుభాషిణి చింతామణి పాత్రలో అంతర్మథనాన్ని నటనలో ఆవిష్కరించింది.

పాత్రుడు మాత్రం ప్రేక్షకుల చప్పట్లకే ప్రాధాన్యం ఇచ్చాడు. బిరుదులకి, సన్మానాలకి పైరవీలు చేశాడు. చింతామణి పాత్రతో ఎందరో స్త్రీలని ఆకర్షించాడు. చింతల్లో ముంచెత్తాడు. మానసిక సుఖం కంటే, శారీరక సుఖానికే వెంపర్లాడాడు.

మైకులో తన పేరు వినేసరికి మైకంలోంచి బయటపడి ఉలిక్కిపడ్డాడు పాత్రుడు.

సుభాషిణి తన తల్లి రంగనాయకికి గురుపూజ చేసి కాళ్ళకి నమస్కరించింది.

రంగనాయకి మాట్లాడుతూ "ఈనాడు నా కూతురు మీ అందరి ముందు ఇంత గొప్పగా అభినయించి పేరు తెచ్చుకుంటోంది అంటే, దీని కంతటికీ మూల కారణం నా గురువు పాత్రుడు గారు. ఆయన దర్శన భాగ్యం ఎన్నో ఏళ్ళుగా కలగ లేదు. ఈ రోజు సుదినం. ఆయన నా కూతురి ప్రదర్శన చూసి ఆశీర్వదించడానికి, శరీరం సహకరించకపోయినా, ఓపిక తెచ్చుకుని వచ్చినందుకు నా కృతజ్ఞతలు. వారిని వేదిక మీదకొచ్చి 'మా' బిడ్డను ఆశీర్వదించవలసిందిగా కోరుతున్నా.

చేతికర్ర సాయంతో అవస్థ పడుతూ వేదిక ఎక్కాడు పాత్రుడు.

రంగనాయకి పాత్రుడి పాదాల మీద పువ్వులు పోసి నమస్కరించింది. కళ్ళతో కూతుర్ని కూడా ఆశీస్సులు తీసుకోమంది. సుభాషిణికి తల్లిపడ్డ కష్టాలు గుర్తొచ్చి, అయిష్టంగానే సభా మర్యాద కోసం పాత్రుడికి నమస్కరించింది.

ప్రేక్షకులు పాత్రుడ్ని మాట్లాడమని కోరారు.

"అందరికీ నమస్కారం. నేను మొదటిసారి కుమారి సుభాషిణి నటన చూశా. అద్భుతంగా నటించింది. ఆమెను చూస్తుంటే అద్దంలో నన్ను నేను చూసుకున్నట్టుంది. శ్రీకృష్ణ సాక్షాత్కారం వల్ల భోగిని అయిన చింతామణి యోగిని అయింది. శృంగారం శాంతరసం అయింది. తార హారాలు తులసి పేరులయ్యాయి. 'కాళ్ళకూరి'



ఆఫర్లకు కారణం తెలిసిందట

తెలుగు, తమిళంలో బిజీగా ఉన్న హీరోయిన్ సమంత మాత్రమే! రెండు సంవత్సరాల క్రితం ఆమె పని అయిపోయిందని అన్నారు. మరి ఇంత తక్కువ గ్యాపులో ఇన్ని ఆఫర్లు ఎలా సంపాదించింది? అన్న అనుమానం సినీ జనాలను వేధిస్తూనే ఉంది. ఇప్పుడు ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది అంటున్నారు. సమంతకు ఇన్ని ఆఫర్లు రావడానికి కారణం ఆమె రెమ్యునరేషన్ తగ్గించుకోవడమేనట! దాంతో చాలా మందికి ఆమె మంచి ఆప్షన్ అయిపోయింది. ఇదీ సమంత ఆఫర్ల వెనుక దాగిన అసలు కారణం.

వారి సాహితీ క్షేత్రంలో పండిన కల్పవృక్షమే చింతామణి.

ఏ నటుడికైనా తను నటించిన పాత్ర వల్ల మంచి చెడ్డలు తెలుసుకుని, నిజ జీవితంలో అవి ఆచరణలో పెట్టినప్పుడే ఆ నటుడి జీవితానికి సార్థకత".

సుభాషిణి ఆయన నాలిక చివరి మాటలకి నవ్వుకుంది.

"గురువు రంగనాయకికి నా అభినందనలు. నటన వారసత్వంగా వచ్చే విద్య కాదు. 'నటన' అనే బీజంలో జీవం ఉంటే, అది గురువనే సుక్షేత్రంలో నాటినప్పుడే, దాని ఫలాలు ప్రేక్షకులు అనుభవిస్తారు. ఆమెకు నా ఆశీస్సులు" అంటూ ఉత్తరీయంతో కన్నీళ్ళు తుడుచుకున్నాడు పాత్రుడు.

పాత్రుణ్ణి కారులో తన ఇంటికి తీసుకెడదామంది రంగనాయకి. సుభాషిణి ఆ మాటకి తీక్షణంగా చూసింది. పాత్రుడిగార్ని వారి ఇంటి దగ్గర దించి రమ్మని డ్రైవర్‌కి చెప్పి కన్న కూతుర్ని కష్టపెట్టడం ఇష్టం లేక కన్నీళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయింది రంగనాయకి.

•••

కారు ముందుకెడుతోంటే, పాత్రుడి ఆలోచనలు వెనక్కి వెళ్ళాయి.

రంగనాయకి పరిచయం పాత్రుడికి ఎలా అయ్యిందంటే... పద్దెనిమిదేళ్ళ రంగనాయకిని వాళ్ళ అమ్మ పాత్రుడి దగ్గరికి తీసుకొచ్చి "బాబు గారూ! నా కూతురికి నటన నేర్పండి. నలుగుర్నీ ఆకర్షించే మెళకువలు నేర్పండి. కుల వృత్తిలో అది రంగరంగ వైభోగాలు అనుభవించే తర్ఫీదివ్వండి. భోగభాగ్యాలతో భోగిని అయి, అపర చింతామణి అయ్యేలా తీర్చిదిద్దండి" అంటూ రంగనాయకిని, పాత్రుడి చేతుల్లో పెట్టి వెళ్ళిపోయింది.

అందం ఓ పిసరంత తక్కువైనా, ఆకర్షణ మాత్రం అమితంగా ఉంది రంగనాయకిలో. ఎదిగే వయసు, మనసు, ఇప్పుడే తన దారిలో పెట్టుకుంటే ముందు, ముందు మొండికేయదు అనుకున్నాడు పాత్రుడు.

కట్టూ, బొట్టూ, నటన నేర్పుతూ ప్రేమగా, తన అనుభవంతో ఆమెను ఆకర్షించాడు.

విచ్చలవిడితనం తెలియని, అప్పుడే విచ్చుకుంటున్న మనసు. అమ్మ దగ్గరుంటే కుల వృత్తిలో దింపుతుందన్న భయం వల్ల, పాత్రుడి వల్లే రక్షణ అనుకుని, అతని ఉచ్చులో సులువుగా పడింది రంగనాయకి. దాంతో పాత్రుడి పని మరీ సులువైంది.

నటనలో అన్ని మెళకువలూ చెబితే, తనని మించిపోతుందని, ఎప్పుడో ఒకప్పుడు ముంచిపోతుందని, తొందరగా తల్లిని చేసి, రహస్యంగా సాక్ష్యాలు లేకుండా పెళ్ళి చేసుకున్నాడు. భార్యకి తెలియకుండా పొరుగూర్లో చిన్న ఇంట్లో గృహ ప్రవేశం చేశాడు.

నీ భవిష్యత్తుకి అడ్డం అవుతుంది పుట్టబోయే బిడ్డ అని పాత్రుడు ఎంత మొరపెట్టుకున్నా అబార్షన్ చేయించుకోలేదు. బిడ్డను కని, నేను సాధించలేనిది దాని ద్వారా సాధిస్తానని శపథం చేసింది రంగనాయకి.

తిండి విషయంలో రంగనాయకికి ఏ లోటు చేయకపోయినా, మోజు తీరాక మిగతా విషయాల్లో మెల్లగా అశ్రద్ధ చెయ్యడం మొదలెట్టాడు పాత్రుడు.

జీవితంలో తానేం నష్టపోయిందో తెలిసేసరికి జ్ఞానోదయం అయింది రంగనాయకికి.

ఆ తర్వాత కథ మామూలే.

రంగనాయకి జీవిత నాటకంలో పాత్రుడి పాత్ర నిష్క్రమించింది.

అష్టకష్టాలు పడి పిల్లను పెద్దచేసి ప్రయోజకురాల్ని చేసింది. చాలా ఏళ్ళ తర్వాత ఇదిగో ఇప్పుడే పాత్రుణ్ణి కలవడం.

కారు పాత్రుడి ఇంటి ముందు ఆగింది.

చేతులు వణుకుతూంటే కష్టపడి ఇంటి తాళం తీశాడు. ఇంట్లో మంచినీళ్ళు ఇచ్చే దిక్కు లేదు. బిందెలో మిగిలిన కాసిన్ని నీళ్ళతో దాహం తీర్చుకుని నిస్సహాయంగా కుర్చీలో కూలబడ్డాడు.

బాహ్యప్రపంచంలో పాత్రుడి నటన భరించలేక భార్య భవబంధాలు తెంచుకుని ఎప్పుడో కన్ను మూసింది. భార్యాభర్తల అనురాగం లేని ఆ ఇంట్లో పిల్లల రాగం వినిపించలేదు ఎన్నేళ్ళు అయినా.

కౌలు చేలో బాగా పండించిన రైతు, సొంత చేనులో ఒక్క గింజ పండించలేక గిజగిజలాడినట్టుంది పాత్రుడి పని.

పలకరించే దిక్కు లేక ఇల్లంతా పరికించి చూశాడు. ఒకప్పుడు పరవసింపచేసిన బహుమతులు, సన్మానపత్రాలు ఇప్పుడు పాప పిశాచాల్లా పరిహసిస్తున్నాయి తను చేసిన పాపాల వల్ల.

గొప్ప నటుడని అభిమానించిన ప్రేక్షకులు, తన అసలు రంగు తెలిసేసరికి అసహ్యించుకుని దూరమయ్యారు. ఇంతలో మేకప్‌మేన్ బాబూరావు వచ్చాడు.

"గురువుగారూ! రేపు నా శిష్యులందరూ కలిసి నాకు షష్టిపూర్తి చేస్తున్నారు. నేను వాళ్ళకి చేసింది కొంచెమైనా, కొండంత అభిమానం చూపుతున్నారు. మీకు కారు పంపుతా, తప్పక రావాలి" అంటూ కాళ్ళకి నమస్కరించి వెళ్ళాడు బాబూరావు.

'దేవుడు దీపానికి పురుగుల్ని ఆకర్షించడానికి వెలుతుర్ని ఇవ్వలేదు. అంధకారాన్ని పోగొట్టడానికి మాత్రమే ఇచ్చాడు. కేవలం ప్రేక్షకుల బలహీనతల్ని సొంత లాభానికి ఉపయోగించుకోవడానికి నటరాజు నటుడ్ని సృష్టించలేదు. తన నటనతో ప్రేక్షకుడికి రసోత్పత్తి కలిగించి, వీలైతే

ధృవపు ఎలుగుబంటి కార్జం తింటే వెంటనే మరణిస్తారు. అందులో ఎక్కువ పరిమాణంలో ఉండే ఏ విటమిన్‌ను మానవ జీర్ణకోశం తట్టుకోలేదు.

అజ్ఞానాన్ని పోగొట్టి, వీలైనంత ఆనందం కలిగించడానికే నటుణ్ణి పుట్టించాడు. అది గ్రహించిన నటుడి జన్మ ధన్యం. బాబూరావు తనకి తెల్సిన విద్య నలుగురికీ నేర్పాడు. విద్య పంచుకుంటే పెరుగుతుంది. దాచుకుంటే నశిస్తుంది. కాని తనో ఒక్కడంటే ఒక్క శిష్యుణ్ణి కూడా తయారు చెయ్యలేదు స్వార్థంతో' ఇలా అనుకుంటున్న పాత్రుణ్ణి ఒంటరితనం భయపెడుతోంది. ఆ నాలుగ్గోడల మధ్య ఏదో ఒకరోజు అనాథ ప్రేతం అయిపోతానన్న అనుమానం ప్రారంభమైంది.

జీవితానికి క్లైమాక్స్ బాగుండటం ఒక యోగం. ఆ యోగం బాగుండాలంటే ధర్మబద్ధ ప్రవర్తనా పునాదులుగా పడాల్సిందే.

పాత్రుడి విషయంలో పునాదులు కేవలం అందంగా ఆకర్షణీయంగా ఉన్నాయి కాని, దృఢంగా లేవు. అందుకే దాని మీద కట్టిన భవంతులు తాత్కాలికంగా చూడ ముచ్చటగా ఉన్నా శాశ్వతంగా బీటలు తీశాయి.

తన బారిన పడ్డ ఎంతోమంది స్త్రీలు తనని శపిస్తున్నట్టు కలలు వస్తున్నాయి. నిద్దుర కరువైపోయింది పాత్రుడికి.

పేపర్లో పెన్నుతో మార్క్ చేసిన ఫోను నెంబర్ కూడ బలుక్కుంటూ, వణికే కంఠంతో ఫోను చేశాడు.

●●●

వృద్ధాశ్రమం వారు లారీలో వచ్చి ఇంట్లో పనికొచ్చే సామాన్లు తీసుకుని, సన్మాన పత్రాల్ని, మెమెంటోల్ని, బహుమతుల్ని చెత్తకుప్పలో పడేసి, పాత్రుడిని కారులో ఎక్కించుకుని ఆశ్రమానికి తీసుకెళ్ళారు.

ఇద్దరు వాలంటీర్లు పాత్రుణ్ణి మెల్లిగా నడిపించుకుంటూ, ఆశ్రమంలోకి తీసుకెళ్ళారు.

గుమ్మంలో అడుగు పెట్టగానే గోడకి చింతామణి వేషంలో ఉన్న తన ఫొటో కనిపించింది. ఆశ్చర్యపోయాడు. ఆనంద పడ్డాడు. ఫొటో ఎందుకు పెట్టారో అన్న సంశయంలో పడ్డాడు.

ఇంతలో ఆశ్రమ నిర్వాహకురాలు వృద్ధ మాణిక్యం పూల మాల పట్టుకొచ్చి పాత్రుడి మెళ్ళో వేసి "అపర చింతామణికి స్వాగతం... సుస్వాగతం" అంది.

కళ్ళు మిటకరించి చూశాడు. ఆమెను ఎక్కడా చూసిన గుర్తులేదు. మీరెవరు? ఈ ఆదరణ ఏమిటి? అన్నట్టు ఆమెకేసి చూశాడు.

"నా పేరు మాణిక్యం. నేను మీ శిష్యురాల్ని కాను. కానీ మీ చింతామణి నా గురువు. నా యవ్వనంలో నేనో ప్రఖ్యాత వేశ్యను".

ఆ మాటకి మందహాసం చేశాడు పాత్రుడు.

"ఎందుకు నవ్వుతున్నారు? నేనన్న దాంట్లో తప్పేముంది? ప్రఖ్యాత రాజకీయవేత్తలు, ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలు, నా పొందుకోసం తహతహలాడినప్పుడు, నేను మాత్రం ప్రఖ్యాత వేశ్యను ఎందుకు కాదు. గతం గతః, ఆ విషయం వదిలేయండి.

రాజమండ్రిలో మీ చింతామణి నాటకం చూశా. చింతామణి చేసింది వేశ్య వృత్తి అయినా ఆమె హృదయం అందుకు విరుద్ధం. గొప్ప మానవతా వాది. గంజాయి వనంలో తులసి మొక్క. నాటకంలో ఆ పాత్ర నాకు జ్ఞానోదయాన్ని ప్రసాదించింది.

తపన పశ్చాత్తాపంతో జీవిత గమ్యాన్ని మార్చుకోవాలన్న నిశ్చలమైన నిర్ణయం నాలో మార్పు తెచ్చింది.

అందుకే నా యావదాస్తి, ఈ వృద్ధాశ్రమానికి రాసి, దాన్ని దగ్గరుండి నిర్వహిస్తున్నా. అజ్ఞానంలో ఎంతోమందికి ఈ శరీరాన్ని సమర్పించుకున్నా. కాని ఇప్పుడు... ఇప్పుడు మనసా, వాచా, కర్మణా ఈ దేహాన్ని కృష్ణుడికి అర్పించా. రండి. ఇక నుంచి గతాన్ని ఓ పీడకలగా మర్చిపోయి, భవిష్యత్తుకు అద్భుతమైన ఆధ్యాత్మిక పునాదులు వేద్దాం" అంటూ ఆనంద బాష్పాలతో పాత్రుణ్ణి ఆహ్వానించింది మాణిక్యం.

ఎన్నో వందల నాటక ప్రదర్శనలు, మరెన్నో ప్రశంసలు, సన్మానాలు అందుకున్నా జీవితాశయం తెలియలేదు పాత్రుడికి.

కాని 'మాణిక్యాన్ని' చూశాక పాత్రుడికి తన పాత్ర ఏమిటో అర్థమయింది.

సెల్:98491 42361

మనమీదేనర్రోయ్!

సరసి



ఆనందానికి ఎనిమిది మార్గాలు

మీరు ఆనందంగా ఉన్నారా? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకుంటే దాదాపు చాలా మంది వందశాతం మేము పరిపూర్ణమైన ఆనందంతో ఉన్నామని చెప్పలేరు. ఎవరికో ఒకరికి ఏదో ఒక బాధ ఉండి తీరుతుంది. పరిపూర్ణమైన ఆనందాన్ని ఎవరైనా కోరుకుంటారు. ఆనందానికి డబ్బు, సంపాదన, గెలుపు ఇవే కారణాలని చాలామంది అనుకుంటారు. కానీ అవన్నీ నామమాత్రపు ఆనందాన్నే ఇస్తాయి.

ఆందోళనలు, భయాలు, కష్టాలు మనిషిని ఆనందానికి దూరం చేస్తున్నాయి. ఉన్నదానితో సంతృప్తి పొందితే చాలు అమితమైన ఆనందం మనకు లభిస్తుంది. కానీ సంతృప్తి అనేది మానవ జీవన విధానంలో అంత సులువుగా సాధ్యమయ్యే పనికాదు. దానివల్ల ఒత్తిడికి గురవుతున్నాం. మన జీవన శైలిలోని ఒత్తిడి క్రమక్రమంగా మనలోని ఉత్సాహాన్ని, నవ్వును దూరం చేస్తోంది. ఒత్తిడి మనిషిని మరింతగా కుంగదీస్తుంది. ఈ విషయం తెలిసి కూడా మానవ జీవితాలను ఆ విషవలయం లోనే పరిభ్రమించేట్టు చేయడం అన్నింటికన్నా గొప్ప విషాదం.

ఎందుకు చేస్తున్నాం?

ఒక మనిషి ఒత్తిడికి గురికావడానికి ముఖ్య కారణం ఆందోళనే. ఆ విషయం చాలామందికి తెలుసు. తెలిసినా సరే ఆ ఆందోళనను ఎలా దూరం చేసుకోవాలో తెలియకపోవడం దానికి అసలు కారణం ఏమిటో గుర్తించకపోవడం వల్ల చాలా మంది ఏదో జీవితాలను వెళ్లదీస్తున్నాం అంటే వెళ్ల దీస్తున్నాం అన్నట్లు గడిపేస్తుంటారు. ఆందోళనకు ఒత్తిడి కారణమయినట్లుగా మరేదీ కారణం కాదు. మరి ఆ ఆందోళనను అధిగమించి చిరునవ్వులు వికసించడానికి పనికి వచ్చే ఎనిమిది జీవన సూత్రాలు తెలుసుకోండి! వాటిని పాటించడానికి ప్రయత్నించండి!

1. ఫలితాన్ని ఆశించకు

జీవితంలో పైకి ఎదగాలని, ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ప్రతి ఒక్కరూ ఆశపడతారు. పరీక్ష రాసే విద్యార్థి తనకు ఫస్ట్‌క్లాసు మార్కులు రావాలని కోరుకుంటాడు. అలాగే చాలామంది వివిధ రకాలుగా అభివృద్ధి చెందాలని కోరుకుంటారు. అందులో తప్పేమీ లేదు. ఎందుకంటే మన కష్టానికి తగిన ప్రతిఫలం ఆశించడం తప్పు కాదు. కానీ వాటి నుంచి వచ్చే ఫలితాలే కొన్నిసార్లు మనకు బాధ కలిగిస్తాయి. ఆశించిన ఫలితాలు పొందలేకపోయినప్పుడు మనిషిలో నిరాశ, నిస్పృహలు కలుగుతాయి. అందుకే చేస్తున్న పని ఉత్సాహంతో చేయండి. అది ఆశావహ దృక్పథాన్ని, ఎంతో తృప్తిని కలిగిస్తుంది. గోడకు కొట్టిన బంతి తిరిగి అంతే వేగంతో మళ్లీ మనల్ని చేరుతుంది. అలాగే మనం ఎలా ప్రయత్నిస్తామో అలాంటి ఫలితాలనే పొందగలం. ఒకవేళ చేసిన పనికి వ్యతిరేక ఫలితం వస్తే ఎక్కడ తప్పు చేశామో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడు మరింత మెరుగ్గా తిరిగి ఆ పని చేయడానికి అవకాశం చిక్కుతుంది. అంతే తప్ప నేను ఓడిపోయాను ఇక నావల్ల కాదు అని భావించడం సరికాదు.

2. చేస్తున్న పనిపట్ల ప్రేమ

ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో తేలిన విషయం ఏంటంటే చాలామంది తాము చేస్తున్న పని పట్ల విముఖంగా ఉన్నారట. నలభై లేదా అంతకన్నా ఎక్కువ వయసు దాటిన తర్వాతే చాలా మంది వృత్తినిపుణులు తమ అభిరుచులకు అనుగుణంగా వారి వృత్తిని మార్చుకుంటున్నారట. కొన్ని కొన్ని ఇతర కారణాల వల్ల వీరు అనుకున్న వృత్తిలోకి వెళ్ళలేకపోతారు. అందువల్ల బతుకు పోరాటం సాగించడం కోసం ఏదో ఒక వృత్తిని ఎన్నుకుంటారు. అంతంత మాత్రం ఆర్థిక ఆదాయంతో ఏదో పని చేస్తున్నాం అంటే చేస్తున్నాం అని కాక ప్రస్తుతానికి చేస్తున్న పనిని ప్రేమించాలి. ఇది నా బాధ్యత నేను సక్రమంగా నెరవేర్చాలి అనుకోవాలి. మనం అనుకున్న లక్ష్యానికి చేరుకోలేకపోవచ్చు కానీ ప్రస్తుతం చేస్తున్న వృత్తి పట్ల నిబద్ధతతో పని సంస్కృతిని అలవర్చుకోవాలి. వృత్తిని ప్రేమిస్తూ ఉన్నత శిఖరాలు అందుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే పనిలో నూటికి నూరు శాతం విజయాలు సాధిస్తారు.

3. మనకోసం కొంత సమయం

అన్నీ పక్కవారికోసమే చేయకుండా మన కంటూ కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. రోజులో కొంత సమయం మీకు నచ్చిన పనిచేస్తే సంతోషంగా ఉంటుంది. చిత్రలేఖనం, డాన్స్, పాటలు పాడడం లేదా ఏదైనా అభ్యసించడం

మొదలుకొని అది ఎలాంటి పనైనా కానివ్వండి, ఆ రోజు చేసిన పనులు, జరిగిన విషయాలను డైరీలో రాసుకునే అలవాటు చేసుకోవాలి. ఎక్కడ తప్పులు చేశామో గుర్తించి అలాంటి తప్పులు మళ్లీ చేయకుండా జాగ్రత్త పడాలి. మనసు బాలేనప్పుడు మీ జీవితంలో జరిగిన సంతోషకర సమయాలను గుర్తుతెచ్చు కుంటే, వెంటనే మీ మూడ్‌లో మార్పు వస్తుంది. మీతో మీరు గడిపినప్పుడే మీరేమిటి అన్న విషయం మీకు తెలిసిపోతుంది.

4. అబద్ధాలు అసలే వద్దు

ప్రతి మనిషి ఎప్పుడో ఒకసారి ఏదో ఒక సందర్భంలో అబద్ధాలు చెబుతూనే ఉంటారు. కానీ అవసరం కోసం ఒక అబద్ధం, దాన్ని కప్పిపుచ్చడానికి మరిన్ని అబద్ధాలు ఆడడానికి దారితీస్తుందనే విషయాన్ని గమనించాలి. అలాగే కొందరికి అదేపనిగా అబద్ధాలు ఆడే తత్వం ఉంటుంది. అలాంటి వారు ఆ పద్ధతి మార్చుకుంటే మంచిది. నిజాన్ని నిర్భయంగా చెబితే ఆ క్షణంలో మనం బాధపడినప్పటికీ ఎదుటివారు తప్పుగా భావించకుండా, ఏదీ మనసులో దాచుకోకుండా ఫ్రాంక్‌గా అన్నీ బయటకు వ్యక్తీకరించగల మనిషిగా ఎదుటివారు మనల్ని గుర్తించే అవకాశాలు ఉంటాయి. అంతేకాక ఇతరుల మీద చాడీలు చెప్పడం, ఉన్నవీ లేని కల్పించి ఎదుటివారి గురించి చెడుగా మాట్లాడడం లాంటి పనులన్నింటినీ మార్చుకుంటే మంచిది.

5. సమయానికి తినాలి

ఆనందం అంటే కేవలం మానసిక పరంగానే కాదు శారీరకంగా బలంగా ఉండడం కూడా ఆనందంలో ఒక భాగమే. శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే మానసికంగా ఎలాంటి వ్యాకులత లేకుండా ఉండడానికి అవకాశాలు ఉన్నాయి. అందుకోసం వేళకి తినాలి. నేటికాలం ఉద్యోగుల్లో సమయానికి తిండి తినని వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని దానివల్ల రకరకాల అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నారని అనేక సర్వేలు ఇప్పటికే వెల్లడించాయి. కాబట్టి ఎక్కడున్నా సరే ఆహార సమయాలు, ఆహార నియమాలు పాటించడం చాలా ముఖ్యం. అలాగే నీళ్లు ఎక్కువగా తాగుతుండాలి. సరిపడా నీళ్లు తాగడం వల్ల మనసులో ఆందోళనలు తగ్గుముఖం పడతాయట. అందువల్ల ఫాస్ట్‌ఫుడ్‌ను వదిలేసి పౌష్టికాహారం తీసుకోవడం మర్చిపోకండేం!

6. హాయిగా నిద్రపోండి

మనిషికి సరైన ఆహారం తీసుకోవడం ఎంత అవసరమో, దానికంటే సరైన నిద్ర ఇంకా ఎక్కువ అవసరం. ఇంకా చెప్పాలంటే తిండికన్నా నిద్ర చాలా అవసరం. ప్రతిరోజూ హాయిగా నిద్రించాలి. నిద్రలేమి, నిద్రకు సమయం దొరక్కపోవడంలాంటి సమస్యల వల్ల ప్రజలు ఎక్కువ ఒత్తిడితో వచ్చే ఇతర ఆరోగ్య సమస్యలకు దగ్గర అవుతున్నారు. మరికొందరేమో ఎనిమిది గంటలు నిద్రిస్తే చాలు కదా ఎప్పుడు పడుకుంటే ఏంటన్నట్లు అర్ధరాత్రి దాకా నిద్రపోకుండా బారెడు పొద్దెక్కిన తర్వాత లేస్తారు. అలా కాకుండా ఉదయం నిద్ర లేవడానికి నిర్ణీత సమయం అలవర్చుకోవాలి. ఎప్పుడు ఏ సమయానికి నిద్రించాలి, లేవాలి అనే విషయాలపై పక్కా ప్లానింగ్ చేసుకోవాలి. దీనివల్ల నిద్రలేమి దూరమవుతుంది. ఉద్యోగవేళలు కుదిరినవాళ్లు, వీలున్నవారు రాత్రి పదిగంటలకే నిద్రించి ఉదయం సూర్యోదయం సమయానికల్లా నిద్రలేస్తే మేలు!

7. ధ్యానం

మన మనసులో ఉన్న ఆలోచనలను, చిటపటలను తగ్గించుకోవడం చాలా అవసరం. అందుకని ధ్యానం చేయడం మేలు. అది ఎలా చేయాలో శిక్షణ ద్వారా పాటిస్తే జీవితాలు మరింత మెరుగవుతాయి. ఒత్తిడికి చరమగీతం పలుకుతాం. నిశ్శబ్దంగా ధ్యానాభ్యాసం చేయడం వల్ల కలిగే లాభాలు, మనం చెప్పగలిగిన దానికన్నా చాలా ఎక్కువ ధ్యానం మనసును స్వస్థ పరుస్తుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. నేటికాలపు గజిబిజి జీవనంలో రోజూ కనీసం ఇరవై నిమిషాలు ప్రశాంతంగా కూర్చుని నిశ్శబ్దంగా మనలోకి మనం ప్రయాణం చేస్తే దాని వల్ల శాంతి, ప్రశాంతత, పవిత్రత చేకూరుతుంది. మన మనసు ఎంతో నిర్మలంగా ప్రశాంతంగా ఉండడానికి ఈ ధ్యానం దోహదం చేస్తుంది.

8. సమాజాన్ని ప్రేమించండి

ఇతరులపై ద్వేషభావన వద్దు. ప్రేమ, సహనం ఈ రెండూ జీవితంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఎదుటివారిపై మనం చూపించే ప్రేమ మరింత ఉత్సాహాన్ని అందిస్తుంది. ప్రేమించడం అంటే మనసులో ఏదో పెట్టుకొని స్వార్థంతో వారి పంచన చేరడం కాదు. మన మనసులో ఎలాంటి కల్మషం లేకుండా వారిపై ఎలాంటి షరతులు విధించకుండా, కుదిరితే సహాయం చేయడం, లేకుంటే వారికి సపోర్ట్‌గా నిలబడడం లాంటి పనుల వల్ల మనం, మనచుట్టూ ఉన్నవారూ ఆనందంగా ఉండగలుగుతారు. ఎదుటి వ్యక్తి మనల్ని ఎంత ఎక్కువగా ప్రేమించారన్న విషయం మనలోని ప్రేమకు కొలబద్ద కాదు. మనం ఎంత బాగా వారిని అర్థం చేసుకున్నాం అనేదే మన ప్రేమకు కొలబద్ద. వీలైనంతవరకూ ఎవ్వరినీ విమర్శించకుండా ఇష్టపడుతూ చిరునవ్వుతో పలకరిస్తూనే ఉండండి. దానివల్ల వచ్చే మార్పు మీ జీవితాన్ని అద్భుతంగా మార్చివేస్తుంది.

ఈ ఎనిమిది సూత్రాలను జీవితంలో అంతర్భాగం చేసుకుంటే మనం సంతోషంగా ఉన్నట్లే. కేవలం సంతోషమంటే మనం మన కుటుంబమే కాదు మనచుట్టూ ఉన్నవారు ఆనందంగా ఉన్నప్పుడే మనమూ ఆనందంగా ఉంటాం. చనిపోయేదాకా ఎలా అయినా బతకవచ్చు కానీ ఆనందంగా, తృప్తిగా బతకడమే మనిషి జీవితంలో ముఖ్యం. అలా ఆనందంగా బతకాలనుకుంటే ఈ ఎనిమిది సూత్రాలను మనవిగా చేసుకోవాలి. పాటించాలి. అప్పుడే ఆ ఆనందం సాధ్యమవుతుంది.

- సంతోషి

మనసున్న మనుషులు

10

-శారదా శ్రీనివాసన్, ఫోన్: 040-27631246

సిటీ సివిల్‌కోర్టులోని కేసు రుక్మిణి పరంగా అయింది. మొత్తం ఆస్తిలో కొడుకు సగం ఆస్తికి వాటాదారు. దానిలో ఇప్పుడు సగం అత్తగారికి, సగం ఆస్తి రుక్మిణికి వస్తుంది. ఆమె అత్తగారు హైకోర్టుకు అప్పీలు చేసుకున్నారు. హైకోర్టు ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించి కింది కోర్టు ఇచ్చిన తీర్పు సరియైనదేనని, ఆమె అత్తగారు వేసిన కేసు చెల్లదని, కోడలికి కొడుకు ఆస్తిలో హక్కు ఉందని, ఆ అప్పీలు డిస్మిస్ చేసింది. అందు చేత కొడుక్కి రావలసిన ఆస్తిలో సగభాగం కోడలికి ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది రుక్మిణి అత్తగారికి. లాయర్ రవికుమార్ సమర్థుడైనందు వల్ల హైకోర్టు జడ్జికి పూర్వాపరాలు వివరంగా చెప్పి హైకోర్టులో కేసు డిస్మిస్ అయ్యేలా చెయ్యగలిగాడు. ఈ కేసు ఇంకా ఎన్నేళ్ళపాటు నడుస్తుందో, తను ఎంతకాలం ఇలా కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తోందో అని ఆందోళన చెందుతున్న రుక్మిణికి ఈ కబురు ఎంతో సాంత్వన కలిగించింది.

ఈ కోర్టు కేసు జరుగుతున్నప్పుడు రెండు సార్లు అన్న కనిపించాడు దూరంగా. కానీ ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకునేందుకు ఇద్దరూ ప్రయత్నించలేదు. వెళ్లి తల్లి క్షేమసమాచారం తెలుసుకోవాలని రుక్మిణి ఆరాటపడింది. అయితే లాయరు, ఎలీషాగారు ఇద్దరూ కూడా ఇప్పుడు ఎలాంటి పలకరింపులు, రాకపోకలు పెట్టుకోవడం మంచిది కాదన్నారు. తల్లిని గురించిన వివరాలు తెలుసుకోవాలని చాలా తాపత్రయ పడేది రుక్మిణి. ఒకసారి కోర్టుకు తల్లిని కూడా పిలిచి ప్రశ్నించారట. అప్పుడు తను కోర్టుకు వెళ్ల లేదు.

తన చదువు పూర్తి అయి ఉద్యోగంలో చేరితే అమ్మను తెచ్చుకుని తన దగ్గర పెట్టుకోవాలని రుక్మిణి ఆశ. కానీ తనేకాక అమ్మను కూడా తీసుకువచ్చి వీళ్ల ఇంట్లో పెడతాననడం బావ్యం కాదుకదా! పోనీ అమ్మా, తనూ విడిగా ఉంటేనో? అది చాలా తప్పుగా తోచింది. ఇన్నేళ్లూ తనని తమ ఇంట్లో పెట్టుకుని, ఇంత చదివించి, ఒక ప్రయోజకురాలిని చేసి, తమ సొంతబిడ్డలా చూసుకుంటున్న వీళ్లను విడిచి వెళతానని ఎలా చెప్పగలదు? తను అంత స్వార్థపరురాలా? ఈ ఆలోచనలతో రుక్మిణి బుర్ర వేడెక్కిపోతోంది.

రుక్మిణి బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్‌లో మంచి మార్కులతో విజయం సాధించింది. ఎలీషాగారు, సుజాత ఇద్దరూ ఎంతో అభినందించారు. మాస్టర్ డిగ్రీ ఆఫ్ లైబ్రరీ సైన్స్ కూడా చదవమని ప్రోత్సహించారు. కానీ తనింక చదవననీ, ఉద్యోగం చెయ్యాలనుందనీ చెప్పింది రుక్మిణి. వాళ్లు కూడా అందుకు సమ్మతించారు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పేరు నమోదు చేసుకుంది. ఇంతలో పేపర్లో అసిస్టెంట్ లైబ్రేరియన్ కోసం యూనివర్శిటీ వారి ప్రకటన పడింది. దానికి అప్లై చేసింది. చివరికి యూనివర్శిటీలోనే అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా సెలెక్ట్ అయింది.

ఇక నేడో, రేపో వెళ్లి ఉద్యోగంలో చేరుతుందనగా ఎలీషాగారు రుక్మిణిని కూచోబెట్టి ఉద్యోగంలో ఉండే సాధకబాధకాలు ఎన్నో చెప్పారు. తను పెద్దవాళ్ళు, కుర్రకారు ఒకేచోట ఉండే యూనివర్శిటీలో ఉద్యోగం చెయ్యబోతోంది. పెద్దలకు ఎలాంటి గౌరవం ఇవ్వాలి. కుర్రకారు విషయంలో ఎలాంటి జాగ్రత్తలు వహించాలి, ఈ విషయాలన్నీ చక్కగా చెప్పారు రుక్మిణికి. ఎలీషాగారు ఒక తండ్రిలా, ఒక అన్నలా, ఒక స్నేహితుడిలా కనిపించారు రుక్మిణికి.

ఈ మధ్య రెండు, మూడు సార్లు సుజాత భద్రాచలం ఫోను చేసినప్పుడు తండ్రికి బాగా లేదని తల్లి చెప్పడమో, తల్లికి బాగాలేదని తండ్రి చెప్పడమో జరుగుతున్నది. ఇద్దరు పిల్లలను పెంచి, చదివించి ప్రయోజకులుగా చేసిన తల్లీతండ్రీ పెద్దతనంలో దిక్కులేనట్లు ఉండటం సుజాతకు చాలా కష్టంగా ఉంది. తమ్ముడు వాళ్ల సంగతి పట్టించుకునేలా లేడు. అయినా అమ్మానాన్నలను తమ్ముడే చూడాలని ఎక్కడ ఉంది? వాణ్ణి చదివించినట్లే నన్నూ చదివించారు. నేను నా కాళ్ల మీద నిలబడేలా చేశారు. నాకు మాత్రం బాధ్యత లేదూ! తప్పక తను వాళ్లను ఇక్కడకు తెచ్చుకుంటుంది. అయితే నాన్న నా ఇంట్లో ఉండేందుకు ఇష్టపడరు. పోనీ నా ఇంటి పక్కనే ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకుని అందులో ఉంచి, వాళ్లకి కావలసినవన్నీ చూసుకుంటాను. అప్పుడు వాళ్లకీ కూతురు మీద ఆధారపడి బతుకుతున్నామనే బాధ ఉండదు. అమ్మానాన్నలు నా కళ్ల ముందు ఉన్నారనే తృప్తీ ఉంటుంది అనుకుంది.

తనకు మనసులో కలిగిన ఆలోచనలన్నీ ఎలీషాగారికి చెప్పి ఏమంటారని అడిగింది. ఆయన చాలా సంతోషించారు. "నువ్వు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం నాకు సంతోషాన్నీ, గర్వాన్నీ కలిగిస్తోంది. ఈ విషయాన్ని లోగడ నీకు చెప్పాలనుకున్నాను. కానీ నా నమ్మకం ఏమిటంటే నీకు ఒకరు చెప్పనవసరం లేదనీ, నీ అంతట నీకే తోస్తుందనీను. చూశావా, నా నమ్మకం ఎలా నిజమైందో" అంటూ సుజాత దగ్గరకొచ్చి ఆమె భుజం చుట్టూ చేతులు వేసి, దగ్గరకు తీసుకుని నుదుటి మీద ముద్దుపెట్టారు. సుజాత పారవశ్యంతో కళ్లు మూసుకుంది.

సుజాత తండ్రితో మాట్లాడింది. తల్లికీ, తండ్రికీ

జరిగిన కథ

ప్రొఫెసర్ ఎలీషా, నర్సు సుజాత భార్యాభర్తలు. ఆయనలోని దాతృత్వగుణం, ఆమెలోని సేవాభావమే వారిద్దరినీ కలిపింది. మొదట ఆనంద్ వల్ల మోసపోయిన సుజాత హైదరాబాద్ చేరుకుని అక్కడే నర్సు ఉద్యోగంలో చేరుతుంది. పక్క ఇంట్లో ఎలీషాగారితో సుజాత పరిచయం వారి వివాహానికి దారితీస్తుంది. రుక్మిణికి ఆశ్రయమిచ్చి ఆమెను డిగ్రీ చదివిస్తారు ఆ దంపతులు. తెలివిగా వ్యవహరించి సుజాత తల్లిదండ్రులకు కొడుకుపీడ నుంచి విముక్తి కలిగిస్తారు.

ఆ తర్వాత.....

కూడా ఆ ఊరు విడిచి రావడం ఇష్టం లేదు. సుజాత వారికి నచ్చచెప్పి ఒప్పించింది. తండ్రి 'అక్కడకు వచ్చినా మీ ఇంట్లో మాత్రం ఉండను' అని కచ్చితంగా చెప్పాడు. సుజాత వాళ్ల కోసం ఇల్లు చూడటం మొదలుపెట్టింది. ఎలీషాగారు ఒక మాట చెప్పారు.

"నాకు ఇంక ఈ క్యాంపస్‌లోని ఇంట్లో ఉండటం ఇష్టంగా ఉండటం లేదు. మన సొంత ఇంటికి వెళ్లిపోదాం త్వరలో. పొద్దున్నే లేచి ఆ తోటలో ఎప్పుడెప్పుడు తిరుగుదామా అని మనసు ఉవ్విళ్లూరుతోంది" అని.

అందుకని సుజాత తల్లిదండ్రుల కోసం తమ సొంత ఇంటి పక్కనే ఇల్లు వెతకడం ప్రారంభించింది. సత్యానికి ఫోన్ చేసి మాట్లాడింది. ఈ ఆలోచన సత్యానికి కూడా నచ్చింది. తనకి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశాలున్నాయని చెప్పాడు. ఇల్లు దొరికితే తను వెళ్లి అమ్మానాన్నను తీసుకొచ్చి దింపగలడా అని అడిగింది సుజాత.

దానికి సత్యం, "అక్కా! పెద్దమ్మను, పెదనాన్నను అయితే దింపగలను. అక్కడి సామాను కూడా కొంత ప్యాక్ చేసి పంపాలి కదా. అది నేను నిర్ణయించలేను. కనుక నువ్వు కూడా వస్తే మనిద్దరం కలిసి ఏ సామాన్లు హైదరాబాద్‌కి పంపాలో, పెద్దమ్మనీ, పెద్దనాన్ననీ అడిగి నిర్ణయిద్దాం. సరేనా" అన్నాడు.

"అయితే ఇల్లు దొరకగానే నీకు ఫోను చేసి, నేనూ వస్తాను" అంది సుజాత.

త్వరలోనే సుజాత కట్టుకున్న ఇంటికి ఎదురుగా కట్టిన ఒక కాంప్లెక్స్‌లో రెండో ఫ్లోర్‌లో సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్ దొరికింది. దానికి వెంటనే అడ్వాన్స్ ఇచ్చేసింది సుజాత. తల్లిదండ్రుల్ని తీసుకు రావడానికి భద్రాచలం వెళ్లి అక్కడ తను, సత్యం కలిసి హైదరాబాద్‌కి కావలసిన సామాను ప్యాకర్స్‌తో ప్యాక్ చేయించి పంపేశారు. మిగిలిన సామానులో అనవసరమైనవి కొన్ని పారేసి, కొన్ని ఎవరికైనా ఇచ్చేసి, మిగిలిన కొద్దిపాటి సామాను ఒక రూంలో వేసి, ఆ రూంకి తాళం వేసి మిగతా ఇల్లంతా శుభ్రం చేయించి ఎవరికో అద్దెకిచ్చేశారు. అలా ఇప్పుడు అనంతయ్య గారు, సావిత్రమ్మ గారు హైదరాబాదు వాస్తవ్యులైనారు.



ఇంటిపని కోసం ఒక మనిషిని, వంట చేసి పెట్టేందుకు మరొకావిడను ఏర్పాటుచేసింది సుజాత. ఇంట్లోకి కావలసిన వస్తువులు తనో, రుక్మిణో కొని తీసుకువెళ్లి ఇచ్చేవారు. రుక్మిణి యూనివర్సిటీకి వెళ్లి వచ్చాక అప్పుడప్పుడు వాళ్ల దగ్గర కూచుంటుండేది. వాళ్లిద్దరినీ తాతయ్య గారనీ, అమ్మమ్మగారనీ అంటుంది రుక్మిణి.

ఈ మధ్య రుక్మిణి మరో పని చేసింది. అయితే సుజాతతో చెప్పే చేసింది. లాయరు ద్వారా కోర్టు పేపర్ల నుండి అన్న గారి అడ్రస్ సేకరించి పెట్టుకుంది. ఇప్పుడు తనకు ఊరంతా పరిచయమే. తెలిసిన ఆటోలో వెళ్లి అన్న ఇంటికి ఎదురుగా ఆపించి అందులోనే కూచుని గమనించసాగింది. ఇంటికెవరో వచ్చారులా ఉంది. వదిన వారితో కలిసి ఎక్కడికో వెళ్లిపోయింది. చాలాసేపటికి ఆ ఇంటి తలుపులు తెరుచుకుని ఒకావిడ బయటికి వచ్చింది. రుక్మిణి చూసింది 'ఎవరా' అని. 'తల్లే'. ఆవిడ తలుపులు దగ్గరగా వేసి గొళ్లెం పెట్టి రోడ్డు మీదకొచ్చి నాలుగడుగుల దూరంలో ఉన్న కిరాణాషాపులో ఏదో కొంటోంది. రుక్మిణి ఆటో దిగి పమిట తలమీదుగా వేసుకుని వెళ్లి తల్లి పక్కగా నిలబడి, 'అమ్మా!' అంది, చెవిలో చెప్పినట్లు. ఆవిడ ఉలిక్కిపడి ఇటు చూసింది. కూతురు నిలబడి ఉంది. భయంగా ఇంటి వైపూ, రోడ్డు వైపూ చూసింది. ఎవరూ లేరు. రుక్మిణి తన చేతిలోని కాయితాన్ని తల్లి చేతిలో పెట్టి, "ఇది చదువుకో. ఎల్లుండి మళ్లా వస్తాను" అని చెప్పి గబగబా ఆటో ఎక్కి వెళ్లిపోయింది.

రుక్మిణి ఆ ఉత్తరంలో క్లుప్తంగా తన గురించిన విషయాలన్నీ రాసి, తన చదువు, ఉద్యోగం గురించి రాసి, తల్లి గనకవస్తే తమిద్దరు కలిసి ఉండొచ్చని, అన్నయ్య, వదిన తనయందు మంచి అభిప్రాయంతో ఉన్నట్లైతే తనే వచ్చి మాట్లాడతానని రాసింది. మళ్లా ఎల్లుండి వస్తాను. నువ్వు నాకు ఉత్తరం రాసినా సరే లేక ఇంటికి రమ్మన్నా వస్తానని రాసింది.

సుజాతకు జరిగిన విషయాలన్నీ చెప్పింది. తల్లి భయం భయంగా ఇంటివైపూ, రోడ్డు వైపూ చూడ్డం సంగతి కూడా చెప్పింది.

అప్పుడు సుజాత, "బహుశ ఇంట్లో మీ అన్నకీ, వదినకీ నీ మీద సదభిప్రాయం లేదనుకుంటా. వాళ్లుగా మీ అమ్మను నీ దగ్గరకు పంపుతారనుకోను. అదీకాక ఆవిడ ఇంటిపనులన్నీ చేసి పెడుతుండవచ్చు. ఆ సుఖం వాళ్లెందుకు వదులుకుంటారు?" అంది.

రుక్మిణికీ అలాగే అనిపించింది.

"అమ్మకు గనక నా దగ్గరకు రావాలనుంటే నేను తీసుకు రావచ్చా మేడమ్" అని అడిగింది.

"అయ్యో, ఆవిడకు అలా అనిపించాలే గానీ, తప్పక తీసుకొద్దాం రుక్మిణీ" అని భరోసా ఇచ్చింది సుజాత.

మర్నాడు కాక మూడో నాడు మళ్లా వెళ్లింది రుక్మిణి తల్లిని చూడడానికి. ఈసారి చాలాసేపు వేచి ఉండాల్సి వచ్చింది. రుక్మిణి శాలువా తల మీద నుండి కప్పుకుని ఆటోలోనే కూచుని గమనిస్తోంది. ఇంటి తలుపు తీసే ఉంది. లోపల మనుషులు ఉన్న సందడి కనిపిస్తున్నది. వాళ్లెవరో నవ్వుకుంటూ వాకిట్లో దాకా వచ్చారు. ఆటో అతన్ని పిలుస్తూ తన ఆటోదాకా రాబోయారు. తను సమయానికి ఆటోవాలాని హెచ్చరించింది, ఆటోలో సవారీ ఉన్న సంగతి చెప్పమని. అతను చెప్తుండగానే వాళ్లే చూసి వెనక్కి తగ్గి, మరో ఆటోకోసం చూస్తూ రోడ్డు మీద నడుస్తూ దూరమయ్యారు. వాళ్లటు వెళ్లగానే వదిన కూడా అలంకరించుకుని బయటికి వచ్చి మళ్లా తన ఆటోవైపే రాబోయి లోపలెవరో ఉన్నది గమనించి మరో ఆటోను వెతుక్కుంటూ వెళ్లిపోయింది. తలుపులు తీసే ఉన్నాయి. కాసేపయినాక అమ్మ వచ్చి నాలుగు వైపులా చూసింది. ఫరవాలేదనుకున్నాక తనవైపు చూసింది. షాపు దగ్గర కొంచెం హడావిడిగానే ఉంది. అలా నిలబడి అటే చూస్తోంది. అక్కడ జనం తగ్గాక లోపలికి వెళ్లి చేత్తో ఏదో పట్టుకుని వచ్చి వీధి తలుపు దగ్గరగా వేసి రుక్మిణి వైపు ఒకసారి చూసి, "ఇక ఫరవాలేదు రా' అన్నట్లు తలూపి దుకాణం వైపు నడిచింది. తను కూడా మెల్లిగా రోడ్డు దాటి దుకాణం దగ్గరకొచ్చి మంచి నీళ్ల బాటిలుందా? అడిగింది. అతను అది తీసే లోపల తల్లి నుండి ఉత్తరం అందుకుని బాటిల్‌కి డబ్బు చెల్లించి గబగబా నడిచి వెళ్లి ఆటో ఎక్కి వెళ్లిపోయింది.

ఇంటికెళ్లి తల్లి రాసిన ఉత్తరం విప్పి చదవడం మొదలుపెట్టింది.

చిరంజీవి రుక్మిణికి ఆశీస్సులు.

ఇన్నాళ్ల తరువాత నిన్ను చూడటం, నీ ఉత్తరం చదవటం కలో, నిజమో తెలియలేదు. ఇన్నాళ్లుగా నిన్ను చూడకపోయినా నిన్ను తప్పక చూస్తాను అని నా మనసు నమ్ముతూనే ఉంది. నువ్వు కనిపించావు. సంతోషం తల్లీ. పోతే ఇక్కడ వీళ్లింట్లో నువ్వు వస్తే నిన్ను ఆదరించేవారు గానీ, మాట్లాడేవారు గానీ ఎవరూ లేరు. నీ తప్పేమీ లేకపోయినా, నీ తోడబుట్టిన వాడు నిన్ను అసహ్యించుకుంటున్నాడంటే ఏం చెప్పను? నీ అన్నకి ఇద్దరు పిల్లలు. ఈ ఐదారేళ్లుగా వాళ్ల పనులన్నీ నావే. వంట పనీ, ఇంటిపనీ అన్నీ నావే. ఈ శరీరంలోని శక్తంతా ఉడిగిపోయాక నా పరిస్థితేమిటో తెలియదు. ఇలాంటిస్థితిలో ఉన్న నాకు నీ రాక వరంలా ఉంది తల్లీ. ఎంతత్వరగా వీలైతే అంత త్వరగా నాకు ఈ చాకిరీ నుంచి మోక్షం కలిగించు.

వచ్చే ఆదివారం నాడు పిల్లలిద్దరినీ తీసుకుని భార్యాభర్తలు ఎక్కడికో పిక్నిక్‌కు

కన్న తల్లిదండ్రులకంటే ఎక్కువగా రుక్మిణిని ఆదరిస్తున్నారు ఆ దంపతులు. యూనివర్సిటీలో లైబ్రేరియన్ ఉద్యోగం ఇప్పించారు. కోర్టు కేసు గెలిపించి భర్త ఆస్తి ఆమెకే దక్కేట్టు చేశారు. ఇక తల్లిని కూడా తన దగ్గరకు రప్పించుకోవాలనీ వేరే ఇల్లు తీసుకోవాలనీ ఆశించింది రుక్మిణి. కానీ ఆ దంపతుల్ని వదిలివెళ్ళడం నమ్మకద్రోహం అనిపించిందామెకు. మరి అప్పుడేం చేసింది? ఆమె సమస్యను ఎవరు పరిష్కరించారు?

కుమారికి ఫలితం దక్కింది

'కుమారి 21 ఎఫ్'లో నటించడానికి మిగతా హీరోయిన్లు వెనుకా ముందూ ఆలోచిస్తే హెబ్బాపటేల్ మాత్రం దర్శకుడి మీద ఉన్న నమ్మకంతో ముందుకు వెళ్ళిపోయింది. ఆ సినిమాలో ఎంతగా రెచ్చిపోయిందో అందరికీ తెలిసిందే! అలా రెచ్చిపోయినందుకే ఆమెకు ఆఫర్లు మీద ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం నాలుగు సినిమాలతో బిజీగా ఉన్న హెబ్బాకు వరుణ్‌తేజ్ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా ఛాన్స్ వచ్చిందని అంటున్నారు. ఈ వార్త కనుక నిజమైతే ఆమె కష్టానికి తగిన ప్రతిఫలం దక్కినట్టే అంటున్నారు సినీ జనాలు.

నామీద జోకులొద్దు

మొన్నటి దాకా రానాతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్న శ్రియ అన్న వార్తలకు ఇంత పొడుగున వివరణ ఇచ్చుకుంది శ్రియ. అప్పుడు గానీ ఫుల్‌స్టాప్ పడలేదు. ఇప్పుడు కొత్తగా 'బాహుబలి 2'లో భల్లాల దేవుడి భార్యగా నటించబోతోందన్న వార్త బాగా హల్‌చల్ చేస్తోంది. పాపం ఈ వార్తకు కూడా శ్రియ వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. నా మీద ఎందుకు ఇన్ని జోకులు వస్తున్నాయో అర్థం కావడం లేదంటూ వాపోయింది. ఆ సినిమా కోసం నన్నెవరూ అప్రోచ్ కాలేదు. ఆ ఛాన్స్ వస్తే అస్సలు వదలను అంటూ శ్రియ చెప్పుకొచ్చింది.

వెళదా మన్న ప్రయత్నంలో ఉన్నట్లు న్నారు. ఏమేం పదార్థాలు చేయించుకుందామా అన్న చర్చల్లో ఒకటి రెండు మాటలు నా చెవిని కూడా పడ్డాయి. ఇంకేమీ వివరాలు రాయలేను. ఏ క్షణాన వాళ్లు వస్తారో అన్న భయం ఉండడం వల్ల ఇంతటితో ముగిస్తున్నాను.

ఇట్లు
మీ అమ్మ.

ఉత్తరం చదువుతున్నంత సేపూ రుక్మిణి కళ్ల నుంచి నీళ్లు కారుతూనే ఉన్నాయి. తండ్రి పోయిన నాటి నుండి తమను పెంచడానికి తల్లి పడ్డ బాధలు ఒక్కొక్కటి జ్ఞాపకం వచ్చాయి. ఎంత కష్టపడి అన్నయ్యను చదివించింది. పాపం అన్నయ్య కూడా అమ్మ చెప్పినట్లు వినేవాడు. ట్యూషన్స్ కూడా చెప్తుండేవాడు. అమ్మ బయటికి వెళ్లి ఎవరింట్లోనూ పని చేసేది కాదు గానీ, ఎవరైనా ఇది చేసి పెట్టమని, అది చేసి పెట్టమని అడిగేవారు. అమ్మ ఏది చేసినా రుచిగా ఉండేది. అది తీపైనా, కారమైనా. అందుకే అందరూ అమ్మ దగ్గరకొచ్చేవారు. అమ్మ కావలసిన వస్తువులు చెప్తే తెచ్చిచ్చేవారు. అలా చేసి పెట్టినందుకు ఎంతో కొంత డబ్బు తీసుకునేది. తమను పోషించడానికి ఇలా ఎంత కష్టపడేదో. అన్నయ్య చదువు పూర్తి అయితే ఇక అమ్మకు ఈ కష్టాలు గట్టెక్కుతాయని ఆశపడ్డాం. కానీ అమ్మ కష్టాలు ఈ రోజుకీ తీరలేదు. రుక్మిణి మెల్లిగా తన ఆలోచనల నుండి బయటపడింది.

ఆ సాయంత్రం సుజాత, ఎలీషాగారు కూచుని మాట్లాడు కుంటున్నారు. రుక్మిణి టీ చేసి తీసుకెళ్లి ఇచ్చింది. తను కూడా ఒక కప్పులో టీ తెచ్చుకుని వాళ్లతో పాటు కూచుంది.

“ఎలా ఉందమ్మా నీ ఉద్యోగం?” అడిగారు ఎలీషాగారు.

“బావుంది. నాకు చాలా నచ్చింది. ఆ పుస్తకాలు చూస్తుంటేనే మనసు నిండిపోతుంది” అంది రుక్మిణి. కాస్త ఆగి, “మీ ఇద్దరిని ఒక సలహా అడగాలని ఉంది” అంది మళ్లీ.

“చెప్పమ్మా ఏమిటి?” అన్నారు ఎలీషాగారు.

రుక్మిణి తన తల్లి రాసిన ఉత్తరం వాళ్ల చేతిలో పెట్టింది. వాళ్ళది చదివారు. సుజాత వెంటనే, “రుక్మిణీ నేను లోగడే చెప్పాను నీకు, ఆవిడ ఒప్పుకుంటే మనం తీసుకొచ్చేద్దామని. ఇంకా ఏమిటి నీకు అనుమానం?” అని అడిగింది.

“నాకు అనుమానం ఏమీ లేదమ్మా. నన్ను మీరు కాపాడి చదివించి, ఉద్యోగంలో చేర్చి నా కాళ్ల మీద నేను నిలబడేలా చేశారు. అంటే నేను స్వతంత్రంగా బతకగలిగే స్థితికి తీసుకువచ్చారు. అమ్మమ్మగారు, తాతయ్యగారు ఉంటున్న ఫ్లాట్స్‌లో మరోటి దొరికితే అది అద్దెకు తీసుకుని నేనూ, అమ్మా అక్కడ ఉంటే అమ్మకు తన కూతురు దగ్గరనే ఉంటున్నాననే తృప్తి కలుగుతుంది కదా అని ఉంది. మీరిద్దరూ నాకు తల్లీ తండ్రే అని నేను భావిస్తాను. కానీ తనకు మీరంతా కొత్త. ఆమెకు ఎలాంటి చీకూ చింతా లేని విశ్రాంతిని ఇవ్వాలని నా కోరిక. మిమ్మల్ని విడిచి విడిగా వెళ్లాలన్నా నా మనసు ఒప్పుకోవడం లేదు. కానీ ఇప్పుడు నా కన్నతల్లికి నా అవసరం చాలా ఉంది. నాకు ఇంకోటి కూడా తోచింది. ఏమిటంటే అక్కడ ఆ ఫ్లాట్‌లో అమ్మమ్మగారు, తాతయ్యగారు ఎలా ఉన్నారో అని ఎప్పుడూ మీరు చింత పడుతుంటారు. నేను అక్కడ ఉంటే, నేను వాళ్లను చూసుకుంటాను కదా అని మీ మనసుకు నెమ్మది కలుగుతుంది కూడా. ఈ మాటలే మీకు చెప్పాలని వచ్చాను. మీరు ఆలోచించి ఎలా చెయ్యమంటే అలా చేస్తాను” అని చెప్పి ముగించింది రుక్మిణి.

సుజాత వింటూ రుక్మిణి వైపు చూస్తూ కూచుండిపోయింది. ఎలీషాగారిది చూశారు. ఆయనకి తెలుసు సుజాత, రుక్మిణి మీద చాలా ప్రేమ పెంచుకుంది. ఆ అమ్మాయి ఇంట్లో నుండి వెళుతుందంటే తట్టుకోవడం కష్టంగా ఉంది. కానీ రుక్మిణి వెళ్లడానికి చెప్పిన కారణం వద్దనడానికి వీలు లేనిది. ఏం చెప్పాలో తెలియక చూస్తూ ఉండిపోయింది.

అప్పుడు ఎలీషాగారందుకుని, “నువ్వు చెప్పింది సబబుగానే ఉంది రుక్మిణీ. తప్పక ఆవిడను తీసుకురా. అయితే ముందు ఇక్కడికే రానీ మీ అమ్మగారిని. ఎందుకంటే ఒకవేళ మీ అన్నగారు, నువ్వు తనకు తెలియకుండా ఆవిడను తీసుకొచ్చినందుకు దురహంకారంతో ఏదైనా చెయ్యదలిస్తే అక్కడ మీరు ఒంటరివాళ్ళైపోతారు. ఇక్కడైతే మేం మీకు తోడుగా నిలబడతాం. కొద్దిరోజులు వేచి చూసి అంతా బాగానే ఉంటే మీరిద్దరూ ఆ ఇంటికి మారిపోదురుగాని. ముందుగా నువ్వు ఒక ఫ్లాట్ చూసి పెట్టుకో. అక్కడ ఫ్లాట్‌లో అన్నీ అమరి, ఇక్కడ మీ అన్నగారి ద్వారా వస్తాయేమో అనుకుంటున్న చికాకులేమీ రానప్పుడు మీరు ఆ ఇంటికి వెళ్లిపోదురుగాని. ఏం సుజాతా!

నా సలహా ఎలా ఉంది? నువ్వు ఓకే చేస్తావా?" అడిగారు సుజాతని నవ్వుతూ. సుజాత కూడా కాస్త తేరుకుని. "ఈ ఆలోచన బావుంది. నిజంగా మీరు చెప్పినట్లు వీళ్ల అక్కడే ఉంటే ఆ అలుసు చూసుకుని అన్నగారు తన ప్రతాపం చూపడానికి సిద్ధమైతే ఇబ్బందే" అంది.

రుక్మిణికి మొదట తట్టలేదుగానీ ఎలీషాగారు అన్నాక అలాంటి ప్రమాదం కలగవచ్చేమోనని భయం కలిగింది. తల్లిని మొదట ఇక్కడికే తీసుకు రావాలని నిర్ణయించుకుంది. తల్లికి తన ప్లానంతా ఉత్తరంలో రాసింది. అయితే ఈసారి తను వెళ్లి అక్కడ వెయిట్ చేసి చూస్తే ఇల్లంతా సందడిగా కనిపించింది. ఎవరూ బయటికి వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు కనిపించలేదు. ఇక లాభం లేదని రుక్మిణి ఇంటికొచ్చేసింది.

ఇంటికి వెళ్లాక సుజాత చెప్పింది.

"ఇవాళ నాన్న ఫోన్ చేశారు. నువ్వు చెప్పావటగా ఆ కాంప్లెక్స్‌లో మరో ఫ్లాట్ ఉంటే చెప్పమని. ఉన్నదట. వీళ్ల ఫ్లోర్‌లోనే ఉందట. నిన్ను వచ్చి చూసుకోమని ఫోన్‌లో చెప్పారు" అని.

సాయంత్రం రుక్మిణి వెళ్లి ఫ్లాట్ చూసింది. ఆ ఫ్లాట్ రెండు బెడ్ రూములది. చాలా వీలుగా ఉంది. అనంతయ్యగారు, సావిత్రమ్మగారు ఉన్న ఫ్లాట్‌కి ఎదురు ఫ్లాటే ఇది. వాళ్లది 204 అయితే ఇది 201. చాలా వీలుగా ఉంటుందని అడ్వాన్స్ చెల్లించేసింది. ఇక దానిలోకి కావలసిన సామాను ఒక్కటొక్కటిగా కొని అమర్చుకోవాలనుకుంది.

మళ్లీ రెండు రోజులాగి తను రాసిన ఉత్తరం చేత పట్టుకుని తల్లి దగ్గరికి వెళ్లింది. ఈసారి తల్లి బయటికి వచ్చినప్పుడు తను అటూ ఇటూ చూసి గబగబా ఆ ఇంటిముందుకెళ్లి ఉత్తరం అరుగుమీద పెట్టింది. తల్లి సమయం చూసి అది తీసుకుంది. అంతే, మళ్లా ఎల్లుండి వస్తానని చెప్పి వెళ్లిపోయింది. ఆ ఉత్తరంలో తను అప్పుడే ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్న సంగతి కూడా పి.ఎస్.లో చేర్చింది. ఉత్తరం చదువుకున్న తల్లికి ఎలీషాగారి ఆలోచన సరియైనదనే తోచింది. కొడుకులో ఆలోచనా శక్తి నశించిపోయింది. ఎవరో ఇచ్చిన ఆజ్ఞలు పాటించే ఒక మరమనిషి లాగా అయిపోయాడు. తల్లి కష్టాన్ని గ్రహించగలిగే స్థితిలో లేడు. ఇక మెల్లిగా తను అమ్మాయి దగ్గరకు వెళ్లిపోతేనే నయం అనుకుంది.

ఇంట్లో ఎవరూ లేనప్పుడు కొడుకుకు ఒక ఉత్తరం రాసి తనా ఇల్లు విడిచి పెట్టి వెళ్లే ముందు ఆ ఉత్తరాన్ని ఇంట్లో తన గదిలో పెట్టి వెళ్లాలనుకుంది. సర్దుకోవలసినవేమీ లేవు. ఉన్న రేకు ట్రంకుపెట్టెలో తన పాత చీరలు రెండు పెట్టుకుంది. ఏదో సందర్భంలో కొడుకు, కోడలు కొనిచ్చిన చీరలు అక్కడే వదిలేయదలచి విడిగా పెట్టుకుంది. తనూ, భర్తా, పిల్లలు కలగక ముందు తీయించుకున్న ఫోటో మాత్రం తీసి పెట్టెలో దాచుకుంది. అంతే. కూతురు గనక వస్తే తనతో కలిసి వెళ్లిపోయేందుకు వీలుగా అన్నీ రెడీ చేసుకుంది. కొడుకుకి ఉత్తరం రాయడం మొదలు పెడదామని కూచుంది. ఏమని సంబోధించాలో తెలియలేదు. ఈ అయిదారు సంవత్సరాలుగా వాడు తన కొడుకుగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. తమ ఇద్దరి మధ్య యజమాని, పని మనిషి లాగే నడుస్తోంది వ్యవహారం. జీతం లేని పని మనిషి తను. చాకిరీ చెయ్యడానికి శక్తి కావాలి గనక ఆ ఇంట్లో తిండి తింటోంది. ఒక్క నాడు వాడు, 'అమ్మా' అని పిలిచిందీ లేదు. తను, 'ఏం నాయనా' అన్నదీ లేదు. వాళ్లు కావలసిన పని చెప్తారు. తను మౌనంగా చేసుకు పోతుంది. తన కొడుకెలా చూస్తాడో పిల్లలూ, కోడలూ కూడా అలాగే చూస్తారు. తను వాళ్ల నాయనమ్మ నని పిల్లలకు తెలియదు. తల్లిదండ్రులు చెప్పనప్పుడు తను మాత్రం ఎలా చెప్తుంది! కాబట్టి ఇప్పుడు తను ఉత్తరం కూడా యజమానీ, పని మనిషీ సంబంధంగానే రాయాలి.

అయ్యా!

తన తల్లిదండ్రులను కావడిలో చెరోపక్క కూచో పెట్టుకుని కావడి మోసిన శ్రవణకుమారుని పేరు పెట్టుకున్న మీకు జోహార్లు. నేను ఇంతకాలంగా తమ పిల్లలకు, తమకు, తమ భార్యామణికి ఊడిగం చేస్తూ గడుపుకొస్తున్నాను. మీరు కూడా నా యందు దయతో నేను తినేందుకు గుప్పెడు మెతుకులు దయచేస్తూ వచ్చారు. ఇక ఈ రోజుతో ఆ రుణం తీరిపోతోంది. ఎందుకంటే నాకొక దయగల, తల్లియందు ప్రేమాభిమానాలు గల కూతురు ఉంది. ఇప్పుడామె తన కష్టాలలో నుండి బయటపడి, ప్రయోజకురాలై తన తల్లికి ముసలితనంలో తను ఆధారంగా ఉండి కాపాడుకోవాలని కోరుతున్నది. అందుకే ఆమె దగ్గరకు వెళ్లిపోతున్నాను. మీరు నాకిచ్చిన రూము తప్ప తతిమావన్నీ తాళాలు వేసుకునే వెళ్లారు కనుక వీధి గుమ్మానికి తాళం వేసి తాళం చెవి ఎదురింట్లో ఇచ్చి వెళుతున్నందుకు నన్ను క్షమించగలరు.

ఇట్లు
రాజేశ్వరమ్మ.

ఉత్తరం రాసి మడిచి జాగ్రత్తగా పెట్టుకుంది. అనుకున్నట్లుగానే ఆ ఆదివారం పొద్దున్నే కొడుకూ, కోడలూ, పిల్లలూ ఒక పెద్ద కారు తెప్పించుకుని, అందులో బయలుదేరారు పిక్నిక్‌కి. స్వీట్సు రాత్రి చేసిపెట్టి, తెల్లవారుజామునే లేచి పులిహోర, గారెలు, దద్ధోజనం చేసి పెట్టింది రాజేశ్వరమ్మ. అవన్నీ కారులో పెట్టుకుని వెళ్లిపోయారు. తను స్నానం చేసి తల దువ్వుకుని, ఏనాటిదో నేరేడు పండు పాత నేత చీర తీసి కట్టుకుంది. గోడ గడియారంలో టైము చూసుకుంది. కొడుకుకు తను రాసిన ఉత్తరం బాగా కనిపించేలాగా, దానిమీద ఒక బరువు పెట్టింది. తన పెట్టె తీసుకుని బయటికి వచ్చి తలుపు దగ్గరగా లాగి గడియ బిగించి తాళం వేసి పెట్టె తీసుకుని మెట్లు దిగింది. ఎదురింటికి వెళ్ళి తాళం చెవులు ఇవ్వబోయింది. వాళ్లు ఆవిడ వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. ధైర్యంగా వెన్ను విరుచుకుని తలెత్తుకు నిలబడి ఉన్న ఆమె ఎంతో గౌరవనీయురాలిలా కనబడుతోంది. పాతచీరైనా ఆ రంగు ఆమెకి ఒక కాంతిని, గౌరవాన్ని తెస్తోంది.

ఎదురింటివారు ఆమెను, "మీరు.. మీరు.." అంటూండగానే, ఆమె, "నేను మీ ఎదురింట్లో పని చేస్తాను. ఈ ఊళ్లోనే నా కూతురు ఉంది. ఆమె దగ్గర కెళుతున్నాను" అని ఆమె చెప్తుండగానే రుక్మిణి ఆటో వచ్చి ఆగింది. అందులో నించి రుక్మిణి తొంగి చూస్తూ, "రా అమ్మా! త్వరగా" అని పిలిచింది. రాజేశ్వరమ్మ తాళం చెవులు వారికి అప్పజెప్పి వచ్చి ఆటోలో కూచుంది. రుక్మిణి ఒక్కసారి తల్లిని గట్టిగా కావలించుకుంది. ఇద్దరి కళ్ల వెంట నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి.

వీళ్లు వెళ్లేటప్పటికి సుజాత, ఎలీషాగారు వాకిట్లోనే ఎదురు చూస్తున్నారు. ఇద్దరూ రాజేశ్వరమ్మను "రండి రండి," అని ప్రేమగా ఆహ్వానించారు. అందరూ కలిసి లోపల హాల్ వైపు నడిచారు. ఆమె స్థైర్యానికి ఎలీషాగారికి ఒకటే ఆశ్చర్యం. అలాంటి కష్టాలను కూడా ఆవిడ ధైర్యంగా ఎలా ఎదిరించి నిలబడిందా అని. ఆమె ముఖంలో ఎక్కడా బేలతనం లేదు.

(ముగింపు వచ్చే వారం)

సింహప్రసాద్
నిండు నూరేళ్ళు
సీరియల్ త్వరలో....

ముద్దు పెట్టేటప్పుడు కళ్ళెందుకు మూసుకుంటాం?

ముద్దు ఓ గొప్ప అనుభూతి. భార్యాభర్తలు, ప్రేయసీ ప్రియులు ఎవరైనా ముద్దు పెట్టుకునేటప్పుడు తాదాత్మ్య స్థితిలోకి వెళ్ళిపోతారు. తెలియకుండానే వారి కళ్ళు మూతలు పడిపోతాయి. అలా ఎందుకు జరుగుతుందనే విషయంపై రాయల్ హోల్లోవేకు చెందిన లండన్ యూనివర్సిటీ సైకాలజిస్టులు విస్తృత పరిశోధనలు చేసి ఒక నిర్ధారణకు వచ్చారు. నాలుగు పెదవులతో స్పర్శను అనుభూతిచెందడం ఇంద్రియాలకు సంబంధించిన విషయం. మెదడు రెండు పనులను ఏక కాలంలో చేయలేదు. కళ్ళు తెరిచి ఉంటే పెదవుల స్పర్శను పరిపూర్ణంగా ఆస్వాదించే అనుభూతిని మెదడు ప్రోసెసింగ్ చేయలేదని పరిశోధకులు వెల్లడించారు. హ్యూమన్ సైకాలజీకి సంబంధించి చాలా కాలంగా ఇదొక మిస్టరీగా మిగిలిపోయింది.

కళ్ళతో చూస్తూ స్మృతిశక్తిని ప్రదర్శిస్తూ మరోవైపు ముద్దును ఆస్వాదించే ప్రోసెసింగ్ విశ్లేషణను పరిపూర్ణంగా పూర్తిచేయడం మెదడుకు కష్టమైన పని అని పరిశోధకులు తేల్చారు. నాలుగు కళ్ళు తెరిచి చూసుకోవడంలో నిబిడీకృతమైన విజువల్ టాస్క్ భారాన్ని, నాలుగుపెదవుల స్పర్శను ఆస్వాదించే ప్రోసెసింగ్ కెపాసిటీ తట్టుకునే సామర్థ్యాన్ని మెదడు ఏకకాలంలో పరిపూర్ణంగా చేయలేదు. అలా చేస్తే ఈ రెండింటిలోనూ ఏదో ఒకదానికి మెదడు ప్రాసెసింగ్‌లో పూర్తిస్థాయి ఇంద్రియ న్యాయం జరగదని అర్థంచేసుకోవాలి. సింపుల్‌గా చెప్పాలంటే కళ్ళతో చూస్తూ ముద్దును ఆస్వాదించే ప్రక్రియను కొనసాగించడానికి మనిషి చాలా కష్టపడాల్సి వస్తుంది. అంటే రెండూ చేస్తే ఆ మాధుర్యాన్ని కోల్పోతారన్నమాట. అందుకే ఆ క్రమంలో కళ్ళు మూతలుపడతాయి. పట్టుదలగా కళ్ళతో చూస్తూ ముద్దు పెట్టుకుంటే ఆ స్పర్శలో ఎలాంటి కిక్కూ ఉండదు, అంటే దాన్ని సర్వేంద్రియాలతో ఆస్వాదించలేమని డాక్టర్ డాల్టన్ వెల్లడించారు. ఒక విషయంపై మనం దృష్టి కేంద్రీకరించినప్పుడు ఆ సమయంలో మన సర్వశక్తులూ దానినే ఆలంబన చేసుకుంటాయని ఆయన అన్నారు.

ఘుమ ఘుమలు

శ్రీమతి డి.విజయారావు

సంపాదకుడు: పి.రాజేశ్వరరావు

ధర: 200

పేజీలు: 404

ప్రతులకు: ప్రముఖ పుస్తక విక్రేతలు

వంటల్లో అత్యంత నిపుణురాలు శ్రీమతి డి.విజయారావు. ప్రముఖ టీవీ చానల్‌లో 1500 ఎపిసోడ్స్‌లో రకరకాల వంటలు చేసి ప్రశంసలు పొందారామె. అనుభవంతో రాసిన 700 స్వీట్లు, హాట్లు, వెజ్-నాన్‌వెజ్, సౌత్-నార్త్ ఇండియన్ వంటల పుస్తకమిది.

పునరాగమనం (నవల)

ఎ.వి.రెడ్డిశాస్త్రి

ధర: 100 రూపాయలు,

పేజీలు: 184

ప్రతులకు: ప్రముఖ పుస్తక దుకాణాలు

అధ్యాపకుడు, రచయిత రెడ్డిశాస్త్రి. ఒక ప్రవాస తెలుగు యువతి వరుడి కోసం చేసిన అన్వేషణే ఈ నవల. సంస్కృతి, మతం, మనుషుల హిపోక్రసీ వంటి ఎన్నో అంశాలను వివరిస్తూ సాగుతుంది.



నా వాళ్ళు

డా.లక్ష్మీ రాఘవ

ధర: 100 రూపాయలు

పేజీలు: 172

ప్రతులకు: విశాలాంధ్ర, నవోదయ, నవయుగ, తెలుగు బుక్‌హౌస్‌లు.

భిన్న మనస్తత్వాలు, విభిన్న సంస్కృతులను పరిశీలించి అపార జీవితానుభవం గడించిన రచయిత్రి డా.లక్ష్మీరాఘవ. ఆదర్శవంతమైన గతం, వర్తమానంలో ఒంటరితనం, ప్రేమరాహిత్యం వంటివాటిని మానసిక విశ్లేషణతో దృశ్యమానం చేసే 27 కథల సమాహారం ఈ పుస్తకం.

దూరాలు దగ్గరవ్వాలి (నవల)

అడపా రామకృష్ణ

ధర: 60 రూపాయలు,

పేజీలు: 116

ప్రతులకు: రచయిత, వెంకటరాజు నగర్, 43-21-21, దొండపర్తి, విశాఖపట్నం-16

అభ్యుదయ రచయిత అడపా రామకృష్ణ. మన దేశ సంస్కృతీ, సంప్రదాయాలపట్ల, ఈ తరంవారి భవిత కోసం ప్రవాస భారతీయుల ఆలోచన, ఆచరణలను ప్రతిబింబించేలా రాసిన నవల యిది.



స్వీకారాలు

భగవద్గీత

సారాంశం

అనువాదం: ఆర్వీయార్

సంపాదకుడు: పి.రాజేశ్వరరావు

ధర: 40 రూపాయలు, పేజీలు: 64

ప్రతులకు: ప్రముఖ పుస్తక విక్రేతలు

గౌతమ బుద్ధుడు

జీవితం, బోధనలు, సూక్తులు

పి.రాజేశ్వరరావు

ధర: 60 రూపాయలు

పేజీలు: 94

ప్రతులకు: ప్రముఖ పుస్తక విక్రేతలు

సెల్: 80963 14553

సకల దేవతా నైవేద్యాలు

వివిధ రకాల పిండివంటలు-స్వీట్స్

ధర: 50 రూపాయలు, పేజీలు: 120

ప్రతులకు: శ్రీ బాలాజీ పబ్లికేషన్స్, అరండల్ పేట, ఏలూర్‌రోడ్, విజయవాడ-2

సెల్: 9441176276

తడియారని స్వప్నం

లోసారి సుధాకర్

ధర: 100 రూపాయలు,

పేజీలు: 128

ప్రతులకు: రచయిత, కేరాఫ్ ఎన్.భాస్కర్‌రెడ్డి, రోడ్ నెం 13, వివేకానందనగర్, కడప-01, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో.

-లలితా త్రిపుర సుందరి

మిస్టర్ కాసనోవా!

'డిటెక్టివ్ శరత్ మీరేనా?' గంభీరంగా ధ్వనించింది అతడి స్వరం.

ప్రశ్నార్థకంగా తలఎత్తి చూశాడు శరత్. 'మీరు కలవాలనుకున్నది నన్నేకదా?' ప్రశ్నించాడు.

నిట్టూర్చి శరత్ ఎదురుగా కూర్చున్నాడాయన. హఠాత్తుగా ఏడవటం ఆరంభించాడు రెండు చేతులలో ముఖం దాచుకుని.

సానుభూతిగా అతడివైపు చూస్తూ కూచున్నాడు శరత్. అతడిని పూర్తిగా ఏడవనిచ్చాడు. కాసేపటికి తేరుకుని అతడు ముఖం కడుక్కుని వచ్చాడు. 'సారీ' అన్నాడు కూర్చుంటూ.

'ఏమిటీ సమస్య?' మృదువుగా అడిగాడు శరత్.

'ఈ వీడియో చూడండి' కళ్లల్లోంచి నీళ్లు కారుతుండగా సెల్ ఫోన్‌ను శరత్‌కి అందించాడు.

వీడియో ఆన్ చేశాడు శరత్.

వీడియోలో ఓ అందమైన యువతి ఉంది. నడుస్తున్న కారులో ఆమె పక్కన కూర్చున్న వ్యక్తి కెమెరాను ఆమె ముఖంపై నుంచి శరీరం మొత్తం పైకి ఫోకస్ చేస్తున్నాడు.

నవ్వుతూ సిగ్గుపడుతూ అమ్మాయి కెమెరా కన్ను నుంచి తప్పించుకోవాలని చూస్తోంది. కానీ తప్పించుకునే అవకాశం లేదు.

ఇంతలో ఓ చేయి ఆమెని తాకింది. ఆమె ముఖంలో పరవశత్వం కనిపించింది. కాసేపటికి ఆమె అతను చెప్పినట్టు వినసాగింది.

జరుగుతున్నదంతా కెమేరా రికార్డు చేస్తోంది. దాదాపు పదిహేను నిమిషాల వీడియో.

వీడియోలో అమ్మాయి, ఆమె శరీరం కనిపిస్తున్నాయి. అబ్బాయి అధోభాగం తప్ప ఎక్కడా అతడి ముఖం కనబడటం లేదు. మరోసారి చూశాడు శరత్.

ఆరంభంలో నడిచిన కారు కాసేపటికి ఆగింది.

వీడియో నుండి దృష్టి మళ్ళించి ఎదురుగా కూర్చున్న వ్యక్తివైపు చూశాడు శరత్. 'ఆ వీడియోలో ఉన్నది నా కూతురు కావేరి. అది ఆత్మహత్య చేసుకుని మరణించింది'.

మౌనంగా వింటున్నాడు శరత్.

'నా కూతురు డిగ్రీ చదువుతోంది. పెళ్లి నిశ్చయం చేశాం. చివరి పరీక్ష రాసింది. కానీ ఇంటికి తిరిగి రాలేదు. తన చావుకి ఎవరూ బాధ్యులు కారని రాసిపెట్టి ఆత్మహత్య చేసుకుంది. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందో మాకు మొదట అర్థం కాలేదు. దాని సెల్‌ఫోన్‌లో ఈ వీడియో కనిపించింది. అప్పుడు అర్థమయింది. ఎవడో నమ్మించి, మోసం చేశాడు. బహుశా, వీడియో బైటపెడతానని బెదిరించి ఉంటాడు. పోలీసులు అంత సీరియస్‌గా తీసుకోవటం లేదు. సూసైడ్ నోట్‌లో ఎవరి బాధ్యతా లేదంది కదా, వీడియో కారణం కాకపోవచ్చు అంటున్నారు. అందుకని మీ దగ్గరకు వచ్చాను. వాడెవరో కనిపెట్టాలి. వాడికి శిక్ష పడేట్టు చూడాలి' అన్నాడాయన.

తల ఊపాడు శరత్. అసిస్టెంట్ రాముకు సెల్‌ఫోన్ అందించాడు. కూతురి వివరాలు అడిగి రాసుకున్నాడు రాము.

'పెళ్లి సెటిల్ అయిన ఆ అబ్బాయితో సన్నిహితంగా ఉండేదా?' అడిగాడు శరత్.

ఆయన క్షణం ఆలోచించాడు.

'పెళ్ళి కాకముందు అబ్బాయి రెండు మూడు సార్లు వచ్చి అమ్మాయిని బయటకు తీసుకు వెళ్లాడు'.

'అబ్బాయి పేరు, వివరాలు ఇవ్వండి' అడిగాడు శరత్.

•••

'అమ్మాయి కాల్‌డేటాలో చివరిఫోను ఆమెతో పెళ్లి సెటిల్ అయిన ప్రసాద్‌కి 'ఎన్ని గంటలకు వచ్చింది?' అడిగాడు శరత్.

'ఎగ్జామ్ అయిపోయే టైమ్‌కి' చెప్పాడు రాము.

'అంటే, పరీక్ష పూర్తయ్యాక కలుసుకోవాలనుకున్నారేమో' అన్నాడు శరత్.

•••

'అవును. కలవాలనుకున్నాం. కలిశాం' ఇబ్బందిగా చెప్పాడు ప్రసాద్.

అతడిని పరిశీలనగా చూస్తూ అడిగాడు శరత్ 'ఈ విషయం పోలీసులకు, ఎవ్వరికీ చెప్పలేదేం?'

'నన్నెవ్వరూ అడగలేదు'.

అమ్మాయికి పెళ్ళి కుదిరింది. పరీక్షలయ్యాక పెళ్ళి. డిగ్రీ చివరి పరీక్ష రాసింది అమ్మాయి. కానీ ఇంటికి తిరిగి రాలేదు. ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు పట్టించుకోవడం లేదు. అమ్మాయి తండ్రి డిటెక్టివ్‌ను ఆశ్రయించాడు. డిటెక్టివ్‌కు ఒక వీడియో క్లూ అందించాడు అమ్మాయి తండ్రి. కానీ అది అస్పష్టంగా ఉంది. ఈ మిస్టరీ కేసును ఎలా సాల్వ్ చేశాడా డిటెక్టివ్? నిందితులు దొరికారా లేదా?

'ఇద్దరూ కలుసుకున్న తర్వాత ఏం చేశారు?' అడిగాడు శరత్.

'పార్క్‌కి వెళ్లాం. వీడియో చూపించాను. ఇది నువ్వేనా అని అడిగాను. అవునంది. పెళ్లయిన తరువాత అయినా సవ్యంగా ఉంటుందేమో అడిగాను. మాట్లాడలేదు. నేను ఇలాంటివి పట్టించుకోనని చెప్పాను. నాకు తను నచ్చింది కానీ పెళ్లి తరువాత నాతో విశ్వాసంగా ఉండాలని, ఆలోచించుకోమని చెప్పి ఆమెను అక్కడే వదిలి వచ్చాను. ఆత్మహత్య చేసుకుంటుందనుకోలేదు' అతడి మాటల్లో ఎక్కడా గిల్టీఫీలింగ్ లేదు. బాధలేదు.

'ఆ వీడియోలో ఉన్నది నువ్వు కాదా?'

'కాదు. నేను తాకితేనే ముడుచుకుపోయేది. చేయి తోసేసేది. సిగ్గు అనుకున్నాను. ఇప్పుడు కారణం తెలిసింది. దాన్ని ఆమెకు నేనే ఫార్వర్డ్ చేశాను'

'నీకు ఈ వీడియో ఎలా వచ్చింది?'

శరత్ వైపు నిరసనగా చూశాడు అతడు. 'హాట్ కాలేజీ స్లట్ పాషనేట్ సెక్' అన్న హెడ్డింగ్‌తో పోర్న్‌సైట్‌లో ఉంది. డౌన్‌లోడ్ చేసుకున్నాను".

'ఏ సైట్?' అడిగాడు శరత్.

•••

'బాస్... ఇది ఎవరు అప్‌లోడ్ చేశారో ట్రేస్ చేయటం అసాధ్యం కాదు, కానీ కష్టం' అన్నాడు కత్తి ఉమేశ్‌కుమార్.

'ఎందుకని?'

'డైరెక్ట్ అప్‌లోడ్ అయితే కనుక్కోవటం సులభం. కానీ ఇది గొలుసు లింకుతో ఒక సైట్‌నుంచి మరో సైట్‌కి షేర్ అవుతోంది. అన్నీ తవ్వుకుంటూ పోవాలి. చాలాకష్టం. పైగా వీడెవడో ప్రొఫెషనల్‌లా ఉన్నాడు. చూడు, వీడి ఇతర వీడియోలు. కాసనోవా కిల్స్ క్యూట్ కాలేజీ స్లైట్' పైకి చదివాడు ఉమేశ్.

'ఓ పని చెయ్యి. వాడి ఎకౌంట్‌లోని వీడియోలన్నీ డౌన్‌లోడ్ చెయ్యి. ఎక్కడయినా వాడి ముఖం కనిపిస్తుందేమో చూద్దాం' అన్నాడు శరత్ ఆలోచిస్తూ.

"బాస్... కాలేజీ అమ్మాయిలు వీడి స్పెషాలిటీలా ఉన్నారు' అన్నాడు ఉమేశ్.

'బాస్... అమ్మాయి ఫ్రెండ్సందరినీ ప్రశ్నించాను. ఎక్స్‌ట్రా ఏక్టివిటీస్ ఏమీలేవు. కాలేజీ అవగానే ట్యూషన్. అటు నుంచి ఇల్లు. ఎవరితోనూ పెద్దగా సన్నిహితంగా ఉండటం చూడలేదంటున్నారు ఫ్రెండ్స్' గదిలోకి వస్తూ చెప్పాడు రాము.

ఆలోచిస్తూ తల ఊపాడు శరత్.

'శరత్. అమ్మాయి వయసు 18 ఏళ్ళు పైనే. ఫోర్స్‌డ్ సెక్స్ కాదు. కంప్లయింట్ లేదు. కేసు లేదు' వీడియో చూస్తూ చెప్పాడు ఇన్‌స్పెక్టర్ విజయ్. 'కానీ అమాయకమైన అమ్మాయిలను పద్ధతి ప్రకారం మోసం చేసే గ్యాంగు పనే ఇది. అమ్మాయిలను మోసంతో ప్రేమ అని లొంగదీసి, వీడియో తీసి పోర్న్‌సైట్‌లకు అమ్ముతారు. వీళ్లని ఏమీ

చేయలేం. ప్రభుత్వం పోర్న్‌సైట్లు బ్యాన్‌చేస్తే వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం అంది కోర్టు. చూసేవారు ఉన్నంతవరకూ తీసే వారుంటారు' అన్నాడు విజయ్.

ఉమేశ్ అందించిన వీడియోలను తీసుకుని ఆలోచిస్తూ కూచున్నాడు శరత్.

●●●

'ఎలాంటి ఆధారాలు దొరకటం లేదు బాస్. ఏం చేద్దాం?' అడిగాడు రాము.

శరత్ మాట్లాడలేదు. కాసనోవా వీడియోలన్నీ చూశాడు. అన్నిటిలోనూ కాలేజీపిల్లలే ఉన్నారు. అన్నీ కారులోనే తీసినవి. హోటల్ రూమ్, గదుల్లో తీసిన వీడియోలు ఏమీలేవు.

మరోసారి కావేరీ వీడియో చూశాడు శరత్.

ఇతర వీడియోలలోనూ ఇదే పద్ధతి. అమ్మాయి శరీరాన్ని తీస్తాడు. తాకటం ద్వారా వారిని వివశు లను చేస్తాడు.

'స్త్రీ మానసికంగా ఎంత శక్తిమంతురాలో, శారీరకంగా అంత బలహీనం' అనుకున్నాడు శరత్ ఒక వీడియో తరువాత మరో వీడియోలో అమ్మా యిలు వాడికి లొంగిపోవటం చూస్తూ.

కావేరి వీడియోను క్షణం క్షణం 'పాజ్' చేసి జాగ్రత్తగా గమనించటం ఆరంభించాడు శరత్.

కారు ఇంటీరియర్‌ని బట్టి అది ఏ రకం కారో ఊహించవచ్చుకానీ ఎవరి కారో చెప్పటం కష్టం. ఒక్కో ఫ్రేమ్‌ను అణువణువూ పరిశీలనగా చూస్తున్న శరత్ హఠాత్తుగా 'దొరికింది' అని అరిచాడు.

రాము పరుగెత్తుకు వచ్చాడు.

'రామూ వీడియో ఎనలిస్టు వీణకు ఫోను చెయ్యి' అన్నాడు.

వీడియోలో ఆ సమయం 'నోట్' చేసుకున్నాడు.

ఇంకా చూడటం ఆరంభించాడు. మరోచోట శరత్ కళ్లు ఆగిపోయాయి. అబ్బాయి చేతిలో కెమేరా కదిలింది. కారు ఆగింది. ఎదురుగా వస్తున్న కారు లైట్లను కెమేరా రికార్డు చేసింది. అయితే, శరత్ దృష్టిని ఆకర్షించింది లైట్లు కాదు. కారు ఆగిన చోట మూసిన బ్యాంకు ఉంది. బ్యాంకు అద్దాలలో కారు ప్రతిబింబం. ఆ ఇంకో కారులైట్ల వల్ల కనిపిస్తోంది.

ఆ టైమ్ కూడా నోట్ చేసుకున్నాడు శరత్.

●●●

'వీణా.. నువ్వు చేయాల్సింది ఏమిటంటే అద్దంలో అస్పష్టంగా కనిపిస్తున్న ఆ వ్యక్తి ప్రతిబింబాన్ని స్పష్టంగా చేయాలి. మొదటిసారి కారు నడుస్తున్నప్పుడు ఓ బిల్డింగ్ దాటుతున్నప్పుడు, కారు కిటికీ అద్దంలో అతని రూపం రిఫ్లెక్ట్ అయింది. రెండోసారి బ్యాంకు దగ్గర ఆపినప్పుడు, బ్యాంకు అద్దాల వెనుక నల్లటి తెరలుండడంతో అతని ప్రతిబింబం రికార్డయింది. అదే సమయానికి మరో కారు వెలుతురు అతని రూపాన్ని స్పష్టం చేసింది. ఈ రెంటినీ పోల్చి అతని రూపాన్ని చూపే ఫోటో నువ్వు నాకు అందించాలి' అన్నాడు శరత్.

వెంటనే పనిలోకి దిగింది వీణ. ఏకాగ్రతగా ఆమె పని చేయటాన్ని చూస్తూ కూచున్నాడు. కొన్ని గంటల తరువాత సంతృప్తిగా నిట్టూర్చి, ఫోటోలు అందించింది వీణ.

'థాంక్స్' అన్నాడు శరత్ వాటిని అందుకుంటూ.

●●●

'ఇతడిని ఎక్కడో చూసినట్టుంది. కానీ తెలియటంలేదు' తల అడ్డంగా ఊపుతూ అన్నాడు కావేరి తండ్రి.

'నేను చూసినట్టు కూడా లేదు' అంది కావేరి తల్లి.

కావేరి చెల్లెలికి చూపించాడు శరత్.

ఆ ఫోటోను కావేరీ చెల్లెలు పరిశీలనగా చూసింది. అప్రయత్నంగా ఆమె గొంతులో నుంచి కేక వెలువడింది.

●●●

'ఎవరు మీరు? ఏం కావాలి?' తలుపు తెరచి ఎదురుగా ఉన్న శరత్, విజయ్‌లను ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగాడు అతడు.

'కావేరి మీకు తెలుసనుకుంటాను. ఆమె గురించి కొన్ని ప్రశ్నలు అడగాలి.

'కావేరి అంటే ఆత్మహత్య చేసుకుంది, ఆమే కదా. పూర్‌గర్ల్' అన్నాడతడు సానుభూతిగా లోపలకు దారి ఇస్తూ.

గదిలోని పుస్తకాలు, ఫోటోలు చూశాడు శరత్.

'ఇది మీరేనా?' తన చేతిలోని ఫోటోను అందిస్తూ అడిగాడు శరత్.

'పరిశీలనగా చూశాడు అతడు.' చెప్పలేను. నాలాగే ఉంది. కానీ.. అంతలో అతడి ముఖం లోంచి నెత్తురు ఇంకిపోయింది.

'నీ ఆట కట్టింది. మిస్టర్ కాసనోవా... కాలేజీ స్టూడెంట్ల జీవితాలతో ఆటలాడుకుంటూ, అమాయకులని మోసం చేసి డబ్బులు సంపాదించే కామపిశాచి కాసనోవా ప్రొఫెసర్ నీ ఆట సమాప్తం' అన్నాడు శరత్.

●●●

ప్రొఫెసర్ పరిమళ్‌కు చక్కటి ప్రొఫెసర్‌గా పేరుంది. యువకుడు, అందగాడు కావటంతో అమ్మాయిలు ఆకర్షితులవటం స్వాభావికం. వారిని వాడుకుని వీడియోతీసి పోర్న్‌సైట్లలో ఎక్కించటం అతడికి సరదా. అయితే, కావేరీ వీడియోను యాదృచ్ఛికంగా ఆమెకు కాబోయే భర్త చూడటం, కావేరీ ఆత్మహత్యల కారణంగా అతడి నేరం బయటపడింది. లేకపోతే ఇంకెంతమంది అమాయకులు బలైపోయేవారో. ఇంట్లోని కంప్యూటర్‌లో అతడి నేరాన్ని నిరూపించే ఇతర వీడియోలు కూడా దొరికాయి'

శరత్ మాటలు వింటూ కావేరి తల్లితండ్రులు భోరుమన్నారు. 'కంచె చేను మేసే కాలంలో ఎవరిని నమ్మాలి? రక్షణ ఏది?' అన్నారు ఏడుస్తూ.

-కస్తూరి మురళీకృష్ణ

సెల్: 98496 17392

రామాయణం

80

తనకి సహకరించిన అగ్నికి లంకానగరాన్ని ఆహుతి చెయ్యడం సముచితం అనుకున్నాడు హనుమ. మండుతున్న తోకను చూసుకున్నాడు. ఆనందించాడు. మందిరాలపైనా, బురుజులపైనా, సైన్యస్థావరాలపైనా ఎగిరి గంతులేశాడు. వాటన్నిటికీ నిప్పు పెట్టాడు. నగరం నలుమూలలా మంటలను వ్యాప్తి చేశాడు. మిన్నంటిన మంటలను చూసి సంతోషించాడు. కాసేపటికి సముద్రంలోకి దూకి తోకను చల్లార్చుకున్నాడు. అప్పుడు అతనికి సీతాదేవి గుర్తొచ్చింది. గొల్లుమన్నాడు హనుమ. తాను రగిలించిన మంటలకు సీత మరణించలేదు కదా? అనుకున్నాడు. ఒకవేళ మరణించి ఉంటే తప్పు చేశాననుకున్నాడు. రామకార్యాన్ని నాశనం చేశాననుకున్నాడు. కళ్ళు చెమర్చుకున్నాడు. ఆ స్థితిలో అతనికి ఆకాశసంచారుల మాటలు వినవచ్చాయి. ఆ మాటల ద్వారా సీతాసాధ్వి అశోకవనంలో క్షేమంగా ఉందని తెలిసింది. ఊపిరి పీల్చుకున్నాడప్పుడు హనుమ. కన్నీరు తుడుచుకున్నాడు. లేచి నిల్చున్నాడు.

హనుమ తిరుగు ప్రయాణం : మధువన విధ్వంసం

ఒక్క గెంతులో అశోకవనానికి చేరుకున్నాడు. చెక్కుచెదరక ఎప్పటిలా ఉన్న సీతను చూశాడు. సంతోషించాడు. చేతులు జోడించి నమస్కరించాడామెకు.

"తల్లీ! నేను చేసుకున్న పుణ్యఫలం వల్లనే నిన్ను క్షేమంగా చూడగలిగాను. రామకార్యాన్ని కూడా నెరవేర్చగలిగాను." అన్నాడు హనుమ. అతని మాటలు ఎవరైనా వింటున్నారేమోనని భయం భయంగా అటూ ఇటూ చూడసాగింది సీత.

"ఇక నువ్వు భయపడాల్సిన అవసరం లేదు తల్లీ! ధైర్యంగా ఉండు! త్వరలోనే రామలక్ష్మణులూ, వానరసేనతో మా మహారాజు సుగ్రీవుడూ వచ్చి, రావణున్ని హతమార్చడం ఖాయం. నిన్ను అయోధ్యకు తీసుకొనిపోవడం ఖాయం." అన్నాడు హనుమ.

ఆనందంగా కళ్ళు చెమర్చింది సీత.

"అయితే చిన్న మనవి తల్లీ"

"చెప్పు నాయనా"

"ఈలోపు ఆత్మాహత్యాయత్నానికి మాత్రం నువ్వు పూనుకోరాదు."

సరేనన్నట్టుగా తలూపింది సీత.

"మరి నాకు సెలవు. స్వామి దర్శనార్థం నేను కిష్కింధకు బయల్దేరుతున్నాను. నన్ను ఆశీర్వదించు తల్లీ."

సీత పాదాలకు నమస్కరించాడు హనుమ.

"రామకార్యనిర్వాహకుడిగా శాశ్వత యశస్సు పొందుదువుగాక." దీవించింది సీత.

"వస్తాను తల్లీ" చెప్పాడు హనుమ.

"వెళ్ళిరా నాయనా" అన్నది సీత.

వెను తిరిగి, తిన్నగా సముద్రతీరానికి చేరుకున్నాడు హనుమ. అక్కడ గల కొండను ఎక్కాడు. దాని పేరు అరిష్టం. పాదాలు రెంటినీ ఆ కొండ మీద గట్టిగా ఒత్తి, ఆకాశానికి ఎగిరాడు. మేఘాలను చీల్చుకుని ప్రయాణించసాగాడు. సగం దారి దాటాడు. ఆ దారిలో తన కోసమే వేచి చూస్తున్న మైనాక పర్వతాన్ని చూసి ఆనందించాడు. ఆదరంగా దానిని ఓసారి తాకి ముందుకు సాగాడు. ఆవలి తీరానికి చేరుకున్నాడు. మహేంద్రపర్వతాన్ని చూడగానే ఆనందంతో దిక్కులు పిక్కటిల్లేలా సింహనాదం చేశాడు.

హనుమ రాకకై ఎదురు చూస్తూ, మహేంద్రగిరిపై ఉన్న వానరవీరులను ఆ నాదం ఉత్తేజితుల్ని చేసింది. ఒక్కసారిగా లేచి నిల్చున్నారంతా. ఆకాశం కేసి చూశారు. మేఘాలు అడ్డు పడ్డాయి. హనుమ కానరాలేదెవరికీ.

"హనుమ కనిపించకపోతేనేం? అతని సింహనాదం జయఘోషగా వినవచ్చిందంటే... రామకార్యం సఫలమైనట్టే." అన్నాడు జాంబవంతుడు. వృద్ధుడైనా ఉత్సాహంగా నాలుగు అడుగులు అటూ ఇటూ వేశాడు. ఆకాశంకేసి పదేపదే చూడసాగాడు. వానరవీరులు ఊరుకోలేదు. వారంతా ఆనందంగా ఒక గుట్టపై నుండి మరో గుట్టపైకి దూకుతూ, ఎగురుతూ, కిలకిలధ్వనులు చేశారు. ఆకాశంలో హనుమకు కనిపించే విధంగా తాము ఉన్న చోటుని తెలిపేందుకు పూలకొమ్మలను ఊపారు. చూశాడది హనుమ. వానరవీరుల ప్రయత్నాన్ని తాను గుర్తించినట్టుగా పెద్దగా గర్జించాడు. ఆ గర్జనకి ఆనందించారు వానరవీరులు. చేతులు పైకెత్తి హనుమకు స్వాగతం పలికారు. కిందకి దూకాడు హనుమ. కొండశిఖరంలా వారి ముందు నిలిచాడు.

చాలా దూరం నుంచి వచ్చాడు. ఎంత ఆకలి మీద ఉన్నాడో ఏమో! కందమూలఫలాలను హనుమకు ఆప్యాయంగా అందించాడు అంగదుడు. జాంబవంతుడు మరిన్ని ఫలాలను మోసుకొచ్చాడు. నీ కోసమే అన్నట్టుగా వాటిని హనుమకు చూపించి, తినమన్నట్టుగా సైగ చేసి, చేతులు కట్టుకుని నిల్చున్నాడు. అంగద జాంబవంతుల అభిమానానికి మురిసిపోయాడు హనుమ. నమస్కరించాడు వారికి. తర్వాత మిగిలిన వానరులను చూశాడు. అంతా ఆత్రంగా ఉన్నారని గ్రహించాడు. తన నోటి మాట కోసం వేచి చూస్తున్నారని తెలుసుకున్నాడు. ఒకే ఒక్క మాట పలికాడిలా.

"సీతను చూశాను"

ఆ మాట చాలు! అమృతసమానం అనుకున్నారు వానరవీరులు. సంతోషంగా కేకలు వేశారు. తోకలు నేలకు బాది గంతులు వేశారు.

"చాలు, కూర్చోండిక" ఆజ్ఞాపించాడు అంగదుడు. జాంబవంతుడుసహా అంతా పచ్చికబయలుపై కూర్చున్నారు. వివరాలు కావాలి. సంగ్రహంగా కాదు, సమగ్రంగా కావాలి. జాంబవంతుడు అప్పుడు అడిగాడిలా.

"హనుమా! నువ్వు సీతను ఎలా చూశావు? నువ్వు చూసినప్పుడు ఆమె ఏ స్థితిలో ఉంది? సీత పట్ల రావణుడు ఏ విధంగా ప్రవర్తిస్తున్నాడు?"

చెబుతానన్నట్టుగా తలూపి, కళ్ళు మూసుకున్నాడు హనుమ. అంతా గుర్తు చేసుకున్నాడు ఒక్కసారి. కళ్ళిప్పాడు. సాగరమధ్యంలో మైనాకుడు తనకు ఆతిథ్యం ఇస్తానన్న దగ్గర నుంచీ సురసను తాను జయించిన తీరూ, సింహికను చంపిన తీరూ, లంకాధిదేవతను ఓడించిన తీరూ అన్నీ వివరంగా చెప్పాడు హనుమ. లంకలోని వివిధ ప్రదేశాలూ, రావణసౌధంలో సీతను తాను వెదకిన ప్రాంతాలూ వివరించాడు. సీతను అశోకవనంలో చూశానన్నాడు హనుమ. రావణుడు ఆమెను బెదిరించాడని చెప్పాడు. అయితే సీత బెదిరిపోలేదనీ, అతన్ని గడ్డిపోచకంటే హీనంగా చూసిందనీ చెప్పాడు. కావలాగా ఉన్న రాక్షస స్త్రీలు సీతను చంపుతామన్నారని, చంపినా తన నిర్ణయం మారదని, రావణునికి తాను దగ్గర కావడం కల్ల అని సీత గట్టిగా అన్నదని చెప్పి, పాపం! ఆ తల్లి ఆత్మహత్యకు ప్రయత్నించిందని బాధపడ్డాడు. త్రిజట స్వప్నం గురించి చెప్పాడు. ఆ స్వప్నానికి వానరులు ఆశ్చర్యపోయారు. సీతతో తాను మాట్లాడిన సంగతీ, ఆమె సందేశం తూ.చా. తప్పక వినిపించాడు

మహేంద్రగిరి చేరుకున్నాడు హనుమ. సీతను చూశాను అంటూ రాక్షస వధ, లంకాదహనం సహా జరిగిన వృత్తాంతాన్నంతటినీ వానర వీరులకు సమగ్రంగా వివరించాడు. ఇటునించి యిటే లంకాద్వీపం చేరి రావణుణ్ణి సంహరించి సీతమ్మతల్లిని తోడ్కొని రామదర్శనం చేసుకుందాం అన్నాడు హనుమ. అంగదాది వానరవీరులంతా అందుకు సై అంటూ యుద్ధానికి ఉత్సాహంతో ఉరకలేశారు. అప్పుడు జాంబవంతుడు ఏమన్నాడు?

హనుమ. సీత కష్టాలు విని ఓర్చుకోలేకపోయానన్నాడు. అశోకవనాన్ని ధ్వంసం చేశానన్నాడు. రాక్షసులతో యుద్ధం చేశానని, ఆఖరికి ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రానికి లోబడ్డానన్నాడు. రాజసభలో రావణునితో మాట్లాడానంటూ, అతడు తనకి విధించిన శిక్షను గురించి చెప్పాడు. ఆ శిక్షే బాగా కలసి వచ్చిందన్నాడు. లంకానగరాన్ని కాల్చి బూడిద చేశానన్నాడు.

"సీత మహా పతివ్రత. ఆమె రావణుని అశోకవనంలో ఉంది. ఆమె చుట్టూ రాక్షసస్త్రీలు కాపలాగా ఉన్నారు. కృశించిపోయి ఉంది సీత. రాముణ్ణి చూడాలన్న ఆశతోనూ, చూడగలనన్న ధైర్యంతోనూ ఉంది. ఎలాగైతేనేం ప్రాణాలతో ఉంది." అన్నాడు హనుమ.

చాలనుకున్నారు వానరవీరులు. తమని దేవుడు చల్లగా చూశాడనుకున్నారు.

"రామునిభాగ్యం, సుగ్రీవునిదీక్షతో పాటు సీతాదేవి పాతివ్రత్య మహిమ కారణంగానే మన ప్రయత్నం ఫలించింది. ఆమెను నేను చూడగలిగాను. అందుకు నా జన్మ ధన్యమైంది." అన్నాడు హనుమ.

నిజమేనన్నారు వానరవీరులు.

"నిజం చెప్పాలంటే... రాక్షసరాజు రావణుడు కూడా అసాధారణమైన వ్యక్తే! గొప్ప తపశ్శక్తి సంపన్నుడు. ఆ తపశ్శక్తి కారణంగానే సీతమ్మను తాకినా అతను భస్మం కాలేదు." అన్నాడు హనుమ.

అవునవును అన్నారు వానరవీరులు.

"ఇంకో సంగతి! రావణుణ్ణి రాముని చేత చంపించాలన్నదే సీతమ్మ సంకల్పం. అందుకే అతన్ని ఆమె శపించడం లేదు. సీతమ్మ శపిస్తే ఎంతసేపు? రావణుడు ఎప్పుడో మరణించేవాడు." అన్నాడు హనుమ.

అక్షరసత్యం అన్నారు వానరవీరులు.

"జరిగిందిది. జరిగిందంతా ఉన్నది ఉన్నట్టుగా మీకు వివరించాను. తర్వాత జరగాల్సింది మీ ఇష్టం. చెప్పమంటే ముందుగా నా అభిప్రాయం చెబుతాను."

"చెప్పు చెప్పు" హనుమను అడిగారంతా.

"జాంబవంతాది పెద్దలు ఒప్పుకుంటే...మనమంతా రావణుణ్ణి పరివారంసహా పరిమార్చి, సీతను వెంటబెట్టుకుని రాముణ్ణి దర్శించడమే యోగ్యమనిపిస్తోంది." అన్నాడు హనుమ.

పెద్దలు అంగద జాంబవంతులకేసి చూశారంతా.

"చతురంగ సైన్యాలసహా రావణుణ్ణి నేను ఒక్కణ్ణే మట్టుబెట్టగలను. ఇక మీ సంగతి నేను చెప్పనవసరం లేదు. నా కన్నా బలవంతులు మీరు. తర్వాత ఇంకో విషయం. లంకలో రాక్షసులతో యుద్ధం చేసినప్పుడు నేనెవరో వారికి చెప్పాను. కోసలదేశ ప్రభువు రాముడి దాసుణ్ణి అన్నాను. సుగ్రీవుని మంత్రిననీ, పేరు హనుమ అని కూడా చెప్పాను." అన్నాడు హనుమ.

తప్పేముంది ఇందులో అన్నారు వానరవీరులు.

"నాకేమనిపిస్తున్నదో నేను చెప్పాను, మీకేమనిపిస్తున్నదో మీరు చెప్పండి. నిర్ణయం పెద్దలు తీసుకుంటారు." అన్నాడు హనుమ. వెంటనే అంగదుడు ఇలా అన్నాడు.

"నీ నిర్ణయంతో నేనూ ఏకీభవిస్తున్నాను హనుమా! నువ్వు చెప్పిన మాటే బాగుంది. నువ్వొక్కడివే ఇంత చేసి వచ్చావంటే...మనం అంతా కలిస్తే లంకా, రావణుడూ రెండూ ఉండవు. లంకను నాశనం చేసి, రావణుని అంతు చూసి, సీతసహా రాముణ్ణి దర్శించడమే నాకూ మేలనిపిస్తోంది."

సై అంటే సై అన్నారంతా.

ఆ ఆలోచన సరికాదనుకున్నాడు జాంబవంతుడు. ఇబ్బందిగా చూశాడు. ఆ చూపులోని ఆంతర్యాన్ని గ్రహించాడు అంగదుడు. అన్నాడిలా.

"ఇంతకాలం వృధా చేశాం. వృధా చేసి ఇప్పుడు ఒట్టి చేతుల్తో రాముణ్ణి దర్శించడం, సుగ్రీవుని సందర్శించడం సబబు కాదనిపిస్తోంది. అందుకే ఈ యుద్ధప్రకటన."

"నిజమే! నీ ఉత్సాహం ప్రశంసనీయమే యువరాజా! కాని, జరిగిందంతా రామునికి చెప్పి, ఆపై ఆయన నిర్ణయానుసారం మనం ప్రవర్తించడం మంచిదని నాకు తోస్తోంది. దేనికీ తొందర కూడదు. జరిగిన ఆలస్యం కూడా మన మంచికే అనుకుందాం." అన్నాడు జాంబవంతుడు.

ఆలోచనలో పడ్డారంతా. జ్ఞానవృద్ధుడూ, వయోవృద్ధుడైన జాంబవంతుని మాటే శిరోధార్యమనిపించింది. ఆయన సలహాను హనుమాదులందరూ అమోదించారు. ఇక ఆలస్యం అమృతం విషం అనుకున్నారు. వెంటనే కిష్కింధకు బయల్దేరారు.

ఆకాశంలో ఎగురుతున్న వానరవీరులంతా గుంపులు గుంపులుగా ఎగురుతున్న పక్షుల్లా కనిపించారు.

వీరులంతా కిష్కింధ సమీపానికి చేరుకున్నారు. కిందికి చూశారు. నిండుగా ఫలాలూ, తేనెపట్టులతో ఉన్న మధువనం కనిపించింది వారికి. రాజకుటుంబీకులేగాని, సామాన్యులెవరూ ఆ వనంలోకి ప్రవేశించ వీలులేదు. అయితే ఇప్పుడు ప్రవేశించకతప్పదు అనుకున్నారంతా. అందుకు అలసిపోవడం ఒక కారణమైతే రెండో కారణం రామకార్యం సాధించామన్న ఆనందం. దిగండంటే దిగండన్నారు. అంతా కిందికి దిగారు. ఆకలిగా ఉందన్నారు. దప్పికగా ఉందన్నారు. వనప్రవేశానికి అంగీకరించమని యువరాజు అంగదుణ్ణి బతిమలాడారు. సరేనన్నాడు అంగదుడు. అంతే! అంతా ఉల్లాసంగా ఉత్సాహంగా నాట్యాలు చేస్తూ మధువనంలోకి ప్రవేశించారు. కడుపు నిండా పళ్ళు తిన్నారు. దోసిలిపట్టి తేనెలు తాగారు. తిన్నంత తిని, తాగినంత తాగి మత్తెక్కారు. ఆ మత్తులో తూగుతూ, దొర్లుతూ, దూకుతూ కిచకిచలాడారు. వెక్కిరించుకున్నారు. కొక్కిరింతలతో గంతులు వేశారు. తినగా మిగిలిన పళ్ళని నేల రాల్చారు. తేనెలు పారబోశారు. కొమ్మలు విరిచి, చెట్లను వేళ్ళసహా పీకి పారేశారు. ఎలాగైతే హనుమ అశోకవనాన్ని చిందరవందర చేశాడో అలాగ మధువనాన్ని అతలాకుతలం చేసి ఆనందించారు వానరవీరులు.

చూశాడది దధిముఖుడు. కోపించాడు. అతను ఆ వనరక్షకుడే కాదు, సుగ్రీవునికి మేనమామ కూడ. సైన్యంతో హనుమాదులను అడ్డగించాడతను. గదలతో, కత్తులతో బెదిరించేందుకు ప్రయత్నించాడు. బెదరలేదు సరికదా, మత్తులో ఉన్నారేమో! పెద్దలనీ, పిన్నలనీ చూడకుండా దధిముఖుణ్ణీ, అతని అనుచరుల్నీ చితకబాదారు వానరవీరులు. ఒకరిద్దరినీ ఆకాశంలోకి విసిరి, కింద పడితే వారిని పట్టుకుంటూ, మళ్ళీ విసిరి బంతులాడారు. ప్రాణాలు పోతుంటే వాటిని నిలుపుకునేందుకు పరుగులంకించుకుంది సైన్యం. పరుగుదీస్తున్న సైన్యాన్ని చూసి, తానూ పరిగెత్తాడు దధిముఖుడు. పరిగెడుతూ అనుకున్నాడిలా.

వీళ్ళ అంతు చూడాలి! రామలక్ష్మణులకూ, సుగ్రీవునికీ వీరి గురించి గట్టిగా చెప్పాలి. చెప్పి, తగిన విధంగా శిక్షించాలి. తప్పదు!

-అరణి

సౌభాగ్య చక్రం

మార్చి 30 నుంచి
ఏప్రిల్ 5 వరకు

శ్రీ బిజుమళ్ళ బిందుమాధవశర్మ

మేషం (మార్చి 21 - ఏప్రిల్ 20 మధ్య పుట్టినవారు)

వేడుకలు, సమావేశాలు, వృత్తి, వ్యాపారాలు, ఆర్థిక నిర్ణయాలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు. ఒక సమాచారం ఉల్లాసం కలిగిస్తుంది. 31, 1, 2, తేదీల్లో పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో కొత్త ప్రయోగాలపై దృష్టి పెడతారు. ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ, మర్యాదలు అందుకుంటారు. 3, 4, 5 తేదీల్లో సమావేశాలు, బృందకార్యక్రమాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఖర్చులు అంచనాలు మించుతాయి. ఆర్థికంగా ప్రోత్సాహకరం.

వృషభం (ఏప్రిల్ 21 - మే 21 మధ్య పుట్టినవారు)

దీర్ఘకాలిక పెట్టుబడులు, ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, గృహ నిర్మాణ పనులు, వేడుకలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం ఉత్సవాలు, సంస్మరణల్లో పాల్గొంటారు. రుణప్రయత్నాలు ఫలిస్తాయి. 31, 1, 2 తేదీల్లో సమావేశాల్లో మాటపడాల్సి వస్తుంది. సినీ, రాజకీయరంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు. 3, 4, 5 తేదీల్లో రాజకీయ, సినీరంగ ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ మన్నలు పొందుతారు. వృత్తి, వ్యాపారాల్లో గత అనుభవం వల్ల లబ్దిపొందుతారు.

మిథునం (మే 22 - జూన్ 21 మధ్య పుట్టినవారు)

సమావేశాలు, పెట్టుబడులు, షాపింగ్, వేడుకలు, విద్యా సంస్థలతో పనులపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం శ్రీవారు, శ్రీమతి విషయంలో శుభపరిణామాలు సంభవం. వేడుకల్లో పాల్గొంటారు. 31, 1, 2 తేదీల్లో ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. డబ్బు విషయంలో సన్నిహితులు మొహమాట పెట్టే అవకాశం ఉంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. 3, 4, 5 తేదీల్లో ఆర్థిక విషయాల్లో సంకల్పం ఫలిస్తుంది. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం అందుకుంటారు.

కర్కాటకం (జూన్ 22 - జులై 22 మధ్య పుట్టినవారు)

ప్రముఖులతో సమావేశాలు, కొత్త ప్రాజెక్టులు, అదనపు ఆదాయం కోసం ప్రయత్నాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరం. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. 31, 1, 2 తేదీల్లో శ్రీవారు, శ్రీమతి వైఖరి ఆవేదన కలిగిస్తుంది. పరువు, ప్రతిష్ఠలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రముఖులను కలుసుకుంటారు. వివాహ నిర్ణయాలకు అనుకూలం. 3, 4, 5 తేదీల్లో పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరం. లక్ష్య సాధనలో పూర్వ అనుభవం ఉపయోగపడుతుంది.

సింహం (జులై 23 - ఆగస్టు 23 మధ్య పుట్టినవారు)

సమావేశాలు, దూరప్రయాణాలు, ఇంటర్వ్యూలు, వృత్తి, వ్యాపారాలకు సంబంధించిన అంశాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం విద్యార్థులకు శుభప్రదం. ప్రేమానుబంధాలు బలపడతాయి. 31, 1, 2 తేదీల్లో వృత్తి, వ్యాపారాల్లో అంచనాలు ఫలించకపోవచ్చు. సమావేశాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. వేడుకల్లో పాల్గొంటారు. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. 3, 4, 5 తేదీల్లో శ్రీవారు, శ్రీమతి విషయంలో శుభపరిణామాలు సంభవం. భాగస్వామ్యాలు లాభిస్తాయి. ఒక సమాచారం ఉల్లాసం కలిగిస్తుంది.

కన్య (ఆగస్టు 24 - సెప్టెంబర్ 22 మధ్య పుట్టినవారు)

పెట్టుబడులు, సంస్మరణలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు, షాపింగ్, బోనస్‌లపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం ఇంటికోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలు సమీక్షించుకుంటారు. 31, 1, 2 తేదీల్లో ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం కలవరపెడుతుంది. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. 3, 4, 5 తేదీల్లో వైద్యం, హోటల్, పరిశ్రమల రంగాల వారు చక్కటి ఫలితాలు సాధిస్తారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం లభిస్తుంది.

తుల (సెప్టెంబర్ 23 - అక్టోబర్ 23 మధ్య పుట్టినవారు)

వేడుకలు, జనసంబంధాలు, సమావేశాలు, ఆర్థిక వ్యవహారాలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కీలక సమాచారం అందుకుంటారు. 31, 1, 2 తేదీల్లో కుటుంబ సభ్యుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వేడుకల్లో అసౌకర్యం కలిగే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి కొత్తపరిచయాలు లాభిస్తాయి. 3,4,5 తేదీల్లో చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. స్పెక్యులేషన్లు లాభిస్తాయి. వివాహ నిర్ణయాలకు అనుకూల సమయం.

వృశ్చికం (అక్టోబర్ 24 - నవంబర్ 22 మధ్య పుట్టినవారు)

ఆరోగ్యం, బీమా, వృత్తిపరమైన సమావేశాలు, ప్రముఖుల కలయిక. ఉద్యోగ వ్యవహారాలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం లభిస్తుంది. హోటల్, వైద్యం, రిటైల్ రంగాల వారికి శుభప్రదం. 31, 1, 2 తేదీల్లో స్టేషనరీ, ఏజెన్సీలు, రవాణా, మార్కెటింగ్ రంగాల వారికి వృత్తి, వ్యాపారాల్లో నిరుత్సాహకరం. సన్నిహితుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. శుభవార్త అందుకుంటారు. 3, 4, 5 తేదీల్లో విందు వినోదాల్లో పాల్గొంటారు. రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగాల వారికి ప్రోత్సాహకరం.

ధనుస్సు (నవంబర్ 23 - డిసెంబర్ 21 మధ్య పుట్టినవారు)

వేడుకలు, ప్రేమానుబంధాలు, పెట్టుబడులు, వృత్తిపరమైన సమావేశాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం విద్యార్థులకు శుభప్రదం. ప్రేమానుబంధాలు బలపడతాయి. 31, 1, 2 తేదీల్లో పెట్టుబడుల్లో నిదానం అవసరం. ప్రియతముల కోసం ఖర్చులు అంచనాలు మించుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. బ్యాంకులు, ఫైనాన్స్ రంగాల వారికి శుభప్రదం. 3, 4, 5 తేదీల్లో విద్యార్థులు సత్ఫలితాలు సాధిస్తారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లకు అనుకూల సమయం. ఒక సమాచారం ఉల్లాసం కలిగిస్తుంది. లక్ష్యాలు సాధిస్తారు.

మకరం (డిసెంబర్ 22 - జనవరి 20 మధ్య పుట్టినవారు)

కుటుంబ విషయాలు, బదిలీలు, మార్పులు, గృహరుణాలు, విద్యా విషయాలకు ఈ వారం అనుకూలం. బుధవారం గృహారంభ ప్రవేశాలకు అనుకూలం. కుటుంబ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. 31, 1, 2 తేదీల్లో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది. బదిలీలు అసౌకర్యం కలిగిస్తాయి. కుటుంబంలో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. 3, 4, 5 తేదీల్లో ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. గృహనిర్మాణానికి అవసరమైన నిధులు లభిస్తాయి. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి ఆర్థికంగా అనుకూల సమయం.

కుంభం (జనవరి 21 - ఫిబ్రవరి 18 మధ్య పుట్టినవారు)

పెట్టుబడులు, విద్యా సంస్థలతో పనులు, వేడుకలు, ఇంటర్వ్యూలు, సమావేశాలకు ఈ వారం ప్రాధాన్యం ఇస్తారు. బుధవారం బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. 31, 1, 2 తేదీల్లో రవాణా, బోధన, రాజకీయ, సినీరంగాల వారు నిరుత్సాహకరమైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులు శ్రద్ధాలోపం వల్ల నష్టపోతారు. ప్రయాణాలు, సమావేశాలకు ఏర్పాట్లు చేసుకుంటారు. శుభవార్త అందుకుంటారు. 3, 4, 5 తేదీల్లో ఉన్నత విద్య, విదేశీ ప్రయాణాలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ప్రోత్సాహకరం.

మీనం (ఫిబ్రవరి 19 - మార్చి 20 మధ్య పుట్టినవారు)

రుణాలు, పొదుపు పథకాలు, ఫీజుల చెల్లింపులు, షాపింగ్, ఇంటర్వ్యూలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. 31, 1, 2 తేదీల్లో పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరించాలి. ప్రియతముల కోసం ఖర్చులు అంచనాలు మించుతాయి. ఆర్థికపరమైన సమావేశాలు, బృందకార్యక్రమాలు ఫలిస్తాయి. 3, 4, 5 తేదీల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి. సినీ, రాజకీయ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. మొండి బకాయిలు వసూలవుతాయి. పోయిన వస్తువులు తిరిగి లభిస్తాయి.

వంద కోట్ల మీద కన్నేశాడుగా?

త్రివిక్రమ్, సూర్య కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతోందన్న వార్త బాగానే హల్‌చల్ చేస్తోంది. ఇందులో వింతేముంది? అనుకోవచ్చు. వింత అంతా ఇందులోనే ఉంది. ఎందుకంటే వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా బడ్జెట్ వంద కోట్లట! వందకోట్ల బడ్జెట్‌తో తెలుగు, తమిళంలో సినిమాను తీయాలన్నది త్రివిక్రమ్ ఆలోచన! ఈ సినిమాకి హీరో సూర్య అయితేనే కరెక్ట్‌గా సరిపోతాడని త్రివిక్రమ్ భావించాడట! సూర్యని ఎంచుకోవడంలో ఓ కారణముంది అంటున్నారు సినీ జనాలు. సూర్యకి కోలీవుడ్‌లో దాదాపు డెబ్భైకోట్ల మార్కెట్ ఉంది. అతని సినిమాకి తెలుగులో దగ్గర దగ్గర ఇరవై కోట్లు వస్తుంది. ఇక త్రివిక్రమ్ బ్రాండ్‌నేమ్ ఎలాగూ ఉంటుంది కాబట్టి మరో ముప్ఫై నలభై కోట్లు తేలికగా వచ్చేస్తాయి అన్న ఆలోచనతో ఉన్నాడట మాటల మాంత్రికుడు. ఈ సినిమాకి తెలుగు హీరోని అనుకుంటే కోలీవుడ్‌లో మార్కెట్ వర్కవుట్ కాదనే ఉద్దేశంతోనే సూర్యని త్రివిక్రమ్ ఎంచుకున్నాడని అంటున్నారు. కాకపోతే ఈ సినిమా పట్టాలెక్కడానికి ఇంకా కొంత కాలం పడుతుంది.

నవ్య సినిమా

ప్రకాష్‌రాజ్ చేతికి 'నటసామ్రాట్!'

మరాఠీలో విజయవంతమైన 'నటసామ్రాట్' సినిమా మీద చాలా మంది సినిమా వాళ్ళ కళ్ళు పడ్డాయి. అయితే ఆ సినిమా రైట్స్ ప్రకాష్ రాజ్ చేతికి వచ్చాయి. ఆ సినిమా ప్రకాష్ రాజ్ స్వంతంగా నిర్మించడంతో పాటు దర్శకత్వం కూడా వహించబోతున్నాడు. ఈ సినిమాలో ప్రధానపాత్ర కూడా తనే చేయాలని భావిస్తున్నాడట ప్రకాష్‌రాజ్. ప్రస్తుతం 'మనవూరి రామాయణం' సినిమాతో బిజీగా ఉన్న ప్రకాష్‌రాజ్ ఆ సినిమా పూర్తి అయిన తరువాతే నటసామ్రాట్ పనులు ప్రారంభించాలని ఆలోచిస్తున్నాడట! ఈ సినిమా ఒక్క తెలుగులోనే ఉంటుందా? లేక తమిళం, హిందీ భాషల్లో కూడా తీస్తారా? అన్న వివరాలకి కొంత కాలం వేచి చూడాల్సిందే అంటున్నారు సినీ జనాలు.

ఆ నటుణ్ణి మోసం చేశారట!

'ఊపిరి' ప్రమోషన్‌తో ఆ సినిమా యూనిట్ అభిమానులను ఊపిరి తీసుకోనివ్వడంలేదు. అయితే ఈ సినిమా కారణంగా ఓ నటుడు నష్టపోయాడన్న వార్త ఫిలింనగర్‌లో తెగ హల్‌చల్ చేస్తోంది. ఆ నటుడు ఎవరో కాదు రాజారవీంద్ర. ఇతగాడు 'ఊపిరి' టైటిల్‌ను ఎప్పుడో రిజిస్టర్ చేసి పెట్టుకున్నాడు. ఈ సినిమా దర్శకనిర్మాతలకు తమ సినిమాకు 'ఊపిరి' అన్న పేరు డిసైడ్ అయిన తరువాత రాజారవీంద్ర ఆ పేరును రిజిస్టర్ చేయించాడని తెలిసిందట! 'ఊపిరి' టైటిల్ తమకు ఇచ్చినట్టయితే సినిమాలో ఓ మంచి పాత్ర ఇస్తామని అతగాడికి ఆశ పెట్టారట! దానితో ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఉదారంగా రాజారవీంద్ర తన టైటిల్ వీరికి ఇచ్చేశాడు. దర్శకనిర్మాతలు రాజారవీంద్రకు ప్రామిస్ చేసినట్టుగానే ఓ పోలీసాఫీసరు పాత్ర ఇచ్చారు. కానీ చివరికి ఈ పాత్ర కనిపించేది కొద్దిసేపే! అంతే కాకుండా ఒకే ఒక్క డైలాగు ఉండడంతో రాజారవీంద్ర షాక్ తిన్నాడని సమాచారం! తను మోసపోయిన విధానం బయటకి చెప్పుకోలేక సన్నిహితుల వద్ద తన బాధను వ్యక్తం చేస్తున్నాడట!

ఆ డైరెక్టర్ అన్వేషణ పూర్తయింది!

'రుద్రమదేవి' సమయంలోనే 'ప్రతాపరుద్రుడు' సినిమా చేస్తానని ప్రకటించిన గుణశేఖర్ ఇప్పటి దాకా మరో ప్రకటన చేయకుండా మౌనంగా ఉండిపోయాడు. ఆ సినిమా చేయడేమో అని చాలామంది అనుకున్నారు. కానీ గుణశేఖర్ మౌనానికి ఓ కారణం ఉందట! ఈ సినిమా ఆషామాషీగా తీయడం కాకుండా, కథకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరించిన తరువాతే సినిమా తీయాలని నిర్ణయించుకున్నాడట! ఇంత కాలం ఆ కథాన్వేషణలోనే ఉన్నాడట! ఇప్పటికి అతని అన్వేషణ పూర్తయిందంటున్నారు. 1910లో రాసిన 'హిందూ మహాయుగం' అనే పుస్తకాన్ని గుణశేఖర్ సంపాదించాడట! ఇందులో ప్రతాపరుద్రుడికి సంబంధించిన పూర్తి సమాచారం ఉందట! దీని ఆధారంగా కథ తయారు చేసుకోవచ్చని గుణశేఖర్ భావిస్తున్నాడట!

దర్శకుడే విలన్!

దర్శకుడు విలన్ కావడం ఏంటి? అన్న అనుమానం వస్తోందా? నిజమే ఓ దర్శకుడు విలన్ అవతారం ఎత్తబోతున్నాడు. మహేష్‌బాబు, మురుగదాస్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమాలో దర్శకుడు ఎస్..జె.సూర్య విలన్‌గా ఎంపికయ్యాడట! ఈ దర్శకుడు మహేష్‌బాబుతో గతంలో 'నాని' సినిమా చేశాడు. స్వతహాగా నటుడు అయిన సూర్య అడపాతడపా తమిళ సినిమాల్లో కనిపిస్తుంటాడు. అక్కడ ఇతగాడికి మంచి పేరే ఉందట! దాంతో సూర్యను విలన్‌గా తీసుకోవాలని మురుగదాస్ ఫిక్స్ అయ్యాడట! ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ మూడు భాషలలో తీస్తుండడంతో ఆయా భాషల్లో పేరున్న వ్యక్తుల్ని తీసుకోవాలని యూనిట్ నిర్ణయించిందట! సూర్యకి నటుడిగా మంచి పేరుందనీ, ముఖ్యంగా విలన్ పాత్రలలో ఈజీగా ఒదిగిపోతాడని అంటున్నారు.

‘ఊపిరి’ ఆడేది కాదు

-తమన్నా భాటియా

అందం, అభినయం, తెలివితేటలు, అదృష్టం ఇవన్నీ కలిపి తమన్నాను దక్షిణాదిన స్టార్ హీరోయిన్‌గా నిలిపాయి. కెరీర్‌లో అప్పుడప్పుడు తడబడినా పడిలేచే కెరటంలాగా దూసుకుపోతూనే ఉంది. ఓ పక్క సినిమాలు, మరోపక్క ఐటెంసాంగ్స్. ఏం చేసినా వాసి కోసమే తప్ప రాశి కోసం కాదంటున్న తమన్నాతో....

‘ఊపిరి’ సినిమా అనుభవాలు...

చెప్పుకోవడానికి చాలానే ఉన్నాయి. ఈ సినిమాలో పాత్ర పరంగా టైట్ డ్రెస్సులు వేసుకోవలసి వచ్చింది. అవి ఎంత ఇబ్బంది పెట్టేవంటే ఊపిరి కూడా ఆడేది కాదు. కానీ ఆ భావాన్ని బయటకి కనిపించకుండా నవ్వుతూ నటించేదాన్ని. కొన్ని సన్నివేశాలు అయిపోగానే ఎంతగా రిలాక్స్ అయ్యేదాన్నో చెప్పడం కష్టమే!

శ్రుతిహాసన్ వద్దన్న పాత్రని మీరెలా అంగీకరించారు?

ఈ విషయం గురించి గతంలో చాలాసార్లు స్పష్టం చేశాను. శ్రుతి ఈ సినిమా ఎందుకు వద్దనుకుందో నాకు తెలియదు. డైరెక్టర్ నాకు కథ చెప్పగానే ఓకే చెప్పేశాను.

దీని మాతృక ‘ఇన్ టచబుల్స్’ ఫ్రెంచి సినిమా మీరు చూశారా?

చూడలేదు. కానీ మాతృకలో ఉన్న పాత్ర కాదు నాది. దాన్ని చాలా వరకూ మార్చారని సెట్‌లో ఉండగా అనుకునేవారు. ఎంత మేరకు మార్చారో నేను అడగలేదు. వాళ్ళు చెప్పలేదు. మాతృక చూస్తే ఆ సినిమా ప్రభావం నామీద ఎంతో కొంత కచ్చితంగా పడుతుంది. దాంతో నా పాత్రకి న్యాయం చేయలేకపోవచ్చు. అందుకే చూడలేదు. ఇప్పుడు నా పాత్రకి నూటికి నూరు శాతం న్యాయం చేశానని భావిస్తున్నాను.

ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో బాగా ఇబ్బంది పడేవారంటారు కదా? నిజమేనా?

చాలావరకూ నిజం. నాకు భాష రాక, అర్థం కాక చాలా ఇబ్బంది పడ్డాను. కొన్ని మంచి సినిమాలు కూడా వదిలేశాను. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకూడదని పట్టుదలతో తెలుగు, తమిళ భాషలు నేర్చుకున్నాను. ఈ సినిమాకి నేనే డబ్బింగ్ చెప్పాను. తమిళంలో మాత్రం చెప్పలేదు.

ఈ సినిమాకి తెలుగు డబ్బింగ్ చెప్పాలని ఎందుకనిపించింది?

‘ఊపిరి’ చిత్ర బృందమంతా నిజాయితీగా కష్టపడి పనిచేశారు. నా వంతుగా నాకూ ఏదైనా చేయాలనిపించింది. సినిమాలో ప్రతి డైలాగూ గొంతులోంచి కాకుండా మనసులోంచి రావాలి. అలాంటప్పుడు నాకు ఎవరో డబ్బింగ్ చెబితే ఆ ఫీలింగ్ రాదు. అందుకే నా పాత్రకి డబ్బింగ్ నేనే చెప్పడానికి ముందు కొచ్చాను.

తదుపరి సినిమాలకి కూడా మీరే డబ్బింగ్ చెబుతారా?

చెప్పలేను. అప్పటి పరిస్థితులను బట్టి ఆలోచిస్తాను.

కార్తితో మూడోసారి నటిస్తున్నట్టున్నారు?

ఇప్పటివరకూ కార్తితో రెండు సినిమాలు చేశాను. ఊపిరి మూడోది. తనతో చేయడం నాకు చాలా సౌకర్యం. మా ఇద్దరి పెయిర్ కూడా బాగుంటుందని అందరూ అంటూంటారు.

నాగార్జునగారు, నాగచైతన్యతో కలిసి నటించారు కదా? ఇద్దరిలో ఎవరితో సౌకర్యంగా అనిపించింది?

ఇద్దరితోనూ కంఫర్టబుల్‌గానే ఫీలయ్యాను. ఇద్దరికీ వృత్తి పట్ల ఉన్న గౌరవం మాటల్లో చెప్పడం కష్టం. ఇది వారి సినిమాలు చూస్తేనే తెలిసిపోతుంది. నాగార్జున గారి నటన గురించి చెప్పాలంటే, ఆయన చేసినన్ని ప్రయోగాలు మరే హీరో చేయలేదేమో? ఏ పాత్ర చేసినా అందులో ఒదిగిపోయి నటించడం ఆయనకే చెల్లింది. ప్రయోగాలు చేయడంలో ఈ తరం హీరోలు ఆయన్ని చూసి నేర్చుకోవలసిందే!

మిమ్మల్ని కూడా వీల్‌ఛైర్‌లో కూర్చునే పాత్ర చేయమంటే?

బాబోయ్ అస్సలు ఊహించలేను. దానికి చాలా గట్స్ కావాలి. కాళ్ళూ, చేతులు కదపకుండా ముఖంలో హావభావాలు, కళ్ళతో ఫీలింగ్స్ చూపించాలి. అలా చేయడం చాలా కష్టం. నాగార్జునగారి నటన దగ్గర నుండి చూశాను కదా! అదంత ఆషా మాషీ కాదు. అలా నటించాలంటే చాలా పరిణతి కావాలి. నాకు ఇంకా ఆ పరిణతి రాలేదనుకుంటున్నాను.

పుకార్ల మీద ఎలా స్పందిస్తారు?

స్పందించడమా? అసలు వాటి గురించి పట్టించుకుంటే కదా? ఒక్కోసారి ఆ పుకార్లు చాలా ఫన్నీగా ఉంటాయి. ఉదాహరణకి చిరంజీవి గారి 150వ సినిమాలో అవకాశం వస్తే చేయనన్నానని పుకారు పుట్టించారు. ఏ ఆధారమూ లేకుండా ఇలాంటివి ఎలా బయటకొస్తాయో నాకు తెలియడం లేదు. అదే విధంగా తమన్నాను ఒక సినిమా నుంచి తప్పించేశారంటారు. నేను ఏ సినిమా ఒప్పుకున్నా వెంటనే ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తాను. బోలెడంత టెక్నాలజీ అందుబాటులో ఉంది. దాన్నీ వాడుకుందాం.

సినిమా ఎంపికలో దేనికి ప్రాధాన్యం?

ముందు కథకే! నా ఒక్క పాత్ర గురించే ఆలోచించను. మొత్తం కథ నచ్చితేనే చేస్తాను. ఏడాదిలో ఏకబిగిన సినిమాలు చేయాలన్న తొందరేం లేదు. మంచి సినిమాలు చేయాలనుకుంటున్నాను.

ఎక్కువగా ద్విభాషా చిత్రాల్లో నటిస్తున్నట్టున్నారు?

అలా కలిసి వస్తోంది. ఒకే సమయంలో తెలుగు, తమిళ ప్రేక్షకులకు దగ్గరయ్యే అవకాశం వస్తోంది. 'ఊపిరి' కూడా ద్విభాషా చిత్రం. అలాగే ప్రభుదేవా సార్‌తో చేస్తున్న సినిమా త్రిభాషా చిత్రంగా రాబోతోంది.

ఈ సినిమాతో బాలీవుడ్‌లో పాగా వేయవచ్చని అనుకుంటున్నారా?

పాగా అని ఏముంది? ఇప్పటికే అక్కడ నేను నటించాను. కాకపోతే రీమేక్ సినిమాతో బాలీవుడ్‌కి వెళ్ళడం వలన నష్టపోయాను. మరోసారి రీమేక్‌లో నటించకూడదని అప్పుడే డిసైడ్ అయ్యాను. 'ఊపిరి' రీమేక్ కాదా? అని అడగకండి. మూలకథలో చాలా వరకూ మార్పులు చేశారు. కాబట్టి ఇది రీమేక్ కిందకి రాదని అనుకుంటున్నాను.

వరుసగా ప్రత్యేక గీతాలు చేస్తున్నట్టున్నారు?

మంచి ఆఫర్ అనిపిస్తే తప్పకుండా చేస్తున్నాను. ఏదో ప్రత్యేకంగా పెట్టినట్టుగా కాకుండా, సినిమాలో అంతర్భాగంగా నా పాట రావాలి. అలాంటి పాటలకే డ్యాన్స్ చేస్తున్నాను. అలాంటి సాంగ్స్ భవిష్యత్తులో వస్తే చేయడానికి నాకెలాంటి అభ్యంతరమూ లేదు.

'బాహుబలి 2'లో మీ పాత్ర గురించి....

నిజంగా ఆ పాత్ర గురించి నాకు అస్సలు అవగాహన లేదు. చాలా చిన్న పాత్ర అని రాజమౌళిగారు చెప్పారు. అందుకేనేమో సినిమాకి నా డేట్లు కూడా అడగలేదు. రాజమౌళిగారు ఎప్పుడు రమ్మంటే అప్పుడు వెళ్ళడానికి నేను రెడీ! ఆయన నుంచి ఇంకా పిలుపు రాలేదు.

పరిశ్రమకొచ్చి పది సంవత్సరాలు దాటినట్టుంది?

అవును పది సంవత్సరాలు పూర్తయ్యాయి కానీ, నాకైతే నిన్నో మొన్నో వచ్చినట్టుంది.

ఈ పది సంవత్సరాలలో ఏం సాధించారనుకుంటున్నారు?

నా మీద నాకు నమ్మకం పెరిగింది. ఏ పాత్ర ఇచ్చినా చేయగలనన్న కాన్ఫిడెన్స్ వచ్చింది. 'బాహుబలి' లాంటి సినిమాలో నటించగలిగాను. ఈ సినిమా ద్వారా నా పేరు ప్రపంచమంతా తెలిసింది. ఇంతకన్నా సాధించగలిగింది ఏమైనా ఉంటుందా? అనిపిస్తుంది ఒక్కోసారి. కానీ ఇంకా నేను సాధించాల్సింది చాలా ఉంది.

సినిమాల్లో ఇంత బిజీ అవుతానని ముందే ఊహించారా?

ఊహించలేదు. ఐదారు సినిమాలు చేస్తే చాలనుకున్నాను. ఇండస్ట్రీలో ఇన్ని సంవత్సరాలు ఉండగలనని కూడా అనుకోలేదు. ఇదంతా నా గొప్పతనం కాదు. ప్రేక్షకుల అభిమానం. వారు ఆదరించకపోతే తమన్నా అనే అమ్మాయి పేరు ఈ రోజు సినిమాల్లో వినిపించేది కాదు. నాకు ఏ గౌరవం, అభిమానం దక్కినా, అదంతా నా అభిమానులకూ, ప్రేక్షకులకే చెందుతుంది.

-చిన్ని

అడిగితే కాదనదట

శ్రుతి, తమన్నాలు ఐటెంసాంగ్స్ చేశారు కానీ కాజల్ మాత్రం ఇప్పటి వరకూ దూరంగానే ఉంది. అందుకు కారణం ఏంటని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు కాజల్ సుదీర్ఘ సమాధానమే ఇచ్చింది. 'ఐటెంసాంగ్స్ అంటే నాకు గౌరవం. సినిమాలో అందర్నీ ఆకర్షించే అంశం ఏదన్నా ఉంటే అది ఐటెంసాంగ్! అయితే ఇంత వరకూ నాకు అలాంటి అవకాశం రాలేదు. ఎవరూ నన్ను అడగలేదు కూడా! అలా ఎవరైనా అడిగితే తప్పకుండా చేస్తాను' అంటూ చెప్పుకొచ్చింది. ఇక నిర్మాతలదే ఆలస్యం అంటున్నారు సినీ జనాలు.

ఇంటర్వ్యూ

క్యారెక్టర్ పాత్రలు ఇంపార్టెన్స్ కోల్పోయాయి

కళ్ళతో పాత్రల హావభావాలు పలికించగల బహుభాషా నటి సీత. మూడు దశాబ్దాలుగా దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించి తెలుగు, తమిళ, మలయాళ ప్రేక్షకులను అలరించారు. పాత చిత్రాల్లో క్యారెక్టర్ పాత్రలకు, క్యారెక్టర్ నటులకు ఒక ప్రత్యేకత ఉండేదనీ, ఇప్పటి చిత్రాల్లో ఆ ప్రాధాన్యం ఉండటం లేదనీ అంటున్న సీత ఇంటర్వ్యూ ఈ వారం.....

- సీత

చెన్నై నగరం ఎగ్మోర్‌లో 1964 జూలై 13న జన్మించాను. నా తండ్రి మోహన్‌బాబు, తల్లి చంద్ర. నాకు ఇద్దరు సోదరులు పాండు, దుష్యంత్.

హైస్కూల్‌లో చదువుతున్నప్పుడే చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించాను. నిజానికి నాకు రంగస్థల అనుభవం లేదు. నటన అంటే తెలియదు. కానీ వెంపటి చినసత్యంగారి శిష్యుడు మూర్తిగారి వద్ద కూచిపూడి నృత్యం అభ్యసించాను. డాన్స్ బాగా చేసేదాన్ని. స్టేజ్ ఫియర్ ఉండేదికాదు.

ఇంటికొచ్చి అడిగితే ఇష్టంలేదని చెప్పాం

